

ఈనాడు



విజయవాడ 21-12-2025 ఆదివారం సిటీ సంపుటి 52 . సంచిక 131

THE LARGEST CIRCULATED TELUGU DAILY

రూ. 8-00 పేజీలు 18+28 www.eenadu.net

Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru



CMR SHOPPING MALL

The joy of life

ఆంధ్రప్రదేశ్ | తెలంగాణ | ఒడిశా | కర్ణాటక

CHRISTMAS & NEW YEAR BIG SALE

SPOT GIFTS and more...

1+1 OFFERS* COMBO OFFERS* AND MANY MORE

₹999* పై బడిన కొనుగోలుపై స్పాట్ గిఫ్ట్స్





*Colours shown may not match the actual colours, features mentioned and accessories shown may vary by model and also may not be a part of the standard equipment.

*Conditions Apply.

PATTU SAREES

PATTU SAREE BUY 2 ₹899*	SANKRATHI BUY 2 ₹1599*	VAISHALI BUY 2 ₹1899*	KANJEEVARAM BUY 2 ₹2999*
VARAHI BUY 2 ₹3499*	MAHADEVA BUY 2 ₹3799*	KAUSHALYA BUY 2 ₹4999*	KANCHI SAREE ~~₹5799~~ ₹3999*

Cotton & Catalogue Sarees

COTTON SAREE ~~₹879~~ ₹699*	COTTON SAREE ~~₹949~~ ₹749*	FANCY SAREE ~~₹949~~ ₹749*
FANCY SAREE ~~₹1399~~ ₹1099*	SAREE BUY 2 @ ₹1499*	

WOMENS WEAR

JEANS BUY 3 ₹999*	PALAZZO BUY 2 ₹299*	KURTA BUY 2 ₹699*	KURTA BUY 2 ₹499*	KURTA BUY 2 ₹999*
KURTA BUY 3 ₹299*	WESTERN DRESS BUY 3 ₹999*	CO-ORD SETS BUY 3 ₹1499*	NIGHTIES BUY 2 ₹499*	LEGGING BUY 4 ₹499*

KIDS WEAR



JEANS BUY 2 ₹899*	COTTON FROCKS BUY 3 ₹599*	GIRLS T-SHIRT BUY 4 ₹799*

BOYS SHIRTS BUY 2 ₹499*	BOYS SHIRTS BUY 2 ₹699*	BOYS T-SHIRTS BUY 4 ₹799*
GIRLS TOPS BUY 4 ₹599*	GIRLS PALAZZO BUY 4 ₹799*	GIRLS SKIRTS BUY 3 ₹999*

BED SHEETS



A/C BLANKET BUY 2 ₹199*	BED SHEETS BUY 2 ₹199*
BED SHEETS BUY 2 ₹299*	TOWELS BUY 2 ₹99*

HANDLOOM SAREES

KANCHI COTTON BUY 2 @ ₹1699*	KERALA COTTON BUY 2 @ ₹499*	SOMANUR BUY 2 @ ₹799*
UPPADA BUY 2 @ ₹2999*	VEPARALA BUY 2 @ ₹999*	YELLAMPALLI BUY 2 @ ₹999*

HI FANCY SAREE

ROYAL QUEEN BUY 2 @ ₹3299*	SPACE SILK BUY 2 @ ₹3499*	KHATAN SILK BUY 2 @ ₹3699*	
HASTHAKALA SILK BUY 2 @ ₹3899*	JAHNAVI SILK BUY 2 @ ₹4299*	CHINAN SILK BUY 2 @ ₹4599*	WORM SILK BUY 2 @ ₹4799*

CHUDIDHAR ~~₹1469~~ ₹1099*	DRESS MATERIAL BUY 2 ₹899*
CHUDIDHAR ~~₹1759~~ ₹1299*	DRESS MATERIAL BUY 2 ₹999*
CHUDIDHAR BUY 2 ₹1499*	CHUDIDHAR BUY 2 ₹1299*

GAGRAS BUY 2 @ ₹1499*



MENS WEAR



SHIRTS BUY 5 ₹999*	SHIRTS BUY 4 ₹999*	SHIRTS BUY 3 ₹999*
SHIRTS BUY 2 ₹1199*	T-SHIRTS BUY 2 ₹499*	T-SHIRTS BUY 3 ₹499*
COTTON TROUSERS BUY 3 ₹999*	COTTON TROUSERS BUY 2 ₹1299*	FORMAL TROUSERS BUY 3 ₹999*
FORMAL TROUSERS BUY 2 ₹1499*	MEN'S JEANS BUY 4 ₹999*	MEN'S JEANS BUY 2 ₹1299*
LOWERS BUY 3 ₹699*	SHORTS BUY 3 ₹399*	CARGOS BUY 2 ₹1499*

Levi's: BUY 5 @ 50%* OFF | BUY 4/3 @ 40%* OFF | BUY 2 @ 30%* OFF | BUY 1 @ 20%* OFF

THINC / KILLER / INDIAN TERRAIN: BUY 4 @ 50%* OFF | BUY 3 @ 40%* OFF | BUY 2 @ 30%* OFF | BUY 1 @ 20%* OFF

BLACKBERRYS / CRIMSOUNE CLUB / parx / BB / CLOUD 9 / UNITED COLORS OF BENETTON / RARE RABBIT / Pepe Jeans: BUY 3 @ 40%* OFF | BUY 2 @ 30%* OFF | BUY 1 @ 20%* OFF

celio*: BUY 3 @ 50%* OFF | BUY 2 @ 40%* OFF | BUY 1 @ 30%* OFF

U.S. POLO ASSN. / ARROW: BUY 3 GET 2 FREE | BUY 2 GET 1 FREE | BUY 1 @ 20%* OFF

FLYING MACHINE: BUY 2 GET 2 FREE | BUY 2 @ 30%* OFF | BUY 1 @ 20%* OFF

spykar: BUY 4 @ 50%* OFF | BUY 2 @ 40%* OFF | BUY 1 @ 30%* OFF

mufti alternative clothing: BUY 4 @ 50%* OFF | BUY 2 @ 40%* OFF | BUY 1 @ 25%* OFF

TURTLE: BUY 3 @ 50%* OFF | BUY 2 @ 40%* OFF | BUY 1 @ 25%* OFF

TWILLS / OXEMBERG / COOL COLORS: SHOP FOR ₹2999 GET A BACK PACK @ ₹199

Celebrity: Flat 15%* OFF

Cavallo / LINEN CLUB: BUY 2 @ 40%* OFF | BUY 1 @ 25%* OFF

Heniis ITALIAN COUTUR: BUY 2 GET 1* FREE | BUY 1 @ 20%* OFF

rock.it: BUY 2 @ 40%* OFF | BUY 1 @ 20%* OFF

JACK & JONES: BUY 4 @ 50%* OFF | BUY 2/3 @ 40%* OFF | BUY1 @ 30%* OFF

BB / LIGHT HOUSE / CLOUD 9: BUY 3 @ ONLY ₹1599*

TWILLS / OXEMBERG / COOL COLORS / OTTO: BUY 3 @ ONLY ₹1599*

ఎం.జి.రోడ్, విజయవాడ 91333 87124 | బస్టాండ్ ఎదురుగా, మచిలీపట్నం 7799971833 | నెహ్రూ చౌక్ సెంటర్, గుడివాడ 7799971839

ఈనాడు



విజయవాడ 21-12-2025 ఆదివారం సిటీ సంపుటి 52 . సంచిక 131
THE LARGEST CIRCULATED TELUGU DAILY
రూ. 8-00 పేజీలు 18+28 www.eenadu.net
Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru



శతాధిక స్ఫూర్తి.. కృష్ణమూర్తి

శాకాహారం.. వ్యాయామం.. సానుకూల దృక్పథం

102 ఏళ్ల వయసులోనూ చురుకైన జీవితం

ఈనాడు - హైదరాబాద్

ముగ్గుబుట్టలా నెరిసిన తల.. 'భారతీయుడు'లో కమల్‌హాసన్‌ను తలపించే ఆహార్యం.. పొద్దున్నే పార్కులో చకచకా నడిచేస్తూ ఓ పెద్దాయన కనిపిస్తారు. వయసు డెబ్బయ్యో.. ఎనభయ్యో ఉండొచ్చు అనుకుంటాం.. కాదు.. కాదు.. 102 ఏళ్లంటే నోరెళ్లబెడతాం. ఆయన రిటైరై దాదాపు 5 దశాబ్దాలవుతోంది. సంతానం కూడా విశ్రాంత ఉద్యోగులయ్యారు. ఇంత వయసొచ్చినా ఆయనకు అనారోగ్య సమస్యలు లేవంటే అతిశయోక్తి కాదు. స్వాతంత్ర్య పోరాట నేపథ్యం, స్వతంత్ర భారతంలో ఉద్యోగుల హక్కుల కోసం పోరాడిన చరిత్ర ఉన్న ఆయన పేరు ఏటుకూరి కృష్ణమూర్తి. శతాధిక వయసులోనూ చురుగ్గా ఉన్న ఆయన జీవనశైలి ఆదర్శప్రాయం.. అనుసరణీయం.

క్రమశిక్షణే రహస్యం

ఆది నుంచీ కృష్ణమూర్తిది క్రమశిక్షణతో కూడిన దినచర్య. ఇప్పటికీ తన పనులు తానే చేసుకుంటారు. వేకువజామున ఐదు గంటలకే మేల్కొంటారు. పార్కులో 4 కిలోమీటర్ల నడక, యోగా సాధన చేస్తారు. తరువాత అల్పాహారం (రెండు ఇడ్లీలు/ఒక కప్పు ఉప్మా/దోశ) తీసుకుంటారు. నూనెలో వేయించిన ఆహార పదార్థాలకు దూరంగా ఉంటారు. ఒక గ్లాసు పాలు తాగుతారు. తర్వాత దినపత్రికలు చదువుతారు. స్నేహితులు, సన్నిహితులతో గడుపుతారు. మధ్యాహ్నం పప్పులు, పెరుగన్నం, కూరగాయలతో భోజనం చేస్తారు. తర్వాత 2 గంటలసేపు నిద్ర.. రాత్రిపూట గ్లాసు పాలు తాగి 10 గంటలకల్లా నిద్రపోతారు. రోజు మొత్తమ్మీద కనీసం 8 నుంచి 9 గంటలు నిద్రకు కేటాయిస్తారు. పూర్తి శాకాహారం, దురలవాట్లు లేకపోవడం, సానుకూల దృక్పథం తన ఆరోగ్య రహస్యాలంటారాయన. స్వాతంత్ర్య సమరయోధులకు ఇచ్చే హెల్త్‌కార్డున్నా.. దాంతో ఆయనకు పనిలేదు. ఆసుపత్రికి వెళ్లాల్సిన అవసరం ఒక్కసారీ రాలేదు. పరోపకార దృక్పథంతో సమాజంపైనా శ్రద్ధ చూపే నైజం కృష్ణమూర్తిది. (మిగతా 3లో)

> 102 ఏళ్ల వయసులో పెన్షన్ తీసుకుంటున్న వ్యక్తిగా అరుదైన గుర్తింపు పొందారు.

ఐదేళ్లలోపు పిల్లలకు పోలియో చుక్కలు వేయించండి

నేడు రాష్ట్రవ్యాప్తంగా 'పల్స్ పోలియో' కార్యక్రమం

మహా ఆటవిక రాజ్యాన్ని అంతమొందిస్తాం

అవినీతితో బెంగాల్ భ్రష్టుపట్టింది: ప్రధాని మోదీ

లోపలి పేజీల్లో »

రైలు ఢీకొని 7 ఏనుగుల మృతి

పొగమంచుతో అస్సాంలో ప్రమాదం

పట్టాలు తప్పిన 5 బోగీలు

ప్రయాణికులంతా సురక్షితం

బీమా డబ్బుల కోసం.. పాము కాటుతో తండ్రిని చంపేశారు

లోపలి పేజీల్లో

రాష్ట్రానికి పిల్లలే ఆస్తి

- వాళ్లతో నాలెడ్జ్ ఎకానమీ సృష్టించొచ్చు
- 'ముస్తాబు' కార్యక్రమం ప్రారంభంలో సీఎం చంద్రబాబు
- తాళ్లపాలెం బాలికల వసతిగృహ విద్యార్థులతో ముఖాముఖి



అనకాపల్లి జిల్లా తాళ్లపాలెంలోని బాలికల గురుకుల పాఠశాలలో ముస్తాబు కార్యక్రమం ప్రారంభించి విద్యార్థులతో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు

ఈనాడు-విశాఖపట్నం, ఈనాడు డిజిటల్-అనకాపల్లి: పిల్లలు అనుకున్న లక్ష్యాలు సాధించి, భవిష్యత్తులో ఉన్నతంగా ఎదిగితే రాష్ట్రం బాగుంటుందని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆకాంక్షించారు. మన రాష్ట్రానికి పిల్లలే పెద్ద ఆస్తి అని, వారితో నాలెడ్జ్ ఎకానమీ సృష్టించవచ్చన్నారు. బాగా చదివి పైకొస్తే కుటుంబ జీవనప్రమాణాలు మెరుగవుతాయని, ఇది రాష్ట్రాభివృద్ధికి దోహదపడుతుందని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా అమలుచేస్తున్న 'ముస్తాబు' కార్యక్రమాన్ని అనకాపల్లి జిల్లా తాళ్లపాలెం ఏపీఎస్‌డబ్ల్యూఆర్ బాలికల వసతి గృహం నుంచి శనివారం ప్రారంభించారు. ముందుగా ఉపాధ్యాయులు ఎలా చెబుతున్నారు, భోజనం ఎలా ఉంటోందని పిల్లలను అడిగి తెలుసుకున్నారు. ముస్తాబు కార్యక్రమాన్ని పాఠశాలలో ఎలా అమలుచేస్తారు, చేతుల శుభ్రత, గోళ్లు కత్తిరించడాన్ని పిల్లలు చేస్తుంటే ఆసక్తిగా గమనించి ప్రశ్నలు వేశారు. అనంతరం విద్యార్థులతో ముఖాముఖి మాట్లాడారు.

ఆత్మవిశ్వాసం పెంపొందిస్తుంది

'విద్యార్థులకు పోషకాహారం, నాణ్యమైన విద్య అందిస్తున్నాం. వ్యక్తిగత శుభ్రత అలవరచుకుంటే ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. అందుకే ముస్తాబు కార్యక్రమాన్ని ప్రారంభించాం. పార్వతీపురం మన్యం జిల్లాలో ఈ కార్యక్రమాన్ని ఆ జిల్లా కలెక్టర్ అమలుచేసి, పిల్లల్లో నాయకత్వ లక్షణాలు పెరిగినట్లు గుర్తించారు. కొందరు శుభ్రంగా ఉంటారు గానీ, మరికొందరు ఉండరు. దానికి శ్రద్ధ పెట్టకపోవడమే కారణం. దాంతో చాలా నష్టాలు కలుగుతాయి. ఇప్పుడు అందరూ శుభ్రతను తప్పక పాటించాలి. ఎప్పటికప్పుడు గోళ్లు కత్తిరించుకోవడం, తల దువ్వుకోవడం, ముఖం కడుక్కోవడం ద్వారా తాజాదనం కలిగి చదువుపై శ్రద్ధ పెరుగుతుంది. తల్లిదండ్రులకు మీ చదువులు భారం కాకూడదని తల్లికి వందనం లాంటివి చాలా చేస్తున్నాం. మీరంతా బాగా చదువుకోవాలి. 12 ఏళ్లు కష్టపడి చదివితే ఏం కావాలంటే అది కావచ్చు' అని చంద్రబాబు పేర్కొన్నారు.

వైద్యపరీక్షలు చేసి..

'రాష్ట్రంలోని 75 లక్షల మంది విద్యార్థులకు వైద్యపరీక్షలు చేసి లోపాలుంటే వాటిని సరి చేస్తాం. విద్యావిధానంలో మంత్రి లోకేశ్ వినూత్న మార్పులు తెస్తున్నారు. (మిగతా 13లో)

ప్లాస్టిక్ రహితంగా ఏపీ

వచ్చే ఏడాది జూన్ నాటికి అమలు

వ్యర్థాలతో సర్క్యులర్ ఎకానమీ

స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర సభలో సీఎం చంద్రబాబు

13లో

పీఎస్సీలకు నిష్పాక్షికతే పునాది



- అక్రమాలను ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించరాదు
- వికసిత్, ఆత్మనిర్భర్ భారత్ ప్రయాణంలో మీదే కీలకపాత్ర
- ఛైర్‌పర్సన్ల సదస్సులో ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్

3లో

గూండాలకు యోగి ట్రీట్‌మెంటే కరెక్ట్

- గీత దాటి మాట్లాడితే తాట తీస్తాం
- రౌడీమూకలపై రాజకీయ నిర్ణయం తీసుకుంటే సరి
- వైకాపా నేతల బెదిరింపులపై పెరవలి సభలో నిప్పులు చెరిగిన ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్



ఈనాడు, రాజమహేంద్రవరం: 'ప్రతిపక్షంలో లేని గత కాలపు ముఖ్యమంత్రి, ఆ పార్టీ నాయకులు బెదిరించేలా మాట్లాడుతున్నారు. మీరు అధికారంలో ఉన్నప్పుడే మీ బెదిరింపులకు, దౌర్జన్యాలకు భయపడలేదు. ఇప్పుడు మళ్లీ మేమొస్తాం.. ఒక్కొక్కరినీ చంపేస్తాం అంటున్నారు. మీరు బాధ్యతగా విమర్శిస్తే సరే.. గీత దాటి మాట్లాడితే చేతి రేఖలు లేకుండా చేస్తాం' అని జనసేన అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ హెచ్చరించారు. తూర్పుగోదావరి జిల్లా పెరవలిలో 'అమరజీవి జలధార' ప్రాజెక్టు శంకుస్థాపన సందర్భంగా నిర్వహించిన బహిరంగ సభలో పవన్ ఈ వ్యాఖ్యలు చేశారు. 'పనులు చేసే గుత్తేదారులను మేమొచ్చాక జైల్లో వేస్తామని బెదిరిస్తున్నారు. ఏదైనా మాట్లాడితే అధికారులు భయపడుతున్నారు. ఎందుకని అడిగితే వాళ్ల వెనుక రౌడీలు, కిరాయి హంతకులు ఉంటారని చెవిలో చెబుతున్నారు. మీకు యోగి ఆదిత్యనాథ్ తరహా ట్రీట్‌మెంట్ కరెక్ట్. (మిగతా 13లో)

'అమరజీవి జలధార'తో ఇంటింటికీ మంచినీళ్లు


పవన్ కల్యాణ్

13లో

వీసీల వెతుకులాట..

ఓ అంతులేని కథ!

- ఏడాదిన్నరగా ఐదు వర్సిటీలకు ఇన్‌ఛార్జులే దిక్కు
- రెండు నెలలైనా విధుల్లో చేరని ఏఎన్‌యూ వీసీ
- ఉన్నత విద్యాశాఖ జాప్యం



ఈనాడు, అమరావతి: విశ్వవిద్యాలయాలకు వైస్ ఛాన్స్‌లర్ (వీసీ)ల నియామకంలో ఉన్నత విద్యా శాఖ తీవ్ర జాప్యం చేస్తోంది. దాదాపు ఏడాదిన్నర పూర్తికావొస్తున్నా కొన్ని వర్సిటీలు ఇన్‌ఛార్జి వీసీలతోనే నెట్టుకొస్తున్నాయి. ఉన్నత విద్యార్హతలు, విద్యావంతుల కోసం చేస్తున్న అన్వేషణలో నియామకం తీవ్ర ఆలస్యమవుతోంది. కూటమి అధికారంలోకి వచ్చిన కొత్తలో 17 విశ్వవిద్యాలయాలకు చెందిన వీసీలు రాజీనామాలు చేశారు. ఫిబ్రవరి, అక్టోబరు నెలల్లో రెండు విడతలుగా 13 వర్సిటీలకు వీసీలను నియమించారు. మరో నాలుగు వర్సిటీలకు ఇంత వరకు వీసీల నియామకాలు చేపట్టలేదు. ఆంధ్రకేసరి వర్సిటీకి సెర్చ్ కమిటీ ఏర్పాటే కొలిక్కి రాలేదు. శ్రీకృష్ణదేవరాయ, ద్రవిడ, ఉర్దూ విశ్వవిద్యాలయాలకు సెర్చ్ కమిటీలు మూడు పేర్లను ఎంపిక చేసి ఇచ్చినా ప్రభుత్వం ఇంతవరకు నిర్ణయం తీసుకోలేదు.

ఏఎన్‌యూ సమస్య ఇదీ..

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం (ఏఎన్‌యూ) వీసీగా అక్టోబరు 8న వెంకట సత్యనారాయణరాజును ప్రభుత్వం నియమించింది. 2 నెలలు అవుతున్నా ఇంత వరకు ఆయన విధుల్లో చేరలేదు. దీంతో పరిపాలన (మిగతా 3లో)

ప్రజల హృదయాల్లో నిలిచిన వాజ్‌పేయీ

డబుల్ ఇంజిన్ సర్కార్‌తో ఏపీకి ప్రయోజనాలు

విశాఖలో వాజ్‌పేయీ విగ్రహావిష్కరణలో కేంద్ర మంత్రి బండి సంజయ్



వాజ్‌పేయీ విగ్రహావిష్కరణలో కేంద్ర మంత్రి బండి సంజయ్. చిత్రంలో రాష్ట్ర మంత్రి సత్యకుమార్, ఎంపీ శ్రీభరత్, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, ఎమ్మెల్యేలు గణబాబు, గంటా శ్రీనివాసరావు, వెలగపూడి తదితరులు

15లో

గౌరవంగా బతుకుదాం..

డ్రగ్స్.. వద్దు బ్రో!

- 4 జిల్లాలు.. 50 రోజులు.. 1,000 కిలోమీటర్లు
- మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా పోలీసుల సైకిల్‌యాత్ర
- అభ్యుదయం పేరిట చైతన్యం



సైకిల్ యాత్రలో కానిస్టేబుళ్లు

ఈనాడు, అమరావతి: గంజాయి, మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా ప్రజల్లో చైతన్యం నింపేందుకు విశాఖ రేంజ్ పోలీసులు ప్రచారబాట పట్టారు. 'డ్రగ్స్ మిమ్మల్నే కాదు.. మీ కుటుంబాలనూ రోడ్డున పడేస్తాయి.. వ్యసనాన్ని వీడండి.. జీవితంలో విజేతలవ్వండి.. గంజాయి వద్దు.. గౌరవంగా బతుకుదాం' అంటూ నినదిస్తున్నారు. విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్‌జెట్టీ మార్గదర్శకత్వంలో 25 మంది కానిస్టేబుళ్లు 'అభ్యుదయం' పేరిట అనకాపల్లి జిల్లా పాయకరావుపేట నుంచి శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం వరకు సైకిల్‌యాత్ర చేపట్టి, ఊరూరా చైతన్యం తీసుకొస్తున్నారు. మాదకద్రవ్యాల తయారీ, సాగు, నిల్వ, ఉత్పత్తి, కొనుగోలు, అమ్మకాలు, వినియోగం, ఎగుమతి, దిగుమతి వంటివి ఎంతటి తీవ్రమైన నేరాలో, వాటిల్లో భాగస్వాములైతే (మిగతా 3లో)

ఇదీ సంగతి!



నా అన్నవాళ్లు ఎవరూ లేక వచ్చా.. మరి మీరో..?!

దేశవ్యాప్తంగా 50 జెన్-జెడ్ పోస్టాఫీసులు

కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ వెల్లడి



అమరావతి విట్ క్యాంపస్‌లో ప్రారంభించిన జెన్ జెడ్ పోస్టాఫీసులోని టేబుల్ సాకర్ బల్ల ఇది. పోస్టాఫీసుకు వచ్చినవారు కొద్దిసేపు వేచి ఉండాల్సిన పరిస్థితి తలెత్తితే.. ఆడుకుంటూ ఉల్లాసంగా గడిపేందుకు దీనిని ఏర్పాటుచేశారు.

15లో

శ్రమలేని సేద్యం

- జయశంకర్ అగ్రి యూనివర్సిటీలో కృత్రిమ మేధ ఆధారిత ల్యాబ్
- డ్రోన్లు, రోబోలు, సెన్సర్లతో పంటల సాగు లక్ష్యంగా పరిశోధనలు
- రైతులకు అత్యాధునిక సాంకేతికతపై శిక్షణకు ఏర్పాట్లు
- యువతను వ్యవసాయం వైపు ఆకర్షించేందుకు అడుగులు



క్యాబేజీ పంటలో డ్రోన్ పురుగుమందు పిచికారీ చేస్తుండగా, కలుపుతీస్తున్న రోబో

నేల ఏ పంటకు అనుకూలంగా ఉంది.. వాతావరణం ఎలా ఉంది.. పంటలకు చీడపీడలేవైనా వ్యాపించాయా.. నివారణకు ఎలాంటి పురుగుమందులు వేయాలి... ఉత్పత్తుల అమ్మకానికి మార్కెట్ అనుకూలంగా ఉందా? లేదా.. .. తదితర పనులన్నీ సెన్సర్లు అమర్చిన యంత్రాలే చక్కబెడితే ఎలా ఉంటుంది. కృత్రిమ మేధ, రోబోటిక్స్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ (ఐఓటీ) సాంకేతిక పరిజ్ఞానంతో సేద్యానికి సంబంధించిన సమస్త పనులన్నీ శారీరక శ్రమ లేకుండా వాటికవే జరిగిపోతే అన్నదాతకు ఎంత హాయిగా ఉంటుంది. అలాంటివన్నీ సాకారం చేసే దిశగా అడుగుపడింది. తెలంగాణలో 'స్మార్ట్ సేద్యం' లక్ష్యంగా హైదరాబాద్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం.. భారతీయ స్టేట్‌బ్యాంక్ ఆర్థిక సహకారంతో దేశంలో తొలిసారిగా అధునాతన ఏఐ, రోబోటిక్స్, ఐఓటీ ఆధారిత (అరిసా ల్యాబ్) ప్రయోగశాలను ఏర్పాటుచేసింది. అగ్రివర్సిటీ అందుకు ప్రణాళిక రూపొందించి ఇవ్వగా.. వర్సిటీ పూర్వ విద్యార్థి, స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా ఛైర్మన్ చల్లా శ్రీనివాసులుశెట్టి.. కార్పొరేటు సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) కింద రూ.15 కోట్ల ఆర్థిక సాయం అందజేశారు. తొమ్మిది నెలల వ్యవధిలోనే ఈ ప్రాజెక్టు రూపకల్పన జరిగింది. (మిగతా 3లో)



రోబో పురుగుమందు పిచికారీ చేస్తుండగా.. ల్యాబ్ నుంచి పరిశీలిస్తున్న నిపుణుడు

పీఎస్సీలకు నిష్పాక్షికతే పునాది

● ఛైర్‌పర్సన్ల సదస్సులో ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్



ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్‌కు జ్ఞాపిక అందిస్తున్న యూపీఎస్సీ సభ్యుడు లెఫ్టినెంట్ జనరల్ రాజ్ శుక్లా. చిత్రంలో టీజీపీఎస్సీ ఛైర్మన్ బుర్రా వెంకటేశం, తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, యూపీఎస్సీ మరో సభ్యుడు దినేశ్ దాసా



రామోజీ ఫిల్మ్‌సిటీలో పీఎస్సీ ఛైర్‌పర్సన్ల జాతీయ సదస్సు ముగింపు కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్‌కు స్వాగతం పలుకుతున్న రామోజీ గ్రూపు సంస్థల ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ సీహెచ్ కిరణ్, ఫిల్మ్‌సిటీ ఎండీ విజయేశ్వరి

ఈనాడు, హైదరాబాద్: పబ్లిక్ సర్వీస్ కమిషన్లకు నిష్పాక్షికతే నైతిక పునాది అని ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ తెలిపారు. వికసిత్ భారత్ 2047 లక్ష్యానికి.. వినూత్న ఆలోచనలు, నైతికత, ప్రజల పట్ల సానుకూల దృక్పథం కలిగిన సివిల్ సర్వెంట్లు అవసరమన్నారు. సుపరిపాలనలో.. ప్రభుత్వ సంస్థలు, వ్యవస్థలను నడిపించే వ్యక్తుల నైతికత అత్యంత నిర్ణయాత్మకమన్నారు. దేశసేవ చేసేందుకు నైతిక విలువలు కలిగిన వ్యక్తులను ఎంపిక చేసే బాధ్యత రాజ్యాంగబద్ధ సంస్థలైన పీఎస్సీలపై ఉందని పేర్కొన్నారు. రామోజీ ఫిల్మ్‌సిటీలో రెండు రోజుల పాటు జరిగిన పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఛైర్‌పర్సన్ల 26వ జాతీయ సదస్సు ముగింపు కార్యక్రమానికి ఉపరాష్ట్రపతి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, యూపీఎస్సీ సభ్యులు లెఫ్టినెంట్ జనరల్ రాజ్ శుక్లా, దినేశ్ దాసా, రాష్ట్రాల పీఎస్సీల స్టాండింగ్ కమిటీ ఛైర్మన్ అలోక్‌వర్మ, టీజీపీఎస్సీ ఛైర్మన్ బుర్రా వెంకటేశం, ఉత్తర్‌ప్రదేశ్ పీఎస్సీ ఛైర్మన్ సంజయ్ శ్రీనేత్, మరికొన్ని రాష్ట్రాల పీఎస్సీల ఛైర్మన్లు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉపరాష్ట్రపతి మాట్లాడుతూ.. "దేశభవిష్యత్తును నిర్ణయించే వ్యక్తులతో కూడిన సమావేశమే ఈ సదస్సు. ప్రభుత్వ ఉద్యోగ నియామకాలు నిష్పక్షపాతంగా జరగాలి. పరీక్షల నిర్వహణలో పారదర్శకత, రహస్య మూల్యాంకనం వంటి విధానాలతో పక్షపాత ధోరణులను నివారించవచ్చు. నియామకాల్లో ఎస్సీ, ఎస్టీ సామాజికవర్గాలకు సమన్యాయం జరగాలి. యూపీఎస్సీ నియామక విధానంపై ఇప్పటికే విదేశాల్లోని నియామక సంస్థలు ఆరా తీస్తున్నాయి. అంతగా ఆ సంస్థ పరపతి సాధించింది. సుపరిపాలన పునాదులను బలోపేతం చేసేలా వికసిత్, ఆత్మనిర్భర్ దిశగా భారత్ సాగిస్తున్న ప్రయాణంలో పీఎస్సీలు కీలకపాత్ర పోషించాలి. డిజిటల్ గవర్నెన్సు, సామాజిక సమ్మిళితం, మౌలిక సదుపాయాల అభివృద్ధి, వాతావరణ మార్పులపై కార్యాచరణ, ఆర్థిక సంస్కరణల అమలు వంటి కీలక బాధ్యతలు.. కొత్తగా ఎంపికవుతున్న అధికారులపై ఉన్నాయి. ప్రభుత్వ పోటీ పరీక్షల్లో అక్రమాలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించకూడదు. వీటి నివారణకు పకడ్బందీ విధానాలను అమలు చేయాలి. అభ్యర్థుల్లో నైతికత, ప్రవర్తన సామర్థ్యాలను అంచనా వేయడానికి పబ్లిక్ సర్వీస్ కమిషన్లు నిర్మాణాత్మక పద్ధతులు అన్వేషించాలి" అని సూచించారు.

పారదర్శకతే కీలకం: డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

పబ్లిక్ సర్వీస్ కమిషన్లు దేశ పరిపాలన వ్యవస్థకు వెన్నెముక వంటివని, పారదర్శక నియామక విధానాలతో ప్రతిభకు సరైన స్థానం లభిస్తుందని తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. సదస్సులో ఆయన ప్రసంగిస్తూ.. "సర్వీస్ కమిషన్లు స్పష్టమైన కాలపరిమితితో వార్షిక క్యాలెండర్లు ప్రకటించి, వాటికి కట్టుబడి ఉండాలి. మరిన్ని సంస్కరణలు అమలు చేయాలి. సమానత్వంతో కూడిన ప్రతిభను ప్రోత్సహించి ప్రజల్లో నమ్మకం పెంచాలి. రాజకీయ ప్రభావాలకు లోనుకాకుండా పనిచేయాలి. సామాజికన్యాయం, సమానావకాశాలు అందించేందుకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు, అవసరమైన చోట ప్రత్యేకంగా అర్హత నిబంధనల సడలింపు, సమాన ప్రాతినిధ్యం లభించేలా పర్యవేక్షణ వ్యవస్థలను ఏర్పాటు చేయాలి. ముందస్తు జాగ్రత్తలు, నిష్పక్షపాతంగా వ్యవహరించడం ద్వారా న్యాయవివాదాలను తగ్గించవచ్చు. నోటిఫికేషన్ల రూపకల్పనలో న్యాయనిపుణుల సలహాలు తీసుకోవాలి. ఏటా పోటీ పరీక్షలకు లక్షల మంది దరఖాస్తు చేస్తున్నారు. ప్రతి విషయంలోనూ స్పష్టతతో వ్యవహరించాలి. ప్రశ్నపత్రం తయారీ నుంచి మూల్యాంకనం వరకు.. షార్ట్‌లిస్టు నుంచి తుది ఎంపిక వరకు ఎక్కడా అనుమానాలకు తావివ్వకూడదు. ఎప్పటికప్పుడు సమాచారాన్ని వెల్లడిస్తూ పక్షపాతరహితంగా వ్యవహరించాలి. ప్రశ్నపత్రాల లీకేజీ అంటే.. ప్రజా సేవ విలువలకు, సర్వీస్ కమిషన్ల నైతికతకు ద్రోహం చేయడమే. ఇలాంటివి జరగకుండా కమిషన్లు రక్షణ వ్యవస్థలను బలోపేతం చేయాలి. డిజిటల్ ప్లాట్‌ఫాం నుంచి సిబ్బంది వరకు తనిఖీలకు అత్యాధునిక పద్ధతులు ఉపయోగించాలి. ఇంటర్వ్యూ ప్రక్రియను మరింత మెరుగుపరచాలి. సదస్సులో చేసిన తీర్మానాలు అమలు చేయాలి" అని సూచించారు.

వైభవంగా ముక్కోటి ఉత్సవాలు ఆరంభం



మత్స్యావతారంలో స్వామివారు

భద్రాచలం, న్యూస్‌టుడే: భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంలో ముక్కోటి ఏకాదశి మహోత్సవాలు శనివారం వైభవంగా ఆరంభమయ్యాయి. తొలి రోజు దివ్య ప్రబంధ పారాయణం నిర్వహించారు. స్వామి వారు మత్స్యావతారంలో దర్శనమివ్వడంతో భక్తులు మురిసిపోయారు. తిరువీధి సేవ ఆధ్యాత్మికతను చాటగా.. సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. ఆదివారం కూర్మావతారంలో స్వామివారి దర్శనం ఉంటుందని, ఈ వేడుకలను పురస్కరించుకుని నిత్య కల్యాణాలను ఈ నెల 30 వరకు రద్దు చేసినట్లు ఈఓ దామోదర్‌రావు తెలిపారు.

గౌరవంగా బతుకుదాం.. డ్రగ్స్.. వద్దు బ్రో!



మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా ప్రజలతో ప్రతిజ్ఞ చేయిస్తున్న పోలీసులు

(మొదటి పేజీ తరువాయి)

చట్టపరంగా ఏ పర్యవసానాలు ఎదుర్కోవాల్సి ఉంటుందో వివరిస్తున్నారు.

గంజాయి, డ్రగ్స్ రహిత ఊరు మా లక్ష్యం..

● అనకాపల్లి, విజయనగరం, పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం జిల్లాల మీదుగా.. 50 రోజుల పాటు 1,000 కిలోమీటర్లు యాత్ర సాగించాలనేది లక్ష్యం. గతనెల 12న పాయకరావుపేటలో ప్రారంభమైన యాత్ర ఇప్పటికే 3 జిల్లాల్లో పూర్తయింది. శనివారం 38వ రోజు శ్రీకాకుళం జిల్లాలో కొనసాగుతోంది.

● ఈ యాత్ర జిల్లా, నియోజకవర్గ కేంద్రాలు, ముఖ్యమైన పట్టణాలకు చేరుకున్నప్పుడు స్థానిక ఎమ్మెల్యేలు, జిల్లా, మండల స్థాయి అధికారులు, ఉద్యోగులు అందులో పాల్గొంటున్నారు. వేల మందితో ర్యాలీలు చేస్తున్నారు. ఆయా చోట్ల బహిరంగ సభలు నిర్వహించి డ్రగ్స్‌కు వ్యతిరేకంగా ప్రదర్శనలిస్తున్నారు. 'గంజాయి, డ్రగ్స్ రహిత ఊరు మా లక్ష్యం' అంటూ ప్రతిజ్ఞ చేయిస్తున్నారు.

● విశాఖపట్నం రేంజ్‌లో గంజాయి తీవ్రత అధికంగా ఉంది. ఈ నేపథ్యంలోనే ఆ ప్రాంతం నుంచే చైతన్యం తీసుకురావాలనే ఉద్దేశంతో ఈ యాత్రకు శ్రీకారం చుట్టారు. విశాఖ రేంజ్‌లోని అల్లూరి సీతారామరాజు జిల్లా పరిధిలో మరో బృందం ఈ సైకిల్‌యాత్ర కొనసాగిస్తోంది.

● ఈ నెల 29 నాటికల్లా ఈ యాత్ర ఇచ్ఛాపురం చేరుకోనుంది. ఆ రోజు భారీఎత్తున ముగింపుసభ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

చైతన్యం తీసుకొచ్చేందుకు..: గోపీనాథ్‌జెట్టీ, విశాఖపట్నం రేంజ్ డీఐజీ

గంజాయి, మాదకద్రవ్యాల కట్టడికి కఠిన చర్యలు తీసుకుంటూనే.. వాటికి ఎవరూ అలవాటు పడకుండా ఉండేలా, ఇప్పటికే వినియోగిస్తున్న వారిని మాన్పించేలా చైతన్యం తీసుకొచ్చేందుకే అభ్యుదయం సైకిల్‌యాత్రకు శ్రీకారం చుట్టాం. రేంజ్ పరిధిలోని ప్రతి నియోజకవర్గాన్నీ టచ్ చేసేలా ఈ యాత్ర సాగుతోంది. ఎక్కడైనా డ్రగ్స్, గంజాయి మూలాలుంటే 1972 టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేయండి.

శ్రమలేని సేద్యం




జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో ఏర్పాటైన అరిసా ల్యాబ్

(మొదటి పేజీ తరువాయి)

అగ్రి వర్సిటీలోని డిజిటల్ వ్యవసాయ కేంద్రంలో 4 ఎకరాల్లో ఈ ప్రాజెక్టును చేపట్టారు. 3,000 చదరపు అడుగుల భవనం నిర్మించారు. ల్యాబ్, శిక్షణ కేంద్రాలు, మానిటరింగ్ వ్యవస్థ తదితరాల నిర్మాణాలకు వినియోగించారు. దాదాపు మూడు ఎకరాల స్థలాన్ని పంట క్షేత్రాలు, ప్రయోగాల నిర్వహణకు వినియోగిస్తున్నారు.

కొత్త తరాన్ని సేద్యం వైపు ఆకర్షించేలా..

వాతావరణ మార్పులు, భూసారం దెబ్బతినడం, పంటలకు తెగుళ్లు, అధిక ఎరువులు, దిగుబడుల లోపం, అన్నదాతలకు అధిక వ్యయాలు, కూలీల కొరత వంటి సవాళ్లకు తక్కువ ఖర్చుతో కూడిన శాస్త్రీయ పరిష్కారాలను చూపించడం ఈ ప్రాజెక్టు ప్రధాన లక్ష్యం. రైతుల సగటు వయసు పెరుగుతుండడం.. యువత వ్యవసాయంపై ఆసక్తి కోల్పోతున్న పరిస్థితుల దృష్ట్యా ఉండటం.. ఆధునిక శిక్షణ, సాంకేతికతలను అందుబాటులోకి తేవడం ద్వారా యువతను సేద్యం వైపు ఆకర్షించి..ఆ రంగాన్ని సుస్థిరంగా భవిష్యత్ తరాలకు అందించడం దీని ఉద్దేశం.



రోబో ఆధారిత రోటోవేటర్. ఇది నేలను చదును చేస్తుంది, సాళ్లు తీయడంతోపాటు కలుపుమొక్కలను తొలగిస్తుంది

ఏమేమి చేస్తారంటే..

పరిశోధన, శిక్షణ: విద్యార్థులు, పరిశోధకులు, రైతులు, ఆవిష్కర్తలకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ అందిస్తారు. కృత్రిమ మేధ, ఐవోటీ, రోబోటిక్స్ వంటి ఆధునిక సాంకేతికతలను ఉపయోగించి కచ్చితమైన, సమర్థ వ్యవసాయ పద్ధతులకు ప్రోత్సాహం అందిస్తారు.

● రైతులు, వ్యవసాయ ఆవిష్కర్తలు, స్టార్టప్‌లకు ప్రయోగాత్మక శిక్షణ అందించేందుకు అవసరమైన మౌలిక సదుపాయాలు, క్షేత్రస్థాయి పరిశోధన ప్రాంతాలు ఏర్పాటుచేస్తారు.

● కేంద్రీకృత డేటా నిర్వహణ వేదికను ఉపయోగించి వ్యవసాయ సాంకేతికతల అభివృద్ధి, అమలు, ఉత్తమ పద్ధతులను ప్రోత్సహిస్తారు.

● వ్యవసాయం, దాని సాంకేతికతల్లో ఉన్న నైపుణ్య లోటును తగ్గించడంతోపాటు అవసరమైన విజ్ఞానాన్ని రైతులు, వ్యవసాయ భాగస్వాములు, ఇతర సంబంధిత వర్గాలకు చేరవేస్తారు.

పొలాలకు వెళ్లే అవసరమే ఉండదు..

– జానయ్య, జయశంకర్ వ్యవసాయ వర్సిటీ వీసీ



కలుపు మొక్కల నిర్మూలనకు రోబోలు, పంటల పర్యవేక్షణకు డ్రోన్‌లు..డ్రైవర్ లేకుండానే నడిచే ట్రాక్టర్లు.. ఇలా రైతులు పొలాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండానే పంటలు సాగుచేసే (స్మార్ట్ వ్యవసాయం) దిశగా రాష్ట్రాన్ని నిర్మించడమే లక్ష్యంగా ఈ ల్యాబ్‌ను ప్రారంభించాం. వచ్చే ఏళ్లలో సంబంధిత వ్యవసాయ యంత్ర పరికరాలను తయారుచేసి, చౌక ధరలతో సరఫరా చేస్తాం. రాష్ట్రంలోని రైతులకు అత్యున్నత సాంకేతికత అందించడం ద్వారా గ్రామీణ ప్రాంతాల రైతులకు సేవలందిస్తాం. తద్వారా తెలంగాణ రాష్ట్రం.. దేశానికి మార్గదర్శకంగా నిలుస్తుంది.

– ఈనాడు, హైదరాబాద్

కొమ్ముకాసిన అందం!



అనకాపల్లి జిల్లా సబ్బవరం మండలం బోదువలస గ్రామంలో బలమైన కొమ్ములతో ఉన్న ఎద్దు ఆకట్టుకుంటోంది. గ్రామానికి చెందిన ఆర్.త్రిలోచన్ కామధేను భారతీయ గోశాల నిర్వహిస్తున్నారు. దేశీయ పశు జాతులను సంరక్షించాలనే లక్ష్యంతో వినూత్న ఆవులు, ఎద్దులను కొనుగోలు చేస్తున్నారు. ఇప్పటికే ఎన్నో రాష్ట్రాలకు చెందిన పశు సంపద ఆయన గోశాలలో ఉంది. భారీ కొమ్ములతో ఉన్న ఈ ఎద్దు గుజరాత్‌కు చెందినదని, ఈ తరహా వాటిని 'సవాయిచాల్' అని పిలుస్తారని సబ్బవరం పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు ఉషారాణి తెలిపారు. వీటి నుదుటి భాగం విశాలంగా ఉంటాయని, ఇవి వ్యాధులను తట్టుకోగలవని ఆమె వివరించారు.

– న్యూస్‌టుడే, విశాఖపట్నం (సబ్బవరం)

రైలు ఢీకొని 7 ఏనుగుల మృతి

● పొగమంచుతో అస్సాంలో ప్రమాదం



అస్సాంలోని చాంగ్‌జురైలో రైలు ఢీకొట్టడంతో మృత్యువాతపడిన ఏనుగులు

నాగావ్, గువాహటి: అస్సాంలోని హోజై జిల్లా చాంగ్‌జురై గ్రామంలో ఏనుగుల గుంపును రాజధాని ఎక్స్‌ప్రెస్ ఢీకొట్టింది. శనివారం తెల్లవారుజామున 2.17 గంటల సమయంలో జరిగిన ఈ ఘటనలో 7 ఏనుగులు మృతి చెందగా మరొకటి గాయపడింది. ప్రమాదం కారణంగా 5 బోగీలతోపాటు ఇంజిన్ పట్టాలు తప్పాయి. అయితే ప్రయాణికులెవరికీ ఎటువంటి గాయాలు కాలేదు. అటవీ ప్రాంతం కావడం, పొగ మంచు అధికంగా ఉండటంవల్ల ఈ ప్రమాదం చోటుచేసుకుంది. గువాహటికి 126 కిలోమీటర్ల దూరంలోని జమునాముఖ్-కాంపుర్ సెక్షన్‌లోని లుండింగ్ డివిజన్‌లో ప్రమాదం జరిగింది. ఈ రైలు మిజోరంలోని సైరంగ్ నుంచి దిల్లీ వెళ్తోంది. ప్రమాదం జరిగిన ప్రాంతం ఏనుగులు సంచరించేది కాదని, దగ్గరికి వచ్చాక ఏనుగుల గుంపు కనిపించడంతో రైలు డ్రైవరు అత్యవసర బ్రేక్ వేశారని, అప్పటికే సమయం మించిపోయిందని నార్త్ ఫ్రాంటియర్ రైల్వే (ఎన్ఎఫ్ఆర్) ప్రధాన అధికార ప్రతినిధి కపింజల్ కిశోర్ శర్మ తెలిపారు. పట్టాలు తప్పిన బోగీల్లోని ప్రయాణికులను ఇతర బోగీల్లోకి ఎక్కించి అందరినీ ఉదయం 6.11 గంటల సమయంలో గువాహటికి తరలించామని వెల్లడించారు. గువాహటిలో అదనపు బోగీలను జోడించి రైలును దిల్లీకి పంపామని వివరించారు. ఈ ప్రమాదం కారణంగా రైళ్లను ఉత్తర్ ప్రదేశ్ మీదుగా మళ్లించామని తెలిపారు. 9 రైళ్లను రద్దు చేశామని, 13 రైళ్లను నియంత్రించామని, రెండింటిని తాత్కాలికంగా రద్దు చేశామని వివరించారు. ప్రమాదం కారణంగా ఆంధ్రప్రదేశ్ మీదుగా వెళ్లే రెండు రైళ్లనూ నియంత్రించారు.

బెంగాల్‌లో ముగ్గురి మృతి

కోల్‌కతా: పశ్చిమ బెంగాల్‌లో ప్రధాని సభకు వెళ్తున్న వారిని రైలు ఢీకొనడంతో ముగ్గురు మరణించగా మరో ముగ్గురికి గాయాలయ్యాయి. నదియా జిల్లా తాహెర్‌పుర్‌లో శనివారం ప్రధాని మోదీ సభ జరగాల్సి ఉంది. పొగమంచు కారణంగా హెలికాప్టర్‌కు అనుమతి లభించకపోవడంతో ఆయన పర్యటన రద్దయింది. దీంతో కోల్‌కతా విమానాశ్రయం నుంచే వర్చువల్‌గా ప్రసంగించారు. ఈ సభలో పాల్గొనేందుకు బస్సులో బయలుదేరిన కార్యకర్తలు.. రైలు పట్టాలవద్ద కాలకృత్యాలు తీర్చుకునేందుకు దిగారు. అదే సమయంలో అటుగా వచ్చిన లోకల్ రైలు వారిని ఢీకొంది. తూర్పు రైల్వే పరిధిలోని సీల్దా-కృష్ణానగర్ సెక్షన్‌లో తాహెర్‌పుర్, బాద్‌కుల్లా స్టేషన్ల మధ్య ఈ ఘటన చోటుచేసుకుంది. ప్రమాదంలో ముగ్గురు అక్కడికక్కడే మరణించారు. మరో ముగ్గురికి గాయాలయ్యాయి. ప్రమాదంపై మోదీ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. తన ప్రసంగంలో ప్రస్తావించారు.

లాభాలు కురిపిస్తామంటూ

రూ.15-20 కోట్లు స్వాహా

సిరి గోల్డ్ నిర్వాహకులపై కేసు

ఈనాడు, హైదరాబాద్: పెట్టుబడులు పెడితే భారీగా లాభాలు సొంతం చేసుకోవచ్చంటూ ప్రకటనలు గుప్పించిన సంస్థ రూ.15-20 కోట్లు కాజేసినట్టు బాధితుడిచ్చిన ఫిర్యాదుతో శనివారం హైదరాబాద్ సీసీఎస్‌లో కేసు నమోదైంది. ఉమ్మడి ఖమ్మం జిల్లాకు చెందిన కె.రవీంద్ర, ఎన్.కోటేశ్వరరావు హైదరాబాద్ ఉప్పల్ భగాయత్‌లోని జీవీఆర్ సన్‌షైన్ బిల్డింగ్‌లో 'సిరి గోల్డ్ మర్చంట్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ'ను ప్రారంభించారు. ఏజెంట్లను ఏర్పాటు చేసుకొని గృహిణులు, ఉద్యోగులు, నిరుద్యోగులే లక్ష్యంగా ఆశల వల విసిరారు. రోజూ గంట సమయం కేటాయిస్తే ప్రతినెలా రూ.50వేల నుంచి రూ.లక్ష సొంతం చేసుకోవచ్చని ప్రచారం చేశారు. ఎటువంటి బంగారు దుకాణాలు, వ్యాపారం నిర్వహించకుండానే తమ సంస్థలో పెట్టుబడుల కోసం స్కీమ్‌లు ప్రవేశపెట్టినట్టు ప్రచారం చేశారు. ఇదంతా నిజమని నమ్మిన ఎంతోమంది పెట్టుబడులు పెట్టారు. ఖమ్మం జిల్లాకు చెందిన రైతు రూ.15 వేలు పెట్టుబడి పెట్టాడు. నెలలు గడుస్తున్నా అసలు, లాభం ఇవ్వకుండా నిర్వాహకులు ముఖం చాటేయటంతో మోసపోయినట్టు గ్రహించాడు. నగరానికి వచ్చి ఆరా తీస్తే సిరి గోల్డ్ కార్యాలయం మూసివేయటంతో ఆందోళనకు గురయ్యాడు. తెలుగు రాష్ట్రాల్లో వందల మంది నుంచి రూ.15-20 కోట్లు డిపాజిట్లు సేకరించి ఖమ్మం, సత్తుపల్లి, విజయవాడ తదితర ప్రాంతాల్లో బినామీ పేర్లతో ఆస్తులు కొనుగోలు చేసేందుకు సిద్ధమైనట్టు తెలుసుకున్నాడు. బాధితుడి ఫిర్యాదుతో గతనెల 13న రాచకొండ కమిషనరేట్ పరిధిలో కేసు నమోదు చేసి అనంతరం నగర సీసీఎస్‌కు బదిలీ చేశారు. సీసీఎస్ పోలీసులు కె. రవీంద్ర, ఎన్. కోటేశ్వరరావుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

శతాధిక స్ఫూర్తి.. కృష్ణమూర్తి

(మొదటి పేజీ తరువాయి)

పెన్షన్ డబ్బుల్లో కొంత భాగాన్ని వృద్ధాశ్రమాలకు, తాను నమ్మిన పార్టీకి విరాళంగా అందిస్తున్నారు.

పిల్లలే ఆస్తి: దాదాపు మూడు దశాబ్దాల ప్రభుత్వ వేతనం.. నాలుగు దశాబ్దాలకు పైగా పెన్షన్ తీసుకున్నా.. కృష్ణమూర్తికి సొంత ఇల్లు లేదు. హైదరాబాద్ విజయనగర్ కాలనీలో అద్దె ఇల్లే నివాసం. పిల్లలే తన ఆస్తి అని చెప్పే కృష్ణమూర్తికి ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు. పెద్ద కుమారుడు శ్రీనివాసమూర్తి సీపీఐ లెజిస్లేటివ్ పార్టీ సెక్రటరీగా పనిచేస్తున్నారు. రెండో అబ్బాయి భరద్వాజ్ ఫ్రీలాన్స్ జర్నలిస్టు. పెద్ద అమ్మాయి స్వతంత్ర గృహిణి. చిన్న అమ్మాయి ఉషారాణి బీఎస్ఎన్ఎల్‌లో పనిచేసి రిటైరయ్యారు.

బ్రిటిష్ హయాంలో జైలు జీవితం

గుంటూరు జిల్లా ఏటుకూరులో సీతారామయ్య, లక్ష్మీబాయమ్మ దంపతులకు 1923 సెప్టెంబరు 9న కృష్ణమూర్తి జన్మించారు. గుంటూరు టౌన్ హైస్కూల్‌లో విద్యనభ్యసించారు. తండ్రి అందించిన జాతీయోద్యమ స్ఫూర్తి వంటబట్టింది. 1935లో గుంటూరు వచ్చిన మహాత్మాగాంధీని చూశాక.. మనసు మరింతగా ఉద్యమంవైపు మళ్లింది. అప్పటి నుంచి స్వాతంత్ర్యోద్యమ కార్యక్రమాలే ఆయన దినచర్యగా మారాయి. పలు ఉద్యమాలు, నిరసన ప్రదర్శనల్లో పాల్గొన్నారు. 1940లో భారత కమ్యూనిస్టు పార్టీలో చేరారు. 'క్విట్ ఇండియా' ప్రదర్శనలో పాల్గొన్నందుకు 15 రోజుల జైలు జీవితం అనుభవించారు. బొంబాయి నౌకాదళ సైనిక తిరుగుబాటుకు సంఘీభావంగా 1946లో లఖ్‌నవూలో జరిగిన మిలిటరీ ప్రదర్శనకు కృష్ణమూర్తి నాయకత్వం వహించడంతో బ్రిటిష్ పాలకులు ఆగ్రహించారు. ఆయనను కోర్ట్ మార్షల్ ద్వారా విచారించి జైలుశిక్ష విధించారు. దీంతో కృష్ణమూర్తి 8 నెలల పాటు లఖ్‌నవూ, లాహోర్ మిలిటరీ జైళ్లలో గడిపారు.

అనుభవాలకు అక్షరరూపం

స్వాతంత్ర్యం వచ్చాక.. కృష్ణమూర్తి 1948లో కర్నూలు జిల్లా ఆళ్లగడ్డలో నెలకు రూ.37 వేతనంతో రెవెన్యూశాఖలో ఉద్యోగంలో చేరారు. 1978లో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌గా ఉద్యోగ విరమణ చేశారు. ప్రస్తుతం ప్రతినెలా రూ.60 వేల పెన్షన్ వస్తోంది. తన అనుభవాలకు ఆయన గ్రంథ రూపమిచ్చారు. 'భారత స్వాతంత్ర్యోద్యమంలో మా ఊరు' శీర్షికతో రచించిన పుస్తకంలో గుంటూరు జిల్లా స్వాతంత్ర్యోద్యమ చరిత్రతో పాటు.. పలువురు స్వాతంత్ర్య సమరయోధుల జీవిత విశేషాలను ఛాయాచిత్రాలతో అందించారు. చిన్ననాటి జ్ఞాపకాలు- చెరిగిపోని అనుభవాలు, స్వాతంత్ర్య సమరయోధుల సంస్థ ఆవిర్భావం - అంతర్ధానం, ఇదీ మా ఊరు, ప్రజా వైద్యులు వంటి పుస్తకాలూ రచించారు.



కృష్ణమూర్తితో కుమారులు, కుమార్తెలు, అల్లుళ్లు

రాజకీయాలు డబ్బుతో ముడిపడ్డాయి: కృష్ణమూర్తి

రాజకీయ నాయకులతో పాటు ప్రజలూ మారిపోయారు. ఓట్ల పండగొస్తే ఎవరు డబ్బు ఇస్తారా అని ఓటర్లు ఎదురు చూడడం బాధాకరం. ఒకప్పుడు నాయకుల ప్రచారం కోసం ప్రజలే చందాలిచ్చేవారు. అప్పట్లో వావిలాల గోపాల కృష్ణయ్య ఎన్నికల ప్రచారం కోసం రూ.5 వేలు ఖర్చు చేశారని తెలిసి పార్టీ నిలదీసిన సందర్భాలున్నాయి. కానీ ఇప్పుడు ఎవరు ఎంత ఖర్చు పెడతారని పార్టీలు చూస్తున్నాయి. భవిష్యత్తు మరింత భయంకరంగా ఉంటుందేమోనన్న ఆందోళన కలుగుతోంది.

వీసీల వెతుకులాట.. ఓ అంతులేని కథ!

(మొదటి పేజీ తరువాయి)

కోసం మళ్లీ ఇన్‌ఛార్జి వీసీని నియమించారు. సత్యనారాయణరాజు ఉత్తర్‌ప్రదేశ్‌లోని బంద యూనివర్సిటీ ఆఫ్ అగ్రికల్చర్ వీసీగా పని చేస్తున్నారు. ఆ పదవికి రాజీనామా చేసినా ప్రభుత్వం ఆమోదించకపోవడంతో రిలీవ్ కావడం లేదని తెలిసింది.

గాడి తప్పిన ఆంధ్ర కేసరి వర్సిటీ: ఆంధ్ర కేసరి విశ్వవిద్యాలయంలో బీఈడీ, న్యాయ విద్య కళాశాలల ప్రవేశాలు, అనుమతుల విషయంలో అక్రమాలు జరుగుతున్నట్లు ప్రభుత్వానికి ఫిర్యాదులు వస్తున్నాయి. ఒక కీలక అధికారి ప్రతి పనికి కొంత రేటు నిర్ణయించి వసూలు చేస్తున్నట్లు కళాశాలల యాజమాన్యాలు ఆరోపిస్తున్నాయి. ఈయన సంతకం చేయాలంటే రూ.10 వేలు కావాల్సిందే అని బహిరంగంగా వ్యాఖ్యానిస్తున్నారు. వీరిపై చర్యలు తీసుకోకపోగా.. రెగ్యులర్ వీసీ నియామకంలోనూ తీవ్ర జాప్యం జరగడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ఆర్జీయూకేటీలో ఇలా..: వీటితో పాటు రాజీవ్ గాంధీ విజ్ఞాన సాంకేతిక విశ్వవిద్యాలయానికి వీసీని, దాని ఆధ్వర్యంలోని నాలుగు ట్రిపుల్‌ఐటీలకు డైరెక్టర్లను నియమించాల్సి ఉంది. కూటమి అధికారంలోకి వచ్చిన కొత్తలో డైరెక్టర్లు, ఇన్‌ఛార్జి వీసీ పదవులకు రాజీనామాలు సమర్పించారు. ఈ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇచ్చి, రెండు నెలలు గడిచినా నియామకాలు ఇంతవరకు పూర్తి కాలేదు.

జి.మాడుగులలో 4.7 డిగ్రీల ఉష్ణోగ్రత

చింతపల్లి, న్యూస్‌టుడే: అల్లూరి సీతారామరాజు జిల్లాను చలిపులి వణికిస్తోంది. శనివారం జి.మాడుగులలో కనిష్ఠ ఉష్ణోగ్రత 4.7 డిగ్రీలుగా నమోదైనట్లు చింతపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా కేంద్రంలోని వాతావరణ విభాగం నోడల్ అధికారి డాక్టర్ ఆళ్ల అప్పలస్వామి తెలిపారు. ముంచంగిపుట్టులో 5, అరకులోయ 5.8, చింతపల్లి 6.5, పాడేరు 6.7, పెదబయలు 6.9, డుంబ్రిగుడలో 9.1 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయని వెల్లడించారు.

గ్రహం అనుగ్రహం

21-12-2025 ఆదివారం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం; దక్షిణాయనం;
హేమంత రుతువు, పుష్య మాసం, శుక్లపక్షం
పాడ్యమి: ఉ. 8-12 తదుపరి విదియ
పూర్వాషాఢ: తె.3-06 తదుపరి ఉత్తరాషాఢ
వర్జ్యం: ఉ. 11-33 నుంచి 1-16 వరకు
అమృత ఘడియలు: రా. 9-55 నుంచి 11-39 వరకు
దుర్ముహూర్తం: సా. 3-58 నుంచి 4-42 వరకు
రాహుకాలం: సా. 4-30 నుంచి 6-00 వరకు
సూర్యోదయం: ఉ.6.29; సూర్యాస్తమయం: సా.5.26
చంద్రోదయం

చలి - పులి


ప్రాంతం	కనిష్ఠ	గరిష్ఠ
హైదరాబాద్	11.2	29.0
తిరుపతి	13.2	17.1
అనంతపురం	14.0	29.5
కర్నూలు	14.7	31.0
విజయనగరం	15.0	26.0
విశాఖపట్నం	16.0	28.0
కడప	17.0	28.0
శ్రీకాకుళం	17.0	28.0
గుంటూరు	17.0	29.0
రాజమహేంద్రవరం	17.0	33.5
విజయవాడ	17.5	29.0
ఒంగోలు	20.0	29.7
నరసాపురం	20.1	29.6
నెల్లూరు	21.4	28.9
తాడేపల్లిగూడెం	26.0	29.0

పదండి... పుస్తకాల జాతరకు!

ఉత్తరాది ప్రాంతాలను ఊపిరాడనీకుండా, దారి కానరాకుండా దట్టంగా కమ్మేసే శీతాకాలం ఏటేటా తెలుగు రాష్ట్రాలకు మాత్రం- మంచు పల్లకీలో రెండు మంచి పండుగలను మోసుకొస్తుంది. పంచాంగాలు పేర్కొనే పర్వాలు కావివి. ఇవి సాహిత్యప్రియుల ఎదనలరించే పుస్తకాల జాతరలు. మస్తకాలకు విందులు. తొలుత భాగ్యనగరంలో పురివిప్పుకొనే కొత్తకొత్త పుస్తకాల అత్తరు పరిమళాలు- కాల పురుషుడికి కొసమెరుపులతో పవళింపు సేవలు చేసి, వీడ్కోలు చెబుతాయి. కొత్త ఏడాది ఉదయించగానే విజయవాడకు విస్తరించి సుప్రభాత సుగంధాలతో స్వాగతవచనాలు పలుకుతాయి. జనజాతర్లలోని రకరకాల రంగుల రాట్నాల మాదిరే- పుస్తకాల జాతర్లలోనూ, బండెనక బండి కట్టినట్లుగా రైలు పెట్టెల్లా స్టాల్స్ కొలువుతీరుతాయి. షామియానా గూళ్లు కాస్తా పొత్తపు గుళ్లు అవుతాయి. కాకపోతే- రంగులరాట్నాలు తామే తిరుగుతాయి; ఇవి జనాన్ని తమచుట్టూ తిప్పుకొంటాయి. రెండింటా ఉద్వేగం, ఉల్లాసం సమానమే! రంగులరాట్నం- కాలచక్రాన్ని వెనక్కి తిప్పి మనల్ని బాల్యంలోకి నెడుతుంది. పొత్తపుగుడిలో చేరిన కావ్యాలు- కవుల కలాల సాయంతో కాలాన్ని వెలిగించి మనల్ని కలల ప్రపంచంలోకి నెడతాయి. జ్ఞాపకాల గుట్టలను తవ్విపోస్తాయి.

దేవుడి గుడి- ఆత్మ ప్రకాశానికి, పొత్తపు గుడి- మానసిక వికాసానికి! దేవాలయంలోకి అడుగుపెట్టగానే మధురమైన మంగళవాద్యాలు, కర్పూర హారతులు ఎదురవుతాయి. పొత్తపు గుడిలో నన్నయ మొదలు నవ్య తెనుగు కవులెందరో ఎదురొచ్చి ఆత్మీయంగా హత్తుకుంటారు. ప్రబంధకవులూ పాశ్చాత్య గ్రంథకర్తలూ జుగల్‌బందీలు నిర్వహిస్తారు. 'జాతిబంధముల్లన్న గొలుసులు జారి సంపదలబ్బెదన్' అన్న మహాకవి మాటను నిజం చేస్తారు. దేశాల సరిహద్దులు చెరిపేస్తారు. కుల మత వర్గ భేదాలను రద్దుచేస్తారు. పొద్దంతా అరచేతిలో తిప్పవేసే అరిష్టాలనుంచి- మన దృష్టిని తమవైపు ఆకర్షిస్తారు. మెదడుకు సేద తీరుస్తారు. కళ్లకు కాంతినిస్తారు. మంత్రనగరిలోకి ప్రవేశపెడతారు. అక్కడి 'ఇంతలు కన్నులుండ... దారేదని వెదకెదవదేల మానవా?' అంటూ వరూధినులు కవ్విస్తారు. నవపల్లవకోమల కావ్యకన్యకలు కన్నుగీటుతారు. లేవదాళ్లు వెక్కిలి మీటుతారు. మరోవైపు నేతన్నల మగ్గాల్లోంచి, రైతన్నల నాగేటిచాళ్లనుంచి, శ్రామికుల పదును కొడవళ్లనుంచి, అణిచివేతల్లోంచి, మూలమూలల్నుంచి- మూలుగులు చెవిని పడతాయి. కావ్యాలు బుద్ధిని ఆకట్టుకుంటే- కన్నీళ్లు గుండెను పట్టి ఊపుతాయి. రెండూ చేరి మనిషిని కదుపుతాయి. కుదుపుతాయి.

'నీకంటూ ఓ మెదడుంది. దానికి కాసింత మేత పెట్టు' అని చలం నచ్చచెబుతారు. 'చదవడం మానేసిన రోజునుంచీ నువ్ మరణించడం ఆరంభిస్తావ్' అని పాబ్లో నెరుదా హెచ్చరిస్తారు. ఆర్తితో ఆత్మీయంగా పొంగి వచ్చే తడి ఆరని తల్లిభాష గుండెను తడుముతుంది. అలనాటి షేక్స్పియర్ మొదలు మొన్నమొన్నటి కన్నుమూసిన గుగి వా థియాంగో వరకూ ఎందరో పాశ్చాత్యుల నోట ఆంగ్లభాష విభిన్న సంగీతాన్ని రుచి చూపిస్తుంది. రెండూ తెలిసిన రసజ్ఞుల తీరని దాహం- ఆ పడమటి సంగీతానికి పట్టుచీరలను చుట్టబెట్టి దప్పిక తీర్చుకుంటుంది. 'నా పుస్తకం తమనెంతో ప్రభావితం చేసిందని ఎవరైనా వచ్చి చెబితే- నాకు కలిగే ఆనందం, సంతృప్తి- నోబెల్‌కు ఏమీ తీసిపోదు' అన్న కవుల చిరకాల వాంఛలను ఆ రసజ్ఞులే తీర్చగలుగుతారు. మంత్రనగరి మహాయాత్రను మనం ముగించే సమయానికి ఆర్ద్ర చెప్పినట్లు అనిపిస్తుంది. గుబులు జనిస్తుంది. ఆ పుస్తకాలను హత్తుకోవాలన్న కోరిక పుడుతుంది. వాటితో సొంతింట ఓ గదిని ఆలయంగా మార్చి అనునిత్యం ఆరాధిస్తే తప్ప ఆ గుబులు తీరదని అనిపిస్తుంది. చిత్రం ఏమంటే- అది మళ్లీమళ్లీ ఆవరించే జ్వరం, కోరుకునే దిగులు. పదండి- మనసు మన మాటను ఎప్పుడు వినవచ్చింది కనుక!




మానవ హక్కులను ప్రభుత్వం ఒక్కటే ఎప్పటికీ పూర్తిగా అమలు చేయలేదు. పౌరులు కూడా బాధ్యత తీసుకుని ప్రజా ప్రయోజన వ్యాజ్యాల ద్వారా న్యాయాన్ని నిస్సహాయుల ముంగిటకి తీసుకెళ్లాలి. అందరికీ సమన్యాయం అందేలా చూడాలి.

– జస్టిస్ పి.ఎన్.భగవతి

ధ్యానం ఎందుకంటే..!

ధ్యానం అనగానే రకరకాల అపోహలు... అన్నీ వదిలేసిన సన్యాసులూ సాధువులే ధ్యానం చేస్తారని అనుకుంటారు. వాళ్లు సంసార బంధాలకు, భావోద్వేగాలకు, ఉద్యోగ వ్యాపారాలకు అతీతంగా జీవిస్తుంటారని. నిజానికి ఇవన్నీ సరైన అవగాహన లేకపోవడంతో ఏర్పడే అభిప్రాయాలే!

ఈ గందరగోళానికి మూలం మనసుకు సంబంధించిన రెండు స్థితుల మధ్య తేడా తెలియకపోవడం. పూర్తిగా ఇహలోకపు విషయాలు ఏమాత్రం పట్టించుకోకుండా నిర్లిప్తంగా ఉండటం వేరు. దీన్ని 'డిటాచ్‌మెంట్' అనుకుందాం. నిత్యజీవితంలో బాధ్యతలన్నీ మనస్ఫూర్తిగా నిర్వహిస్తూనే ఫలితాల గురించి పట్టించుకోకుండా ఉండటం వేరు. ఇది 'నాన్- ఎటాచ్‌మెంట్'. ధ్యానం ఈ రెండో కోవకు చెందినది. అది నిర్లిప్తతకు, అన్నింటినీ పట్టుకుని వేళ్లాడటానికి మధ్యస్థంగా ఉంటుంది. ధ్యానం చేసేటప్పుడు ఏం జరుగుతుందో చూద్దాం. జీవితంలో ఎప్పుడూ ఎదురయ్యే పరిస్థితులూ సందర్భాలే అప్పుడూ ఉంటాయి. కాకపోతే కష్టాలను చూసి బెదిరిపోయి దూరంగా పెట్టడం; ఆనందాలను అంటిపెట్టుకుని ఉండటం చేయరు. కేవలం నిమిత్తమాత్రుల్లా గమనిస్తూ ఉంటారు. తమలోపల ఏం జరుగుతుందో స్పష్టంగా తెలుసుకోగలుగుతారు. ఈ సాధన మనిషిని చైతన్యవంతుణ్ని చేస్తుంది. అతనిలో సున్నితత్వాన్ని పెంచుతుంది. ధ్యానం చేసేవారు సాధారణంగా ఎక్కువ ప్రేమా అనుభూతి చెందుతారు. ఇతరుల బాధ అర్థమవుతుంది. అనుబంధాలను ఆస్వాదిస్తారు. బంధుత్వాలు మెరుగు పడతాయి. ధ్యానం వల్ల మనల్ని మనం కోల్పోకుండా ఇతరుల పట్ల శ్రద్ధ వహించవచ్చు. ఇతరులతో పోలిస్తే ఎక్కువ తరచుగా ధ్యానం సాధన చేసిన వ్యక్తుల్లో భావోద్వేగ చైతన్యం, గాఢమైన సహానుభూతి, మెరుగైన అనుబంధాలు ఉన్నట్లు పరిశోధనలు చెబుతున్నాయి.



అంతర్యామి

మనిషి మనస్తత్వానికి సంబంధించిన ఒక వైరుధ్యాన్ని ఇక్కడ గమనించవచ్చు. ఫలితాలకు ఎక్కువ ప్రాధాన్యమిచ్చే వ్యక్తులు నిజంగా జరుగుతున్న దాని పట్ల తగినంత శ్రద్ధతో స్పందించలేరు. అనుబంధాలను కోల్పోతామేమోనని భయపడే మనుషులు దాన్ని మరింత ఒత్తిడికి గురిచేస్తారు. కచ్చితమైన ఫలితాలను ఆశించేవారు చేసే పని అసహజంగా ఉంటుంది. తమ పిల్లలు ఎలా ఉండాలో స్థిరమైన అభిప్రాయం ఏర్పరచుకున్న తల్లిదండ్రులు వాళ్లతో అనుబంధాన్ని నాశనం చేసుకుంటారు. నాన్- అటాచ్‌మెంట్ తరహా మానసిక స్థితిలో ఉన్నవారికి ఈ ఇబ్బందులుండవు. ఎప్పుడైతే ఫలితం కచ్చితంగా ఈ విధంగానే ఉండాలని ఆశించమో అప్పుడు సంఘటనల పట్ల మన స్పందన మరింత స్పష్టంగా, స్వేచ్ఛగా ఉంటుంది. ఎలాంటి భయసందేహాలూ లేకుండా నిర్ణయాలు తీసుకోగలుగుతాం.

ధ్యానం చేసేవారు జీవితాన్నుంచి పారిపోయేవారు కారు. అనుభవాల్లో తలమునకలు కాకుండానే జీవితాన్ని ఆస్వాదించగలరు. ఓడిపోతామన్న భయం లేకుండా సవాళ్లను స్వీకరించగలరు. భయాందోళనలు లేకుండా అనిశ్చితిని ఎదుర్కోగలరు. ధ్యానం వల్ల మనసు నిశ్చలమూ విశాలమూ అవుతుంది తప్ప కుంచించుకుపోదు.

– కమలేష్ డి.పటేల్ (దాజీ)

ఆధునిక భారత అమరశిల్పి

స్వతంత్ర భారత నాయకులు, వారసత్వ స్మృతులకు సజీవ రూపునిచ్చిన అమరశిల్పి రామ్ వాంజీ సుతార్. కళాకారుడిగా ఏడు దశాబ్దాల పయనంలో ఆయన ప్రాచీన శిల్పకళా సంప్రదాయాలను ఆధునిక రీతులతో మేళవించి అపురూప లోహ, శిలాకృతులను సృజించారు. సుతార్ శిల్పాలు సాంస్కృతిక ప్రతీకలు. ఆధునిక భారతీయ శిల్పులలో మేరునగమైన సుతార్ మూడు రోజుల క్రితం కీర్తిశేషులయ్యారు.

జాతి ఆత్మలో చిరస్థాయిగా నిలిచిన చారిత్రక, ఐతిహాసిక పురుషులు రామ్ సుతార్ ఉలి నుంచి తిరిగి ప్రాణం పోసుకున్నారు. కురుక్షేత్రలో కృష్ణార్జునులు, అయోధ్యలో రూపుదిద్దుకుంటున్న శ్రీరాముడు, పార్లమెంటుతోపాటు పలు రాష్ట్రాల విధాన సభా ప్రాంగణాల్లోని మహాత్మా గాంధీ విగ్రహాలు, ఛత్రపతి శివాజీ, రాణా ప్రతాప్, నర్మదా తీరాన సర్దార్ పటేల్ విగ్రహం, హైదరాబాద్, ముంబయిలలోని అంబేడ్కర్ విగ్రహాలు సుతార్ కళాసృజనలే. భారతావనికి గర్వకారణమైన ఈ విశిష్ట కళాకారుణ్ని పద్మశ్రీ, పద్మవిభూషణ్ పురస్కారాలు వరించాయి.



మార్మికతకు దూరంగా...

మహారాష్ట్రలోని గొండూర్‌లో సాధారణ విశ్వకర్మ కుటుంబంలో జన్మించారు రామ్ సుతార్. ఆయన తండ్రి దేవతా విగ్రహాలను పోత పోయడం చిన్ననాటినుంచే వీక్షించేవారు. ఆరాధ్య దైవాల ప్రతిమల తయారీకి వాడాల్సిన పదార్థాలు, కొలతల గురించీ, పవిత్ర రూపాల గురించీ అవగాహన ఏర్పరచుకున్నారు. స్థానికంగా, సంప్రదాయంగా, కుటుంబపరంగా అలవడిన శిల్ప కళకు బొంబాయిలోని సర్ జేజే స్కూల్ ఆఫ్ ఆర్ట్ శిక్షణ ఆధునిక శైలిని, మెలకువలను అద్దింది. అక్కడ ఆయన శరీర నిర్మాణ శాస్త్రాన్ని, శిల్పకళా సూత్రాలను నేర్చుకున్నారు. తన తోటి శిల్పులు, చిత్రకళాకారులు ఐరోపా-అమెరికా ఆధునిక కళా రూపాలకు, నైరూప్య కళకు మళ్లినా సుతార్ మాత్రం సంప్రదాయ, సాకార స్పష్టతకు అంటిపెట్టుకున్నారు. కొత్తగా స్వాతంత్ర్యం పొందిన జాతికి కళ్లెదుట సజీవంగా కనబడే మహాపురుషుల ప్రతిమలు, విస్పష్ట సాంస్కృతిక ప్రతీకలు స్ఫూర్తి, ఉత్సాహాలు ఇస్తాయని గ్రహించి తన శిల్పకళలో ప్రజలకు సులభంగా అర్థమయ్యే యదార్థ వాదానికి పట్టంకట్టారు. బహిరంగ ప్రదేశాలలో ప్రతిష్ఠించే శిల్పాలు ప్రజలతో నేరుగా సంభాషిస్తున్నట్లు కనిపించాలే తప్ప అర్థంకాని మార్మికత, అస్పష్టత వాటిలో ఉట్టిపడకూడదని సుతార్ భావించారు. ఇదే ఆయన శిల్పకళను నడిపించిన సూత్రం. ఆయన మలచిన మహాపురుషుల విగ్రహాలు హుందాగా, నేరుగా ప్రజా హృదయాలను తాకుతాయి. అలాగని అవి ఫొటో తీసినట్లు ఉంటాయని కాదు. ఆ విగ్రహాలలో భారీతనం, ఆదర్శాలు, నైతిక విలువలు మూర్తీభవిస్తాయి. ఆ విగ్రహ మూర్తుల ముఖకవళికలలో గాంభీర్యం, సంయమనపూరిత భావోద్వేగం ఉట్టిపడతాయి. శరీర భంగిమలో నింపాదిగా చైతన్యం మూర్తీభవించి ఉంటుంది.


సజీవ మూర్తిమత్వం

ఛాతీ వరకు మాత్రమే తీర్చిదిద్దిన ప్రతిమలు మొదలుకుని వందలాది అడుగుల ఎత్తయిన విగ్రహాలదాకా- సుతార్ పనితనం అద్భుతం. 182 మీటర్ల సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ విగ్రహం ఆయన శిల్ప చాతుర్యానికీ, సాంకేతిక నైపుణ్యానికీ ఆకాశమంత ఎత్తయిన నిదర్శనం. ఆ విగ్రహం నిలకడగా సూటిగా చూసే చూపులో, స్థిరంగా నిలిచిన తీరులో, దీక్షగా అడుగు ముందుకు వేస్తున్న భంగిమలో ఉక్కుమనిషి పటేల్ దృఢ వ్యక్తిత్వం ప్రస్ఫుటంగా కనిపిస్తుంది. అంతటి భారీ విగ్రహంలో శరీర భాగాలు చక్కగా పొందికగా గంభీరంగా ఉండేట్లు చెక్కడంలో సుతార్ శిల్పకళా ప్రజ్ఞ ఉట్టిపడింది. అది ప్రపంచంలో అతికొద్దిమంది శిల్పులకే సాధ్యం. పటేల్ బృహత్తర విగ్రహానికి ముందు గాంధీ, నెహ్రూ, సుభాష్ చంద్రబోస్, అంబేడ్కర్ వంటి జాతీయ మహా నాయకుల శిల్పాలకు సుతార్ రూపుదిద్దారు. వాటిని భారతదేశంతోపాటు ఇతర దేశాల్లోనూ ప్రతిష్ఠించారు. ఈ ఆదర్శ మూర్తుల విశిష్ట లక్షణాలు సుతార్ శిల్పాలలో చక్కగా ప్రతిఫలిస్తాయి. గాంధీజీ చేత కర్రపట్టి స్థిరచిత్తంతో ముందుకు అడుగు వేస్తున్నట్లూ, అంబేడ్కర్ పుస్తకం పట్టుకుని చేయి ముందుకుచాచి రాజ్యాంగ ధర్మాన్ని ప్రబోధిస్తున్నట్లూ చిత్రించడం ద్వారా సుతార్ మన జాతి నిర్మాతల మహోన్నత నైతిక వ్యక్తిత్వానికి దృశ్యరూపమిచ్చారు.

సుతార్ శిలలతో, కాంస్యంతో, కాంక్రీటుతో ప్రతిమలను సృజించి సవ్యసాచినని చాటుకున్నారు. అయితే- కాంస్య విగ్రహాలు కాలపరీక్షలో చెక్కుచెదరవనీ, వాటిలో గాంభీర్యం, హుందాతనం ఉట్టిపడతాయనీ, ప్రాచీన శిల్పకళను ఆధునికతతో మేళవించడం వాటితో బాగా సాధ్యమవుతుందన్నది ఆయన భావన. సుతార్ శిల్పాలలో నాటకీయత కన్నా సంయమనం ఎక్కువ. రామ్ కింకర్ బైజ్ వంటి కళాకారులు ఆధునిక భారతీయ కళలో వాస్తవాన్ని అతిశయోక్తిగా చిత్రించడం, నిరాకార భావోద్వేగాలను, ఆధ్యాత్మిక భావాలను నైరూప్యంగా చిత్రించడం వంటి శైలులను ప్రవేశపెట్టారు. సుతార్ దీనికి భిన్నంగా ఆర్భాటం లేని ఆధునికతను ఒద్దికైన యదార్థ వాదాన్నీ మేళవించారు. ఆయన సంప్రదాయ పిడివాదానికీ, దానిపై ఆధునికుల తిరుగుబాటుకూ దూరంగా ఉంటూ మానవీయ ఆధునికతకు పట్టం కట్టారు. ఆయన శైలి అంతర్జాతీయ శిల్పి అగస్టే రోడిన్ భావోద్వేగభరిత సహజత్వానికి దగ్గరగా ఉంటుంది. అదే సమయంలో సుతార్ భావజాల పునాదులు గాంధేయ నైతిక విలువలలో, జాతీయవాద చారిత్రక దృక్పథం, వలస పాలనానంతర స్వేచ్ఛా భారత ఆశయాలు, ఆకాంక్షలలో పాదుకుని ఉన్నాయి.

జాతి ఆత్మతో అనుసంధానం

పలు భాషలు, సంస్కృతులు, భావజాలాలకు నెలవైన భారతదేశంలో సుతార్ కళ విస్పష్ట రూపంతో ఏకీకరణ శక్తిగా నిలుస్తోంది. ఆయన కళాకృతులకు విమర్శకులు అర్థాలు చెప్పనక్కర్లేదు. సామాన్య భారతీయులు సైతం ఆయన శిల్పాలలో తమ వారసత్వాన్ని చూసుకుంటారు, సుతార్ చెక్కిన మహనీయుల విగ్రహాలపై భక్తిగౌరవాలను చాటుకుంటారు. ఈ విధంగా జాతి ఆత్మతో సుతార్ కళ నేరుగా బంధం ఏర్పరచుకుంటుంది. సుతార్‌కు ఎన్నో అవార్డులు, రివార్డులు వచ్చినా ఆయన శాశ్వత కళా వారసత్వం వాటిలో లేదు. అది పార్కులలో, విద్యాసంస్థలు, విధాన సభలు, పార్లమెంటు ప్రాంగణాలలో, అంతర్జాతీయ బహిరంగ స్థలాలలో ప్రతిష్ఠించిన విగ్రహాలలో చిరస్థాయిగా నిలిచిపోయింది. చివరగా రామ్ సుతార్ జాతీయ స్మృతులకు ఉత్కృష్ట రూపునిచ్చిన అద్భుత శిల్పి. భారతదేశ నైతిక విలువలకు, రాజకీయ భావాలకు బృహత్తర రూపునిచ్చిన సృజనశీలి. తరతరాలుగా నిలిచిపోయేలా భారత జాతీయతను దృశ్యీకరించిన స్రష్ట రామ్ సుతార్.




డాక్టర్ డి.వెంకట రమణమూర్తి

ఆర్ట్ కన్సల్టెంట్, ఆర్ట్ గ్యాలరీ క్యూరేటర్, నిర్మలా బిర్లా గ్యాలరీ ఆఫ్ మోడ్రన్ ఆర్ట్, హైదరాబాద్

టైమ్ ట్రావెల్... చిన్నా పెద్దా అందరినీ అలరించే సబ్జెక్టు. అందుకే దానిమీద ఏకంగా నవలల సిరీస్ రాసేశారు జపాన్ రచయిత తోషికజు కవగూచి. మొదట 'బిఫోర్ ద కాఫీ గెట్స్ కోల్డ్' పేరుతో ఓ నాటకం రాశారాయన. దానికి అవార్డులు వచ్చి బహుళ ప్రేక్షకాదరణ పొందడంతో పదేళ్ల క్రితం ఆ పేరుతోనే నవలగా మలిచారు. అదీ ఇన్‌స్టంట్ హిట్ అయ్యింది. దాంతో సిరీస్ కింద ఇప్పటికి అయిదు నవలలు వెలువరించారు. అన్నీ వేటికవే చదవవచ్చు, ఒక వరుసలో చదివితే మరింత థ్రిల్లింగ్‌గా ఉంటాయి. టైమ్ ట్రావెల్‌కి సంబంధించిన షరతులన్నీ మొదటి పుస్తకంలోనే ఉంటాయి. వాటి ఆధారంగానే కథలు నడుస్తాయి కాబట్టి అది తప్పక చదవాలి.

గతంలోకి వెళ్లొస్తారా?



టోక్యోలోని ఒక సందులో ఉన్న చిన్న కాఫీ షాప్ అది. మూడు టేబుల్స్, కౌంటర్, వెనకాలో గది... మొత్తం కథ ఆ కాస్త చోటులోనే జరుగుతుంది. మూడు గోడ గడియారాలు వేర్వేరు టైమ్‌లను చూపిస్తుంటాయి. ఆ కెఫేలోని ఒక కుర్చీలో దయ్యం కూర్చుంటుంది. అది టాయ్‌లెట్‌కి వెళ్లి వచ్చేలోపు ఎవరైనా అందులో కూర్చుంటే టైమ్ ట్రావెల్ చేయొచ్చు. గతంలోకి వెళ్లి ఎవరినైనా కలిసిరావచ్చు. కాకపోతే ఆ వ్యక్తి కూడా గతంలో ఈ కెఫేకి వచ్చి ఉండాలి. కాఫీ పూర్తిగా చల్లగా అయిపోయేలోపు అంటే గంట లోపలే తిరిగి వర్తమానానికి వచ్చేయాలి. ఫ్యుమికో అనే యువతి వారం క్రితం ఆ కెఫేలోనే బాయ్‌ఫ్రెండ్‌తో గొడవపడుతుంది. అతడు మంచి ఉద్యోగం కోసం ఆమెను వదిలేసి అమెరికా వెళ్లిపోవాలనుకుంటాడు. ఒక్క అవకాశం దొరికితే మళ్లీ ఆరోజుకు వెళ్లి ఆనాటి గొడవను సరిదిద్దుకోవాలనుకుంటుంది ఫ్యుమికో. ఆమెకు ఆ కెఫే ప్రత్యేకత గురించి తెలుస్తుంది. ఆమె ప్రయత్నం సఫలమైందా అన్నది కథ. మరో నలుగురు కస్టమర్లు కూడా ఈ కథలో ఉంటారు. ఒక్కొక్కరిదీ ఒక్కో కథ. అల్జీమర్స్‌తో బాధపడుతున్న భర్త రాసిన ఒక ఉత్తరం ఎక్కడుందో తెలుసుకోవాలని ఒకరు, కోపంతో విడిపోయిన చెల్లెల్ని కలవాలని మరొకరు అనుకుంటే, ఇంకొకామె ఏకంగా భవిష్యత్తులోకి వెళ్లి పుట్టబోయే తన కూతురితో మాట్లాడాలనుకుంటుంది.

ఇక సీక్వెల్స్ విషయానికి వస్తే ప్రతిదాంట్లోనూ కొత్త పాత్రలు ఉంటాయి. 'టేల్స్ ఫ్రమ్ ద కెఫే'లో ఒక వ్యక్తి ఇరవయ్యేళ్ల క్రితం మరణించిన స్నేహితుణ్ని కలిసి థ్యాంక్స్ చెప్పాలనుకుంటాడు. మరో వృద్ధుడు జీవితకాలంలో తన భార్యకు ఏ బహుమతీ ఇవ్వనందుకు పశ్చాత్తాపపడతాడు. 'బిఫోర్ యువర్ మెమొరీ ఫేడ్స్'లో ఓ తల్లీకూతురూ ఒకరినొకరు రక్షించుకోవడానికి గతంలోకి వెళ్తారు. 'బిఫోర్ వియ్ సే గుడ్‌బై'లో భార్య బ్రెయిన్ డ్యామేజ్ అయ్యాక బాధపడే వ్యక్తి, పెళ్లి ప్రతిపాదనకు సమాధానం చెప్పలేకపోయిన యువతి లాంటివారు తారసపడతారు. నిరుడు వచ్చిన 'బిఫోర్ వియ్ ఫర్‌గెట్ కైండ్‌నెస్'లో నలుగురివీ వైవిధ్యభరితమైన కథలు. మరో నాలుగు కథలతో ఆరో పుస్తకం 'బిఫోర్ ఐ న్యూ ఐ లవ్డ్ యు' వచ్చే ఏడాది రానుంది. జ్ఞాపకాల పరామర్శ మారిపోయే మనుషులు, మనసులను దహించివేసే పశ్చాత్తాపాలు, కాలపు సరిహద్దులు దాటి నిలిచే ప్రేమలు... గుప్పెడంత మనసుకు ఎన్నెన్నో కోణాలు. హృద్యమైన మానవీయ కథనాలు. పలు భాషల్లోకి అనువాదమై ఆసక్తిగా చదివిస్తున్న ఈ పుస్తకాల్లోని కథలన్నీ చెప్పేదొకటే... గతంలోకి వెళ్లగలమేమో కానీ దాన్ని మార్చలేం, మార్చుకోగలిగిన భవిష్యత్తు మాత్రం అచ్చంగా మన సొంతమేనని!

– మిహిర

అంతా నకిలీ... సాంకేతిక మకిలి!



పుణ్యభూమి

జగమే మాయ.. జీవుడు మాయ అంటారు వేదాంతులు. ఒక పట్టాన అంతుపట్టని ఆ సిద్ధాంతాల సంగతి అటుంచితే, ఏఐ వంటి ఆధునిక సాంకేతికతను విపరీతంగా దుర్వినియోగం చేస్తున్న కొందరు ప్రబుద్ధుల మూలంగా ఏది నిజమో, ఏది మాయో తెలియని గందరగోళం నెలకొంటోంది. కొత్త ఆవిష్కరణలు ఏవి వచ్చినా వాటిని ఎలా తమ స్వార్థానికి వాడుకుందామా అని కాచుకుని కూర్చున్న కేటుగాళ్ల మూలంగా ప్రజల జేబులు గుల్లవుతున్నాయి. దాంతోపాటు వ్యక్తిగత గోప్యత, పరువు ప్రతిష్ఠలు, దేశ భద్రత, ప్రజాస్వామ్య వ్యవస్థలే ప్రమాదంలో పడుతున్నాయి.

ఊహించనంత రాబడులు రావాలంటే ఫలానా సంస్థల్లో పెట్టుబడులు పెట్టాలని రాజ్యసభ సభ్యురాలు సుధామూర్తి సూచిస్తున్నట్లుగా ఉన్న వీడియో ఒకటి ఇటీవల వైరల్ అయ్యింది. తానెప్పుడూ అలా చెప్పనని, ఆ వీడియో నకిలీదని తాజాగా ఆమె తేల్చి చెప్పారు. కొన్ని కంపెనీల్లో ఇన్వెస్ట్ చేస్తే దండిగా లాభాలొస్తాయని ఇన్ఫోసిస్ నారాయణ మూర్తి, ముఖేష్ అంబానీలు చెబుతున్నట్లుండే డీప్‌ఫేక్ వీడియోలు గతంలో సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టాయి. వాటిని నమ్మి బెంగళూరులో ఇద్దరు వ్యక్తులు కోటి రూపాయలు హారతి కర్పూరం చేసుకున్నారు. ప్రముఖ ఆధ్యాత్మికవేత్త జగ్గీ వాసుదేవ్ రూపంతో వచ్చిన అలాంటి దొంగ వీడియోను చూసి నిజమనుకుని అదే నగరంలో మరో మహిళ 3.7 కోట్లు పోగొట్టుకున్నారు. ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, రతన్ టాటాలు సైతం పెట్టుబడులను ప్రోత్సహిస్తున్నట్లున్న ఫేక్ వీడియోలు కొద్ది రోజుల కిందట నెట్‌లో దర్శనమిచ్చాయి. 'రూ. 22వేలు పెట్టండి... ఫోన్ ద్వారా క్రమం తప్పకుండా ఆదాయం పొందండి' అంటూ ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చెబుతున్నట్లున్న డీప్‌ఫేక్ వీడియో సైతం ఇటీవల బయటకొచ్చింది. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఒక వెబ్‌సైట్‌ను ప్రమోట్ చేస్తున్నట్లుగా కూడా కేటుగాళ్లు నకిలీ దృశ్యాలను సృష్టించారు. అధునాతన సాంకేతికతను దారి మళ్లించి స్నేహితులు, బంధువుల్లా వీడియో, ఆడియో కాల్స్ చేస్తున్న సైబర్ బందిపోట్లు అమాయకుల నుంచి దర్జాగా డబ్బు దండుకుంటున్న ఉదంతాలూ తరచూ వెలుగుచూస్తున్నాయి. ప్రజల రోజువారీ జీవనాన్ని మరింత మెరుగుపరచడానికి, దేశాభివృద్ధికి తోడ్పడాల్సిన టెక్నాలజీని ఇలా మోసాలు, దుర్మార్గాలకు సాధనంగా మారుస్తున్న వారు సమాజానికి పట్టిన చీడపురుగులు!

రాజకీయాల్లో ఎదుటి పక్షాలను జనంలో పలుచన చేయాలంటే మైకులు పట్టుకుని ఉన్నవీ లేనివీ చెబుతూ గతంలో గొంతు చించుకునేవారు. ఎంతో డబ్బు పోసి రాత్రికిరాత్రి దొంగ పోస్టర్లు అంటించేవారు. ఏఐ వచ్చాక ఈ నయవంచక నేతల పని మరింత సులువైంది. దాని సాయంతో మంచినీళ్లు తాగినంత తేలిగ్గా ప్రత్యర్థి రూపాన్ని ముందు పెట్టి, దాంతో వివాదాస్పద, అబద్ధపు వ్యాఖ్యలు చేయిస్తున్నారు. అలా దొంగ వీడియోలు, ఆడియోలు సృష్టిస్తూ జనం దృష్టి మళ్లిస్తున్నారు. తనతో సహా భాజపా సీనియర్ నాయకుల వ్యాఖ్యలను వక్రీకరించడానికి ఏఐని వాడుతున్నారని మోదీ గత ఎన్నికలప్పుడు ఆవేదన వ్యక్తం చేశారు. భాజపా సైతం అలాగే తమను అభాసుపాలు చేస్తోందని ప్రతిపక్షాలు వాపోయాయి. పరిశీలనల ప్రకారం గత సాధారణ ఎన్నికల సమయంలో 75శాతం భారతీయులు డీప్‌ఫేక్ వీడియోలను చూశారు.



అందులో ప్రతి నలుగురిలో ఒకరు వాటిని నిజమని నమ్మారు. బాలీవుడ్ నటులు అమీర్‌ఖాన్, రణ్‌వీర్ సింగ్‌లు ఒక పార్టీ తరఫున ప్రచారం చేస్తున్న నకిలీ వీడియోలు దుమారం రేపాయి. పేద కుటుంబాలకు కేంద్రం రూ. 12వేలు అందిస్తుందని లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా ప్రకటించినట్లు ఒక డీప్‌ఫేక్ వీడియో ఇటీవల షికార్లు చేసింది. చెప్పనిది చెప్పినట్లు, జరగనిది జరిగినట్లు, ఉన్నది లేనట్లు జరుగుతున్న వికృత ప్రచారాలు ప్రజల అభిప్రాయాలు, ఆలోచనలపై తీవ్ర ప్రభావం చూపిస్తాయి. అంతిమంగా అవి ప్రజాస్వామ్య స్ఫూర్తికి గొడ్డలి పెట్టుగా పరిణమిస్తాయి.

మన దేశంలో 90 కోట్ల మందికి పైగా అంతర్జాలం వాడుతున్నారు. 49 కోట్ల మందికి క్రియాశీల సోషల్ మీడియా అకౌంట్లు ఉన్నాయి. దాంతో డీప్‌ఫేక్ చిత్రాలు, వీడియోలు, ఆడియోలు క్షణాల్లో ప్రజల్లోకి వెళ్లిపోతున్నాయి. మెకాఫీ సంస్థ అధ్యయనం ప్రకారం గడిచిన ఏడాది కాలంలో మూడొంతుల మంది భారతీయులు డీప్‌ఫేక్ వీడియోలు చూశారు. సమాజాన్ని పట్టిపీడిస్తున్న లింగవివక్ష మూలంగా ఇప్పటికే ఆన్‌లైన్‌లో స్త్రీలకు లైంగిక వేధింపులు అధికమయ్యాయి. వాటికి డీప్‌ఫేక్‌లు సైతం జతకావడంతో వ్యక్తిగత గోప్యత గాలిలో దీపమవుతోంది. నటీమణులు, ఇతర మహిళల డీప్‌ఫేక్ వీడియోలతో కొందరు దుర్మార్గులు సోషల్ మీడియా ఖాతాలు, వెబ్‌సైట్లు నిర్వహిస్తున్నారంటేనే తమనెవరు ఏం చేస్తారులే అన్న ధీమా ఎంతలా వారిలో ఎగదన్నుతోందో అర్థమవుతుంది. కొందరు యువతులు సోషల్ మీడియాలో సరదాగా పంచుకునే ఫొటోలను సేకరిస్తున్న కొన్ని మానవ రూప తోడేళ్లు- వాటిని నగ్నంగా మార్చి డబ్బు డిమాండ్ చేస్తున్న ఉదంతాలూ కొంత కాలంగా పెరుగుతున్నాయి. ఫేక్ ప్రచారాలతో సంస్థలు, వ్యక్తుల ప్రతిష్ఠను దెబ్బతీసే పన్నాగాలూ యథేచ్ఛగా కొనసాగుతున్నాయి.

ఇంతలా డీప్‌ఫేక్‌లు సమాజానికి చెరుపు చేస్తున్నా, వాటికి అడ్డుకట్ట వేసేందుకు దేశీయంగా పటిష్ఠ చట్టం లేదని నిపుణులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వాలు దాని గురించి ఆలోచించాలి. ఫేక్ దృశ్యాలు, ఆడియోలను ఎప్పటికప్పుడు తొలగించేలా సామాజిక మాధ్యమాలను నియంత్రించాలి. ఎవరు చెప్పినా వినాలి, విన్నదాన్ని వెంటనే విశ్వసించకుండా నిజానిజాలు తెలుసుకుని ముందుకు సాగినవారే తెలివైనవారు అని హితబోధ చేశాడు సుమతీ శతకకర్త. కాబట్టి అంతర్జాలంలో కనపడే ప్రతిదాన్నీ గుడ్డిగా నమ్మకుండా, ఆ సమాచారాన్ని ప్రధాన స్రవంతి పత్రికలూ మీడియాతో సరిచూసుకోవాలి. అలా సత్యాసత్యాలు గ్రహించాలి. లేకపోతే ఏఐ మాయా ప్రపంచంలో మన కళ్లూ చెవులే మనల్ని నిలువునా మోసం చేస్తాయి!

– వేణుబాబు మన్నం

మంచు కురవదా?

క్రికెట్‌లో మనం తరచూ 'డ్యూ' అనే మాట వింటుంటాం. డ్యూ కారణంగా మ్యాచ్ ఆలస్యమైందనో, ఆగిపోయిందనో చెబుతుంటారు. ఇంతకీ డ్యూ అంటే ఏంటి? సింపుల్‌గా మంచు అని చెప్పవచ్చు. పొద్దున్నే లేచి చూస్తే మొక్కల ఆకులపై వెండి బిందువుల్లా, గడ్డిపై వజ్రాల్లా మెరుస్తూ కనిపించేదే మంచు. రాత్రంతా పడిన మంచుతో మొక్కలు, గడ్డి తడిసిపోయి తళతళ మెరుస్తుంటాయి. మరైతే, మంచు పైనుంచి పడుతుందా?

నిజానికి మంచు వర్షంలా ఆకాశం నుంచి కిందికి పడదు. మంచు కురవకపోతే, మంచు బిందువులు ఎక్కడ్నుంచి వచ్చాయన్నదే మీ అనుమానం కదూ! గాలిలో తేమ ఉంటుందన్న సంగతి తెలుసుగా... గాలి చల్లగా మారినప్పుడు తనలోని మొత్తం తేమను ఇముడ్చుకోలేకపోవడంతో అది ద్రవరూపంలోకి మారుతుంది. అదే



హాయ్! బుజ్జీ!!

మంచులా ఏర్పడుతుందన్న మాట! గాలిలోని నీటి ఆవిరి చల్లగా మారి, గడ్డి, ఆకులపై ద్రవ బిందువుల్లా నిలిచిపోతుంది. ఆకులపై కనిపించే తేమలో కొంత భాగం మంచు బిందువులే అయినా, అందులో చాలావరకు మొక్క నుంచి వచ్చిందే. మొక్క నేల నుంచి గ్రహించిన నీటిని ఆకులకు సరఫరా చేస్తుంది. ఆకులపై ఉండే రంధ్రాల నుంచి తేమ బయటికి వస్తుందన్నమాట. వర్షాలు కురవని సమయాల్లో మొక్కలు మంచుపైనే ఆధారపడి మనుగడ సాగిస్తాయి.

క్రికెట్‌లో డ్యూ ప్రస్తావన ఎందుకు వస్తుందంటే.. మైదానంలో మంచు పెరిగితే దాని ప్రభావం ఆటతీరుపై, గెలుపోటములపైనా పడుతుంది. మంచులో బంతి తడిస్తే బౌలింగ్ ఇబ్బందిగా మారుతుంది. ముఖ్యంగా బంతిని పట్టుకోవడానికి స్పిన్నర్లకు కష్టమవుతుంది. మైదానంలో ఔట్‌ఫీల్డ్ మంచుతో తడిస్తే ఫీల్డర్లు బంతిని ఆపడం, క్యాచ్‌లు పట్టడం ఇబ్బందే. బంతి జారిపోతుంటుంది. పరుగుల నియంత్రణ కష్టమవుతుంది. మైదానంలో ఫీల్డర్లు జారిపడే ప్రమాదమూ పెరుగుతుంది. మ్యాచ్‌ల సందర్భంగా మంచుతో ఇన్ని సమస్యలుంటాయి. అలాంటప్పుడు మైదానాల్లో ప్రత్యేక రసాయనాలు చల్లి మంచు ప్రభావాన్ని తగ్గించడానికి ప్రయత్నిస్తారు.

– శ్రీజన్

మన సామెతలు!

ఇక్కడ కొన్ని సామెతలు అసంపూర్తిగా ఉన్నాయి. వాటిని పూర్తి చేయగలరా?

1. ఎవరి ☐☐ వాళ్లకు ☐☐☐.
2. ఎంత ☐☐ కి అంత ☐☐.
3. ☐☐ విరిగి ☐☐లో పడినట్లు.

కొత్తది కనిపెట్టు.. పేటెంట్ పట్టు

యువ

వర్సిటీల్లో మేధో మథనం ● సరికొత్త ఆవిష్కరణల దిశగా విద్యార్థుల కృషి

ఈనాడు, అమరావతి

తరగతి గదులంటే కేవలం బోధన.. అభ్యాసానికే పరిమితం అన్నది ఒకప్పటి మాట... నేడు.. మేధో వికాసానికి కేంద్ర బిందువులవుతున్నాయి... మేధో సంపత్తి హక్కులే (పేటెంట్) లక్ష్యంగా ప్రయోగశాలలుగా రూపొందిస్తున్నాయి ఉమ్మడి గుంటూరు, కృష్ణా జిల్లాల్లోని అనేక విద్యాలయాలు. ప్రజా ప్రయోజనాలే లక్ష్యంగా కొత్త ప్రయోగాలకు నేటి విద్యార్థులు సై అంటున్నారు. అమరావతిలోని విట్ ఏపీ, కేఎల్ యూనివర్సిటీ, ఎస్ఆర్ఎం, వీవీఐటీ, విజ్ఞాన్, ఆర్వీఆర్‌జేసీ, ఎన్ఆర్ఐటీ... సహా అనేకచోట్ల నూతన ఆలోచనలను కార్యరూపంలోకి తెచ్చేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి

ఏమిటీ పేటెంట్..?

చట్టపరంగా లభించే మేధో హక్కు. ఆవిష్కరణను బహిరంగంగా ప్రచురించడానికి, నిర్దిష్ట కాలపరిమితి వరకు ఆ మేధో ఉత్పత్తులను ఇతరులు తయారు చేయకుండా, ఉపయోగించకుండా లేదా విక్రయించకుండా పరిరక్షించే పరిమిత హక్కు. దీని ప్రధాన ఉద్దేశం ఆవిష్కర్తలను సృజనాత్మకతవైపు ప్రోత్సహించడం. తద్వారా చట్టపరమైన రక్షణ, మార్కెట్ ప్రయోజనం, ఆర్థిక అవకాశాలు లభిస్తాయి.



✦ వీవీఐటీకి చెందిన సుబ్రహ్మణ్యం రూపొందించిన గ్లాస్ హ్యాండిల్స్, లోహ రహిత పూలకుండీల తయారీకి పేటెంట్ లభించింది. తక్కువ ఖర్చుతో, వేగంగా తయారు చేసేలా రూపొందించారు.

✦ ఆర్వీఆర్ జేసీలో మూడు ఆవిష్కరణలకు పేటెంట్లు దాఖలు చేశారు. దివ్యాంగుల కోసం విష్ణు అనే విద్యార్థి ప్రోస్థెటిక్ హ్యాండ్ రూపొందించారు. ఇప్పటికే కృత్రిమ చేతులు అందుబాటులో ఉన్నా..



ప్రోస్థెటిక్ హ్యాండ్ ఆవిష్కరణతో రూపకర్తలు

ఈ పరికరం వైవిధ్యంగా ఉండేలా ప్రయత్నించాడు. విష్ణు చదువు పూర్తి చేసుకుని వెళ్లినా.. అతని బృందం అధ్యయనం కొనసాగిస్తోంది.

✦ అద్దకం పరిశ్రమలో నీటిని పునర్వినియోగించడం ద్వారా నీటి కొరతను ఎలా అధిగమించవచ్చో ఇక్కడి



ఎఫ్లియంట్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ డిజైన్‌తో..

విద్యార్థులు పరిశోధించారు. వాడిన నీటిని శుద్ధి చేసి వినియోగించేలా పోర్టబుల్ ఎఫ్లియంట్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌ను తీర్చిదిద్దారు. ఇది పేటెంట్ పరిశీలనలో ఉంది.

✦ ఘనశ్యామ్ ఐవీ ఫ్లూయిడ్ మానిటరింగ్ డివైజ్ రూపొందించారు. క్యాన్సర్ రోగులకు కీమో థెరపీ చేస్తున్నప్పుడు ఇబ్బంది లేకుండా ఈ డివైజ్‌ను ఏఐ ఇంటిగ్రేటెడ్‌గా తయారు చేశారు. ప్రొడక్ట్, డిజైన్ రిజిస్ట్రేషన్‌లకు పేటెంట్ కోసం దరఖాస్తు చేశారు.

ఉద్యోగాల్లోనూ కీలకమే..

పట్టభద్రులకు ఉద్యోగాలు దొరకడం కష్టంగానే ఉంటోంది. వారి ఆలోచనలు. . ఆవిష్కరణలను ప్రముఖ సంస్థలు లోతుగా పరిశీలిస్తున్నాయని ప్లేస్‌మెంట్ అధికారులు చెబుతున్నారు. తద్వారా విద్యార్థి మేధస్సును అంచనా వేస్తున్నాయి. పేటెంట్లు, పరిశోధనా పత్రాలు, ప్రచురణలు.. ఇలా అన్నీ కీలకంగా మారాయి.

మిన్నగా ధాన్యం కొనుగోళ్లు

ఎన్టీఆర్ కలెక్టరేట్: గత ఖరీఫ్ సీజను (2024-25)లో మొత్తం 1,10,738.800 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశారు. ప్రస్తుత సీజనులో లక్ష్యం 1.50 లక్షల మెట్రిక్ టన్నులుగా ఉంది. ఇప్పటి వరకు 1,13,512.560 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశారు. గత లక్ష్యానికి మించి కొనుగోళ్లు జరగగా, ఈ సీజనులో సాధించాల్సిన లక్ష్యానికి చేరువలో ఉంది. 15,576 మంది రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసినట్లు పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ సతీశ్ తెలిపారు. రూ.247.64 కోట్లను రైతుల ఖాతాల్లో 24 గంటల్లో జమ చేసినట్లు వెల్లడించారు. 148 రైతు సేవా కేంద్రాల్లో కొనుగోళ్లకు ఏర్పాట్లు చేయగా, 144 కేంద్రాల్లో సేకరణ జరుగుతోందని వివరించారు.

వెలుగు కణం.. తొలగు రణం..

మూలకణం దానానికి యువత ముందడుగు...★ గుడివాడలో వారంలో 600 మంది నమోదు

ఈనాడు, అమరావతి

'గుడివాడలో వారం రోజులు.. మూలకణాల దానంపై అవగాహన, నమోదు నిర్వహించగా.. పెద్దఎత్తున యువత ముందుకొచ్చి అంగీకారపత్రాలు సమర్పించారు. ఏఎన్నార్ కళాశాలలో మూడు రోజులు శిబిరం నిర్వహించగా ఏకంగా 600 మంది నమోదు చేసుకున్నారు. ఉమ్మడి కృష్ణా, గుంటూరుల్లోనే 50 వేల మంది పైగా దాతలున్నారు.'



గుడివాడ: విద్యార్థి నుంచి నమూనాల సేకరణ

అవయవ దానం మాదిరే.. మూలకణాలను ఇచ్చేందుకూ చాలామంది ఆసక్తి చూపిస్తున్నారు. మన శరీరంలో కొన్ని కణాలను దానం చేసి.. మరొకరి ప్రాణాలను కాపాడే సువర్ణావకాశమిది. తలసీమియా బారినపడి నిత్యం మృత్యువుతో పోరాడే చిన్నారులు.. సరైన మూలకణ దాతలు లేక ప్రాణాలు కోల్పోతున్నారు. వీరి కోసమే.. దేశీయంగా మూలకణాలను ధాత్రి ఫౌండేషన్ సేకరిస్తోంది. కొవిడ్‌కు ముందు విస్తృతంగా ఉమ్మడి కృష్ణా, గుంటూరుల్లో మూలకణ దాతల నమోదు చేపట్టారు. ఆ తర్వాత ఇప్పుడు గుడివాడలో విజయవంతమైంది.

హెచ్‌ఎల్‌ఏ రకం గుర్తించాక...

హ్యూమన్ ల్యూకోసైట్ యాంటిజెన్ (హెచ్ఎల్ఏ) అనేది.. రక్త మూలకణం, అవయవ మార్పిడిలో చాలా కీలకం. ఈ హెచ్ఎల్ఏ.. ఒకరితో మరొకరికి సరిపోలితే.. వారి మూలకణాలతో వ్యాధిగ్రస్థులకు చికిత్స చేసి కోలుకునేలా చేయొచ్చు. దాతలు నమోదు చేసుకునే వేళ.. వారి లాలాజలం, రక్తనమూనా పరీక్షిస్తారు. హెచ్ఎల్ఏ ఏ రకమో ధ్రువీకరించి. దాత వివరాలను భద్రపరుస్తారు.

తీవ్ర వ్యాధులకు పరిష్కారం..

లుకేమియా, లింఫోమా, తలసీమియా బాధితులకు.. సరిపోలే హెచ్ఎల్ఏ ఉండే దాతల రక్త మూల కణ మార్పిడితో పూర్తిగా కోలుకునేలా చేయొచ్చు. రక్తగ్రూపు సరిపోలితే ఎలాగైతే దానం చేయవచ్చో.. అలాగే మూలకణాలు ఇచ్చేందుకు జన్యుపరంగా హెచ్ఎల్ఏ సరిపోలాలి. రక్తదానం మాదిరిగానే ఇదీ 3-4 గంటల్లో పూర్తయ్యే ప్రక్రియ. ముందుగా నమోదు చేసి డేటాను నిక్షిప్తం చేస్తే.. ఆపన్నవేళ దాతలను గుర్తించే వీలుంది. లేదంటే.. ఒక రోగికి సరిపడే జన్యుపరమైన హెచ్ఎల్ఏ దొరకటానికి 10వేల నుంచి 2,00,000 మంది నమూనాలను పోల్చాలి.

80కి పైగా వ్యాధులు నయంచేసే సామర్థ్యం ఉంది..

మూలకణ దాతలకు 18-50 ఏళ్లు ఉండాలి. 80పైగా వ్యాధులను నయం చేసే సామర్థ్యం మూల కణాలకు ఉంది. కొన్నేళ్ల కిందటే విజయవాడ, గుంటూరు సహా ఈ ప్రాంతంలో వేల మంది దాతలు ముందుకొచ్చి.. రిజిస్ట్రేషన్లు చేసుకున్నారు. విద్యాసంస్థల్లో శిబిరాలు నిర్వహిస్తే.. యువత భారీగా ముందుకొస్తున్నారు. తలసీమియా బాధిత చిన్నారులకు.. మూలకణాలు ఓ వరమే.

\- చావా రవీంద్రనాథ్, ఏపీ, తెలంగాణ కోఆర్డినేటర్, ధాత్రి ఫౌండేషన్

1 నుంచి జీవన ప్రమాణ ధ్రువపత్రాల సమర్పణ

ఎన్టీఆర్ కలెక్టరేట్, గాంధీనగర్, : పదవీ విరమణ పొందిన రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, కుటుంబ పింఛనుదారులు తమ జీవన ప్రమాణ ధ్రువీకరణ పత్రాలను 2026 జనవరి ఒకటో తేదీ నుంచి ఫిబ్రవరి నెలాఖరులోగా సమర్పించాలని ఖజానా శాఖ అధికారి ఎ.రవి శనివారం తెలిపారు. జీవన్ ప్రమాణ్ పోర్టల్/ పింఛనర్ల వ్యక్తిగత సీఎఫ్ఎంఎస్ లాగిన్/ ఏదైనా ఖజానా శాఖ కార్యాలయంలో సమర్పించవచ్చని సూచించారు. ఆధార్, మొబైల్, పీపీవో, బ్యాంకు ఖాతా నంబర్లు సరిచూసుకోవాలని చెప్పారు. ఫిబ్రవరిలో సమర్పించకపోతే ఏప్రిల్ ఒకటో తేదీన ఇచ్చే మార్చి నెల పింఛను నిలిపివేస్తారని పేర్కొన్నారు. ఖజానా కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్లు అందుబాటులో ఉంచామని, నందిగామ, జగ్గయ్యపేట, కంచికచర్ల, మైలవరం, తిరువూరు, విస్సన్నపేటలలోని కార్యాలయాల్లోనూ ఉంచినట్లు వివరించారు.

జిల్లా సీనియర్ నెట్‌బాల్ జట్ల ఎంపిక నేడు

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే : స్థానిక ఐజీఎంసీ స్టేడియంలో 21న ఉమ్మడి కృష్ణా జిల్లా సీనియర్ (స్త్రీ, పురుషుల) నెట్‌బాల్ జట్ల ఎంపిక పోటీలు నిర్వహిస్తామని కృష్ణా జిల్లా నెట్‌బాల్ సంఘ అభివృద్ధి కమిటీ ఛైర్మన్ బూదోటి శివరామ్ తెలిపారు. ఎంపిక పోటీలో పాల్గొనే క్రీడాకారులు ఆధార్ కార్డు, పాస్‌పోర్టు సైజు ఫొటోతో అదే రోజు సాయంత్రం 4 గంటలకు స్టేడియంలోని నెట్‌బాల్ మైదానంలో రిపోర్టు చేయాలన్నారు. ఎంపికైన క్రీడాకారులు 27 నుంచి 29 వరకు కోనసీమ జిల్లా రావులపాలెంలో జరిగే 10వ రాష్ట్ర స్థాయి అంతర్ జిల్లాల సీనియర్ నెట్‌బాల్ ఛాంపియన్‌షిప్‌లో జిల్లా జట్లకు ప్రాతినిధ్యం వహిస్తారని పేర్కొన్నారు.

స్వర్ణోత్సవ వేదిక.. సుమధుర గీతిక



సిద్ధార్థ అకాడమీ 50 సంవత్సరాల సందర్భంగా శనివారం నిర్వహించిన 'గోల్డెన్ జూబ్లీ సంగీత కచేరీ' హుషారెత్తించింది. ప్రముఖ సింగర్లు సింహ, శ్రీకృష్ణ, రమ్యాబెహరా, సమీరా భరద్వాజ్ పాడిన పాటలకు విద్యార్థులు నృత్యాలు చేస్తూ ఉర్రూతలూగారు. అతిథులతో సెల్ఫీలు దిగుతూ సందడి చేశారు. - న్యూస్‌టుడే, కానూరు



సుదీర్ఘ రాత్రి @ డిసెంబరు 21

ప్రేమికులు ఒకరినొకరు కలుసుకునేందుకు మరుసటి రోజు కోసం ఆతృతగా ఎదురు చూస్తున్నా.. కొత్తగా ఎవరైనా ఉద్యోగంలో చేరబోతున్నా.. ముందు రోజు రాత్రి వారికి ఎంతకీ తెల్లారదనిపిస్తుంటుంది. రాత్రి వేళ సుదీర్ఘంగా ఉన్నట్లు అనిపిస్తుంది. అదే నిజంగా సుదీర్ఘ రాత్రి అయితే వారికి ఇంకా ఎక్కువ ఉత్కంఠ ఉంటుంది. ఇటువంటి ఉత్కంఠ కలిగించే రోజు డిసెంబరు 21. ఈ రోజున భూమి సూర్యుడి చుట్టూ భ్రమణంలో ఏర్పడే మార్పు వల్ల రాత్రి సమయం కాస్త ఎక్కువగా ఉంటుంది. భూమి అక్షం 23.5 డిగ్రీలు వంగి సూర్యుడి చుట్టూ తిరగటం వల్ల ఉత్తర మధ్య గోళంలో ఈ నెలలో సూర్య కిరణాలు తక్కువ సమయం పడతాయి. దీన్ని శీతాకాల అయనాంతంగా నిపుణులు పేర్కొంటారు. భారత దేశంలో ప్రధానంగా దిల్లీ, హరియాణా ప్రాంతాల్లో సాయంత్రం 5.28 గంటలకే చీకటి పడుతుంది. మరుసటి రోజు ఉదయం 7.10 గంటలకు సూర్యుడు ఉదయిస్తాడు., ఆ రోజు రాత్రి దాదాపు 13 గంటల 42 నిమిషాలకు పైగా రాత్రి కొనసాగుతుంది. దక్షిణ భారత దేశంలోని విజయవాడ వంటి ప్రాంతాల్లో అయితే సాయంత్రం 5.26 గంటలకు చీకటి పడుతుంది. మరుసటి రోజు ఉదయం 6.31 గంటలకు సూర్యుడు ఉదయిస్తాడు. ఇక్కడ సుదీర్ఘ రాత్రి 13 గంటల 5 నిమిషాలు ఉంటుంది. - ఈనాడు, అమరావతి

నేడూ విద్యుత్తు బిల్లులు చెల్లించొచ్చు

సూర్యారావుపేట, న్యూస్‌టుడే : సెలవు దినమైనప్పటికీ ఆదివారం జిల్లాలోని అన్ని విద్యుత్తు బిల్లుల వసూలు కేంద్రాలు తెరిచి ఉంటాయని ఎస్ఈ యు.హనుమయ్య తెలిపారు. వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. అలాగే ఇంటి వద్ద నుంచే చరవాణిలో.. ఏపీసీపీడీసీఎల్ కస్టమర్ యాప్, గూగుల్‌పే, ఫోన్‌పే, అమెజాన్ పే, బిల్ డెస్క్ యాప్‌ల ద్వారా బిల్లులు చెల్లించవచ్చని ఎస్ఈ సూచించారు.

దూసుకెళ్తాం బ్రో.. తగ్గేదేలె..!



విజయవాడ కేబీఎన్ కళాశాల ఉమెన్స్ స్టడీస్ సెంటర్, యూజీసీ ఆధ్వర్యంలో కళాశాల యాజమాన్యం సహకారంతో మహిళలు, యువతులకు ఉచితంగా స్కూటీ డ్రైవింగ్ శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. మహిళలు సాధికారత సాధించేందుకు, సామాజిక సేవలో భాగంగా 2016 సంవత్సరంలో ప్రారంభమైన ఈ కార్యక్రమం.. నేటికీ కొనసాగుతోంది. ఇప్పటి వరకు సుమారు 5వేల మందికి శిక్షణ ఇచ్చారు. 5 ద్విచక్ర వాహనాలను అందుబాటులో ఉంచారు. వాటికి పెట్రోలు ఖర్చును కళాశాల యాజమాన్యం భరిస్తుంది. డ్రైవింగ్‌కి సంబంధించి ఎల్ఎల్ఆర్ కూడా ఇప్పించే బాధ్యత తీసుకుంది. ప్రతి రోజు ఉదయం 5.30 నుంచి 7 గంటల వరకు, సాయంత్రం 5 నుంచి 7 గంటల వరకు శిక్షణ ఇస్తున్నట్లు ప్రిన్సిపల్ కృష్ణవేణి తెలిపారు. - న్యూస్‌టుడే, చిట్టినగర్

చూడ ముచ్చట... చైతన్యమిచ్చుట!



"శిరస్త్రాణం వాడండి.. ద్విచక్ర వాహనంపై ముగ్గురు వద్దండి.. సిగ్నల్ క్రాస్ చేయవద్దు.. చరవాణిలో సంభాషిస్తూ డ్రైవింగ్ చేయవద్దనే" నినాదాలతో చైతన్యం తెచ్చేలా చూడచక్కని చిత్రాలతో ముచ్చటగా ఫ్లెక్సీలతో గోడకట్టేశారిలా. అంతేనా.. పెళ్లి వేడుకలో సైతం అతిథులకు శిరస్త్రాణం పంచారని తెలిసి ఆ ఫ్లెక్సీని పెట్టేశారు. శిరస్త్రాణం వాడకంతో ప్రమాదం వేళ ప్రాణాలతో బయటపడిన తీరునీ వివరించారు.. డ్రగ్స్ వద్దు బ్రో.. ఏపీకే ఫైల్స్ ఓపెన్ చేయవద్దు.. మైనర్‌లకు బైక్ ఇవ్వొద్దని" ఎంచక్కా తెలియజేస్తున్నారు. కమిషనరేట్ పరిధిలో ప్రజల్లో చైతన్యం తెచ్చేలా పోలీసులు... నగరమంతా ఫ్లెక్సీలు, డిజిటల్ తెరలతో ఓ యజ్ఞంలా శ్రమిస్తున్నారు. - ఈనాడు, అమరావతి

తడబడితే బండి.. తల్లడిల్లడమేనండి!



ఈ చిత్రం చూశారా.. లోడు ఆటోలో... లెక్కకు మించి ప్రమాదకరంగా... చంటిబిడ్డలతో ప్రయాణం చేస్తున్న వీరంతా కోల్‌కతా-చెన్నై జాతీయ రహదారిపై గుంటూరు నుంచి విజయవాడ వెళుతున్నారు. కూర్చోవడానికి ఆటోలో స్థలం లేక కొందరు నిలబడి వెళుతున్నారు. హఠాత్తుగా బ్రేక్ వేసినా.. ఏదైనా వాహనం అడ్డుగా వచ్చి ఆటో పక్కకు తిప్పినా... వాహనం నుంచి కిందకు జారిపడే వీలుంది. వాహనాల్లో నిర్దేశిత పరిమితి మేరకు సాగితేనే ఎలాంటి ప్రమాదాలు జరక్కుండా గమ్యం చేరవచ్చు. - ఈనాడు, అమరావతి

ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ దిశగా అడుగులు

విజయవాడ పాతాసుపత్రి, న్యూస్‌టుడే: ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ దిశగా అడుగులు పడుతున్నాయని.. చిన్నారులకు తప్పకుండా పోలియో చుక్కలు వేయించాలని కలెక్టర్ జి.లక్ష్మీశ సూచించారు. శనివారం విజయవాడ పాతాసుపత్రి ఆవరణలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో పల్స్ పోలియో అవగాహన ప్రదర్శన నిర్వహించారు. ఈ ప్రదర్శనను కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సమష్టి కృషితో అడుగులు వేస్తూ స్వర్ణాంధ్ర, వికసిత్ భారత్, లక్ష్యాలు చేరుకుందామని పిలుపునిచ్చారు. చిన్నారులకు బంగారు భవిష్యత్తు అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఇమ్యూనైజేషన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈనెల 21న బూత్ స్థాయిలోనూ, ఈనెల 22, 23వ తేదీల్లో ఇంటింటి సర్వే ద్వారా చిన్నారులకు పోలియో చుక్కలు వేయాలని అధికారులను ఆదేశించారు. 611 గ్రామీణ, 355 అర్బన్ 71 మొబైల్, 35 ట్రాన్సిట్ పాయింట్ల ద్వారా ప్రత్యేక బృందాలు సేవలందిస్తాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిణి ఎం.సుహాసిని, వైద్య ఆరోగ్య జిల్లా సంఘం నాయకులు హనుమయ్య, శ్రీదేవి, శరత్ తదితరులు పాల్గొన్నారు.



నగరంలో ప్రదర్శనగా వెళ్తున్న కలెక్టర్ లక్ష్మీశ, విద్యార్థులు

తరువే స్ఫూర్తి.. తరగని దీప్తి!

అమరావతిలో 6 వేల వృక్షాలకు పునర్జీవం



ఈ భారీ రావి చెట్టు వయసు.. 80 ఏళ్లు. ఉండవల్లిలో కరకట్ట ప్రారంభంలో ఉన్న ఈ చెట్టు.. అక్టోబరు చివరలో వచ్చిన మొంథా తుపాను దెబ్బకు నేలకూలింది. దీనిని ఏడీసీఎల్ (అమరావతి డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్) ఉద్యాన విభాగం శాస్త్రీయంగా తొలగించి అనంతవరం పార్కుకు తరలించి.. పునర్జీవింపజేశారు. ఫలితంగా ఇది చిగుళ్లు తొడిగింది.. ఇలా ఏడీసీఎల్ అధికారులు రాజధాని ప్రాంతంలో పెద్దసంఖ్యలో చెట్లను మరోచోటకు తరలించి బతికిస్తున్నారు. తొలగించిన వాటిని సమీపంలోని బఫర్ జోన్లలో నాటుతున్నారు. మిగిలిన వాటిని అనంతవరం పార్కులో ప్రతిష్ఠిస్తున్నారు.

ఈనాడు, అమరావతి

అమరావతిలో అభివృద్ధి పనులు పెద్దఎత్తున జరుగుతున్నాయి. పనులకు పలు ప్రాంతాల్లో చెట్లు అడ్డు వస్తున్నాయి. తప్పనిసరిగా తొలగించాల్సిన వాటిని జాగ్రత్తగా ట్రీ ట్రాన్స్‌లొకేషన్ విధానంలో పునఃప్రతిష్ఠిస్తున్నారు. వెరసి పచ్చదనం పరిఢవిల్లేలా మరోచోటకు మారుస్తూ... హరిత రాజధాని సంకల్పానికి శ్రమిస్తున్నారు. ఈవిధానంలో అధికారులు 4 వేల చెట్లను శాస్త్రీయంగా తొలగించి.. నర్సరీలో సంరక్షిస్తున్నారు. తాజాగా.. రహదారుల నిర్మాణంలోనూ భారీగా చెట్లను కూల్చకుండా జాగ్రత్తగా తొలగిస్తున్నారు. చింత, మారేడు, ఉసిరి, రావి, మర్రి, బహునియా, లెగస్ట్రోమియా, తాటి, రెయిన్ ట్రీ, కేసియా, ఆకాశమల్లి, తబబియా, కదంబి, స్పాతోడియా, తదితర 6 వేల చెట్లను బతికించారు. మొదటి దశలో 12-15 ఏళ్ల.. 4 వేల చెట్లను పరిరక్షించారు.

సవాళ్లను అధిగమించి..

ప్రగతి పనులు ఊపందుకోగా.. రెండో దశ ట్రాన్స్‌లొకేషన్ చేపట్టారు. ఇప్పటికి 2,000 చెట్లకు జీవం పోశారు. ఈ దశలో... 25-60 ఏళ్ల భారీ చెట్లను తొలగించే క్రమంలో సవాళ్లను అధిగమిస్తున్నారు. మంగళగిరి నుంచి కురగల్లు మార్గంలో 60 భారీ చింత వృక్షాలను తొలగించాల్సి రాగా.. వీటిని ఈ-15 రోడ్డు పక్కన బఫర్ జోన్‌లో తిరిగి నాటారు. ఒకసారి చింత చెట్లను తొలగించాక అవి బతికే రేటు చాలా తక్కువ. ఈ ప్రతికూలతను అధిగమించి వీటిని బతికించడంతో కొత్తగా చిగుళ్లు తొడిగాయి.



పైపులైన్ పనులకు అడ్డుగా ఉన్న చెట్లను తొలగించి సిద్ధం చేశారిలా...

మురిసేలోపే.. ముసిరిన చీకటి!

పిల్లలు లేని వారిపై సరోజిని ముఠా వల ★ డబ్బు తీసుకుని ఉత్తరాది శిశువుల అప్పగింత

ఈనాడు, అమరావతి



'ఏళ్లుగా పిల్లలు లేక తల్లడిల్లిన ఆ దంపతులు.. **బలగం సరోజిని** చేతిలో వంచనకు గురయ్యారు. వారి నుంచి రూ.లక్షల్లో డబ్బు తీసుకుని పిల్లలను అప్పగించింది. పిల్లలను చూసి మురిసిన కుటుంబాల్లో ఆ ఆనందం ఎంతోసేపు నిలబడలేదు. చివరకు నిందితులు పోలీసులకు దొరడంతో.. కొన్న వారి నుంచి శిశువులను తీసుకుని పోలీసులు సంరక్షణ కేంద్రాల్లో అప్పజెప్పారు. బాధితులది ఒక్కొక్కరిది ఒక్కో కథ.'

★ నున్న పరిధిలో దంపతులకు ఏళ్లుగా పిల్లలు లేరు. దీంతో కుమారుడికి మళ్లీ పెళ్లి చేసేందుకు అత్త సిద్ధమైంది. వీరికి బంధువైన ఓ మహిళ ద్వారా విషయం తెలుసుకున్న ఆటోడ్రైవర్ వంశీ కిరణ్‌కుమార్.. మణికి చెప్పాడు. బుధవారం వేకువన దిల్లీ నుంచి కిరణ్‌శర్మ, భారతిలు వెంట తెచ్చిన శిశువుల్లో ఒకరిని సరోజిని.. మణి ఇంట్లో ఉంచింది. ఆటోడ్రైవర్‌తో మాట్లాడారు. బేరం కుదరడంతో ఫరీనా, మణిలు పిల్లల్లేని దంపతులకు రూ.3.70 లక్షలు తీసుకుని అప్పగించారు. తర్వాత రెండు గంటల్లోనే పోలీసులు వచ్చి చిన్నారిని తీసుకెళ్లారు.

★ నెల కిందట ముంబయి నుంచి ఓ చిన్నారిని కవిత.. నూరి, సతీష్‌ల ద్వారా విజయవాడకు పంపింది. ఈ చిన్నారిని తీసుకున్న నిందితురాలు సరోజిని.. సత్తెనపల్లిలో వలి ఇంట్లో ఉంచింది. పెళ్లయి 12 ఏళ్లయినా.. పిల్లలు లేని కొత్తపేట ప్రాంత దంపతులతో మాట్లాడి యేహాను బేరం కుదుర్చుకున్నారు. ప్రభుత్వాసుపత్రిలో పనిచేసే యేహాను దంపతులను సంప్రదించాడు. పతి శ్రీనివాసరావు ద్వారా సరోజినితో మాట్లాడి రూ.3.50 లక్షలకు బేరం కుదిరింది. తర్వాత చిన్నారిని అప్పగించారు. ఈ దారుణం వెలుగుచూడగా పోలీసులు దంపతుల ఇంటికి వచ్చి శిశువును తీసుకెళ్లారు.

వెలుగులోకి వచ్చిందిలా...

నిందితురాలు బ్లెస్సీ ఇంటికి నెల రోజులుగా పలువురు చిన్నారులను తెస్తుండడంతో ఇరుగుపొరుగుకు అనుమానం వచ్చింది. వారానికో శిశువును తెచ్చి సరోజిని ఇక్కడ ఉంచేది. ఒక్కో శిశువుకు బ్లెస్సీకి రూ.5-10 వేలు ముట్టజెప్పేది. బ్లెస్సీ గతంలో ఆశ కార్యకర్త. వైద్యుడి సంతకం ఫోర్జరీ చేసి పుట్టినతేదీ సర్టిఫికెట్ ఇచ్చిన వ్యవహారంలో సస్పెండై.. ఖాళీగా ఉంటోంది. సరోజినితో కలసి తన ఇంట్లో ఆశ్రయం ఇస్తూ.. కమీషన్ తీసుకునేది. దీనిని గమనించిన ఇరుగుపొరుగు నాలుగు రోజుల కిందట పోలీసులకు తెలిపారు. దీంతో బ్లెస్సీ ఇంటి వద్ద రోజంతా రెక్కీ ఉన్నారు. పిల్లల విక్రయ ముఠాగా నిర్ధారణకు వచ్చి.. బుధవారం వేకువన ప్రత్యేక బృందాలతో దాడి చేసి పట్టుకున్నారు.

EENADU Classifieds

AGRI BUSINESS

పౌల్ట్రీ ఫామ్ అమ్మకం
గోపాలపురం, బీమోలు చెరువు దగ్గర 3.35 ఎకరములలో గల 69,000 లేయర్ పక్షుల సామర్థ్యం గల పౌల్ట్రీ ఫామ్ కనీసపు ధర రూ.2,16,00,000/- గా నిర్ణయించి వేలము నందు అమ్మబడును.
80994 44378
98496 36969

AUTO

VEHICLES FOR SALE

2012మోడల్ Benz E-Class Car Fully ఆటోమెటిక్ (కార్) మంచి రన్నింగ్ కండీషన్‌తో అమ్మకమునకు కలదు. ✆ 92463 40700.

USED & DEMO CARS FOR SALE
KIA
SELTOS HTX PLUS DIESEL
CARENS LUXURY PLUS
SONET IMT PETROL
HYUNDAI- VENUE DIESEL
RENAULT- KWID AT
Contact
7799981599

BUSINESS SERVICES

COURIERS

USA,UK, కెనడా, ఆస్ట్రేలియా & ఇతర దేశాలకు పచ్చళ్ళు,స్వీట్స్, బట్టలు, డాక్యుమెంట్స్, మెడిసిన్స్, మొ|| కొరియర్ చేయబడును. SV Express - ICL కొరియర్. గురునానక్‌నగర్, VJA. 94410 27788

BUSINESS OFFER

మీరు కారు డ్రైవరు లేదా కారు ఓనరా! మీ సర్వీసులను www.carstand.in నందు ఉచితంగా నమోదు చేసుకోండి. సంప్ర: 63009 23212.

FOR SALE

Established &Running International Brand GYM 8000Sqft, Fully Operational Invest 2Cr, Serious Investors only ✆99854 26699

PACKERS & MOVERS

Tirumala Packers & Movers an ISO 9001:2015 Certified Co. Household Goods Shifting any time any where. ✆ 97043 64389.

BUILDING CONSTRUCTION

RK కన్‌స్ట్రక్షన్ మెటీరియల్ కాంట్రాక్టర్ మీకు నచ్చే మీరు మెచ్చే విధంగా 100% వాస్తు, లేటెస్ట్ కబోర్డ్స్, క్వాలిటీతో బిల్డింగ్ నిర్మించబడును. ✆ 97043 63336.

WATER PROOFING

Tarun Slab Leakage Works ★ 25 Yrs Exp. ★ 5Yr Waranty ★ Bathroom Leakage Grouting Epoxy Works ✆ 94940 02285, 99516 07504

EDUCATION

SPOKEN HINDI

Learn Online/ Offline Spoken Hindi/ English, French & German Within 30Days. 100% Guarantee For all Ages Free Demo. 98495 42456

HOME TUITIONS

ప్రత్యూష (ఆన్‌లైన్ & హోమ్) ట్యూషన్స్ LKG to PG All Objective సబ్జెక్ట్స్, NEET, IIT ట్యూటర్స్‌కు ✆ 92900 05677, 74165 35749

FINANCIAL SERVICES

సేల్‌డీడ్ హామీపై ఇళ్ళు, స్థలాలు, పొలాలు, అపార్ట్‌మెంట్స్‌పై ఫైనాన్స్ ఇవ్వబడును. Contact: 94401 48114, 80852 83056.

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

హాస్పిటల్ విస్తరణ కోసం యాభై లక్షల రూపాయలు లోన్ రూపాయి వడ్డీతో కావలెను. పర్సనల్ ల్యాండ్ GP చేయబడును. కాంటాక్ట్ నెంబర్. ✆ 86394 43266.

INVESTMENTS

హామీపై ఇళ్ళు, స్థలాలు, పొలాలు, అపార్ట్‌మెంట్స్‌పై ఫైనాన్స్ ఇవ్వగల ఇన్వెస్టర్స్ కావలెను. Contact: 94401 48114, 80852 83056.

HEALTH & CARE

YOGA & MEDITATION

THE ART OF LIVING
ONLINE HAPPYNESS PROGRAM

DATES: Dec. 29th to 31st
TIME: 6.30 am to 9.00 am
Link to Register: http://aolt.in/925651
✆ 98490 15616 78290 21211

HOME NEEDS

MOSQUITO SCREENS

మెష్‌డోర్స్, కర్టన్ రాడ్స్, కబ్‌బోర్డ్స్, UPVC విండోస్ బ్లైండ్స్, వాల్‌పేపర్, Anti Bird మెష్. ఇన్విజిబుల్ గ్రిల్స్, దుర్గా ప్రసాద్. 98495 69111.

PEST CONTROL

Tarun Pest ★25Yrs Exp. 5Yrs Warranty ★ Smell Less ★ Bayers Chemicals (Pest & Other Insects Control). ✆94940 02285, 99516 07504

ప్రియాంక పెస్ట్ &బాత్‌రూమ్ లీకేజీ వర్క్స్కి 30 సం|| అనుభవం, 5సం|| గ్యారంటీ, వాసనలేని బేయర్ కెమికల్స్‌తో చెదలు, బొద్దింకలు నివారించు సంస్థ. ✆94924 82494, 93932 30136.

INDUSTRY

MACHINERY FOR SALE

ఖమ్మంలో మంచి రన్నింగ్‌లో ఉన్నUPVC విండోస్ & డోర్స్ కంపెనీ అమ్మకం/ లీజుకు ఇవ్వబడును. సెల్: 94401 08943.

REAL ESTATE

గొల్లపూడి, రాయనపాడు, విజయవాడ పరిసర ప్రాంతాలలో మీ ప్లాట్స్, స్థలాలు, అపార్ట్‌మెంట్స్, కమర్షియల్ అమ్మదలచినవారు, కొనదలచినవారు సంప్రదించండి. ✆ 92469 61688.

గుంటూరుసిటీ, గోరంట్ల, రెడ్డిపాలెం,లాం, అగతవరప్పాడు, వెనిగండ్ల, నంబూరు, పెదకాకాని, కొప్పురావూరు, కంతేరు, కాజాలలో ప్లాట్లు అమ్మాలన్నా/ కొనాలన్నా సంప్ర॥ 73823 96677.

గుంటూరుసిటీలో, గోరంట్లలాం, JKCరోడ్డు, ఇన్నర్‌రింగ్, వెనిగండ్ల, పెదకాకాని, నంబూరు, కాజా, మంగళగిరి, తాడికొండలోని ప్లాట్లు అమ్మదలచినవారు సంప్ర: 93999 55545.

సెకండ్‌హాండ్ అపార్ట్‌మెంట్స్ ఇళ్ళ మధ్య ఓపెన్ ప్లాట్స్ మరియు షాపులు అమ్మబడును. అద్దెకు ఇవ్వబడును. ✆ 80089 75044.

కొనబడును, అమ్మబడును: వ్యవసాయ భూములు, ఇళ్ళ స్థలాలు, వెంచర్లు, పాత వెంచర్లు, ఓపెన్ ప్లాట్స్ & ఫార్మ్‌ల్యాండ్స్. కొనుగోలు మరియు అమ్మకానికి. ✆ 93926 02024

FLAT FOR SALE

2450 Sft. 3 BHK Each Floor single flat, P&T Colony, Phase 3, Patamata High School backside, VJA. ✆ 76888 86666, 94948 31631

FLAT FOR SALE
Vijayawada, Patamata Near Autonagar Gate, Prime Locality, Luxury 3 BHK (3250 S.Ft.) Flats Sale.
79955 45388

East Face 3BHK New Independent 2nd Floor Sale 2325 S.Ft at R.R Gardens. Near Gurunanak Colony, Patamata, VJA. ✆ 92472 55826

2 BHK ఫ్లాట్స్ కానూరు శ్రీరామ్‌నగర్‌లో అమ్మకం, 3BHK 3ఫ్లోర్స్ ఇండిపెండెంట్ ఫ్లాట్స్ కానూరులో 80Ft రోడ్‌ఫేస్ అమ్మకం ✆ 98484 81701, 93460 22299

VJA, కొరిస్పీనగర్‌లో 2.8 ఎకరాల ప్రీమియం గేటెడ్ కమ్యూనిటీ అపార్ట్‌మెంట్లో 2& 3& 4BHK లగ్జరీ ఫ్లాట్స్ అమ్మబడును. సంప్ర|| ✆ 86884 66789.

3BHK Flats for Sale బందరురోడ్డుకి కేవలం వంద అడుగుల దూరం గోసాల సెంటర్‌కి దగ్గరగా 1700S.Ft.తో అమ్మకం. 94852 90846

విజయవాడ పటమట, కరణంగారి బజార్‌లో 1000Sft గల అపార్ట్‌మెంట్ ఫ్లాట్ (Old) అమ్మకంనకు కలదు ✆ 98484 40381.

FLATS FOR SALE
Ready to Occupy
2 BHK Flat 47 Lakhs Onwards
3 BHK Flat 67 Lakhs Onwards
Including Wood Work & Amenities.
Bank Loan Facility.
Prasadampadu, VJA.
✆90303 89292

సింగ్‌నగర్ తోటవారి వీధి 9వ లైన్ శ్రీ లక్ష్మీ నరసింహ రెసిడెన్సీ నందు న్యూ 2BHK ఫ్లాట్స్ తక్కువ ధరకే అమ్మబడును. సంప్ర: 98662 01239.

VJA, రామవరప్పాడు తూర్పు/ పడమర రోడ్లతో ఫ్లోర్‌కి ఒక్కఫ్లాట్ చొప్పున నిర్మించిన 3BHK ఫ్లాట్స్ గృహప్రవేశమునకు సిద్ధముగా కలవు. ✆ 98485 98331.

గురునానక్ కాలనీ కాఫీడే ఎదురు రోడ్డులో జాని ఎన్‌క్లేవ్ నందు 4th ఫ్లోర్‌లో 2B/R ఫ్లాట్ అమ్మబడును. ✆ 98485 49321/ 88970 87168.

వెటర్నరీకాలనీ లయోలాకాలేజీ ఎదుట మెయిన్‌రోడ్ ఫేసింగ్‌లో 2BHK Flat 800S.Ft. 4వ ఫ్లోరు, లిఫ్ట్ లేదు. ఓల్డ్ అపార్ట్‌మెంట్ మార్కెట్ రేటుకి తక్కువకే అమ్మబడును. 70956 43677

గన్నవరం ప్రీమియం లగ్జరీ 2BHK ఇండిపెండెంట్ ఫ్లోర్స్ ఫ్లాట్స్ అమ్మకం. బుకింగ్ ఆఫర్స్, పులీఫర్నిష్డ్. మెటీరియల్ కాంట్రాక్ట్‌తో కట్టించిఇస్తాం 98666 69123

గన్నవరం సెయింట్ జాన్స్ స్కూల్ శ్రీనగర్ కాలనీలో నూతనంగా నిర్మించిన బాను ఎంపైర్ నందు 2BHK ఫ్లాట్స్ 2 మాత్రమే అమ్మకమునకు కలవు. 98481 47485.

FLATS for SALE
4BHK Premium FLATS - 2850 Sft.
(2 Cars Parking)
beside Bhashyam School, KANURU
✆9989855219 8977162616

నిడమానూరులో గృహప్రవేశానికి సిద్ధంగా, తూర్పు ఫేస్ 2BHK (1250 SFt), 3BHK (1450 SFt) ఫ్లాట్స్, లిఫ్ట్, జనరేటర్, కార్‌పార్కింగ్ సౌకర్యములతో అమ్మకమునకు కలవు. ✆ 80087 67979, 80744 99872.

3బెడ్ రూమ్స్, East facing, A Block, 4th floor ఫ్లాట్ అమ్మకానికి కలదు. శ్రీ ప్రకాశ్ టవర్స్, శిఖమని సెంటర్, ప్రజాశక్తి నగర్ విజయవాడ: ✆ 94404 87971

3&4 BHK Deluxe Floorwise FLATS for SALE
Near Kennedy School, Kanuru.
G+2 Independent House for Sale in 154 Sq.yds
(Lift & 2 Car Parking) @ Tadigadapa.
✆7075017255

ఆటోనగర్ బస్‌టెర్మినల్ దగ్గర బందరురోడ్డు, వశిష్ట ఎన్‌క్లేవ్‌లో E/F డీలక్స్ 3BHK ఫ్లాట్ 2030 Sft, లిఫ్ట్‌కార్ పార్కింగ్‌తో అమ్మకం. ✆ 9866309134

విజయవాడ భారతినగర్ రోడ్డు నెం: 14 బృందావనం అపార్ట్‌మెంట్ ఫ్లాట్‌నెం: 201 2nd ఫ్లోర్ 1100SFt కార్ పార్కింగ్‌తో అమ్మకం. ✆ 8374985819

పటమట న్యూ RTC కాలనీ
ప్రైమ్ లొకేషన్ 40 అ|| రోడ్డు తూర్పు ఫేస్
ఫ్లోర్‌కి ఒక్క 3 BHK డీలక్స్ ఫ్లాట్
అమ్మకమునకు కలవు.
✆ 90000 40792

నున్న SBI ప్రక్కన, వికాస్ కాలేజి రోడ్, మయూర ప్రైడ్‌లో, 2nd ఫ్లోర్‌లో, 204 2B/R, 1100 Sft, 27 LAK, లిఫ్ట్, కారు పార్కింగ్‌తో అమ్మకం. ✆ 99086 84592.

అశోక్‌నగర్ టైం హాస్పిటల్ ఎదురుగా బందరురోడ్‌కి అతి సమీపమున నిర్మించిన 3BHK ఫ్లాట్స్ గృహప్రవేశమునకు సిద్ధముగా వున్నవి. ✆ 93939 59907.

మచిలీపట్నం గుండుపాలెం (రుద్రవరం పంటకాలువ డొంకరోడ్డు కృష్ణ యూనివర్సిటీ దగ్గర) 12.5 ఎకరాల పొలం అమ్మకం ✆ +9199499 88829(Whatsap)

సత్యనారాయణపురంలో 2/3/4 BHK Flats కొత్తవి, పాతవి అమ్మబడును. ✆ 94901 98654.

తాడేపల్లి, మహేంద్ర ఎన్‌క్లేవ్ ప్రక్కన వైస్రాయ్ టవర్స్ ఫ్లాట్ నెం. 201, నార్త్ ఈస్ట్, 2300 S.Ft. 3BHK ఫ్లాట్ అమ్మకమునకు కలదు. ✆ 80080 59789.

VJA, RTC కాలనీ, 2వ లైన్ శ్రీజయదుర్గా నందు 3rd ఫ్లోరు 1432 S.Ft గల 3 BHK లిఫ్ట్, కార్ పార్కింగ్ సౌ.లతో అమ్మకం. ✆ 94404 88334

19500/- రూ|| అద్దెతో 2 BHK ఫ్లాట్ 37 లక్షలకే
ఒక్కొక్క 2 BHK ఫ్లాట్ 1468 S.Ft తో మొత్తం 83 Flats
గేటెడ్ కమ్యూనిటీ సౌకర్యముతో విజయవాడ, కేసరపల్లి
నేషనల్ హైవేని ఆనుకొని చైతన్య కాలేజ్ బిల్డింగ్ నందు.
✆ 9160906566

KANURU

కానూరు మురళీనగర్ బల్లెంవారివీధి మెడ్‌ప్లెస్ ఎదురురోడ్డులో చైతు సాయి నివాస్ FF-1 నందు 2Yrs ఓల్డ్ 2BHK ఫ్లాట్ లిఫ్ట్, కార్ పార్కింగ్‌తో అమ్మకం (నో బ్రోకర్స్). ✆ 76619 62999

న్యూ 3 BHK ఫ్లాట్స్
కానూరు విజయలక్ష్మి థియేటర్ దగ్గర మైత్రినగర్‌లో 1895 S.Ft. గల 3 BHK ఫ్లాట్స్ గృహప్రవేశమునకు సిద్ధముగా ఉన్నవి.
99497 16957

3 BHK తూర్పు ఫేస్ డీలక్స్ ఫ్లాట్స్ అన్ని సౌకర్యములతో అమ్మకానికి కలవు. ★ బల్లెంవారివీధి, గౌరీశంకర్‌నగర్, కానూరు. ✆ 97017 98726, 89196 79256.

TADIGADAPA

Poranki, Prabhu Nagar: Premium Individual, E/F, New 3 BHK (Total 2500 S.Ft. & Plinth 1850 S.Ft.) Flats UD 77 Yards. ✆ 89789 14242

బందరురోడ్డు సిద్ధార్థ Eng.కాలేజి ఎదురు, తాడిగడప, పద్మజానగర్ కాలనీలో న్యూ 3BHK ఫ్లాట్ (1800S.Ft) అమ్మకానికి కలదు. (ఫ్లోర్‌కి 1ఫ్లాట్) ✆ 94400 31268

GANNAVARAM

Vijayawada - Near Gannavaram Gandhi Center, a few yards from the highway, 1.5 km from the airport and HCL, 3 bed 3 bath, new first floor apartment, 1660 sq.ft.; Phone: 83338 65529

TADEPALLI

4 BED ROOM LUXURY FLATS
SITE 1477 YARDS
TOTAL FLATS 10 ONLY
EACH FLAT 4260 SQ FEET
UDS 137 YARDS
(INCLOUD 3 CAR PARKINGS)
20X15 BED ROOMS 4
10X15 & 10X8 BATH ROOMS 4
20X15 KITCHAN
20X15 DINNING HALL
20X15 DRAWING HALL
20X10 HOME THEATER
60X17 LIVING HALL
Prime Locality
Beside SIT Office
Prathuru Road, Tadepalli
CONTACT
gn-fab DOORS&WINDOWS
92464 95788 / 99

SATYANARAYANAPURAM

VJA సత్యనారాయణపురం BRTS రోడ్ దగ్గరలో న్యూ 2BHK ఫ్లాట్స్1,200 Sft upto 90% బ్యాంక్ లోన్ సదుపాయంతో అమ్మబడును ✆ 95818 15555.

HOUSE FOR SALE

విజయవాడ, లోటస్ ల్యాండ్ మార్క్‌లో రోడ్ no-5, సెక్టర్-1 నందు వెస్ట్‌ఫేసింగ్ 166.66 స్క్వేర్ యార్డ్స్‌లో గల ఇల్లు అమ్మకమునకు కలదు. 97043 97779.

హనుమాన్‌జంక్షన్ పంచాయతీ ఆఫీసు వెనుక కాకాని కళ్యాణమండపం ఎదురు 240చ.గ.లలో ఇండిపెండెంట్‌హౌస్ అమ్మకం. 92467 75407, 78426 83179.

లక్ష రూపాయలకే 2 BHK E/F 72 చ||గ|| Indi House Pent Houseతో కలిపి సంక్రాంతికి లక్కీ డిప్ ద్వారా అమ్మకం. మొదటి 20 మందికి మాత్రమే. కొండపల్లి ✆ 70951 70677.

VJA- Bharathi Nagar Road No.10, Duplex Model House, East Facing, Servant Pent House for Sale. ✆ 98661 92045, 83418 35845.

విజయవాడ సూర్యారావుపేటలో పడమర ఫేస్ 174 చ.గ.లలో గ్రౌండ్ ఫ్లోర్ కమర్షియల్ 1 & 2 ఫ్లోర్లు డూప్లెక్స్, 3వ ఫ్లోర్ పెంట్‌హౌస్ కార్ పార్కింగ్ గల బిల్డింగ్ అమ్మకం. ✆ 73965 42444, 70757 69592.

గన్నవరం హైవే, IOCబంక్ ప్రక్కరోడ్‌లో 193.6చ.గ.ల స్థలం అందులో 3అంతస్తుల ఇల్లు SBI వేలంద్వారా అమ్మకం. రిజర్వు ధర: 64ల. 9603061724.

పటమట పోస్టల్‌కాలనీలో 272 చ||గ||లో G+2 బిల్డింగ్, యనమలకుదురు 121 చ||గ||ల్లో G+1 బిల్డింగ్ కానూరులో 572 గ||ల్లో కమర్షియల్/ రెసిడెన్సీ బిల్డింగ్ ✆ 93962 03890

107.5 చ.గ.లలో పడమర 2 BHK గ్రౌండ్ ఫ్లోర్ RCC ఇల్లు దేవినగర్ 6వ లైనులో అమ్మకము. కొనుగోలుదారులు మాత్రమే. సంప్ర: ✆ 90300 27833.

బిల్డింగ్ అమ్మకము
విజయవాడ, కరెన్సీనగర్‌లో (NH-16 కు 200మీ॥ల దూరంలో) 378 చ॥గ॥లు విస్తీర్ణం గల స్థలంలో అన్ని రకాల సౌకర్యాలు ఉన్న ఒక్కొక్క ఫ్లోర్‌లో సుమారు 2,400చ॥అ॥లు విస్తీర్ణం గల 3BHK ఫ్లాట్స్, 5 ఫ్లోర్స్ & పెంట్ హౌస్ (E/F) బిల్డింగ్ మొత్తము అమ్మకమునకు కలదు.
94401 51179
94408 96594

PENAMALURU

బందరు రోడ్డు గోసాల కాలేజ్ వద్ద జయ గార్డెన్స్ హౌసింగ్ కాలనీలో W/F 70 to 80 లక్షలలో మీ ప్లాన్ ప్రకారం బిల్డింగ్ నిర్మించబడును. ✆ 93462 22427.

LAND FOR SALE

Agricultural Lands for Sale Nr. Machilipatnam Upcoming Port Area & 424 Sq.Yds House Sale in Pammaru Town ✆ 9885217967

కాకినాడ 100 అ.పోర్టు హైవేని ఆనుకొని, అచ్చింపేట-లైటుహౌసు దారిలో, N/F, 535/500/310 చ.గ వాణిజ్య స్థలం అమ్మబడును. @50K. ✆ 9347073899.

జక్కంపూడి నుండి పైడూరుపాడు వెళ్ళే తారురోడ్డుకి ఆనుకొని య. 1.63 సెంట్లు భూమి అమ్మకం. Contact ✆ 83176 41971.

హైదరాబాద్ ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్ట్ దగ్గర, 4-10 ఎకరాల ప్రైమ్ ల్యాండ్ అమ్మబడును, తుక్కుగూడ GHMC, పడమర 100ft & దక్షిణం 80ft రోడ్స్. ✆ 9032480448, 9848255132.

గుండిమెడ దగ్గర 3 ఎ & పరిసర ప్రాంతాలలో పొలములు & జగ్గయ్యపేట 17 ఎ. లయోలా కాలేజ్ దగ్గర 267 గ.లలో ఇల్లు అమ్మకము. ✆ 98496 33982.

కొబ్బరితోట అమ్మకం
2.1 ఎకరాల ఫామ్ హౌస్ 2 బోర్లు, చుట్టూ ఫెన్సింగ్ చందర్లపాడు మండలం బొబ్బిళ్ళపాడు గ్రామ పరిధిలో N.T.R.జిల్లా
Cell: 86887 23704 98488 90466

ప్రకాశం జిల్లా కురిచేడు మండలం, 15 ఎకరాల మంచి వ్యవసాయ పొలం, NSP మేజర్ కాల్వ ఆనుకొని పొలం అమ్మబడును. Ph: 7842599975.

కంకిపాడు దగ్గర కోలవెన్ను గ్రామంలో వెంచర్లకు, విల్లాలకు అనువైన 73 సెంట్లు పొలం అమ్మకమునకు కలదు. ధర: 1.20 Cr. ✆ 94908 79761.

గుడివాడ మండలం కొమరవోలు శివారు తటివర్రు గ్రామము నందు 20ఎకరముల మాగాణి పొలము అమ్మకం. సంప్ర: ✆ 93462 81147, 83676 38755.

NH 16 సర్వీసు రోడ్డు పక్కన, హనుమాన్‌జంక్షన్ పెరికీడు వంతెన దగ్గర 2 ఎకరాలు పొలము అమ్మబడును. ✆ 90000 18859.

వీర్లపాడు మండలం పల్లెంపల్లి గ్రామములో మెయిన్ రోడ్డుకు ఆనుకొని 11 ఎకరాలు పామాయిల్ తోట అమ్మకమునకు కలదు. సంప్రదించండి. ✆ 98498 09063.

కృష్ణాజిల్లా, పమిడిముక్కల (మం), కృష్ణాపురం (గ్రా)లో తారు రోడ్డు ఫేసింగ్‌తో 2.34 ఎకరాల మాగాణి పొలం అమ్మబడును. ✆ 80080 50435.

PLOT FOR SALE

చతుర్భుజ ప్రాపర్టీస్ గేటెడ్ కమ్యూనిటీలో CRDA అప్రూవ్డ్ ఓపెన్ Plots కంచికచర్ల, పామర్రు, పరిటాల, పెనమలూరులో కలవు. ✆ 9948110645.

133.33 Sq.Yds. కేవలం 1,00,000/- మాత్రమే. వినుకొండ, పల్నాడు డిస్ట్రిక్ట్‌లో లిమిటెడ్ ఆఫర్. ఫోన్: 9133633855.

పెనమలూరు వంతెన డౌన్ బాష్యం టవర్స్ ప్రక్కన 31x58 కొ|| గల 204 చ||గ|| తూర్పుఫేస్ స్థలము అమ్మకము. ✆ 92478 41264, 90303 76568.

కానూరు, పోరంకి ఏరియాలలో 2 BHK, 3 BHK అపార్ట్‌మెంట్స్ మరియు ఇండివిడ్యువల్ హౌసెస్ కలవు & అమ్మదలచిన - కొనదలచిన సంప్ర: 94414 96469.

పునాదిపాడు నరసయ్యగారి వెంచర్‌లో తూర్పుఫేస్ ప్లాటు నెం: 3లో 36x60 కొ||తో 240 గ|| యనమలకుదురు డొంక రోడ్డులో వెస్ట్‌ఫేస్ 104x115 కొ||గల స్థలం అమ్మకం. ✆ 98482 39369

బందరు రోడ్, గంగూరు, ధనేకుల ఇంజనీరింగ్ కాలేజి ఎదురు 500 గ|| స్థలం (70x65) అమ్మకం. ✆ 81437 83783, 86880 63040.

పోరంకి to నిడమానూరు రోడ్డు గిరిజాపురం కాలనీలో నార్త్/వెస్ట్ కార్నర్ 74x55 కొ||తో 452 చ||గ||లు అమ్మకమునకు కలదు. ✆ 94401 50995.

హరివిల్లువారి ప్రీమియం గేటెడ్ కమ్యూనిటీలో హైరిటర్న్స్ ప్లాట్స్ @పరిటాల, గన్నవరం, కంకిపాడు, పెనమలూరు, ఆకునూరు & మచిలీపట్నంలో ప్లాట్స్ డైరెక్ట్ కంపెనీ. ✆ 7893766996

ఆకునూరు విలేజ్ (బందరురోడ్‌కి 1 కి|| మీ|| దూరంలో) సిగ్నేచర్ పార్క్‌వద్ద AP CRDA అప్రూవుడ్‌తో 167 గ||, 183 గ||, 222 గ|| ప్లాట్లు స్పాట్ రిజిస్ట్రేషన్‌తో అమ్మబడును ✆ 96663 79999.

VJA నందిగామ రెసిడెన్షియల్ ఓపెన్ ప్లాట్స్ తక్షణ నిర్మాణానికి అనువుగా ఇళ్ళకు దగ్గర్లో నందిగామ టౌన్‌కి సమీపంలో సెంటు 3.50 L. మాట్లాడుకోవచ్చు. ✆ 96182 82731.

For Sale: 323 Sq. Yds Residential Site in Patamata Vijayawada. ✆ 98490 02025, 93460 02025.

నివాస స్థలం అమ్మకం
కృష్ణాజిల్లా, బాపులపాడు నందు 726 చ॥గల నివాస స్థలము యొక్క కనీసపు ధర గజమునకు రూ.4,500/- గా నిర్ణయించి వేలము నందు అమ్మబడును.
98496 36969
98482 49289

For Sale: 253 Sq. Yds Site in Srinivasa Nagar, Bank Colony, Near Mahanadu Road, Vijayawada. ✆ 98490 02025, 93460 02025.

256 Sq Yards E/F Plot for Sale in Kankipadu near Petrol Bunk and Gannavaram. Immediate Sale:- 89396 91031

Vijayawada Opp Novotel. veternery colony, road no.3, 350 Sq.yards plot no 64, opp to srihomes #33, size: 45x70, clear title. Ph: 9848183322

Plot @ Gunadala Village, Vijayawada for sale. Dim. 27 ft 57 ft. Clear title. Tel: 9440368210

బందరురోడ్డు, పోరంకిలో 35 ఎ||, ఆకునూరులో 50 ఎ|| ఓపెన్ ప్లాట్లు, హౌస్‌లు & పల్నాడు జిల్లా వినుకొండలో 20, 25, 50 సెంట్లు ఫామ్‌ల్యాండ్ సేల్. ✆ 97012 84449

హరివిల్లువారి అన్ని CRDA లేఅవుట్స్‌లో పెనమలూరు, గండిగుంటలో 194, 240, 300, 400 గ. మంచి ప్లాట్లు కంపెనీ డైరెక్ట్ సేల్‌కై. సంప్ర ✆9246473929

పోరంకి CRDA గేటెడ్ కమ్యూనిటీలో వెంటనే ఇల్లు కట్టుకునే 220, 330, 550, 1050 గ.ల ప్లాట్లు బ్యాంక్‌లోన్ సదుపాయంతో కలవు. ✆9392256567

నున్న రెడ్డబజార్ తూర్పుఫేస్ 156గ||, కానూరు కామినేని హాస్పిటల్ ఎదుట 140గ|| ప్లాట్స్ అమ్మబడును. గవర్నర్‌పేట, బిగ్‌బజార్ వెనుక కార్నర్ 10x12 రూమ్ అద్దెకు కలదు ✆ 93989 37722

బందరు రోడ్ నేషనల్ హైవే ఫేసింగ్ నార్త్ సైడ్ కంకిపాడు దగ్గరలో 450 చ.గ. ప్లాట్ అమ్మకమునకు కలదు. ✆ 98483 43355.

కామినేని హాస్పిటల్ 100 అ. రోడ్డు పోరంకి, కానూరు, జనచైతన్య, రాఘవ ఎస్టేట్స్, ఈడుపుగల్లు, కంకిపాడు చుట్టుప్రక్కల ప్లాట్లు అ/కొ. ✆ 96665 21898

మచిలీపట్నం: కాలేఖాన్‌పేటలోని వడ్లమూడి వారి వీధి నందు చ.గ. 170ల స్థలము అమ్మబడును. ✆ 85004 29659.

3999/- 6999/- చ.గ. గన్నవరం మల్లవల్లి 4 వేల ఎకరాల ఇండస్ట్రియల్ హబ్ దగ్గర Kతాడేపల్లి Gకొండూరు అగిరిపల్లిలలో EMI కలదు. ✆83749 36634

విజయవాడ దుర్గాపురం, రామాలయం దగ్గర, 95 చ|| గ|| ఖాళీ స్థలం అమ్మకమునకు కలదు. ✆ 99639 55516, 78423 90860

VJD- Hyd నేషనల్ హైవే ఫేసింగ్ నందిగామ దగ్గర DTCP ప్లాట్లు 80% బ్యాంక్ లోన్ కలవు. గజం 8499. ✆ 9030746514, 9177839181.

సంక్రాంతి బంపర్ ఆఫర్
బందరురోడ్డు, గూడూరులో 100 చ॥గ॥ కొనుగోలుపై 50 చ॥గ॥ ఉచితం. బందరు పోర్టు 2026 లో ప్రారంభం
✆ 90000 88199

VJD - Hyd నేషనల్ హైవేకి 200 మీటర్లు దగ్గరలో నందిగామ సమీపంలో ప్లాట్లు కలవు. గజం 5499/-; ఫోన్ : 9030746514, 9177839181.

కుంచనపల్లి 40ft రోడ్‌ఫేసింగ్ హైవేకి 1.5 Km దూరంలో 26 సెంట్లస్థలం & గుంటూరు IRRకు 1 Kmదూరంలో 40ft రోడ్‌ఫేసింగ్ 500 చ||గ|| స్థలం అమ్మకం. 9908188946

PLOT FOR SALE
500 SQ Yards (50 Ft. x 90 Ft.)
East & West Both Side Roads Plot for Sale at Aayush Hospital Back Side, Vijayawada. Contact:
Ph: 98660 07296

మంగళగిరి నేషనల్ హైవే సర్వీస్ రోడ్డుని ఆనుకొని, నార్త్ ఫేస్ 445 చ.గ. కమర్షియల్‌కు ఉపయోగపడు ఖాళీ స్థలం అమ్మబడును. ✆ 98484 16864.

పోరంకి పెనమలూరు గోసాలలో 194, 200, 270, 300గ||, గుణదలలో 480 గ||, చిల్లకల్లు టోల్‌ప్లాజా వద్ద హైవేఫేస్ 7 ఎకరాలు అమ్మకం. ✆ 94407 89749

నందిగామ దగ్గర గజం రూ. 2500, ఐమ్మం గ్రీన్ ఫీల్డ్ హైవే పక్కన గజం రూ. 9999 ✆ 83284 51652.

విజయవాడ ఏలూరు రోడ్ చుట్టుగుంట BSNL ఎదురుగా, పెట్రోలు బంకు సందు సుమారు 90 గజాల ఇళ్ళ స్థలం అమ్మకంనకు కలదు. ✆ 86392 56079.

VJA అశోక్‌నగర్ పాత 5వ రోడ్డు సున్నపు బట్టీల సెంటర్ దగ్గర నార్త్‌వెస్ట్ కార్నర్ 3వ బిట్ 400 చ||గ|| స్థలము అమ్మకమునకు కలదు. ✆ 80080 59789

విజయవాడ కార్పొరేషన్ పరిధిలో కుందవారికండ్రిక నందు లేఅవుట్ ప్లాటు 60-40 కొలతలతో 266 గ||లు అమ్మకము. స్పాట్ రిజిస్ట్రేషన్. ✆ 95735 13847, 93917 05358.

విజయవాడ, బందరు రోడ్డు, పెనమలూరు CRDA LP No: 104/25, ప్లాట్లు, హౌసెస్, విల్లాలు ★ బ్యాంక్‌లోన్ ★ స్పాట్ రిజి. ✆9553129369, 9705433765

NUNNA ROAD

అమరావతి-కాజా- నున్న-గ్రేటర్ విజయవాడలో (Nr. ORR దగ్గరలో) CRDA అప్రూవ్ గల 150 గజాల పైనా గేటెడ్ కమ్యూనిటీ ప్లాట్లు అమ్మకము. Ph:9502822335

COMMERCIAL SPACE FOR SALE

గుంటూరు బస్టాండ్ సమీపాన 60325 చ.అ. (సుమారు) బిల్డప్ ఏరియాతో 3 సెల్లార్లు కలిగి సెమి ఫినిష్డ్ స్ట్రక్చర్లతో నిర్మించబడిన 3309 చ.గజాల విస్తీర్ణపు కమర్షియల్ భూమి అమ్మకానికి కలదు. రిజర్వు ధర 32 కోట్లు. బహిరంగ వేలం తేదీ: 08/01/2026. సంప్ర: 98481 70245

HYD శంషాబాద్‌లో నెలకు 30,000/- అద్దె వచ్చే కమర్షియల్ స్పేస్ 36 లక్షలకే (EMI కలదు). ✆ 99124 04355, 80086 20685.

SHOP FOR SALE

విజయవాడ పైపుల రోడ్డు 80' రోడ్డులో 72 చ.గ.లలో (S /F) కమర్షియల్ షాపు G +2, అమ్మబడును. @1.1Crore. Ph: 9848548905

LEASE/ RENT

VJA లబ్బీపేటలో కాలేజీలకు, బ్యాంకులు, గోడౌన్‌లు, గోల్డ్‌షాపులు, డిజిటల్ మార్కెటింగ్ ఆఫీసులకు అద్దెకు/ లీజుకు. ✆ 77939 29255, 77027 99355.

నూజివీడు- విస్సన్నపేట M.Rd లీలానగర్ 7500 Sft పక్క గోడౌన్ అద్దె/లాంగ్‌లీజుకు కలదు. C: 10Am-5 Pm. ✆ 9848173135/ 6304588926.

గోడౌన్‌కు అనువైన 200 గజాలు బందారు రోడ్‌కి 2 బిట్ 33" రోడ్ కామాయతోపు సెంటర్. కాల్: 9652676786

WANTED

కావలెను
తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాలలో CBSE బ్రాంచులు కలిగిన విద్యాసంస్థకు జిల్లా హెడ్ క్వార్టర్స్ నందు మరియు తాలూకా మండల హెడ్ క్వార్టర్స్ నందు
2 నుండి 3 ఎకరాల 40000 నుండి 60000 చ.అ.ల బిల్డింగ్ దీర్ఘకాలిక లీజుకి కట్టించి ఇవ్వదలచిన యజమానులు సంప్రదించండి.
✆ 8897910707 9866160707

TO LET

VJA, గొల్లపూడి D-మార్ట్ ఎదురు హైస్కూల్ వెనుక 2nd ఫ్లోర్ (201) D-బ్లాక్‌లో 3 BHK ఫ్లాట్ 2150 Sft. కారుపార్కింగ్‌తో అద్దెకుకలదు. ✆9246414272

బందరు రోడ్డు తాడిగడప పద్మజానగర్‌లో ఇండిపెండెంట్ హౌస్ 1st ఫ్లోర్, E/F, 3B/R రెసిడెన్షియల్ ఫ్లాట్ లిఫ్ట్ సౌకర్యంతో అద్దెకు కలదు. 94901 45079

3 BHK Ind House Gr Flr Near Mandela Park LIC Colony, ITI, Vijayawada. ✆ 9440772381, 9440656508

Film Colony Plot No:3 Ind House (3BHK) With Car Parking Besides VMC Park LIC Colony Vijayawada. 94919 29136, 98664 42593.

Independent 2B/R House with 1 A/c for rent at Ahyodhyanagar, Lotus Landmark, Sec-1. Govt Employees only ✆ 94901 90739.

రెసిడెన్షియల్ / కార్పొరేట్ ఆఫీస్‌కు అద్దెకు
3 BHK POSH FLAT
ఇండిపెండెంట్ విశాలమైన 3,500 S.Ft. 3rd ఫ్లోర్, లిఫ్ట్, Full సెక్యూరిటీతో టెలికామ్ కాలనీ, గొల్లపూడి.
✆ 94400 28770

విజయవాడ గవర్నర్‌పేట జైహింద్ టాకీస్ దగ్గర 2300 sft కమర్షియల్ స్పేస్ బాడుగకు ఇవ్వబడును. సంప్ర. 94408 56182, 93631 19793.

విజయవాడ: గాయత్రి నగర్ 2nd లేన్ లోని సింధూర అపార్ట్‌మెంటు నందు, 3BHK ఫ్లాట్. 401 అద్దెకు కలదు. ✆ 94408 28487.

విజయవాడ పైపులరోడ్డు దగ్గరలో 125 చ.గ.లో న్యూ 3ఫ్లోర్ల బిల్డింగ్ మొత్తంగాగాని, విడిగాగాని అద్దెకు ఇవ్వబడును. ✆ 97000 26595, 80746 23884

సింగ్‌నగర్, నందమూరి నగర్ తోటవారివీధి, 11వ లైన్ 2BH E/F,GF,FF, 1250 S.Ft. కారు పార్కింగ్‌తో అద్దెకు 98450 94698, 89514 40755

మణిపాల్ హాస్పిటల్ ప్రక్కన వజ్రా రెసిడెన్సీ F-బ్లాక్‌లో 3 BHK 204 పుల్లీ ఫర్నిష్డ్ ఫ్లాట్ కార్ పార్కింగ్, లిఫ్ట్ సౌకర్యాలతో అద్దెకు. ✆ 94403 53834.

COMMERCIAL

Patamata: Commercial Office Space, Ground 600 S.Ft. & 1200 S.Ft. in 2nd Floor. Furnished, Beside Nirmala Convent 70368 82222.

కొండపల్లి IDAలో 20,000 Sft గల షెడ్డు, బిల్డింగ్ మొత్తముగా లేదా విడి విడిగా అద్దెకు ఇవ్వబడును ✆98498 74444, 85238 99999.

VJA, ఏలూరురోడ్డు, రామవరప్పాడు రింగు, కె హోటల్ ప్రక్కన UBI బ్యాంక్ ఆనుకొని 980 చ.అ.ల. గ్రౌండ్‌ఫ్లోర్ బిల్డింగ్ ఆఫీసులకు, షోరూమ్‌లకు అద్దెకు. ✆ 9515461626

విజయవాడ రైల్వేస్టేషన్- అద్దెకు టిఫిన్ సెంటర్ స్థలం- 4,500 sq. ft ప్రధాన వాణిజ్య స్థలం. 24 గంటల అనుమతి, రోజువారీ సందర్శకుల సంఖ్య 1,00,000, అధిక దృశ్యమానత & డిమాండ్. M: 9075891045

బాలాజీ నగర్ (కృష్ణలంక) HP గ్యాస్ ఆఫీసు ఆనుకొని ఉన్న షాపు అద్దెకు కలదు. Contact. 88857 44888

విద్యాధరపురం RTC వర్క్‌షాప్ రోడ్డుకు దగ్గరగా గల బిల్డింగ్‌లో గ్రౌండ్ 2500 చ|| అ||లు + ఫస్ట్‌ఫ్లోర్ - 2500 చ||అ||లు అద్దెకు/ లీజుకు & 10 సెంట్ల ఖాళీస్థలము అద్దెకు/ లీజుకు ఇవ్వబడును. ✆ 98491 48241.

VJA సూర్యారావుపేట విజయ హాస్పిటల్ ఎదురుగా 3,600 Sft. 2 అంతస్తుల కమర్షియల్ భవనం హాస్పిటల్స్, బ్యాంక్స్, స్కూల్స్, హాస్టల్స్‌కు అద్దెకు ఇవ్వబడును. ✆ 92472 09400.

GF consisting of 1800 sq. feet at Ratnamba street, Mogalrajapuram. Ideally suitable to banks, clinics, offices. Available from 15th March-2026. Contact: 9703252203

Spacious 2BHK Flat on Bandar Road Near Sri Devi Jewellery for Officers Only. ✆ 98490 15616/78291 31311.

Lease & Wanted Restaurant Well Equipped AC, 75 Chairs, Nr. Jagadamba, Vizag for Lease.Catering & Cloud Kitchen experienced persons. ✆ 7799544333.

VJA పటమటలంక ఈనాడు వెనుక సుమలత అపార్ట్‌మెంట్ G/Fలో షాపు, ఆఫీసులకు, ఫ్యాన్సీ/ మెడికల్ మొ||వాటికి అద్దెకు కలదు. ✆ 77298 25736.

LEASE/RENT

Available Commercial Area For Lease or Rent
Location: Javahar Auto Nagar, Near Vijayawada KATA, Opp: Sakshi Office
1. Ground Floor 4000 SFT (Height 16 Ft)
2. First Floor 4500 SFT (Height 12 Ft)
3. Second Floor 4500 SFT (Height 11 Ft 6 Inches)
4. Third Floor 2800 SFT (Height 11 Ft)
87121 61717
98490 51369

పటమట బందరురోడ్డు ఫేస్ గోల్డెన్ టవర్స్ గ్రౌండ్ ఫ్లోరునందు 11x26 కొ.గల షాపు ఆఫీసులు/షాపులకు అద్దెకు. ✆ 98669 75877, 9396203890

13,000SF.t గోడౌన్(G+1) Builiding VJA ఆటోనగర్ 100 Feet రోడ్డులో లోడింగు & అన్ లోడింగుకు వీలుగా అద్దెకు. ✆ 84312 51822.

విజయవాడ సత్యనారాయణపురం BRTS రోడ్‌కు దగ్గర 2,000 Sft. కమర్షియల్‌స్పేస్ లిఫ్ట్, పార్కింగ్ సౌకర్యంతో 1వ ఫ్లోర్ అద్దెకు కలదు ✆ 9704333988

పటమట బందరురోడ్డుకి 4వ బిల్డింగ్ గ్రౌండ్ ఫ్లోర్ నందు ఈస్ట్ రోడ్డు ఫేసింగ్‌తో 250 S.Ft గల షాపు ఆఫీసు / షాపుకు అద్దెకు. ✆ 83328 18745.

TO LET - COMMERCIAL
14000 Sft COMMERCIAL SPACE WTH CENTRALIZED AC FOR RENT
(2800 in each floor)
at Kovelamudi Vari Street, Suryaraopet, Vijayawada.
Ready for EDUCATIONAL INSTITUTIONS with infra.
Also Suitable for CORPORATES, HOSPITALS etc.
✆ 9848114696 9705366696

VJA గవర్నరుపేట బకింగ్‌హామ్ పోస్టాఫీస్ ఎదురు గ్రౌండ్ ఫ్లోర్ 1షాపు, 1వఫ్లోర్‌లో 2షాపులు ATM/ గోల్డ్/ సిల్వర్‌కు అనువుగా అద్దెకు కలవు. ✆ 94403 68181

రాజమండ్రి Airport opp highway ఆనుకొని 65 వేలు చ.అ.+ పార్కింగ్, గోడౌన్, కోల్డ్ స్టోరేజ్‌లకు లీజుకు అనుకూలమైనది. ✆ 88855 91479

VJA, కామయ్యతోపు, చలసానినగర్ గోపాళం శివన్నారాయణ హాస్పిటల్ ప్రక్కరోడ్డులో 3 స్టోర్స్ బిల్డింగ్ ఒక్కోఫ్లోర్ 2000 S.Ft. అద్దెకు. 6303498345, 9441083767

పటమట NTR సర్కిల్ బందరు రోడ్డుకి 2వ బిల్డింగ్ G/F నందు 450 S.Ft. ఆఫీసులకు, షాపులకు, గోడౌన్స్‌కు అద్దెకు ఇవ్వబడును. ✆ 99664 45999.

గొల్లపూడి బైపాస్ రోడ్డు VWCC కాంప్లెక్స్‌వద్ద తూర్పుఫేస్ Height 16Ftతో 5,200 S.Ft RCC బిల్డింగ్ అద్దెకు కలదు. ✆ 94404 97174.

3000 S.ft కృష్ణలంక దింత్యాలవారివీధి D.No. 41/17/30లో 2nd + 3rd ఫ్లోర్లు లిఫ్ట్ సౌకర్యంతో వాణిజ్య అవసరాలకు అద్దెకు ✆ 94401 73597

SECOND SALE

వంట సామాగ్రి అమ్మకం
హోటల్ - కేటరింగ్ కు సంబంధించిన వంట సామాగ్రి మరియు జనరేటర్ అమ్మకమునకు కలదు.
SS COMERCIAL KITCHEN EQUIPMENTS - 2, All KUTLERY ITEMS, WATER COOLER, STAINLESS STEEL FREEZER 2, CENTRIFUGAL BLOWER 2, COMMERCIAL LPG SYSTEM, ACRYLIC LED BOARD, THERMAL POS PRINTERS EPSON 4, TOUCH POS SYSTEMS 4, 35 KVA DIESEL GENERATOR, ACs 3 Nos.
98496 36969

JOBS

Wanted Lady Gynaecologist MS (OBGY) or DGO Padmavathi Hospital, Challapalli (Contact 9am to 4Pm). ✆ 98850 51179

Wanted Software Developer Cloud Adminstrator Fashion Designer Beautician Receptionist (Trainers). ✆ 93472 77429

Wanted Accountant Qul: Min Degree with 2 Yrs Exp. Immediate Requirement at Vijayawada. ✆ 90326 66639.

చెఫ్ కావలెను. హోటల్ మేనేజ్‌మెంట్ & క్యాటరింగ్‌లో డిగ్రీ, చెఫ్ కోర్సు చేసి ఏదైన గుర్తింపు పొందిన హోటల్ నందు 2, 3 సం|| అనుభవం గల్గి విదేశయానానికి పాస్‌పోర్ట్ కలిగిన అభ్యర్థులు కావలెను. సంప్రదించండి. ✆ 99499 90355.

Vja లోని ప్రముఖ రియల్ ఎస్టేట్ సంస్థ NTR హౌసింగ్ నందు అనుభవం గల అకౌంటెంట్స్ కావలెను. జీతం: 20K-25K. ✆ 90300 75742

Hyd సిటీలో బ్రాహ్మణ కుటుంబానికి వంటచేయడానికి ఇద్దరు బ్రాహ్మణ స్త్రీలు కావలెను. జీతం-25K; భోజనము, వసతి ఇవ్వబడును. వెంటనే సం|| 9866252220

శ్రీ సాయి అంజనా చిట్‌ఫండ్స్, గాంధీనగర్ నందు పనిచేయుటకు రికవరీ స్టాఫ్ (M) కావలెను. ✆ 76600 08326, 63034 19997.

Diploma/ITI Civil, Valuer Assistant, Computer Typist, Valuer's Off Ramavarappadu, Vijayawada. 9849267445 tnsvaluer@gmail.com

Work Based Training On Tally Prime, GST & TDS/ TCS E- Returns. Veda Computers, Vijayawada-10. Ph: 98485 82191

Need ENT, EMRG Physician, CMO's, Nurses, Receptionist, Pro's Sriram Hospital, Ongole. Call & CV to 98495 95190, 76600 27789.

BMR Arnika Silver Jewellery M.G.Road, Vij. wanted for Manager & Cashier &Sales Executives Preference Experience Persons ✆ 8008526933, 9848828638

సన్‌సిరి ప్రాజెక్ట్స్
వారి CRDA లేఅవుట్ ప్లాటు మార్కెటింగ్ కొరకు మార్కెటింగ్ సిబ్బంది
M/F కావలెను. పటమట, VJA.
✆62811 01979 73862 04849

Programme Coordinator required at FAPCCI. Graduation and 1-2 yrs exp. Send resume: info@fapcci.in or Whatsapp: 9391422821.

WANTED male admin Incharges qualification any Degree, Age limit: 25 to 45 years (must be married) Salary upto: 20,000/- working location: Master minds college. Vijayawada. Contact: 9676196218.

Wanted Female HR executive, Telecallers, counsellors & Receptionist for a reputed college in Labbipet. Qual: Any Degree. Age: 25-40yrs. Min 2 yrs exp. Ph: 6303085727.

Urgent Requirement. Wanted operations Manager, QC In-Charge, QC Technicians, Site Supervisors for Concrete Batching Units to coordinate with MNC clients for prestigious projects in Amaravati, AP. Salary as per Industry standards and Q: Graduation, Diploma in Civil. Ph:+91 9494890909, 9160110560.

DELIVERY boys/ Girls, Shift, General Vijayawada, Sal: 18K-25K, Q:10th, Bike & Driving licence must. ✆ 9246203075 / 8639120355.

Wanted Exp. L/U Supervisors cum System Operator to Work in C&F Agency Depot Situated at Kankipadu, VJA. srilakshmienterprisesvjw@gmail.com ✆ 92461 11973

Site Engineer Min 3Yrs. Exp. Tea Marketing Executive Min Exp, Hotel Supervisors & Office Boys ✆ 99856 59070.

Managers M/F VRS RTD & 40Y above Corporate Company Daily 3 Hours Work Salary 50K Per Month @ 9248766355

Job Vacancies at Plastic Industry. ITI - 5 Posts, Diploma - 5 Posts, Mechanical Engineers-2 Posts, Degree B.com/ BBA -2 Posts Email : infoampp2016@gmail.com ✆ 62810 45178. Address: Amaravathi Poly pack; #25-38, 4th Cross Road, Kabela Industrial; Vijayawada-520 012.

Wanted Data Image Processing/ Entry Operators on Out Source any Graduate/Inter Min Computer Know ✆ 8125583195

విశ్వశాంతి యూనివర్సల్ ట్రస్ట్, VJA. పని/సేవ/ డ్యూటీ చేయుటకు M/F టెలీకాలర్స్, వాలంటీర్స్, స్టాఫ్ కావలెను. భో+వ+జీతం. ✆ 9676901122, 94916 51122

MORE CLASSIFIEDS ON PAGES 8

తిరువూరు
• తిరువూరు • మైలవరం

ప్రతిభతో మెరిశారు.. బహుమతులు సాధించారు


విస్సన్నపేట : గెలుపొందిన వారితో రమణ కుమార్, మోహన్‌రావు, నాగరాజు


మైలవరం : విజేతలతో కరస్పాండెంటు, ఉపాధ్యాయుడు

మైలవరం, న్యూస్‌టుడే : 'ఈనాడు- ఈటీవీ' ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రతిభా పాటవ పోటీల్లో భాగంగా శనివారం స్థానిక వివేకానంద పాఠశాలలోని విద్యార్థులకు క్విజ్ పోటీలు జరిగాయి. ఇందులో పలువురు విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. వీరిలో ఎస్.సాయిసహస్ర, టి.శివప్రియ, డి.వైష్ణవి(9వ తరగతి) వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. ఈ సందర్భంగా వారికి పాఠశాల కరస్పాండెంటు పి.రాజారెడ్డి, ప్రిన్సిపల్ ఎం.వి.శ్రీనివాసరావు, ఉపాధ్యాయుడు జోషి జార్జి బహుమతులు అందజేసి, ప్రత్యేకంగా అభినందించారు.

విస్సన్నపేట, న్యూస్‌టుడే : స్థానిక సిద్ధార్థ హైస్కూల్‌లో నిర్వహించిన పోటీల్లో ఎస్‌కే.అఫ్రీన్(8వ తరగతి), రాధా గుప్తా(9వ తరగతి), కె.సాత్విక(8వ తరగతి) విద్యార్థులు వరుసగా మొదటి మూడు స్థానాలు సాధించారు. వీరికి శ్రీసిద్ధార్థ విద్యా సంస్థల ఛైర్మన్ మేడా మోహన్‌రావు, ప్రిన్సిపల్ వంగల రమణ కుమార్ బహుమతులు అందజేశారు. డైరెక్టర్లు మేడా శ్రీహర్ష, దీప్తి, ఉపాధ్యాయులు నాగరాజు, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

క్రిస్మస్ వేడుకలకు అంతా సిద్ధం


కొండపల్లి సెయింట్ థామస్ చర్చి వద్ద అలంకరణ

ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే : క్రిస్మస్ వేడుకలను వైభవంగా నిర్వహించేందుకు కొండపల్లి పురపాలిక, ఇబ్రహీంపట్నం మండలంలోని అన్ని క్రైస్తవ సంఘాలు సిద్ధమయ్యాయి. ఇందులో భాగంగానే ప్రార్థనా మందిరాలు ముస్తాబు అయ్యాయి. దీంతో ఆయా ప్రాంతాల్లో సందడి వాతావరణం నెలకొంది. యువత పలుచోట్ల క్రిస్మస్ స్టార్లు ఏర్పాటు చేసి ఐక్యత చాటారు.

పునాదుల్లో పనులు.. విద్యార్థులకు వెతలు

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే


అద్దె ఇంట్లో తరగతులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయుడు

పునాది దశలోనే నిలిచిన పాఠశాలల నూతన భవన నిర్మాణాలు. ఏళ్లు గడుస్తున్నా భవనాల సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు. వైకాపా హయాంలో నాడు- నేడు రెండవ విడత కింద రెడ్డిగూడెం మండలంలోని మద్దులపర్వ(జీజీ), కొత్తరెడ్డిగూడెం, నరుకుళ్లపాడు, పాత నాగులూరు, కుదప జడ్పీ ఉన్నత పాఠశాలలకు నిధులు మంజూరు చేశారు. ఆయా బడుల్లో అదనపు తరగతి గదుల నిర్మాణాలు చేపట్టారు కానీ నేటికీ కొన్ని పాఠశాలల భవన నిర్మాణాలు పునాది దశలోనే ఆగిపోయాయి. ఈ నేపథ్యంలో కొత్తరెడ్డిగూడెం, మద్దులపర్వ(జీజీ) ప్రాథమిక పాఠశాలలను కొన్నాళ్లు అద్దె గృహాల్లో నడిపారు. ప్రస్తుతం పంచాయతీ కార్యాలయంలో నిర్వహిస్తున్నారు. నరుకుళ్లపాడు ప్రాథమిక పాఠశాలలో పిల్లలు లేక మూతపడింది.

వేరే బడుల్లో చేర్పించి..

కుదప జడ్పీ ఉన్నత పాఠశాలలో అదనపు తరగతులు నిర్మాణం అసంపూర్తిగా నిలిచిపోవడంతో విద్యార్థులు నానా అవస్థలు పడుతున్నారు. మద్దులపర్వ(జీజీ) ప్రాథమిక పాఠశాల్లో తరగతి సౌకర్యం లేకపోవడంతో కొందరు తల్లిదండ్రులు తమ పిల్లలను వేరే బడుల్లో చేర్పించారు. ప్రస్తుతం ఇందులో అయిదుగురు విద్యార్థులే ఉన్నారు. కొత్తరెడ్డిగూడెం ప్రాథమిక పాఠశాల్లో 12 మంది విద్యార్థులున్నారు. ఈ రెండింటిని పడకొట్టి కొత్త భవనాల నిర్మాణానికి పనులు చేపట్టారు. తర్వాత కొత్తరెడ్డిగూడెం పాఠశాలకు రూ.11 లక్షలు, మద్దులపర్వ(జీజీ) రూ.13 లక్షల నిధులు మంజూరయ్యాయి. అవి ఆయా పాఠశాలల కమిటీలు, ఉపాధ్యాయుల పర్యవేక్షణలో చేపట్టారు. ప్రస్తుతం ఆ కమిటీలు లేవు, అప్పట్లో పనిచేసిన ప్రధానోపాధ్యాయులు ఆ బడుల్లో లేరు.

☛ ఈ విషయమై ఎంఈవో పి.రమేష్ బాబును 'న్యూస్‌టుడే' వివరణ కోరగా ఆయన ఇలా స్పందించారు. ఉన్నతాధికారుల నుంచి అనుమతులు రాగానే ఆయా నిర్మాణాలు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చూస్తామన్నారు.

ఆదాయ వనరులు పెంపొందించాలి


మాట్లాడుతున్న ఎంపీడీవో సరస్వతి

గంపలగూడెం, న్యూస్‌టుడే : గ్రామ పంచాయతీలకు స్వీయ ఆదాయ వనరులను వృద్ధి చేయాలని ఎంపీడీవో సరస్వతి సచివాలయ ఉద్యోగులను ఆదేశించారు. స్వామిత్వ సర్వే ద్వారా ఆదాయ వనరులను గుర్తించాలని సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్, ఇంజినీరింగ్ సహాయకులు, వీఆర్వోలు, సర్వేయర్లకు ఒక రోజు శిక్షణను ఆమె ఆధ్వర్యంలో నిర్వహించారు.

వృద్ధులకు దుప్పట్ల పంపిణీ

తిరువూరు టౌన్, న్యూస్‌టుడే : తిరువూరు ఐడియాస్ సేవా సంస్థ ఆధ్వర్యంలో శనివారం వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఎంఈవో.శ్యామ్‌సుందర్, మాజీ సర్పంచి అనసూయ, సంస్థ డైరెక్టర్ ఆవ్వారి.శౌరీ, మేనేజర్ అంతయ్య, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM
తిరువూరు: 98853 28820 మైలవరం: 80085 74705



● హెచ్.ముత్యాలంపాడులో రామాలయం సమీపంలోని పంచాయతీ బోరు మరమ్మతులకు గురై నీటి కోసం అవస్థలు పడుతున్నామని స్థానికులు సమస్యను 'ఈనాడు' 'మేమున్నాం.. మీకు తోడుగా' ద్వారా అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన సర్పంచి కాజా సంధ్యారాణి సిబ్బందితో బోరుకు మరమ్మతులు చేయించారు. **- న్యూస్‌టుడే, జి.కొండూరు** ● నరసాపురం- చిన్నంపేట రోడ్డుపై గోతులు పడి రాకపోకలకు ఇబ్బందిగా ఉందని ప్రజలు పంచాయతీ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీనిపై ఈవో జి.స్వాతి స్పందించి పొక్లెయిన్ సాయంతో వాటిని పూడ్పించారు. **- న్యూస్‌టుడే, విస్సన్నపేట** ● తిరువూరు పట్టణం 19వ వార్డులోని డ్రెయిన్లలో మట్టి, చెత్త పేరుకుందని స్థానికుడు ప్రభాకరరావు 'ఈనాడు' మేమున్నాం.. మీకు తోడుగా ద్వారా సమస్యను మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన మున్సిపల్ శానిటరీ అధికారి సంతోష్ పారిశుద్ధ్య కార్మికులను పంపించి శుభ్రం చేయించారు. **- న్యూస్‌టుడే, తిరువూరు టౌన్**

రాష్ట్ర స్థాయికి రెండు నమూనాల ఎంపిక

మైలవరం, న్యూస్‌టుడే : విజయవాడలో ఈ నెల 19న నిర్వహించిన సైన్స్ ఫెయిర్‌లో మైలవరంలోని రెండు పాఠశాలల విద్యార్థులు ప్రదర్శించిన నమూనాలు రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు ఎంఈవో ఎల్.బాలు తెలిపారు. అందులో భవిష్యత్తు తరాలకు సహజ వనరులను రక్షించడానికి, గ్రీన్ టెక్నాలజీ పునరుత్పాదక శక్తిని ప్రోత్సహించడం వంటి అంశాలకు సంబంధించి వికసిత్ భారత్‌లో భాగంగా రెవెబుల్ ఎనర్జీపై స్థానిక గిరిజన బాలికల గురుకుల పాఠశాల ఉపాధ్యాయురాలు జె.నాంచారమ్మ మార్గదర్శకంలో 9వ తరగతి విద్యార్థినులు ఇస్లావతు రుక్మిణీ, బత్తుల విజయదుర్గ నమూనా, ప్లాస్టిక్ వ్యర్థాల నుంచి విద్యుదుత్పత్తి తయారీకి సంబంధించి లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయురాలు ఎస్.జానకీదేవి నేతృత్వంలో, విద్యార్థులు కె.సాయిచరణ్ నాయక్, జి.రాకేష్ రూపొందించిన నమూనా ఎంపికైనట్లు చెప్పారు.

కూటమి పాలనలో అభివృద్ధి దిశగా రాష్ట్రం


శిరీష దంపతులను సన్మానించి బాబా చిత్రపటం అందిస్తున్న నాయకులు

విస్సన్నపేట, న్యూస్‌టుడే : మండల కేంద్రంలో శనివారం ఏర్పాటు చేసిన తెదేపా కార్యకర్తలు, నాయకుల ఆత్మీయ సమావేశానికి పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పార్టీని బలోపేతం చేయడానికి శ్రేణులు నడుం బిగించాలని పిలుపునిచ్చారు. కూటమి పాలనలో గ్రామాల్లో మౌలిక వసతులు సమకూరి రాష్ట్రం అభివృద్ధి దిశలో పయనిస్తుందని చెప్పారు. తొలుత పార్టీ నూతన కార్యాలయాన్ని సందర్శించారు. పార్టీ మండల అధ్యక్షుడు రాయల సుబ్బారావు, సీనియర్ నాయకులు బద్దె, బుడ్డియ్య ఆధ్వర్యంలో ఎమ్మెల్యే దంపతులను సన్మానించి సాయిబాబా చిత్రపటం అందించారు. కూటమి నాయకులు పాల్గొన్నారు.

మెరుగైన విద్య అందించేందుకు కృషి


ఎ.కొండూరు: బోధనోపకరణాలు ప్రదర్శిస్తున్న ఎస్జీటీలు

గంపలగూడెం, తిరువూరు, ఎ.కొండూరు, న్యూస్‌టుడే : తిరువూరు, గంపలగూడెం, ఎ.కొండూరు మండలాల్లోని ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులకు శనివారం క్లస్టర్ సమావేశాలు నిర్వహించారు. ఎస్ఏ-1 పరీక్షల ఫలితాలు, వంద రోజుల కార్యాచరణ ప్రణాళిక, జీఎఫ్ఎల్ఎన్‌పై సమీక్షించారు. ఎస్ఏలు నమూనా పాఠాలు బోధన, ఎస్జీటీలు బోధనోపకరణాల తయారీలో పాల్గొన్నారని ఎ.కొండూరు ఎంఈవో-2 కేశవరావు తెలిపారు. విద్యార్థులకు మెరుగైన విద్యను అందించేందుకు పలు విషయాలపై అవగాహన కల్పించారు.

కాల్వలకు నీరు విడుదల

గంపలగూడెం, న్యూస్‌టుడే : ఎన్నెస్పీ రెండో జోన్‌లోని మధిర బ్రాంచి కెనాల్‌కు ఖమ్మం జిల్లా కల్లూరు మండలం కప్పలబంధం నియంత్రిక 72వ కి.మీ నుంచి శనివారం 1074 క్యూసెక్కుల సాగర్ జలాలు విడుదలైనట్లు ఏఈ మహేష్ బాబు తెలిపారు. గంపలగూడెం మండలం సరిహద్దులోని 23వ కి.మీ వద్దకు 453 క్యూసెక్కులు చేరాయని, అక్కడ నుంచి దిగువన మేజర్ల వారీగా గంపలగూడెం 20, ఊటుకూరు- 1కి 60, పెదకొమిర 20, మధిర 60, నిదానపురం 50 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నట్లు వెల్లడించారు.

నిండు జీవితానికి రెండు చుక్కలు


గణపవరంలో ప్రదర్శన చేస్తున్న ఆరోగ్య సిబ్బంది


ఇబ్రహీంపట్నం గ్రామీణం: జూపూడిలో..

మైలవరం, న్యూస్‌టుడే : పల్స్ పోలియోపై మండల వ్యాప్తంగా పలు పాఠశాలల్లో అవగాహన ప్రదర్శనలు నిర్వహించారు. పోలియో చుక్కల ఆవశ్యకతపై ప్లకార్డులు ప్రదర్శించారు.

ఇబ్రహీంపట్నం గ్రామీణం, న్యూస్‌టుడే : పల్స్ పోలియో, స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్ర కార్యక్రమాలపై జూపూడి గ్రామంలో అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతరం గ్రామంలో ప్రదర్శన చేపట్టారు. ఇబ్రహీంపట్నం గ్రామీణ మండల పరిధిలో పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఇబ్రహీంపట్నం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యుడు సయ్యద్ పర్వీన్ తెలిపారు.

విస్సన్నపేట, న్యూస్‌టుడే : నరసాపురంలో నిర్వహించిన కార్యక్రమంలో మండల వైద్యాధికారి శ్రీనివాసరావు, వైద్యారోగ్య శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

గంపలగూడెం, న్యూస్‌టుడే : గంపలగూడెం పీహెచ్‌సీ పరిధిలోని 18 గ్రామాల్లో పల్స్ పోలియో కార్యక్రమానికి ఏర్పాట్లు చేశామని వైద్యాధికారిణి వి.శృతి తెలిపారు.

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే : మండలంలో 31 కేంద్రాలు ఏర్పాటు చేసి 3,162 మంది పిల్లలకు పోలియో చుక్కలు వేయాలని గుర్తించినట్లు తహసీల్దార్ జె.సుశీలాదేవి తెలిపారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు


వృద్ధురాలితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు

తిరువూరు టౌన్, న్యూస్‌టుడే : తిరువూరు నియోజకవర్గంలోని ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ఎమ్మెల్యే కె.శ్రీనివాసరావు తన కార్యాలయంలో శనివారం అర్జీల రూపంలో స్వీకరించారు. ప్రతి ఫిర్యాదును స్వయంగా పరిశీలించి సంబంధిత అధికారులతో మాట్లాడి వెంటనే పరిష్కార చర్యలు చేపట్టాలని ఆదేశించారు. జనాలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. స్థానిక కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గుంత.. వాహనదారులకు చింత



తిరువూరు పట్టణంలో ప్రధాన రహదారి గ్యాస్ కంపెనీ ఎదురుగా రోడ్డు అంచున ఏర్పడిన గుంత వాహనదారులకు ప్రాణాంతకంగా మారింది. నిత్యం రద్దీగా ఉండే రోడ్డు సమీపంలో గుంత ఉండటంతో ప్రజలు రాకపోకలు సాగించడానికి భయపడుతున్నారు. రాత్రి సమయంలో ఈ మార్గంలో సరైన వీధి దీపాలు, హెచ్చరిక బోర్డులు లేకపోవడంతో వాహనదారులు దాని దగ్గరకు వచ్చే వరకు గమనించ లేకపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి దాన్ని పూడ్చివేసేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు వేడుకుంటున్నారు. **- న్యూస్‌టుడే, తిరువూరు టౌన్**

పశువుల సంచారం.. పర్యవేక్షణ లోపం



విజయవాడ-హైదరాబాద్ జాతీయ రహదారి నిత్యం వాహనాల రాకపోకలతో రద్దీగా ఉంటుంది. అలాంటి రోడ్డుపై గొల్లపూడి నుంచి ఇబ్రహీంపట్నం వరకు ఆవులు, గేదెలు సంచరించడంతో ప్రమాదాలు పొంచి ఉంటున్నాయి. డివైడర్ల పైన ఉన్న మొక్కలు తినేందుకు అవి వస్తున్నాయి. కొందరు పశువుల పెంపకందారులు వాటిని రహదారులపై వదిలేస్తున్నారు. దీంతో జాతీయ రహదారిపై [illegible] సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. **- న్యూస్‌టుడే, గొల్లపూడి**

పిక్కలు జాగ్రత్త...!



తిరువూరులోని పలు కాలనీల్లో వీధి శునకాల సంచారం ఎక్కువగా ఉంది. దీంతో ప్రజలు, వాహనదారుల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రత్యేకించి విద్యార్థులు పాఠశాలలకు వెళ్లి వచ్చేటప్పుడు [illegible] తల్లిదండ్రులు ఆవేదన చెందుతున్నారు. ఈ సమస్యపై మున్సిపల్ అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా [illegible] వ్యక్తమవుతుంది. ఇప్పటికైనా స్పందించి సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, తిరువూరు టౌన్**

తీగ విప్పి చూడ.. ఇనుప చువ్వలుండు



ఎక్కడైనా ఇల్లు కట్టాక, కూరగాయలో లేక పూల తీగలనో ఇంటి గోడలకు పాకించడం చూస్తుంటాం. కానీ మైలవరం నియోజకవర్గంలో [illegible] స్థల కాలనీగా ఉన్న మైలవరం మండల పరిధిలోని పుల్లగూడెంలో అడుగడుగునా పునాదులతో అల్లుకున్న బంధాలు కనిపిస్తాయి. ప్రభుత్వం ఇచ్చే కొద్దిపాటి మొత్తంతో గృహం నిర్మించుకోవడానికి పేదలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. నిర్మాణం చేపట్టకపోతే ప్లాట్లు రద్దు చేస్తామన్న హెచ్చరికలు, వారిని పరుగులు పెట్టించగా, ఎలాగోలా మూడేళ్ల కిందటే పునాదులు వేసి, ఇనుప చువ్వల బుట్టలను నిలబెట్టారు. అంతటితో నిర్మాణాలను ఆపేసి, ఆ తర్వాత ఆ వైపు చూడక పోవడంతో ఉద్యానవనాల తరహాలో పిచ్చిచెట్లు పెరిగాయి. ప్రస్తుతం అక్కడ వందలాది ప్లాట్లలో ఇదే పరిస్థితి నెలకొంది. **- న్యూస్‌టుడే, మైలవరం**


తిరువూరు: ప్రత్యేక అలంకరణలో రంగనాయక స్వామి


ఎటీపీఎస్ ఏ కాలనీలో..


గొల్లపూడి ల్యాంకో కాలనీలో..

వైభవంగా ధనుర్మాస పూజలు

ఇబ్రహీంపట్నం (గ్రామీణం), న్యూస్‌టుడే : ధనుర్మాసాన్ని పురస్కరించుకుని శనివారం ఎన్టీటీపీఎస్ ఏ కాలనీ, జూపూడి శ్రీవెంకటేశ్వర స్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శ్రీగోదాదేవి సన్నిధిలో తిరుప్పావై పాశురాలను పారాయణం చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

గంపలగూడెం, న్యూస్‌టుడే : తిరువూరు, గంపలగూడెం, ఎ.కొండూరు మండలాల్లోని వైష్ణవాలయాల్లో గోదారంగనాయక స్వామికి అర్చకులు అభిషేకం, అర్చనలు, విశేషాలంకరణలు నిర్వహించారు. భక్తులు దర్శించుకున్నారు. పెనుగొలను సమీప మెట్టగుట్టలోని గజలక్ష్మి సమేత శ్రీశేషాచల శ్రీనివాస స్వామి ఆలయంలో ప్రధానార్చకులు శ్యామ సుందర శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో స్వామివారిని అలంకరించారు. భక్తులు పాల పొంగళ్లతో [illegible]

తిరువూరు, న్యూస్‌టుడే : పాత తిరువూరులోని వెంకటేశ్వర స్వామి ఆలయంలో అర్చకుడు డి.వేణుగోపాలకృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో విశేష పూజలు నిర్వహించారు. భక్తులకు అన్న ప్రసాదం పంపిణీ చేశారు.

గొల్లపూడి, న్యూస్‌టుడే : స్థానిక ల్యాంకో కాలనీలోని శ్రీమహాలక్ష్మి నారాయణ స్వామి ఆలయంలో ప్రధాన అర్చకుడు బాల లక్ష్మి నరసింహాచార్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారికి తిరుప్పావై సేవ జరిగింది.

హిందూ సమ్మేళనం నేడు

గంపలగూడెం, న్యూస్‌టుడే : స్థానిక సీతారామచంద్ర స్వామి ఆలయ ప్రాంగణంలో ఆదివారం హిందూ సమ్మేళనం నిర్వహించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఇప్పటికే పలు గ్రామాల్లో ఇంటింటా పర్యటించి సమ్మేళనానికి ఆహ్వానిస్తూ కరపత్రాలు అందజేశారు.

ఆలయానికి కంచు గంట వితరణ

గంపలగూడెం : పెనుగొలను సమీప మెట్టగుట్ట శ్రీనివాస ఆలయానికి తిరువూరుకు చెందిన విశ్రాంత ఆర్టీసీ ఉద్యోగి గుడే రామారావు, భారతి దంపతులు, కుమారుడు, పోస్ట్‌మాస్టర్ రవికాంత్ రూ.40 వేల విలువైన ఓంకారం ధ్వనించే కంచు గంటను వితరణ చేసినట్లు గుడి అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు పి.వెంకట్రావు తెలిపారు.

విద్యుదాఘాతంతో ఎలక్ట్రీషియన్ దుర్మరణం

గొల్లపూడి, న్యూస్‌టుడే : విద్యుదాఘాతంతో ఎలక్ట్రీషియన్ మృతి చెందిన సంఘటన విజయవాడ గ్రామీణ మండలం పైడూరుపాడులో శనివారం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి... పైడూరుపాడులో రెండు రాజు(53) కుటుంబ సభ్యులతో కలిసి ఉంటూ ఎలక్ట్రీషియన్ జీవనం సాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో పుట్టిన రోజు సందర్భంగా గ్రామంలోని ఓ ఇంట్లో విద్యుత్తు దీపాలు అమర్చేందుకు శనివారం సాయంత్రం వెళ్లారు. అక్కడ లైటు అమర్చుతుండగా విద్యుదాఘాతానికి గురయ్యారు. వెంటనే స్థానికులు అతడిని విజయవాడలోని ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. దీనిపై ఇబ్రహీంపట్నం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


గుంటుపల్లి పంచాయతీ కార్యాలయం ఎదుట..


కొండపల్లిలో ప్రతిజ్ఞ చేస్తూ..

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత


విస్సన్నపేటలో మొక్క నాటుతూ..

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతని పలువురు వక్తలు పేర్కొన్నారు. స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం మైలవరం, తిరువూరు నియోజకవర్గాల్లోని పలు ప్రాంతాల్లో అవగాహన ప్రదర్శనలు నిర్వహించారు. అధికారులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు. **- న్యూస్‌టుడే, బృందం**

మార్కులకే పరిమితం కాకుండా నైపుణ్యాలపై దృష్టి


బహుమతులు సాధించిన వారితో అధికారులు

మైలవరం, న్యూస్‌టుడే : విద్యార్థులు మార్కులకే పరిమితం కాకుండా, వారిలోని ఆసక్తికి అనుగుణంగా నైపుణ్యాలు సాధించేందుకు దృష్టి సారించాలని బాలికా, శిశు అభివృద్ధి జిల్లా అధికారి(జీసీడీవో) బి.విజ్ఞావతి పేర్కొన్నారు. జిల్లా సమగ్ర శిక్షా అభియాన్ ఆధ్వర్యంలో శనివారం స్థానిక లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జిల్లా స్థాయి కెరీర్ ఫెస్ట్ నిర్వహించారు. వివిధ మండలాల నుంచి వచ్చిన విద్యార్థులతో పలు అంశాలపై స్టాళ్లను ఏర్పాటు చేశారు. ఇందులో ప్రతిభ చాటిన వారికి పతకాలు, బహుమతులు అందజేశారు. ఎంఈవో రాజు, ఎల్.బాలు, ఎస్సై కె.సుధాకర్ పాల్గొన్నారు.

ఓహో పిల్లలు..'ముస్తాబ'య్యారు..!


చంద్రపట్ల : చిన్నారులకు గోళ్లు కత్తిరిస్తున్న శంకరరావు

అరచేతిలో అద్దం నిలువెత్తుగా మారింది. ఇంకేముందీ... చేత దువ్వెన పట్టి, జుట్టుపైన దృష్టి సారించి అలంకరణకు ఉపక్రమించారు. శనివారం నుంచి ప్రారంభించిన 'ముస్తాబు' కార్యక్రమంలో భాగంగా తిరువూరు, మైలవరం నియోజకవర్గాల్లోని ప్రభుత్వ పాఠశాలలు, వసతిగృహాల్లోని విద్యార్థులు అద్దంలో చూసుకుంటూ మురిసిపోయారు. ఆయా కార్యక్రమాల్లో అధికారులు, ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. **- న్యూస్‌టుడే, బృందం**


మైలవరం : అద్దం చూస్తూ తలదువ్వుతున్న విద్యార్థి


ఎ.కొండూరులో మాట్లాడుతున్న సదాభార్గవి

పురుగు మందులు అధికంగా పిచికారీ చేయవద్దు


సదస్సులో ప్రసంగిస్తున్న కనకమహాలక్ష్మి

రెడ్డిగూడెం: మామిడి తోటల్లో ఎక్కువగా పురుగు మందులు పిచికారీ చేయరాదని నూజివీడు మామిడి పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్.బి.కనకమహాలక్ష్మి తెలిపారు. ఉద్యాన శాఖ, మామిడి పరిశోధనా కేంద్రం ఆధ్వర్యంలో శనివారం మద్దులపర్వ, రెడ్డిగూడెం, రెడ్డికుంట గ్రామాల్లో అవగాహన సదస్సులు నిర్వహించారు. మండల ఉద్యానాధికారి నరేంద్ర కుమార్, రెడ్డిగూడెం ఉప సర్పంచి కె.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గంపలగూడెం, న్యూస్‌టుడే : మండలంలోని మేడూరు రైతులు సాగు చేసిన మిరప తోటలను ఉద్యాన పరిశోధన స్థానం, గుంటూరు లాం ఫామ్ కీటక శాస్త్రవేత్తలు నాగేంద్రరెడ్డి, క్రాంతిరేఖ, ఉద్యానాధికారి సొహైల్ అహ్మద్ శనివారం పరిశీలించారు.

శిరస్త్రాణంతో ప్రాణానికి రక్షణ




జి.కొండూరు: అవగాహన కల్పిస్తున్న సీఐ చంద్రశేఖర్, ఎస్సై సతీష్ కుమార్, తిరువూరులో సీఐ గిరిబాబు ఆధ్వర్యంలో..

జి.కొండూరు, న్యూస్‌టుడే : శిరస్త్రాణం భారం కాదు.. మన ప్రాణానికి రక్షణ అని మైలవరం సీఐ దాడి చంద్రశేఖర్ అన్నారు. శనివారం స్థానిక శ్రీశ్రీ పాఠశాల విద్యార్థులతో కలిసి హెల్మెట్‌పై నిర్వహించిన అవగాహన ప్రదర్శనలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎస్సై కె.సతీష్ కుమార్, అదనపు ఎస్సై గిరిజామణి, తెదేపా మండల అధ్యక్షుడు వేములకొండ వెంకటేశ్వరరావు, ఏఎంసీ మాజీ ఛైర్మన్ ఉయ్యూరు వెంకట నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

తిరువూరు టౌన్, న్యూస్‌టుడే : తిరువూరు పట్టణంలో సీఐ.గిరిబాబు ఆధ్వర్యంలో 'నోహెల్మెట్- నోఎంట్రీ' పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. పట్టణ పోలీస్ స్టేషన్ నుంచి మొదలైన ప్రదర్శన బోసు బొమ్మ వరకు సాగింది. ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

స్వర్ణోత్సవ వేళ.. సరాగాల హేళ



కార్యక్రమానికి హాజరైన విద్యార్థులు

కానూరు, న్యూస్‌టుడే: సిద్ధార్థ అకాడమీ ఆఫ్ జనరల్ అండ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ స్వర్ణోత్సవాల సందర్భంగా ముమ్మినేని సిద్ధార్థ కళాపీఠం సహకారంతో నిర్వహించిన సంగీత కచేరీ విద్యార్థులను ఉత్సాహపరిచింది. కానూరు సిద్ధార్థ డీమ్డ్ విశ్వవిద్యాలయం ప్రాంగణంలో శనివారం సాయంత్రం ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రముఖ సింగర్లు సింహా, శ్రీకృష్ణ, రమ్యాబెహరా, సమీరా భరద్వాజ్‌లు తమ గానంతో ఆకట్టుకున్నారు. సింగర్ శ్రీకృష్ణ సిద్ధార్థ పూర్వ విద్యార్థి కావడంతో పాత జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. సిద్ధార్థ అకాడమీకి చెందిన అన్ని కళాశాలలకు చెందిన వేల మంది విద్యార్థులు కేరింతలు కొడుతూ ఉల్లాసభరితంగా గడిపారు. సిద్ధార్థ అకాడమీ అధ్యక్షుడు మలినేని రాజయ్య, కార్యదర్శి పాలడుగు లక్ష్మణరావు, ఉపకులపతి పి.వెంకటేశ్వరరావు, ప్రోవైస్ ఛాన్సలర్ ఏవీ రత్నప్రసాద్, పీవీపీఎస్ఐటీ ప్రిన్సిపల్ కె.శివాజీబాబు, రిజిస్ట్రార్ రవిచంద్, బావినేని పాండురంగారావు, జీవీఎస్‌స్వామి తదితరులు పాల్గొన్నారు.

కార్గో డోర్ డెలివరీ మాసోత్సవాలు ప్రారంభం

విజయవాడ బస్ స్టేషన్: ఆర్టీసీ కార్గో డోర్ డెలివరీ మాసోత్సవాలను శనివారం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జోన్-2 విజయరత్నం పార్శిల్‌ను బుకింగ్ చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్గో డోర్ డెలివరీ మాసోత్సవ గోడప్రతులను ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జోన్-2 విజయరత్నం, కమర్షియల్ ఏటీఎం ఎస్ మోషే, ఏ శ్రీధర్, ఎస్ఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్, డీఎంఈలు పాల్గొన్నారు. వచ్చే నెల 19 వరకు మాసోత్సవాలు నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు.



పార్శిల్ బుక్ చేస్తున్న ఈడీ జోన్-2 విజయరత్నం

రక్తదానం పేరుతో.. ప్రభుత్వాసుపత్రిలో బలప్రదర్శన

చోద్యం చూసిన అధికార యంత్రాంగం

ఈనాడు, అమరావతి- తిరువూరు టౌన్, న్యూస్‌టుడే : తిరువూరులోని ప్రాంతీయ ప్రభుత్వాసుపత్రిలో రక్తదానం పేరుతో వైకాపా నాయకులు శనివారం హల్‌చల్ చేశారు. జగన్ పుట్టిన రోజు సందర్భంగా ఆ పార్టీ నేత నల్లగట్ల స్వామిదాస్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం పెట్టారు. వందల మంది వైకాపా శ్రేణులతో కలిసి.. జై జగన్ అంటూ నినాదాలు చేస్తూ ఆసుపత్రికి ఉదయాన్నే చేరుకున్నారు. మొదటి అంతస్థులో ఉండే బ్లాక్‌కు ముందు వైపు రిబ్బన్ ఏర్పాటు చేసి.. దాన్ని స్వామిదాస్, మదిరెడ్డి సూర్యనారాయణ రెడ్డి, ఇతర నాయకులంతా కలిసి కత్తిరించారు. అనంతరం జగన్ నాయకత్వం వర్థిల్లాలంటూ నినాదాలు చేస్తూ.. వందల మంది ఆసుపత్రి లోపలికి వెళ్లారు. రక్తదానం చేసే బ్లాకులో.. ఆ పార్టీ నేతలతో కూడిన భారీ ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకూ ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రభుత్వాసుపత్రిలో ఇలా ఓ పార్టీ కార్యక్రమం మాదిరిగా హల్‌చల్ చేస్తూ.. నిర్వహించడంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రక్తదాన శిబిరం అంటే.. ప్రశాంత వాతావరణంలో ఎలాంటి హడావుడి లేకుండా ఎవరికి వారొచ్చి.. రక్తం ఇచ్చి వెళ్లాలి. అంతే కానీ.. అనారోగ్యంతో బాధపడే రోగులు ఉండే ఆసుపత్రిలో.. ఇలా నినాదాలు చేస్తూ, అరుపులు, కేకలు వేస్తూ.. ఫ్లెక్సీలు వేలాడదీసినా.. కనీసం ఒక్క అధికారి కూడా ఇటు వైపు కన్నెత్తి చూడలేదు.



రక్తదానం చేసే గదిలో గోడకు భారీ వైకాపా ఫ్లెక్సీ

అందరి సహకారంతోనే కర్బన రహిత రాష్ట్రం

కృష్ణలంక, న్యూస్‌టుడే : రాష్ట్రాన్ని కర్బన రహితంగా తయారు చేసేందుకు అందరూ కృషి చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర ఇంధన పరిరక్షణ మిషన్ (ఏపీఎస్ఈసీఎమ్) ఛైర్మన్ కె.విజయానంద్ అన్నారు. విజయవాడ ఎంజీ రోడ్డులోని ఓ హోటల్‌లో శనివారం నిర్వహించిన ఇంధన పొదుపు వారోత్సవాల ముగింపు, 2025 స్టేట్ ఎనర్జీ కన్జర్వేషన్ అవార్డులు, షార్ట్ వీడియో కాంపిటీషన్ విజేతల బహుమతుల ప్రదానోత్సవానికి అయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఇంధన పరిరక్షణలో రాష్ట్రం నాలుగేళ్లుగా దేశంలో మొదటి స్థానంలో నిలుస్తోందని, 2015 హుద్‌హుద్ తుపాను అనంతరం విశాఖ నగరంలోని వీధి లైట్లను ఎల్ఈడీ లైట్లుగా మార్చడం వల్ల 45 శాతం ఇంధన పొదుపు సాధ్యమైందన్నారు. కేంద్ర సంస్థలైన బీఈఈ (బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫీషియన్సీ), ఈఈఎస్ఎల్ (ఎనర్జీ ఎఫీషియన్సీ సర్వీసెస్ లిమిటెడ్) భాగస్వామ్యంతో రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 2 కోట్లకు పైగా ఇళ్లలో ఎల్ఈడీ బల్బులను పంపిణీ వల్ల సుమారు 30 శాతం విద్యుత్తు ఆదా సాధ్యమైందని పేర్కొన్నారు. ఏపీ జెన్‌కో సీఈవో, ఏపీ ఎస్ఈసీఎం ఎస్.నాగలక్ష్మి మాట్లాడుతూ స్టేట్ ఎనర్జీ కన్జర్వేషన్ మిషన్ ద్వారా ఏటా నేషనల్ ఎనర్జీ కన్జర్వేషన్ వీక్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఏపీసీపీడీసీఎల్ సీఎండీ పి.పుల్లారెడ్డి ఇంధన పొదుపు పరిరక్షణ అవార్డులు గెలుచుకున్న సంస్థలకు, లఘు వీడియో పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు అభినందనలు తెలిపారు.



పరిశ్రమల విభాగంలో థర్మల్ పవర్ ప్లాంట్లు, సిమెంట్, ఫార్మా రంగాల్లో బహుమతులు పొందిన ప్రతినిధులతో సీఎస్ విజయానంద్, ఏపీ జెన్‌కో ఎండీ నాగలక్ష్మి, ఏపీసీపీడీసీఎల్ సీఎండీ పుల్లారెడ్డి తదితరులు

ఇంధన పరిరక్షణ అవార్డుల ప్రదానం.. థర్మల్ పవర్ స్టేషన్లు, సిమెంటు పరిశ్రమలు, ఔషధ పరిశ్రమలు, భవనాల విభాగంలో ఇంజినీరింగ్ కళాశాలలు, హోటళ్లు, ఆర్టీసీ బస్‌స్టేషన్లు, డిపోలు, ఇనిస్టిట్యూషన్ల విభాగంలో తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్, భీమవరం మున్సిపాలిటీలకు అవార్డులను ప్రదానం చేశారు. ఇంధన పొదుపుపై విద్యార్థులకు లఘు వీడియోల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు.

బంగారు పతకాలు : ఇంధన పరిరక్షణకు సంబంధించి పరిశ్రమల విభాగంలో విశాఖపట్నం పరవాడ సింహాద్రి సూపర్ థర్మల్ పవర్ స్టేషన్, కృష్ణా జిల్లా బూదవాడకు చెందిన బాలాజీ సిమెంట్ వర్క్స్ (అల్ట్రాటెక్ సిమెంట్ లిమిటెడ్), విశాఖపట్నం దివీస్ ల్యాబొరేటరీస్-యూనిట్- 2, అనంతపురం జేఎన్‌టీయూ ఇంజినీరింగ్ కళాశాల, ఐటీసీ గ్రూప్‌నకు చెందిన గుంటూరులోని వెల్‌కమ్ హోటల్, సత్తెనపల్లి బస్ డిపో, తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్‌కు బంగారు అవార్డులను ప్రదానం చేశారు.

వెండి పతకాలు : విజయవాడ నార్ల తాతారావు థర్మల్ పవర్ స్టేషన్, కర్నూలు జిల్లా బనగానపల్లెకు చెందిన శ్రీ జయజ్యోతి సిమెంట్ ప్రైవేట్ లిమిటెడ్ (మై హోమ్), అనకాపల్లి జిల్లా పరవాడకు చెందిన లారస్ లాబ్స్ లిమిటెడ్ యూనిట్-3, విజయనగరం జిల్లా రాజాంకు చెందిన జీఎంఆర్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, విశాఖపట్నం నోవాటెల్ వరుణ్ బీచ్, రాజోలు ఏపీఎస్ఆర్టీసీ రాజోలు బస్ స్టేషన్, భీమవరం మున్సిపాలిటీలకు వెండి పతకాలు అందజేశారు.

ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయం.. ప్రేమ పేరుతో వల

బాలిక కిడ్నాప్.. ఆపై అత్యాచారం

విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే : ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయమైన యువకుడు నాలుగు మాటలు చెప్పగానే అది ప్రేమే.. అని అనుకుంది. ఇదే అదునుగా భావించిన అతడు ఆమెను కిడ్నాప్ చేసి, అత్యాచారం చేసిన ఘటన విజయవాడ నగరంలో కలకలం సృష్టించింది. వివరాల్లోకి వెళితే.. విజయవాడ, నున్న పోలీస్‌స్టేషన్ పరిధిలోని వాంబేకాలనీలో ఉండే ఓ బాలిక (16) గుంటూరులోని ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతోంది. ఆమెకు ఇన్‌స్టాగ్రామ్‌లో గుంటూరుకు చెందిన రాహుల్ అనే యువకుడు పరిచయం అయ్యాడు. ప్రేమ పేరుతో మాయమాటలు చెప్పడంతో నమ్మేసింది. ఆమెను కిడ్నాప్ చేసి, తీసుకువెళ్లాలని అతడు నిర్ణయించుకున్నాడు. తనకు తెలిసిన మరో నలుగురికి ఈ విషయం చెప్పి, వారి సహకారం కోరాడు. పక్కా ప్రణాళిక వేశాడు. దీనికోసం హైదరాబాద్‌లో సెల్ఫ్ డ్రైవింగ్ కారును అద్దెకు తీసుకున్నాడు. కారు నంబరు ప్లేటు మార్చి అందరూ విజయవాడకు వచ్చారు. 18వ తేదీ రాత్రి వాంబేకాలనీలోని బాలికను ఎక్కించుకుని పారిపోయారు. పల్నాడు జిల్లా సత్తెనపల్లిలోని ఒక లాడ్జిలో రెండు గదులు అద్దెకు తీసుకున్నారు. ఒక గదిలో బాలికను ఉంచారు. అదే రోజు రాత్రి రాహుల్ బాలికపై అత్యాచారానికి పాల్పడ్డాడు. స్నేహితులు పక్క గదిలో కాపలాగా ఉన్నారు. ఈ క్రమంలో బాలిక వారి నుంచి తప్పించుకుని, నల్లపాడు చేరుకుంది. అక్కడ నుంచి ఫోన్ చేయడంతో బాలిక తల్లిదండ్రులు నున్న పోలీసులను ఆశ్రయించారు. పోలీసులు హుటాహుటిన నల్లపాడు చేరుకుని బాలికను రక్షించారు.

లాడ్జిపై ఆకస్మిక దాడులు: బాలికను కిడ్నాప్ చేసి ఉంచిన లాడ్జిపై నున్న పోలీసులు, అక్కడి పోలీసుల సాయంతో దాడులు చేశారు. రాహుల్‌తో పాటు అతని స్నేహితులు ముగ్గురు లాడ్జిలో ఉన్నట్లు గుర్తించారు. ప్రధాన సూత్రధారి రాహుల్‌తో పాటు మొత్తం నలుగురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. పారిపోయిన యువకుడి కోసం గాలిస్తున్నారు. రాహుల్‌పై కిడ్నాప్, పోక్సో, అత్యాచారం కింద కేసు నమోదు చేశారు. సహకరించిన స్నేహితులపై కిడ్నాప్ ఇతర సెక్షన్ల కింద కేసు పెట్టారు. నిందితులు ఉపయోగించిన కారును స్వాధీనం చేసుకున్నారు.

రిఫ్రిజిరేషన్ దుకాణంలో అగ్నిప్రమాదం

రూ.25 లక్షల ఆస్తి నష్టం

సూర్యారావుపేట, న్యూస్‌టుడే : ఒక రిఫ్రిజిరేషన్ వర్క్స్ షాపులో సంభవించిన అగ్నిప్రమాదంలో రూ.లక్షల విలువైన సరకు, నగదు కాలిపోయాయి. వివరాలు ఇలా ఉన్నాయి.. సత్యనారాయణపురం జేవర్స్‌కాలనీకి చెందిన బాజాపత్ ఉదయ్‌కుమార్ రిఫ్రిజిరేషన్ వర్క్స్ దుకాణం నిర్వహిస్తున్నారు. శుక్రవారం రాత్రి దుకాణం మూసి వేసి ఇంటికి వెళ్లారు. రాత్రి 11.30 గంటల సమయంలో పక్క భవనంలో ఉండే షేక్ సలీం అనే వ్యక్తి ఉదయ్‌కుమార్‌కు ఫోన్ చేసి, దుకాణం కాలిపోతోందని సమాచారం ఇచ్చారు. ఆయన వచ్చి చూసేసరికి 70 శాతం కాలిపోయింది. అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు. రూ.20 లక్షల విలువైన రిఫ్రిజిరేషన్ పరికరాలు, రూ.3లక్షల నగదు కాలిపోయిందని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. సూర్యారావుపేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

'రాష్ట్ర ప్రయోజనాలను పణంగా పెట్టిన తెదేపా, వైకాపా'

రామయ్యపార్కు కూడలి(కృష్ణలంక), న్యూస్‌టుడే : రాష్ట్రంలో అధికార తెదేపా, ప్రతిపక్ష వైకాపాలు మోదీ ప్రభుత్వంతో మిలాఖత్ అయ్యి రాష్ట్ర ప్రయోజనాలను, పారిశ్రామిక అభివృద్ధిని పణంగా పెట్టాయని సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు విమర్శించారు. భారత కమ్యూనిస్టు ఉద్యమ నేత, సీపీఎం అగ్రనాయకుడు మాకినేని బసవపున్నయ్య జయంతి పురస్కరించుకుని ఎంబీ విజ్ఞాన కేంద్రంలో శనివారం 'ఆంధ్రప్రదేశ్‌లో పారిశ్రామికీకరణ తీరు తెన్నులు-రాష్ట్ర ప్రభుత్వ విధానాలు' అంశంపై స్మారకోపన్యాసం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ.. ప్రత్యేక హోదా, రాష్ట్ర పునర్విభజన చట్టం, రాజధాని నిర్మాణం నిధులు తదితర ప్రయోజనాల సాధనకు కేంద్రంపై ఎలాంటి ఒత్తిడి తేకుండా తెదేపా, వైకాపాలు మిన్నకుండిపోయాయని మండిపడ్డారు. విలువైన దశాబ్ద కాలాన్ని వృథా చేశాయన్నారు. వాటి తీరు వల్ల రాయలసీమ, ఉత్తరాంధ్రలు నిర్లక్ష్యానికి గురయ్యాయని చెప్పారు. ప్రైవేటీకరణ, పీపీపీ విధానంతో కార్మికులు మరింత ఆర్థిక ప్రయోజనాలను లోనవుతున్నట్లు చెప్పారు. విద్యుత్తు, రవాణా, విద్య, వైద్య రంగాల్లో ప్రభుత్వం తన బాధ్యతలను వదిలించుకుంటోందన్నారు. సామ్రాజ్యవాద ఉన్న ఆంక్షలను అధిగమించేందుకు నిర్దిష్టమైన చర్యలు చేపట్టాలని సూచించారు. ఎంబీవీకే ట్రస్టు ఛైర్మన్ పి.మధు అధ్యక్షత వహించారు. తొలుత బసవపున్నయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ట్రస్టు కార్యదర్శి వై.వెంకటేశ్వరరావు, ఎంబీవీకే కార్యదర్శి పి.మురళీకృష్ణ, నిర్వహణ కమిటీ సభ్యురాలు కె.స్వరూపరాణి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాఘవులు, వేదికపై వెంకటేశ్వరరావు, మధు, మురళీకృష్ణ తదితరులు

అనుమానాస్పదస్థితిలో వివాహిత మృతి

జగ్గయ్యపేట గ్రామీణం, న్యూస్‌టుడే: పట్టణంలోని శాంతినగర్‌లో ఓ వివాహిత అనుమానాస్పద స్థితిలో మృతిచెందిన ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. వారి వివరాల మేరకు.. జగ్గయ్యపేట సీతారామపురానికి చెందిన గోపీ ప్రసాద్, కమ్మలపల్లి ప్రవల్లిక(30)లకు 12 ఏళ్ల కిందట వివాహమైంది. కొంతకాలం నుంచి వీరి మధ్య ఘర్షణలు జరుగుతుండడంతో కోర్టులో విడాకులకు దరఖాస్తు చేసుకున్నారు. ఇటీవల ఆమె మండలంలోని షేర్ మహమ్మద్‌పేటకు చెందిన చలమల సుభాష్‌చంద్రబోస్‌ను పెళ్లి చేసుకున్నారు. అంతకు ముందే అతడికి మరో మహిళతో వివాహమైంది. ప్రవల్లిక, సుభాష్‌చంద్రబోస్‌లు తాడేపల్లిలో నివాసముంటున్నారు. ఇటీవల అతడు.. పట్టణంలోని శాంతినగర్‌లో ఒక ఇల్లు కొనుగోలు చేశారు. దానిని తన పేరున రిజిస్ట్రేషన్ చేయాలని, మొదటి భార్యకు విడాకులు ఇవ్వాలని ఆమె కోరింది. కానీ అతడు. . తన తల్లి పేరు మీద ఇంటిని రిజిస్ట్రేషన్ చేశారు. దీంతో వారిద్దరి మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో శాంతినగర్‌లోని ఇంట్లో ప్రవల్లిక ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. భర్త సుభాష్‌చంద్రబోస్ వేధింపులు తట్టుకోలేక ఆత్మహత్య చేసుకుందని మృతురాలి బంధువులు, తల్లి యరగర్ల రాజలక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేశారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్లు జగ్గయ్యపేట ఎస్సై రాజు తెలిపారు. ప్రవల్లిక-గోపీప్రసాద్‌లకు ఇద్దరు పిల్లలు ఉన్నారు.



ప్రవల్లిక (పాతచిత్రం)

ఏపీలోనూ ఐఐటీ క్యాపిటల్ టెక్నాలజీస్ మోసాలు

హైదరాబాద్: ఐఐటీ క్యాపిటల్ టెక్నాలజీస్ మోసాలు ఏపీలోనూ బయటపడుతున్నాయి. కృత్రిమ మేధ(ఏఐ) ఆధారిత సాఫ్ట్‌వేర్‌తో స్టాక్ మార్కెట్ పరిణామాలను ముందే తెలుసుకుంటామని పలువుర్ని రూ.5 కోట్ల మేర మోసగించిన ఐఐటీ క్యాపిటల్ టెక్నాలజీస్ వ్యవస్థాపకుడు గడ్డం వెంకట్రావు మీద సైబరాబాద్ ఈవోడబ్ల్యూ ఠాణాలో మరో కేసు నమోదైంది. తనను రూ.1.21 కోట్ల మేర మోసగించినట్లు ఏపీలోని విజయనగరం జిల్లాకు చెందిన ఐటీ ఉద్యోగిని ఫిర్యాదుతో ఈ కేసు నమోదైంది. బాధితురాలు తొలుత విజయనగరం రెండో పట్టణ ఠాణాలో ఫిర్యాదు చేయగా కేసు నమోదైంది. ఇదే సమయంలో గడ్డం వెంకట్రావు ఏఐ ఆధారిత సాఫ్ట్‌వేర్‌తో స్టాక్ మార్కెట్ పరిణామాలను ముందే తెలుసుకుంటామంటూ రూ.5 కోట్ల మేర మోసగించిన వ్యవహారంలో సైబరాబాద్ ఈవోడబ్ల్యూ ఠాణాలో ఈ ఏడాది ఆగస్టులో కేసు నమోదైంది. ఈ రెండు కేసుల్లో మోసం తీరు ఒకేలా ఉండడంతో విజయనగరంలో నమోదైన కేసుల్ని అక్కడి పోలీసులు తాజాగా సైబరాబాద్‌కు బదిలీ చేశారు. పెట్టుబడికి లాభాలు ఇస్తామంటూ తన నుంచి రూ.1.2 కోట్లు కొట్టేశారని.. లాభాలు, అసలు ఇవ్వకుండా ఇబ్బందులు పెడుతున్నట్లు బాధితురాలు తన ఫిర్యాదులో పేర్కొంది. వెంకట్రావుతో పాటు ఏవీ ఇన్వెస్ట్‌మెంట్ సొల్యూషన్స్ వ్యవస్థాపకుడు వేణుగోపాల్, డాక్టర్ గంగాధర్‌రెడ్డి, డాక్టర్ రామకృష్ణ భోజంకి, దుబాయ్ భాస్కర్ పేర్లను ఎఫ్ఐఆర్‌లో చేర్చారు. ఏవీ ఇన్వెస్ట్‌మెంట్ సొల్యూషన్స్‌లో పెట్టుబడి పెడితే.. మంచి లాభాలు ఇస్తామంటూ ఈ ఐదుగురూ విజయవాడ, తుని, విశాఖపట్నం, విజయనగరం తదితర ప్రాంతాల్లో సమావేశాలు నిర్వహించినట్లు బాధితురాలు పేర్కొన్నారు.

పత్తాలేని ఎల్‌బీఎఫ్ నిర్వాహకులు

విస్సన్నపేట, గంపలగూడెం: విస్సన్నపేటలో బోర్డు తిప్పేసిన లైఫ్ ఈజ్ బ్యూటీఫుల్ సంస్థ నిర్వాహకుల కోసం పోలీసుల గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. శనివారం కూడా ఇద్దరు బాధితులు విస్సన్న పోలీసు స్టేషన్‌ను ఆశ్రయించారు. సంస్థ ఛైర్మన్‌గా ఉన్న ఎన్.దుర్గాప్రసాద్ మృతి చెందగా సీఈవోగా ఉన్న అతని భార్య శివాని అజ్ఞాతంలోకి వెళ్లిన సంగతి విదితమే. సంస్థలో జరిగిన ఆర్థిక మోసాలు, బాధితుల వివరాలు వెలుగులోకి రావాలంటే శివాని ఆచూకీ లభించడం కీలకం. రెడ్డిగూడెం మండలం మద్దులపర్వకు చెందిన శివాని తండ్రి బండి గోవిందరావు ఎల్‌బీఎఫ్ కడప జిల్లాకు డైరెక్టర్‌గా ఉండటం విశేషం. ప్రస్తుతం గోవిందరావు విస్సన్నపేట పోలీసుల అదుపులోనే ఉన్నారు. సంస్థలో పెట్టుబడి పెట్టిన కొందరు తమ సొమ్ము చాలా వరకు తిరిగి రావడంతో నోరు మెదపడం లేదని సమాచారం.

బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -133 రిటైల్ ధర 160 చికెన్ విత్ స్కిన్ - 232, చికెన్ స్కిన్‌లెస్ - 264.
అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 150, 159, 170 చికెన్ విత్ స్కిన్ - 290 చికెన్ స్కిన్‌లెస్ - 300.

దసరా బుల్లోడు @ భట్లపెనుమర్రు



నాటి గోడపత్రికలో కనిపిస్తున్న భట్లపెనుమర్రు గ్రామం

దసరా బుల్లోడు.. ఆరు దశాబ్దాల నాటి ఈ చిత్రం అప్పట్లో ఎంత హిట్టో. ఈ సినిమా విడుదలయ్యాక ఎవరైనా యువకులు కొత్త దుస్తులు ధరిస్తే చాలు.. అదుగోరోయ్.. దసరాబుల్లోడు వస్తున్నాడంటూ చమత్కరించేవారు. ఇదంతా ఎందుకు చెప్పాల్సి వచ్చిందంటే.. పూర్తి గ్రామీణ వాతావరణం నేపథ్యంలో రూపొందించిన చిత్రమిది. షూటింగ్ ఎక్కువ భాగం కూచిపూడి మండలం భట్లపెనుమర్రులోనే జరిగింది. లక్ష్మీ పిక్చర్స్ భాగస్వాముల్లో ఒకరైన చలసాని ఉమామహేశ్వరరావు స్వగ్రామం కావడంతో ఆయన సూచనలతో 1970లో జగపతి పిక్చర్స్ నిర్మాత వి.బి.రాజేంద్రప్రసాద్ తొలిసారి దర్శకుడిగా మారి ఈ సినిమా తీశారు. 1971 జనవరి 13న విడుదలైన ఈ సూపర్ హిట్ సినిమా జగపతి ఆర్ట్ పిక్చర్స్ పతాకంపై వి.బి.రాజేంద్రప్రసాద్ దర్శకత్వంలో నిర్మించారు. టైటిల్ సాంగ్‌తో పాటు ఓ మల్లయ్యగారి ఎల్లయ్య పాటను భట్లపెనుమర్రు గాంధీబొమ్మ సెంటరులో, చెరువు సమీపంలోని ఇప్పటి యూనియన్ బ్యాంకు ప్రాంతంలో చిత్రీకరించారు. చంద్రకళ క్యాన్సర్ వ్యాధితో బాధపడిన దృశ్యాలు, గుమ్మడి, వాణిశ్రీ, అంజలిదేవి ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయే దృశ్యాలతోపాటు చెరువులో చేపలపాట, నెమలి, పులివేషాలు వంటి వాటిని కూడా ఇక్కడే చిత్రీకరించారు. అక్కినేని నాగేశ్వరరావు కెరీర్‌లో అతి పెద్ద హిట్ సినిమాల్లో ఒకటిగా నిల్చిన ఈ సినిమా చిత్రీకరణ నాటి అనేక విషయాలను ఇప్పటికీ గ్రామస్థులు గుర్తు చేసుకుంటుంటారు. పాట చిత్రీకరణ సమయంలో అక్కినేని నాగేశ్వరరావు ఉంగరం పోతే దొరికిన ఒక గ్రామస్థుడికి రూ.100 బహుమతిగా ఇచ్చినట్లు చెబుతుంటారు.

- భట్లపెనుమర్రు(కూచిపూడి)

సంకల్పమే నడిపింది.. శిఖరంపై నిలిపింది

మాటలు రాకపోయినా.. ఏమీ వినలేకపోయినా అతని సంకల్పం ముందు అన్నీ ఓడిపోయాయి. ఆటనే గురువుగా భావించి క్రికెట్‌లో లక్ష్యం ఏర్పరుచుకొని గమ్యం వైపు దూసుకెళ్తున్న దివ్యాంగ యువ క్రీడాకారుడి ప్రస్థానం ఇది. కొండపల్లికి చెందిన యశ్వంత్ నాయుడు పుట్టుకతోనే దివ్యాంగుడు. కొండపల్లి క్రాంతి ప్రాథమిక, జడ్పీ ఉన్నత పాఠశాలల్లో చదివాడు. పది పూర్తి అయిన తర్వాత క్రికెట్ ప్రాక్టీస్‌ను ప్రారంభించాడు. ఆ తర్వాత స్థానికంగా జరిగే అన్ని క్రికెట్ మ్యాచ్‌ల్లో సత్తా చాటుతూ వచ్చాడు. ఉన్నత చదువులకు వెళ్లే సమయంలో తండ్రి నాగేశ్వరరావు 2015లో మృతి చెందారు. అదే ఏడాదిలో తల్లి బేబీ, సోదరి సుమ ప్రోత్సాహంతో క్రికెట్‌ను కెరియర్‌గా మార్చుకున్నాడు. శిక్షణ తీసుకునే స్థోమత లేకపోవడంతో అమ్మ ఇచ్చిన స్మార్ట్ ఫోన్‌తో ఆటలోని మెలకువలు నేర్చుకుని, ఇబ్రహీంపట్నం క్రీడా మైదానంలో నిరంతరం సాధన చేశాడు.



టీం ఇండియా జెర్సీతో యశ్వంత్

ఆల్‌రౌండర్‌గా రాణిస్తూ..

ఈ క్రమంలోనే సివిల్ ఇంజినీరింగ్‌లో డిప్లొమా పూర్తి చేశాడు. తర్వాత ఫాస్ట్ బౌలర్‌గా మారాడు. ఆ సమయంలో మంగళగిరి క్రికెట్ స్టేడియంలో గోకరాజు గంగరాజు కొంత ప్రోత్సాహం ఇచ్చారు. బౌలింగ్‌కే పరిమితం కాకుండా ఆల్‌రౌండర్‌గా ప్రాక్టీస్ చేస్తూ తన సత్తాను నిరూపించుకుంటున్నాడు. బధిరుల క్రికెట్ ఇండియా జట్టులో ఎంపికై వరల్డ్ కప్‌లో సత్తా చాటాడు. శ్రీలంక, బంగ్లాదేశ్, దక్షిణ ఆఫ్రికా, భారత్‌లో నిర్వహించిన బధిరుల అంతర్జాతీయ క్రికెట్ పోటీల్లో పాల్గొని పలు విజయాలకు కారకుడయ్యాడు. 2026 వరల్డ్ కప్‌లో సౌత్ ఇండియా నుంచి ఎంపికైన ముగ్గురు క్రీడాకారుల్లో యశ్వంత్ మొదటి వాడు. బీసీసీఐ ఆధ్వర్యంలోనే ఈ మ్యాచ్‌లు జరగనున్నాయి. యూఏఈలో డిసెంబరులో జరగనున్న అంతర్జాతీయ క్రికెట్ పోటీలు, బధిరుల టీ-20 బృందానికి ఎంపికై ప్రస్తుతం దిల్లీకి వెళ్లి మ్యాచ్‌కు సిద్ధమవుతున్నాడు.

– కొండపల్లి, ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే

భక్తి వైభవం... హంస వాహనం..

శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం ఏటా ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే దసరా వేడుకల్లో హంస వాహన సేవకు ప్రత్యేక స్థానముంది. గంగా, పార్వతీ సమేత దుర్గామల్లేశ్వరస్వామి వార్ల ఉత్సవమూర్తులు వైభవంగా కృష్ణానదిలో విహారం చేయిస్తారు. అసలు ఈ కార్యక్రమం ఎప్పుడు మొదలు పెట్టారో తెలుసుకుందాం.

ఆది దంపతుల జల విహారం



స్వామి వార్లకు జల విహారం చేయించాలనే ఆలోచన మొదటి సారి 1980లో వచ్చింది. అంతరం భద్రాచలంలో హంస వాహనం ఉన్న విషయం తెలుసుకుని దేవాదాయ శాఖ అధికారుల సహకారంతో ఆ వాహనాన్ని విజయవాడ దుర్గాఘాట్‌కు తీసుకొచ్చారు. రంగులు, విద్యుత్ దీపాలతో ముస్తాబు చేశారు. విజయదశమి రోజున ఆది దంపతులను హంస వాహనంపైన ఉంచి కృష్ణానది తీరంలో భక్తుల సమక్షంలో జల విహారం చేయించారు. భక్తుల నుంచి లభించిన విశేష స్పందనతో రెండో ఏడాదికి దేవస్థానం ఆధ్వర్యంలో నూతన హంస వాహనం తయారు చేయాలని అధికారులు, అర్చకులు ప్రతిపాదించారు. హంస వాహనం రూపొందిన తర్వాత భద్రాచలం నుంచి తీసుకొచ్చిన వాహనాన్ని తిరిగి గోదావరి తీరానికి చేర్చారు.

నాలుగు దశాబ్దాలుగా..

ఏటా దసరా వేడుకలకు సిద్ధం చేసే క్రమంలో భాగంగా హంస విడి భాగాలకు రంగులు వేస్తుంటారు. 2016లో కనకదుర్గ పైవంతెన నిర్మాణ పనుల నిమిత్తం దుర్గాఘాట్‌లో హంస వాహన విడిభాగాలను భద్రపరిచే గోదాములను తొలగించారు. వాటిని ఇప్పటి నుంచి గుణదలలోని దేవస్థానానికి సంబంధించిన గోదాముకు మార్చారు. గత ఏడాది వర్షాలు వరదల కారణంగా విడిభాగాలు కొంత మేర దెబ్బతిన్నాయి. వాటికి మరమ్మతులు చేసి దసరా ఉత్సవాల్లో వినియోగించారు. నూతన హంస వాహనం తయారు చేయాల్సిన అవసరం ఉందని ఇంజినీరింగ్ అధికారులు, అర్చకులు చర్చించారు. కార్యరూపం దాల్చితే నాలుగు దశాబ్దాల తర్వాత నూతన హంస వాహనం సిద్ధం అవుతుందని భక్తులు ఆకాంక్షిస్తున్నారు.

– ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే

బెజవాడకు.. తొలి పండగ

- 1989లో పుస్తక ప్రదర్శనకు బీజం
- కోల్‌కతా స్ఫూర్తి.. దశాబ్దాల ప్రయాణం

ఈనాడు, అమరావతి

విజయవాడ.. ప్రచురణ సంస్థలకు పెట్టింది పేరు. ఇక్కడే ఓ పుస్తక ప్రదర్శన పెడితే ఎలా ఉంటుందనే ఆలోచన 35 ఏళ్ల కిందట వచ్చింది. నేషనల్ బుక్ ట్రస్ట్ సహకారంతో 1989 అక్టోబరులో మొదటి విజయవాడ పుస్తక మహోత్సవాన్ని నిర్వహించారు. టీవీల హవా ఆరంభమై వీధి చివర ఉండే అద్దె గ్రంథాలయాలు మూత పడుతున్న రోజులవి. వారపత్రికలు, నవలల కొనుగోళ్లు క్షీణిస్తూ, సాహిత్య పుస్తకాలు ఆదరణ కోల్పోయే పరిస్థితి ఎదురైంది. పుస్తక దుకాణాలు స్టేషనరీ విక్రయశాలలుగా మారిపోతున్నాయి. ఆ సమయంలో తొలి విజయవాడ పుస్తక మహోత్సవం ఘన విజయం సాధించింది. అప్పుడు ఆరంభమైన జైత్ర యాత్ర ఇప్పటికీ దిగ్విజయంగా కొనసాగుతోంది. ఏటా జనవరిలో సంక్రాంతికి ముందే విజయవాడను పలకరించే తొలి పండగగా మారిపోయింది.

రికార్డు స్థాయిలో స్టాళ్లు.. 1989లో 84 స్టాళ్లతో ప్రారంభించారు. 2015లో 26వ పుస్తక మహోత్సవంలో అత్యధికంగా 389 స్టాళ్లతో రికార్డు సృష్టించారు. ఈసారి 300 స్టాళ్లు ఏర్పాటు కానున్నాయి. 11రోజుల ప్రదర్శనకు వివిధ జిల్లాల నుంచి 10లక్షల మంది తరలివస్తారు.

పుస్తకప్రియుల పాదయాత్ర: దేశంలోని అనేక పుస్తక మహోత్సవాలకు స్ఫూర్తి కోల్‌కతా పుస్తక ప్రదర్శన. వీబీఎఫ్ తరఫున అక్కడికి వెళ్లి నిర్వాహకుల సూచనలు తీసుకున్నారు. విజయవాడలోనూ 'పుస్తక ప్రియుల పాదయాత్ర' ఆరంభించారు. పుస్తకంపై ఆసక్తి పెంచేలా వచ్చే జనవరి 5న ప్రదర్శన నిర్వహిస్తారు.



జనాభా 5 లక్షలు..సందర్శకులు లక్ష..

తొలి విజయం ఇచ్చిన ఉత్సాహంతో ఇక్కడి ప్రచురణకర్తలు, సాహితీవేత్తలు, కవులు, రచయితలు కలిసి విజయవాడ పుస్తక మహోత్సవ సంఘం(వీబీఎఫ్ఎస్)గా ఏర్పడ్డారు. నగర జనాభా అప్పట్లో 5లక్షలు. అయినా పుస్తక మహోత్సవానికి వచ్చిన సందర్శకుల సంఖ్య లక్ష దాటేది. అంతలా పుస్తకంతో ఈ ప్రాంత ప్రజలకు అనుబంధం పెనవేసుకుంది.

మిద్దె తోట.. మెరిసెనింట



నగరం కాంక్రీట్ జంగిల్‌గా మారుతున్న తరుణంలో పెరుగుతున్న కాలుష్యాన్ని తగ్గించడానికి కొంతమంది మిద్దె పంటల సాగుపై ఆసక్తి చూపుతున్నారు. సేంద్రియ, ప్రకృతి పద్ధతుల్లో తక్కువ ఖర్చుతో ఆకుకూరలు, కూరగాయలు, వివిధ రకాల పళ్లు, పండ్ల మొక్కలు పండిస్తున్నారు.

2020లో గ్రూప్‌గా ఏర్పడి.. వన్ ఎర్త్-వన్ లైఫ్ టెర్రస్ గార్డెన్ గ్రూప్ 2020లో ఏర్పాటయ్యింది. రాష్ట్రంలో 3వేలకు పైగా సభ్యులు ఉండగా.. నగరంలో 600 మంది ఉన్నారు. దీని ద్వారా సేంద్రియ పద్ధతుల్లో మిద్దెపై పంటలు పండించేందుకు తగిన సలహాలు, సూచనలు అందించడంతో పాటు సభ్యులకు తక్కువ ఖర్చుతో విత్తనాలు అందజేస్తున్నారు. ఈ గ్రూప్‌లో వ్యవస్థాపకులు ఏలూరి లీలాకుమారి, పెనుమత్స శ్యామ్‌ప్రసాద్, వెలగా విజయ, అరికపూడి సురేశ్‌కుమార్ ఉన్నారు. సభ్యులు తాము సేకరించిన మొక్కలను పరస్పరం మార్పిడి చేసుకుంటున్నారు. సొంత గ్రూపులతో పాటు మిద్దెపై వీటిని పెంచేలా కాలనీ వాసులను ప్రోత్సహిస్తున్నారు. వంట గది వ్యర్థాలతో ఎరువు తయారు చేస్తున్నారు.

ఆరోగ్య ప్రయోజనం

రోజ్ సొసైటీ ప్రదర్శనలో కర్పూరం, పొలగంధ, అశ్వగంధ, వస, అల్లంపూల, పిప్పళ్లు, పాల సుగంధి వంటి ఆరోగ్యకరమైన ప్రయోజనాలు చేకూర్చే లెమన్ గ్రాస్, అల్లంపూల, పాండవ తులసి వంటి అరుదైన మొక్కలు వీరు ఏర్పాటు చేశారు.

– విజయవాడ సిటీ, న్యూస్‌టుడే

పట్టుజారితే ప్రమాదమే..



ప్రజలందరికీ ప్రకటనలు చేరువకావాలని ప్రధాన కూడళ్లలో, రహదారుల పక్కన భారీ స్తంభంపై ఫ్లెక్సీల కోసం స్టాండ్లు ఏర్పాటు చేశారు. వీటిపైకి ఎటువంటి రక్షణ చర్యలు తీసుకోకుండా ఎక్కేస్తున్నారు. ప్రకటనల ఫ్లెక్సీలు కట్టేటప్పుడు ఏమాత్రం అదుపుతప్పినా ప్రాణాల మీదకే వస్తుంది. విజయవాడ పోలీస్ కంట్రోల్ రూమ్ పాయింట్ కూడలిలో కనిపించిన దృశ్యమిది. -ఈనాడు, అమరావతి

వెదురు.. భళా గురూ..

వనరులు, అవకాశాలు ఉన్నా మనకెందుకులే, మన వల్లకాదులే అని చాలా మంది అనుకుంటారు. మనం కాకపోతే ఇంకెవరు అని కొందరు మాత్రమే ఆలోచిస్తారు. ఆ కోవలోకి వస్తారు ఎన్టీఆర్ జిల్లా చందర్లపాడు మండలం వెలదికొత్తపాలెం గ్రామానికి చెందిన **కంచేటి ఉపేంద్ర బాబు.** ఆయన చదివింది ఎంటెక్. హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తూనే ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయంగా వెదురు ఉత్పత్తులతో ఉపయోగాలను ప్రజలకు తెలియజేయాలని సంకల్పించారు. చైనాలో వెదురు సాగు చేస్తూ లాభాలు పొందుతున్నారు. అదే స్ఫూర్తితో ఇక్కడా సాగు చేయించాలని రైతుల వెన్నుతడుతున్నారు. సెలవు రోజుల్లో తెలుగు రాష్ట్రాల్లోని వివిధ ప్రాంతాల్లో నిర్వహించే పలు సదస్సుల్లో పాల్గొని అక్కడ వెదురు వస్తువులను ప్రదర్శిస్తున్నారు. వెదురులో ఏయే రకాలు ఉన్నాయి, ఎన్నేళ్లకు కోతకు వస్తాయి. వాటివల్ల లాభం ఎంత తదితర అంశాలను వివరిస్తున్నారు. కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు జిల్లాల్లోని మెట్ట ప్రాంతాల్లో సుబాబుల్ సాగు చేస్తారు. సుబాబుల్ పేపర్‌కు మాత్రమే వినియోగిస్తారు. అదే వెదురు పేపరుతో పాటు అనేక ఉత్పత్తులకు వినియోగిస్తారు. తద్వారా రైతులు అధిక ఆదాయం పొందడానికి అవకాశం ఉంది. ఒకసారి నాటితే పంట వస్తూనే ఉంటుంది.



అనేక ఉత్పత్తులు..అలంకరణ వస్తువులు

వెదురు అంటే దడులు, గుడిసెల నిర్మాణానికే అనుకుంటారు. ప్రస్తుతం దానితో ప్లేట్లు, గ్లాసులు, గిన్నెలు, చెంచాలు, సాంబ్రాణి పుల్లలు, టూత్‌పిన్‌లు, టూత్‌బ్రష్‌లు, వివిధ అలంకరణ పరికరాలు ఉత్పత్తి చేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం ఒకో మొక్కకు రూ.150 వరకు రాయితీ ఇస్తోంది. ఉపేంద్రబాబు తన స్నేహితులు 8 మంది, కుటుంబీకులు, బంధువులతో కలిసి 100 ఎకరాల్లో సాగు ప్రారంభించారు. భవిష్యత్తులో వెదురు ఉత్పత్తుల పరిశ్రమ ఏర్పాటు చేసి రైతుల నుంచి కొనుగోలు చేస్తానని ఆయన చెబుతున్నారు.

– న్యూస్‌టుడే, గూడూరు



వెదురుతో చేసిన ప్లేట్లు, గ్లాసు



అలంకరణగా...

కుంచె కదిలితే అపురూపం.. భావితరానికి సందేశం

న్యూస్‌టుడే, మచిలీపట్నం కార్పొరేషన్



దృశ్యం పదికాలాల పాటు మదిలో నిలిచిపోయేలా చిత్రించడం చిత్రకారుల కళానైపుణ్యానికి అద్దం పడుతుంది. అలాంటి కళాకారుడే మచిలీపట్నానికి చెందిన **బత్తుల సాయి వెంకట రమేశ్.** చిత్రలేఖనం ఉపాధ్యాయునిగా పనిచేసి పదవీ విరమణ చేసిన తరవాత కూడా ఎంతో మంది విద్యార్థులకు ఉచితంగా శిక్షణ ఇస్తున్నారు. తెలుగు రాష్ట్రాల్లో ఉన్న చిత్రకారులతో ప్రదర్శన ఏర్పాటు చేయించి ప్రోత్సహిస్తూ అనేక పురస్కారాలు అందుకుని తనదైన గుర్తింపు పొందారు. చిత్రం అపురూపం.. రమేశ్ చేతిలో కుంచె కదిలితే ఏదో ఒక సందేశం సమాజంలోకి చొచ్చుకుపోతుంది. బడుగు జీవుల వ్యథలు, వీధి బాలల సమస్యలు లాంటి సందేశాత్మక చిత్రాలతో పాటు ప్రకృతి రమణీయత, ఆధ్యాత్మికత, చారిత్రాత్మక చిత్రాలు ఆయన కుంచె నుంచి జాలువారాయి. వాటర్ కలర్స్, ఎనామిల్ పెయింటింగ్స్, తైలవర్ణ చిత్రాలు, సూక్ష్మ ప్రకృతి, ఈము గుడ్లపై చిత్రాలు వేటికవే ప్రత్యేకం.



ఆహారం వృథాపై ప్రజలను ప్రశ్నించేలా గీసిన చిత్రం

వందల మందికి ఉచిత శిక్షణ

జిల్లాలోని వివిధ పాఠశాలల్లో విధులు నిర్వహిస్తూనే వందల మంది శిష్యులను తయారు చేసి సమాజానికి అందించారు. ఆయన డిప్లొమా చదివే నాటి నుంచే విద్యార్థులకు చిత్రలేఖనంపై ఉచిత శిక్షణ ప్రారంభించారు. జపాన్, బల్గేరియా, హాంకాంగ్ తదితర దేశాలు నిర్వహించిన పోటీల్లో ఆయన, అతడి శిష్యులు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందుకున్నారు. నేటితరం విద్యార్థులకు చిత్రకళ నేర్చుకునే తీరుపై 'చిత్రకళాదర్శిని' అనే పుస్తకాన్ని రూపొందించారు.

ప్రముఖుల సత్కారాలు.. 2016లో ఎస్సీఈఆర్టీ 7వ తరగతి తెలుగు, హిందీ పుస్తకాల్లో వివిధ అంశాలకు చిత్రరచన చేశారు. ఆ పుస్తకాల్లో ఇప్పటికీ ఆయనపేరుంది. 2024 లో ఆగస్టులో పదవీ విరమణ చేసిన ఆయన మచిలీపట్నం ఆర్ట్ అకాడమీ ద్వారా వివిధ ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. సీఎం చంద్రబాబు, దివంగత సీఎం రోశయ్యల చేతులమీదుగా సన్మానం అందుకున్నారు.

రెడ్డిరాజుల కారాగారం.. ప్రత్యేకతల సమాహారం

కారాగారాల నుంచి ఖైదీలు పరారయ్యారనే వార్తలు అప్పుడప్పుడూ వింటూనే ఉంటాం. కానీ అక్కడ అలా కాదు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఎవరూ తప్పించుకునే పరిస్థితి ఉండదు. ఆ చిమ్మ చీకట్లో ఎటూ వెళ్లలేరు. ఇవన్నీ శతాబ్దాల నాటి రెడ్డిరాజుల కోటలోని కారాగారంలో పరిస్థితులు. కొండపల్లి... ఆ పేరు వినగానే ఎనిమిది శతాబ్దాల చరిత్ర ప్రతి ఒక్కరి మదిలో మెదులుతుంది. కొండపై ఉన్న కోట.. దాని నిర్మాణ విశిష్టత ఎంత చెప్పినా తక్కువే. సముద్ర మట్టానికి 1200 అడుగుల ఎత్తులో నిర్మాణమైన కోటను, అందులోని కారాగారాన్ని ఎంతో పటిష్ఠంగా ఆనాడే నిర్మించారు. దాన్ని బ్రిటీషర్లు సైతం కూల్చలేక వివిధ అవసరాలకు వారి పాలనలో వినియోగించుకున్నట్లు చరిత్ర చెబుతోంది. అప్పటి రాజులు ఖైదీలను ఉంచడానికి కోట ప్రాంగణంలోనే చివరి భాగంలో కారాగారాలు ఏర్పాటు చేశారు. వారు తప్పించుకునే వీల్లేకుండా కొండరాళ్లను చెక్కించి 4అడుగుల మందంతో గోడలను, 20 అడుగుల ఎత్తులో నిర్మించారు. ఖైదీలు కనిపించడానికి సూర్యకాంతి ప్రసరించేలా చిన్నపాటి రంధ్రాలను పైభాగంలో ఉంచారు. కొండపై బురుజు నుంచి సైనికులు పర్యవేక్షించేవారు. వీటి విశిష్టత తెలిస్తే పర్యాటకులు ఆసక్తిగా తిలకిస్తారు. - కొండపల్లి, న్యూస్‌టుడే



కొండపల్లి కోటపై కారాగారం



సూర్యకాంతి పడేలా ఏర్పాట్లు ఇలా..

పంపర పనస.. పసందు తెలుసా..





ఈ చిత్రంలో పండును చూస్తే 1980 దశకం వారు ఇట్టే కనిపెట్టేస్తారు. ప్రస్తుత తరం పిల్లలకు దీని పేరు కూడా తెలియదు. దీనిని పంపరపనస అంటారు. చలికాలంలో మాత్రమే దొరికే ఈ పండ్లు నగరవాసులకు అరుదుగా కనిపిస్తాయి. సిట్రస్ జాతికి చెందిన పంపర పనస పులుపు, ఉప్పు, తీపి కలగలిపిన రుచితో తొనల మాదిరిగా ఉంటుంది. విటమిన్ సి, ఫైబర్ అధికంగా లభించే ఈ పండును చలికాలంలో ఆరోగ్యానికి మంచిదని తింటారు. నగరంలో కొన్నిచోట్ల ఈ పంపరపనస పండ్లను సమీప గ్రామాల నుంచి తెచ్చి విజయవాడ సత్యనారాయణపురంలో విక్రయిస్తున్నారు. -ఈనాడు, అమరావతి

గుడివాడలోనే తొలి ఆర్డీవో కార్యాలయం



కృష్ణా జిల్లాలో తొలిగా నిర్మించిన ఆర్డీవో కార్యాలయం గుడివాడదే. దీన్ని 1908లో ఏర్పాటు చేశారు. ఆ తర్వాత 1912లో మచిలీపట్నంలో ఆర్డీవో కార్యాలయం ఏర్పాటైంది. ఆంగ్లేయుల కాలం నుంచి జిల్లాను పలు రెవెన్యూ డివిజన్లుగా విభజించి పాలన సాగించారు. వాటిలో మొదటగా గుడివాడ నుంచి రెవెన్యూ పాలన సాగింది. 1908లో మహ్మద్ యాకూబ్ సాహెబ్ బహదూర్ ప్రథమ గుడివాడ ఆర్డీవోగా పనిచేశారు. స్వాతంత్ర్య సంగ్రామ సమయంలో కె.సూర్యారావు ఆర్డీవోగా పని చేయగా స్వాతంత్ర్యానంతరం చాలా మంది డిప్యూటీ కలెక్టర్లు ఆర్డీవోలుగా వచ్చారు. నేటి వరకూ 78 మంది పనిచేశారు. గతంలో గుడివాడ కార్యాలయం పరిధిలో గుడివాడ, పామర్రు, ముదినేపల్లి, కైకలూరు నియోజకవర్గాలు ఉండేవి. నేడు గుడివాడ, పామర్రు, గన్నవరం నియోజకవర్గాలు ఉన్నాయి. నాడు బ్రిటీషు వారు బంగాళా పెంకుతో నిర్మాణం చేసిన భవనంలోనే నేటికీ కార్యాలయం కొనసాగుతోంది. ఇది చాలా చల్లగా ఉంటుంది. చిన్న చిన్న మరమ్మతులు చేసి సీలింగ్ వేసి నిర్వహిస్తున్నారు. ఈ భవనంపై ఉన్న బంగాళా పెంకులు పాడవడంతో వాటిపై సిమెంటుతో పల్చగా ప్లాస్టరింగ్ చేసి దానిపై తారు వేశారు. కొండ రాళ్లతో నిర్మించిన ఈ భవనం ఎత్తుగా, చాలా దృఢంగా ఉంటుంది. - గుడివాడ, న్యూస్‌టుడే

డాలర్ల పంటకు బీమాతో ధీమా!

రూ.3 లక్షల వరకు పరిహారం పొందే అవకాశం

ఈనాడు, అమరావతి

తుపాన్లు, వరదలు వంటి ప్రకృతి వైపరీత్యాలకు ఇతర పంటలతో పాటు ఆక్వా రంగం కూడా కుదేలవుతోంది. డాలర్ల పంటగా పేరొందిన రొయ్యల సాగుకు పెట్టుబడి చాలా ఎక్కువ అవుతుంది. ఒక్కసారి నష్టపోయి రోడ్డున పడిన వారు.. అప్పుల పాలై ఆస్తులు అమ్ముకున్న వారు ఎందరో ఉన్నారు. ఆక్వా రైతు కష్టం బూడిదలో పోసిన పన్నీరు కాకుండా బీమాతో ధీమా కల్పించే అవకాశం ఉంది. అవగాహన లేక ఎక్కువ మంది.. తెలిసినా అలసత్వంతో మరికొందరు.. పట్టించుకోవడం లేదు.

60 వేల మందికి అవకాశం..

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 1.5 లక్షల ఎకరాల్లో రొయ్యల సాగువుతోంది. కృత్తివెన్ను, నాగాయలంక, కోడూరు, పెడన, మచిలీపట్నం, అవనిగడ్డ తదితర మండలాల్లో ఆయా చెరువులు ఎక్కువగా ఉన్నాయి. వీటి పరిధిలో 60వేల మంది వరకు రైతులు ఉంటారు. జాతీయ బీమా రంగ సంస్థ(ఐఆర్‌డీఏ) ద్వారా ఆక్వా రైతులకు బీమా సౌకర్యం కల్పిస్తోంది. అగ్రికల్చర్ ఇన్సూరెన్స్ కంపెనీ ఆఫ్ ఇండియా (ఏఐసీ) నేతృత్వంలో ఈ పథకం అమలు చేస్తున్నారు. వెనామీ, టైగర్, స్కాంపీ రకాల రొయ్యలకు బీమా కల్పిస్తారు. ప్రస్తుతం వీటి సాగే ఎక్కువగా ఉన్న నేపథ్యంలో అందరూ ఉపయోగించుకునే వీలుంది.

ఇవి ఉండాలి..

ఆక్వా సాగు అనుమతులు, భూమి రిజిస్ట్రేషన్ పత్రాలు ఉండాలి. దాదాపు 5 ఎకరాలకు వరకు బీమా వర్తిస్తుంది. ఉమ్మడి జిల్లాలో చాలా మంది రైతులకు సాగు అనుమతులు ఉండవు. వారికి బీమా పరిహారం పొందడం వీలు కాదు. వరదల ప్రభావంతో గట్లకు గండ్లు పడటం, తుపాను వల్ల రొయ్యలు మృత్యువాత పడటం, వేసవి కాలంలో ఎండ తట్టుకోలేక నష్టం వచ్చినా, విషపూరిత క్రిమిసంహారాల ప్రభావంతో, వ్యాధుల తీవ్రతతో చనిపోవడంతో, వైరస్ కారణంగా నష్టం జరిగినా బీమా వర్తిస్తుంది.

రూ.12 వేలు చెల్లిస్తే..

ఎకరానికి రూ.12వేలు ప్రీమియం చెల్లిస్తే.. నష్టం వస్తే రూ.3లక్షల వరకు పరిహారం వస్తుంది. సాగు మొదలైన 15 నుంచి 60 రోజుల వరకు బీమా పరిహారం పొందవచ్చు. చాలా మందికి బీమాపై అవగాహన లేదు. ఉన్న వారు సైతం నష్టం జరుగుతుందో లేదో చెప్పలేము కాబట్టి రూ.12 వేలు చెల్లించడం భారంగా భావిస్తున్నారు.

ఎవరిని సంప్రదించాలంటే..

సచివాలయాల్లోని సంబంధిత ఉద్యోగులను సంప్రదిస్తే దరఖాస్తు చేయడం, ప్రీమియం చెల్లింపు, ఇతర నిబంధనలన్నీ చెబుతారు. తదనుగుణంగా దరఖాస్తు చేసుకుంటే సరిపోతుంది.

కృత్తివెన్ను సిరి.. కొబ్బరి



చినగొల్లపాలెం వెళ్లే రహదారికి ఇరువైపులా..

న్యూస్‌టుడే, మచిలీపట్నం కార్పొరేషన్

కొబ్బరి సాగు పేరు ఎత్తగానే జిల్లాలో మొదటగా గుర్తొచ్చేది కృత్తివెన్ను. జిల్లా వ్యాప్తంగా అత్యధిక శాతం సాగయ్యేది ఈ మండలంలోనే. ఏ గ్రామం చూసినా కోనసీమను తలపిస్తుంది. రహదారులు, పొలం గట్ల పక్కన కొబ్బరిచెట్లు ఆహ్లాదాన్ని పంచుతూ ఆహ్వానం పలుకుతుంటాయి. వందల మందికి ఇదే ఆదాయ వనరుగా మారిందంటే అర్థం చేసుకోవచ్చు.

1,702 ఎకరాల్లో ..

జిల్లా వ్యాప్తంగా 2,057 ఎకరాల్లో కొబ్బరి సాగు అవుతుండగా కృత్తివెన్ను మండలంలోనే 1,702 ఎకరాల్లో ఉంది. చినగొల్లపాలెంలో అత్యధికంగా కొబ్బరి సాగు మీదే ఆధారపడి జీవిస్తారు. ఇక్కడ ఏ ఇతర పంటల సాగుకు ఆస్కారం లేక ఈ పంటనే స్థానికులు ఎంచుకున్నారు. మండలంలోని నిడమర్రు, పడతడిక ప్రాంతాల్లోనూ ఎక్కువగానే సాగవుతుంది. సీతనపల్లి, లక్ష్మీపురం, ఎండపల్లి, కృత్తివెన్ను, సంగమూడి తదితర గ్రామాల్లో కూడా పొలం గట్లపై చెట్లు నాటి ఆదాయం పొందుతున్నారు. ఇక్కడి కొబ్బరికాయలు పశ్చిమ గోదావరి జిల్లా కేంద్రంగా హైదరాబాద్, పుదుచ్చేరి, ఒడిశా తదితర రాష్ట్రాలకు ఎగుమతి అవుతాయి. జిల్లాలో ఇతర ప్రాంతాలతో పాటు వివిధ రాష్ట్రాలకు చెందిన వ్యాపారులు ఇక్కడికి వచ్చి కొనుగోలు చేసి తీసుకెళ్తుంటారు. దీనిపై ప్రత్యక్షంగా పరోక్షంగా మండల వ్యాప్తంగా 10వేల మంది వరకు ఉపాధి పొందుతున్నారు. కొబ్బరి ఉత్పత్తుల పరిశ్రమలు ఏర్పాటు చేస్తే మరింత మందికి ఉపయుక్తంగా ఉంటుంది.

వయసు 79.. డిగ్రీలు 36..



జ్ఞాన సముపార్జనకు వయసు అడ్డంకి కాదని నిరూపిస్తున్నారు.. పోరంకికి చెందిన 79 ఏళ్ల **కొడాలి రామశేషాద్రిరావు.** నేర్చుకోవాలనే ఆసక్తి ఉంటే ఎప్పుడైనా చదువుకోవచ్చు.. ఎన్ని డిగ్రీలైనా సాధించవచ్చని నిరూపించారు. చిన్న వయసులోనే ఆయనకు ఎయిర్ ఫోర్సులో ఉద్యోగం వచ్చింది. ఈ కారణంగా ఉన్నత చదువులు చదవాలన్న కోరిక నెరవేరలేదు. ఎప్పటికైనా ఉన్నత విద్యావంతుడిగా గుర్తింపు తెచ్చుకోవాలన్న తపనతో ఎంతో కష్టపడి చదివి అనుకున్నది సాధించారు.

భాషపై పట్టుతో ఇంతింతై...

డిగ్రీ చదవాలని నిశ్చయించుకుని.. తొలుత బీఏ కోర్సుకు దరఖాస్తు చేశారు. ఓవైపు ఉద్యోగం చేస్తూనే మరోవైపు సాయంత్రం సమయాల్లో పుస్తకాలు చదువుతూ పరీక్షలకు సన్నద్ధమయ్యేవారు. ఈ విధంగా 24 ఏళ్లకు తొలి డిగ్రీ అందుకున్నారు. అనంతరం భాషపై పట్టు సాధించేలా రోజుకు ఆరు గంటల పాటు పుస్తకాలతో కుస్తీపట్టేవారు. ఎంఏ, ఎంఎస్సీ, బీఈడీ, ఎంఈడీ, లా, ఐటీ, హ్యూమానిటీస్, జర్నలిజం, లిటరేచర్, రీసెర్చ్ ఇలా 36 కోర్సులు పూర్తి చేశారు. ప్రస్తుతం కూడా చదువుతూ పరీక్షలకు హాజరవుతూ నేటి యువతకు ఆదర్శంగా నిలుస్తున్నారు. కేవలం చదవడమే కాకుండా ఇంజినీరింగ్, లా, బీఈడీ కళాశాలల్లో అధ్యాపకుడిగా సేవలు అందించారు. చిన్ననాటి కలను సాకారం చేసుకోవడంతో పాటు తన జ్ఞానాన్ని విద్యార్థులకు అందించేందుకు అతి తక్కువ ఫీజులతో పోరంకిలో విజ్ఞాన్ భారత్ అనే పాఠశాల ఏర్పాటు చేశారు. పిల్లల కౌన్సిలర్‌గా, విద్యావేత్తగా విద్యా సంస్థలకు సలహాలు, సూచనలు అందిస్తున్నారు. – కానూరు, తాడిగడప, న్యూస్‌టుడే

దేశ సేవలో మేటిగా..

రామశేషాద్రిరావు 1965, 1971 పాకిస్థాన్‌తో జరిగిన యుద్ధాల్లో పాల్గొన్నారు. ఆయన సేవలకు రక్ష, సంగ్రామ, పశ్చిమ యుద్ధ క్షేత్ర, హిమాలయ, నాగాలాండ్, లాంగ్ సర్వీస్ మెడల్స్ అందుకున్నారు. ఉద్యోగ విరమణ అనంతరం తిరిగి చదువుపై దృష్టి సారించారు. విద్యా రంగంలో చేసిన సేవలకు డాక్టర్ ఏపీజే అబ్దుల్‌కలాం నేషనల్ అవార్డు ఫర్ బెస్ట్ టీచర్, లైఫ్ టైం అచీవ్‌మెంట్ అవార్డులు అందుకున్నారు. 'నేటి యువత వ్యక్తిత్వం పెంచుకోవాలి. లక్ష్యాన్ని నిర్దేశించుకుని, ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తే విజయం సులువవుతుంది'అని రామశేషాద్రిరావు చెబుతున్నారు.

రహదారి ప్రమాదాల్లో రెండు పులుల మృత్యువాత

బల్లార్ష, న్యూస్‌టుడే: మహారాష్ట్రలోని చంద్రపూర్ జిల్లా సరిహద్దున యావత్మాల్ జిల్లాలో శనివారం జరిగిన రెండు వేర్వేరు రహదారి ప్రమాదాల్లో రెండు పులులు మృత్యువాతపడ్డాయి. వని-గుగ్గుస్ మార్గంలోని బెలోర ఫాటా వద్ద రహదారి పక్కనే పులి కళేబరాన్ని గుర్తించిన పలువురు అటవీ అధికారులకు సమాచారమిచ్చారు.

మళ్లీ మొదటికొచ్చిన జగన్ అక్రమాస్తుల కేసులు

- జడ్జి బదిలీతో డిశ్చార్జి పిటిషన్లపై తిరిగి విచారణ
- విచారణ చేపట్టిన 8 మంది న్యాయమూర్తుల బదిలీ
- దశాబ్దకాలంగా తేలని వైనం

ఈనాడు, హైదరాబాద్: ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ అక్రమాస్తుల కేసులపై విచారణ మళ్లీ మొదటికి వచ్చింది. నిందితులు దాఖలు చేసిన డిశ్చార్జి పిటిషన్లపై కొత్తగా బాధ్యతలు స్వీకరించనున్న డాక్టర్ కె.పట్టాభిరామారావు విచారణను ప్రారంభించనున్నారు. జగన్ అక్రమాస్తులకు సంబంధించి సీబీఐ 11, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) 9 అభియోగపత్రాలను దాఖలు చేశాయి. ఈ కేసుల్లో నిందితులుగా ఉన్న జగన్, విజయసాయిరెడ్డి, ధర్మాన ప్రసాదరావు, మోపిదేవి వెంకటరమణ, సబితా ఇంద్రారెడ్డి, గీతారెడ్డి, ఐఏఎస్ శ్రీలక్ష్మి, మాజీ ఐఏఎస్‌లు మన్మోహన్‌సింగ్, శామ్యూల్, బి.పి. ఆచార్య, జి.వెంకట్రామిరెడ్డిలతోపాటు పారిశ్రామికవేత్తలు పెన్నా ప్రతాప్‌రెడ్డి, ఇందూ శ్యాంప్రసాద్‌రెడ్డి, రాంకీ అయోధ్య రామిరెడ్డి, ఇండియా సిమెంట్స్ అధినేత ఎన్.శ్రీనివాసన్ తదితరులు సుమారు 130 డిశ్చార్జి పిటిషన్లు దాఖలు చేశారు. వీటిపై విచారణ పూర్తవడంలేదు. 2013 నుంచి దాఖలైన జగన్ అక్రమాస్తుల కేసులోని డిశ్చార్జి పిటిషన్లపై ఇప్పటివరకు 8 మంది న్యాయమూర్తులు విచారణ చేపట్టినా, అవి పూర్తికాకముందే వారు బదిలీ అయ్యారు. ప్రస్తుతం సీబీఐ కోర్టు ప్రధాన న్యాయమూర్తిగా ఉన్న డాక్టర్ టి.రఘురాం గతేడాది మేలో బాధ్యతలు స్వీకరించారు. అరబిందో-హెటిరోకు భూకేటాయింపులు, రాంకీ ఫార్మా సిటీకి గ్రీన్‌బెల్ట్ మినహాయింపులు, జగతి పబ్లికేషన్స్‌లో పెట్టుబడులు, వాన్‌పిక్‌కు ఓడరేవులు, విమానాశ్రయాల ప్రాజెక్టులు, భూకేటాయింపులు, దాల్మియా సిమెంట్స్‌కు చెందిన కేసుల్లోని నిందితులు దాఖలు చేసిన డిశ్చార్జి పిటిషన్లపై దాదాపుగా వాదనలు పూర్తయ్యాయి. దాల్మియా సిమెంట్స్‌లోని ఒకరి పిటిషన్‌పై మినహా మిగిలిన వాటిలో వాదనలు పూర్తయ్యాయి. ఐదు అభియోగ పత్రాల్లో వాదనలు పూర్తయిన తరువాతే ఉత్తర్వులు వెలువరిస్తామని అప్పట్లో సీబీఐ కోర్టు పేర్కొంది. ఆ ఉత్తర్వులు జారీ చేసేనాటికి ఐదు అభియోగ పత్రాలు దాఖలయ్యాయి. ప్రస్తుతం ఐదు కేసుల్లో వాదనలు పూర్తి కావడం, న్యాయమూర్తి పదవీ కాలం జనవరి వరకు ఉండడంతో ఉత్తర్వులు వెలువడే అవకాశం ఉందని భావించారు. అంతలోనే ప్రస్తుత బదిలీతో ఈ ఐదు కేసుల్లోనూ వాదనలు తిరిగి ప్రారంభం కానున్నాయి.

గడువు నిర్దేశించినా పూర్తికాని వైనం

దాదాపు 130 పిటిషన్లపై విచారణ పూర్తికావడానికి సుదీర్ఘ సమయం పడుతుండడం, ఈలోగా న్యాయమూర్తులు బదిలీ అవుతుండడంతో పదేపదే విచారణ మొదటికి వస్తోంది. ప్రజాప్రతినిధులకు చెందిన కేసుల విచారణలో తీవ్రమైన జాప్యం జరుగుతుండడంతో అశ్వినీ కుమార్ ఉపాధ్యాయ్ కేసులో సుప్రీంకోర్టు సత్వర విచారణకు మార్గదర్శకాలు జారీ చేసింది. వీటి ప్రకారం హైకోర్టులో ప్రత్యేక ధర్మాసనం ఏర్పాటై డిశ్చార్జి పిటిషన్ల అంశాన్ని సుమోటోగా స్వీకరించింది. రెండు నెలల్లో విచారణ పూర్తి చేయాలంటూ సీబీఐ కోర్టుకు 2023 డిసెంబరు 15న ఉత్తర్వులు జారీ చేసింది. హైకోర్టు ఇచ్చిన గడువు 2024 ఫిబ్రవరి 15తో ముగియనుండగా విచారణ పూర్తికాలేదని, సుమారు 13 వేల పేజీల పత్రాలను పరిశీలించాల్సి ఉన్నందున మరికొంత గడువు కావాలంటూ 2024 జనవరి 30న హైకోర్టుకు అప్పటి సీబీఐ కోర్టు న్యాయమూర్తి లేఖ రాశారు. ఈ లేఖపై విచారించిన హైకోర్టు డిశ్చార్జి పిటిషన్లపై తేల్చడానికి ఏప్రిల్ 30 వరకు గడువు మంజూరు చేసింది. అనంతరం సీబీఐ కోర్టు న్యాయమూర్తి గడువులోగా విచారణ పూర్తి చేసి తీర్పు రిజర్వు చేశారు. తీర్పు వెలువరించాల్సిన సమయంలో 2024 ఏప్రిల్‌లో రాష్ట్రవ్యాప్తంగా జరిగిన 47 మంది జిల్లా జడ్జీల బదిలీల్లో భాగంగా సీబీఐ కోర్టు న్యాయమూర్తి కూడా బదిలీ అయ్యారు. బదిలీ అయిన వారందరూ మే 1లోగా బాధ్యతలు స్వీకరించాలని ఆదేశాలివ్వగా, అప్పటి సీబీఐ కోర్టు న్యాయమూర్తికి మినహాయింపునిస్తూ మే 1న రిలీవ్ కావాలని హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. అనారోగ్యం కారణంగా ఆసుపత్రిలో చేరడంతో తీర్పును సిద్ధం చేయలేకపోయినట్లు ఆయన హైకోర్టుకు లేఖ రాసి రిలీవ్ అయ్యారు. అనంతరం వచ్చిన డాక్టర్ టి.రఘురాం డిశ్చార్జి పిటిషన్లపై తిరిగి విచారణ ప్రారంభించి రోజువారీ విచారణ చేపట్టారు. ఇతర కేసుల విచారణ పూర్తయిన తరువాత ఈ పిటిషన్లపై విచారణ చేపడుతూ వచ్చారు.

నేడు 'పల్స్ పోలియో'

ఈనాడు, అమరావతి: మీ ఇంట్లో ఐదేళ్లలోపు పిల్లలున్నారా..? దగ్గర్లోని పల్స్‌పోలియో కేంద్రానికి తీసుకెళ్లి పోలియో చుక్కలు వేయించండి. ఆదివారం నిర్దేశిత పల్స్‌పోలియో కేంద్రాల్లో ఏఎన్ఎం, ఆశా, అంగన్‌వాడీ, స్టాఫ్‌నర్సుల బృందం పర్యవేక్షణలో పోలియో చుక్కలు వేస్తారు. పిల్లలను అక్కడికి తీసుకెళ్లి వేయించవచ్చు. 21 నుంచి 23 వరకు బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, విమానాశ్రయాలు, ప్రధాన ఆసుపత్రులు, వాణిజ్య సముదాయాల్లో ఏర్పాటుచేసిన శిబిరాల్లో పోలియో చుక్కలు వేస్తారు.

◆ 22, 23 తేదీల్లో ఇంటింటికీ వెళ్లి ఆయా కుటుంబాల్లో అర్హులందరికీ పోలియో చుక్కలు వేస్తారు.

◆ కాకినాడలోని పట్టణ ఆరోగ్య కేంద్రం నుంచి వైద్యారోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తారు.

వైద్యులు నిత్య విద్యార్థుల్లా ఉండాలి

- 'నిరంతర వైద్య విద్య' అత్యవసర శక్తి
- ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి

రాజమహేంద్రవరం వైద్యం, న్యూస్‌టుడే: నిరంతర వైద్య విద్య (కంటిన్యుయస్ మెడికల్ ఎడ్యుకేషన్- సీఎంఈ) అనేది బాధ్యత కాదని.. ఓ అత్యవసర శక్తి అని ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి పేర్కొన్నారు. వైద్యులూ నిత్యవిద్యార్థుల్లా ఉండి కొత్త అంశాలు నేర్చుకుంటేనే మెరుగైన వైద్యసేవలు అందించగలరన్నారు. ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో శనివారం వైద్యులతో నిరంతర వైద్య విద్యపై సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన భువనేశ్వరి మాట్లాడుతూ ప్రస్తుత ఆధునిక వైద్యంలో పలు అంశాలు వేగంగా మారుతున్నాయన్నారు. ఈ రోజు ఇచ్చిన ఔషధం రేపు రీకాల్ చేసే పరిస్థితి ఉందన్నారు. సీఎంఈ లేకుంటే వైద్యుల్లో నైపుణ్యం క్షీణించే ప్రమాదముందని, కచ్చితత్వంతో వైద్యసేవలందించాలంటే సీఎంఈ వైద్యులకు కీలకమని వివరించారు. ఇందులో వైద్యులు జ్ఞానాన్ని పునరుద్ధరించుకోవాలని, నైపుణ్యాలను మెరుగుపర్చుకోవాలని సూచించారు. గుజరాత్‌లోని ప్రథమ బ్లడ్ సెంటర్ మెడికల్ డైరెక్టర్ డాక్టర్ రిపల్‌షా, వడోదర వైద్య కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ ఫర్జానా కొఠారి పలు అంశాలపై పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. కార్యక్రమ స్పాన్సర్లు తిరుమల విద్యా సంస్థల ఛైర్మన్ నున్న తిరుమలరావు, గోరంట్ల శాంతారావు ఫౌండేషన్ అధ్యక్షుడు డాక్టర్ గోరంట్ల రవిరామ్ కిరణ్‌లను భువనేశ్వరి, ఎన్టీఆర్ ట్రస్టు సీఈవో రాజేంద్రకుమార్, సీవోవో గోపి సత్కరించారు.



జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న నారా భువనేశ్వరి. చిత్రంలో ట్రస్ట్ సీఈవో రాజేంద్రకుమార్, సీవోవో గోపి

9 నెలలు పచ్చగా.. 3 నెలలు తెల్లగా!



తెల్లగా కనిపిస్తున్న ఈ మొక్క పేరు స్నో ఫ్లేక్ బుష్ (శాస్త్రీయ నామం: యూఫోర్బియా ల్యూకోసెఫాలా). ఏడాదిలో 9 నెలలు పచ్చగా ఉంటుంది. నవంబరు నుంచి జనవరి వరకు మాత్రం ఇలా శ్వేతవర్ణంలో ముచ్చట గొల్పుతుందని వృక్షశాస్త్ర విశ్రాంత అధ్యాపకుడు అనిల్ కుమార్ తెలిపారు. ఇవి మెక్సికో, సెంట్రల్ అమెరికాలో ఎక్కువగా కనిపిస్తాయన్నారు. కడియం నర్సరీ నుంచి తెప్పించిన ఈ మొక్కను సాలూరు మండలం కందులపదం లోని ఓ ఇంటి ఆవరణలో పెంచుతున్నారు.

– న్యూస్‌టుడే, సాలూరు గ్రామీణం

అమరావతి రైల్వేలైన్‌కు 77 ఎకరాల భూసేకరణ

ఈనాడు, దిల్లీ: అమరావతి మీదుగా ఎర్రుపాలెం-నంబూరు మధ్య నిర్మించనున్న 56.53 కి.మీ. బ్రాడ్‌గేజ్ లైన్ నిర్మాణం కోసం ఇబ్రహీంపట్నం మండలంలో 77.154 ఎకరాల భూమి సేకరించాలని రైల్వేశాఖ నిర్ణయించింది. ఇందుకు సంబంధించిన నోటిఫికేషన్‌ను శనివారం జారీ చేసింది. ఇందులో చిలుకూరు గ్రామ పరిధిలో 59 సర్వే నంబర్లలో 26.02 ఎకరాలు, దాములూరు గ్రామపరిధిలో 22 సర్వే నంబర్లలో 51.134 ఎకరాల వ్యవసాయ భూమి సేకరించనున్నట్లు పేర్కొంది. దీనిపై అభ్యంతరాలున్నవారు విజయవాడ ఆర్‌డీఓకు లిఖితపూర్వకంగా తమ వాదనలను చెప్పవచ్చని సూచించింది. వాటిపై వాద, ప్రతివాదనలు విన్న తర్వాత భూసేకరణ అధికారి తుది నిర్ణయం వెలువరిస్తారని రైల్వేశాఖ తెలిపింది.

బీమా డబ్బుల కోసం.. పాము కాటుతో తండ్రిని చంపేశారు


హత్యకు గురైన గణేశన్ — నిందితులు మోహన్‌రాజ్, హరిహరన్

చెన్నై (పళ్లిపట్టు), న్యూస్‌టుడే: జీవిత బీమా డబ్బుల కోసం కన్న తండ్రిని పాముతో కాటేయించి హత్య చేశారు ఆయన కుమారులు. మొదటి సారి విఫలమైతే రెండోసారి విషపూరిత పాముతో కాటేయించి, చనిపోయే వరకూ వదల్లేదు. ఈ అమానవీయ ఘటన తమిళనాడులోని తిరువళ్లూరు జిల్లా పొదటూరుపేటలో చోటుచేసుకుంది. పట్టణానికి చెందిన గణేశన్(56) అక్టోబరు 22న పాముకాటుతో మృతి చెందాడని ఆయన కుమారులు మోహన్‌రాజ్, హరిహరన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ తర్వాత గణేశన్ పేరిట ఉన్న రూ.3 కోట్ల బీమా పొందేందుకు దరఖాస్తు చేసుకున్నారు. బీమా క్లెయిమ్ చేస్తున్న సమయంలో గణేశన్‌పై అధిక విలువైన అనేక పాలసీలు ఉండటం, కుమారుల ప్రవర్తనపై అనుమానం రావడంతో బీమా సంస్థ ప్రతినిధులు పోలీసులను ఆశ్రయించారు. దర్యాప్తు చేపట్టిన పోలీసులు.. పథకం ప్రకారమే ఈ హత్య చేసినట్లు తేల్చారు. గణేశన్ నిద్రిస్తున్నప్పుడు విషపూరిత పామును ఆయనపై వదిలారు. అది కాటు వేశాక బాధితుడిని ఆసుపత్రికి తీసుకెళ్లకుండా కావాలనే జాప్యం చేశారు. వారం కిందటే ఇలాంటి ప్రయత్నం చేసినా.. అప్పట్లో వదిలిన పాము విషపూరితం కాకపోవడంతో పథకం పారలేదు. దీంతో 22న మళ్లీ విషపూరిత పామును తెప్పించి గణేశన్ పడుకున్న సమయంలో కాటేయించారు. ఈ కేసులో ఇద్దరు కుమారులు, వారికి సహకరించిన మనవూరు గ్రామానికి చెందిన బాలాజీ(28), ప్రశాంత్(35), నవీన్ కుమార్(28), రాణిపేట జిల్లా మోసూరుకు చెందిన దినకరన్(28)ను శుక్రవారం రాత్రి పోలీసుల అరెస్టు చేశారు.

అప్పట్లో కోడికత్తి డ్రామా.. ఇప్పుడు సంతకాల డ్రామా

జగన్‌పై ధ్వజమెత్తిన మంత్రి సవిత

ఈనాడు, అమరావతి: పీపీపీ విధానంలో వైద్యకళాశాల నిర్మాణంపై దుష్ప్రచారం చేస్తూ పేదలకు కార్పొరేట్ వైద్యం అందకుండా వైకాపా అధినేత జగన్ కుట్రలు చేస్తున్నారని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత ధ్వజమెత్తారు. గతంలో కోడి కత్తి, గులకరాయి డ్రామాలు ఆడినట్లే.. ఇప్పుడు 'కోటి సంతకాల' పేరుతో కొత్త నాటకానికి తెరలేపారని దుయ్యబట్టారు. మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో శనివారం సవిత విలేకరులతో మాట్లాడారు. "పీపీపీ విధానానికి మద్దతుగా పార్లమెంటరీ స్థాయీ సంఘం ఇచ్చిన నివేదికపై వైకాపా ఎంపీ గురుమూర్తి సంతకం పెట్టారు. రాష్ట్రంలో మాత్రం దానికి వ్యతిరేకంగా దుష్ప్రచారం చేస్తున్నారు. రాజకీయ లబ్ధి కోసం విషం కక్కుతున్నారు" అని ఆమె మండిపడ్డారు.

కోటి సంతకాలా.. ఎవరు పెట్టారు?

వైకాపాను ప్రశ్నించిన మంత్రి సత్యకుమార్

కొత్తూరు (అనకాపల్లి), న్యూస్‌టుడే: వైద్య కళాశాలల కోసం కోటి సంతకాలు పెట్టారా? ఎవరు పెట్టారు? అని వైకాపాను మంత్రి సత్యకుమార్ ప్రశ్నించారు. అనకాపల్లిలో శనివారం జరిగిన అటల్ మోదీ సుపరిపాలన సభలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో సుమారు ఐదున్నర కోట్ల మంది ప్రజలు ఉన్నారని, వారిలో పిల్లలను తీసివేస్తే సుమారు 4 కోట్ల మంది ఓటర్లు ఉంటారన్నారు. వీరిలో కోటి సంతకాలు పెట్టారంటే ప్రతి నలుగురిలో ఒకరు సంతకాలు పెట్టి ఉండాలని, మరి మీలో ఎవరైనా సంతకాలు పెట్టారా? అని సభలో పాల్గొన్న వారిని మంత్రి ప్రశ్నించారు. "కనీసం మీకు తెలిసిన వారు ఎవరైనా పెట్టారా? మీ ప్రాంతంలో ఇంత వరకూ సంతకం పెట్టిన వారు ఎవరైనా మీకు తెలుసా?" అని అడిగారు. దీంతో సభలో పాల్గొన్న వారంతా 'లేదు.. లేదు..' అని నినాదాలు చేశారు. దీనిని బట్టి మీకు అర్థం అయ్యింది కదా! సంతకాలు ఎలా వచ్చాయో? అంటూ వైకాపాపై మంత్రి ఘాటుగా విమర్శలు గుప్పించారు.

కార్లతో మభ్యపెట్టి.. అక్రమాలకు తెరతీసి

- పోలీసు కస్టడీలో వెంకటనాయుడు
- 22 కార్లు స్వాధీనం చేసుకున్న పోలీసులు

నరసరావుపేటసెంట్రల్, న్యూస్‌టుడే: చిలకలూరిపేట వద్ద ఇటీవల జరిగిన రోడ్డుప్రమాదంలో ఐదుగురి మృతికి కారణమైన కేసులో ఏఎస్సై కుమారుడు వెంకటనాయుడితో పాటు మరో నలుగురిని పోలీసులు అరెస్టుచేసి కోర్టులో హాజరుపరిచారు. రిమాండ్‌లో ఉన్న నిందితులను ఈ నెల 22 వరకు పోలీస్ కస్టడీకి పంపేందుకు కోర్టు అనుమతి ఇచ్చింది. వీరితోపాటు మరో ఇద్దరు అంజి, భానుప్రకాష్‌లను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారిచ్చిన సమాచారం ఆధారంగా నిందితులు విక్రయించిన 22 కార్లను గ్రామీణ పోలీసులు శనివారం స్వాధీనం చేసుకొన్నారు.

అక్రమ కార్యకలాపాలు ఇలా


నిందితుడు వెంకటనాయుడు బృందంతో పాటు మరో ఇద్దరు నిందితులు అంజి, భానుప్రకాష్‌లు ఫైనాన్స్ కింద తాకట్టు పెట్టుకున్న కార్లతో పాటు అపహరించిన కార్లను పోలీసు, రాజకీయ నాయకులకు తక్కువ ధరకు ఇచ్చి మభ్యపెట్టేవారు. ఈ క్రమంలో వెంకటనాయుడి తండ్రి పోలీసుశాఖలో కొందరు ఉన్నతాధికారులకు తక్కువ ధరకు కార్లు ఇప్పించి తాను చేయాలనుకున్న పనులు చక్కబెట్టుకునేవారు. వారి అండతో వెంకటనాయుడు ఇష్టానుసారం వ్యవహరించేవాడు. పోలీసులు స్వాధీనం చేసుకున్న కార్లలో పోలీసులు, రాజకీయ నాయకులకు అమ్మినవి లేవు. అవేమయ్యాయో తెలియాల్సి ఉంది. స్వాధీనం చేసుకున్న కార్లలో విజయవాడ, హైదరాబాద్, విశాఖపట్నం, నకరికల్లు, చిలకలూరిపేట, మాచర్ల, గురజాల ప్రాంతాలకు చెందినవాటిలో.. ఈఎంఐ చెల్లించనివి ఉన్నాయి. ఒంగోలులో కొందరికి కార్లు విక్రయించారన్న సమాచారం మేరకు దర్యాప్తు బృందం ఒంగోలు వెళ్లగా అక్కడ కార్లు లభించలేదు.


పోలీసులు స్వాధీనం చేసుకున్న కార్లు

విచారణకు సహకరించని నిందితుడు

పల్నాడు జిల్లాలో ఓ ప్రజాప్రతినిధికి నాలుగు కార్లను అమ్మినట్లు తొలుత చెప్పిన వెంకటనాయుడు విచారణలో ఎవరికీ కార్లు అమ్మలేదని తెలిపారు. ఎన్ని కార్లు ఫైనాన్స్‌లో తీసుకున్నారు, ఎన్ని.. ఎవరికి విక్రయించారనే కోణంలో పోలీసులు విచారిస్తున్నారు. పోలీసులకు అతడు సహకరించట్లేదని సమాచారం.

గుడ్డు కాదు నాణెం!



బంగారంలా మెరిసిపోతూ.. కోడిగుడ్డు ఆకారంలో ఉన్న ఈ వస్తువు ఓ నాణెం. నాణేల సేకర్తల కోసమే సమోవా దేశం ఇలాంటివి రూపొందించింది. ఆసియా ఖండంలో సంచరించిన 12 రకాల డైనోసార్ల బొమ్మలతో నాణేలు వేసి విక్రయిస్తోంది. 2022 నుంచి ఇవి అందుబాటులోకి రాగా ఏలూరుకు చెందిన నాణేల సేకర్త అలీఖాన్ మహమ్మద్ వీటిని సేకరించారు. భూమిపై జీవ వైవిధ్యాన్ని చాటి చెప్పే ప్రయత్నంలో భాగంగానే వీటిని రూపొందించినట్లు తెలిసింది. రాగి నాణేలపై బంగారు పూత వేయడంతో మెరిసిపోతున్నాయి.

– ఈనాడు, ఏలూరు



వ్యాపారంలో విఫలం కావద్దంటే..

- ✦ మీరు ఎంచుకున్న వ్యాపారాన్ని తొలుత ప్రయోగాత్మక ప్రాజెక్టుగా ప్రారంభించండి.
- ✦ మీకు ఆదాయాన్నందిస్తున్న వృత్తిని కొనసాగిస్తూనే ఉండండి.
- ✦ దానితో వచ్చే ఆదాయాన్ని మీ వ్యాపారంలో పెట్టుబడిగా పెట్టండి.
- ✦ వీలైనంత వరకూ రుణం జోలికి వెళ్లకండి.
- ✦ మీ వ్యాపారంలో నగదు ప్రవాహం పెరిగినప్పుడు ఇతర వ్యాపకాలన్నీ పక్కనపెట్టి పూర్తిగా దానిపై దృష్టి పెట్టండి.


– కోడి శాంచెజ్, ఇన్వెస్టర్

వసుంధర

vasundhara@eenadu.in



క్రికెట్, హాకీ, బ్యాడ్మింటన్, చెస్... దేశంలో ఆటలంటే గుర్తొచ్చేది ఇవే! కాబట్టే, స్కూళ్లల్లో, యూనివర్సిటీ స్థాయి పోటీల్లో కనిపించే బాస్కెట్ బాల్... ఆపైన కనిపించదు. అయితే ఇదంతా గతం. ఇప్పుడు రోజులు మారుతున్నాయి. బాస్కెట్ బాల్‌కీ ఆదరణ, ప్రాచుర్యం పెరుగుతున్నాయి. అందుకు హర్‌సిమ్రన్ కౌర్ ధమీ, సంజనా రమేష్‌లే ఉదాహరణ. అయితే వీళ్లు దేశీయంగానే సత్తా చాటట్లేదు. అంతర్జాతీయ స్థాయిలోనూ తమ పేరు నిలిచేలా చేసుకుంటున్నారు. వీళ్లని మీరూ కలుసుకోండి.



అన్నయ్య మీద కోపంతో...

అన్నయ్య బాస్కెట్ బాల్ ప్లేయర్! బంతి తాకనీయడు. పోనీ ఇద్దరం ఆడదామని తీసుకెళతాడా... గ్రౌండ్ అంతా పరుగెత్తిస్తాడు కానీ, బంతిని చేతికే అందనీయడు. తనని ఎలాగైనా ఓడించాలి అన్న కసి **సంజనా రమేష్**‌ది. అలా ఈ ఆట ఆమె లక్ష్యమైంది. అసలు చెన్నై, స్థిరపడిందేమో బెంగళూరులో. స్కూల్లో ప్రాక్టీసు చేద్దామంటే అసలు టీమే లేదు. దీంతో ఒక్కతే పాడైన బంతితో గ్రౌండ్‌లో సాధన చేసేది. కాళ్లకి బొబ్బలు, మోకాళ్ల చిప్పలు పగిలి రక్తం కారుతున్నా ఆట ఆపేది కాదు. ఆ పట్టుదలే కోచ్‌ని ఆకర్షించింది. అలా 12ఏళ్ల వయసులో బాస్కెట్ బాల్ శిక్షణ మొదలుపెట్టింది సంజన. ఇంటర్ స్కూల్ కాంపిటీషన్లలో పాల్గొంటూ అండర్ -16 టీమ్‌లో చోటు సంపాదించింది. ఫిబా ఏషియన్ ఛాంపియన్‌షిప్‌లో భారత జట్టుని కెప్టెన్‌గా ముందుకు నడిపింది. ఇక్కడ ఆటతోపాటు నాయకత్వ తీరుతోనూ అందరినీ ఆకర్షించింది. సంజనకి యూరోపియన్, ఆస్ట్రేలియన్ లీగ్ వంటి అంతర్జాతీయ ఈవెంట్లలో ఆడాలని కోరిక. దానికి తగ్గట్టుగానే ఎన్‌సీఏఏ డివిజన్ 1 బాస్కెట్‌బాల్ స్కాలర్‌షిప్‌ని సాధించింది. ఎన్నో అమెరికన్ యూనివర్సిటీలు ఆమెను చేర్చుకోవడానికి ముందుకొచ్చాయి. కానీ... అప్పుడే కాలికి గాయమైంది. దీంతో కళాశాలలన్నీ వెనకడుగు వేశాయి. నార్తర్న్ ఆరిజోనా యూనివర్సిటీ మాత్రం తనపై నమ్మకం ఉంచింది. అందరూ విదేశీయులు, తనొక్కతే భారతీయురాలు. నిరూపించుకోవాలన్న కసితో తనను తాను మెరుగుపరచుకుంటూ వచ్చింది. టోర్నమెంట్లలో కీలకపాత్ర పోషించింది. గోల్డెన్ ఈగల్ స్కాలర్‌షిప్ అథ్లెట్ అవార్డును అందుకుంది. చదువును నిర్లక్ష్యం చేయను అన్న మాట ఇచ్చాకే ఇంట్లోవాళ్లు ఆటను కొనసాగించడానికి ఒప్పుకొన్నారు. అందుకే చదువును అశ్రద్ధ చేయలేదు. 'నేను మంచి ప్లానర్‌ని కాబట్టే, రెండింటినీ సమన్వయం చేసుకోగలిగా'నని సంజనకి శాస్త్రీయ సంగీతం, నృత్యం, వాద్యాల్లోనూ ప్రవేశముంది. ప్రస్తుతం భారత బాస్కెట్ బాల్ సీనియర్ జట్టులో రాణిస్తోందీమె. ఈ ఏడాది ఫిబా విమెన్ ఏషియా కప్‌లో భారత జట్టుకు కెప్టెన్‌గా చేసింది. ప్రొఫెషనల్ ప్లేయర్‌గా మారాలి, దేశంలో బాస్కెట్ బాల్ ఆడే అమ్మాయిలను ప్రోత్సహించాలన్నది ఈమె కల. స్పోర్ట్స్ మేనేజ్‌మెంట్‌పైనా ఆసక్తి ఉందట. దేశంలో బాస్కెట్ బాల్ పరంగా సంజనని ట్రయల్ బ్లేజర్‌గా చెబుతారు. బాస్కెట్ బాల్‌లో రాణించాలి, అంతర్జాతీయ స్థాయిలో ఆడాలి అని కోరుకునే భారత అమ్మాయిలకు ఈమె స్ఫూర్తే మరి!



అమ్మాయి వేనా అనేవారు!

హర్‌సిమ్రన్ కౌర్ ధమీ ఉరఫ్ 'హనీ కౌర్'... యూరప్‌లో ప్రొఫెషనల్ బాస్కెట్‌బాల్ లీగ్ ఆడిన తొలి భారతీయ మహిళ. తల్లి సుమన్‌ప్రీత్ కౌర్ అంతర్జాతీయస్థాయి వాలీబాల్ క్రీడాకారిణి, తండ్రి సుఖ్‌దేవ్ సింగ్ ధమీ జాతీయ స్థాయి బాస్కెట్‌బాల్ క్రీడాకారుడు. వీళ్లది పంజాబ్‌లోని కపుర్తలా. తండ్రితోపాటు బాస్కెట్ బాల్ మ్యాచ్‌లు చూడటానికి వెళ్లేది హనీ. 'ఒకరోజు నేనూ ఆడతా అన్నాను. కానీ, అందరూ 35-40 ఏళ్ల వాళ్లే. వాళ్ల మధ్య నేను ఎటూ పరిగెత్తలేకపోయేదాన్ని. బంతి దొరికేదే కాదు. కానీ నాన్న మాత్రం బంతిని అందుకుని బుట్టలో వెయ్యి అనేవారు' అంటూ తొలిరోజుల్ని గుర్తుచేసుకుంటుంది హనీ. ఏడేళ్లప్పట్నుంచే తండ్రి దగ్గర శిక్షణ మొదలుపెట్టింది. ఉదయం నాలుగు గంటలకే నిద్రలేచేది. బాస్కెట్‌బాల్, జిమ్ ప్రాక్టీసులతో ఒళ్లు హూనమయ్యేదట. కొన్నిసార్లు ఇదంతా తనవల్ల కాదంటూ ఇంటికి వెళ్లిపోయేది. మళ్లీ మనసు మార్చుకునేది. స్కూల్ ఏడు గంటలకే, కానీ బాగా అలసిపోవడంతో క్లాసులో మొదటి మూడు పీరియడ్లూ నిద్రపోయేదట. హనీ ఎత్తు ఆరడుగుల పైమాటే! 'ప్రారంభంలో అబ్బాయిల నుంచి హేళనల్ని ఎదుర్కొన్నా. నా ఎత్తుగురించి మాట్లాడేవారు. నువ్వు అమ్మాయివని అనుకోనేలేదనేవారు. వాళ్ల ముందు భావోద్వేగాల్ని చూపకుండా, ధైర్యంగా ఉండేదాన్ని. కానీ ఇంటికి వెళ్లాక అమ్మ దగ్గర ఏడ్చేసేదాన్ని. మెల్లగా అర్థమైంది... కేవలం కోర్టులోనే కాదు, బయటా దృఢంగా ఉండేలా తీర్చిదిద్దేందుకే నాన్న నన్నంతగా శ్రమపెట్టార'ని చెబుతుందీమె. పదిహేనేళ్లకే 2018లో నోయిడాలోని 'ఎన్‌బీఏ అకాడమీ విమెన్స్ ప్రోగ్రామ్ ఇండియా' క్యాంప్‌కి ఎంపికైంది. అక్కడ 'మోస్ట్ వాల్యుబుల్ ప్లేయర్'గా గుర్తింపు పొంది, ఆస్ట్రేలియాలోని ఎన్‌బీఏ గ్లోబల్ అకాడమీకి వెళ్లింది. 'ఆస్ట్రేలియా వెళ్లినప్పుడు ఇంగ్లిష్ పెద్దగా రాదు. మిగతా వాళ్లలో కలవడానికి ఇబ్బంది పడేదాన్ని. మొదట్లో వాళ్లను అనుకరించడానికి చూశా. కానీ తర్వాత భారతీయ మహిళగా ఉంటూనే, నేనేంటో చూపాలనుకున్నా' అని చెప్పే హనీ... తర్వాత రోజుల్లో అమెరికా వెళ్లి యూనివర్సిటీ ఆఫ్ శాండియాగో, యూనివర్సిటీ ఆఫ్ రోడ్ ఐలాండ్ జట్లకు ప్రాతినిధ్యం వహించింది. ఈ ఏడాది గ్రీస్‌కు చెందిన 'ఏస్పెరీ విస్ క్యాలీ ఫియాస్' ఫ్రాంఛైజీకి ఎంపికైంది. 'నా లక్ష్యం డబ్ల్యూఎన్‌బీఏ. అది చాలా పెద్ద ఘనత' అంటూ తన తదుపరి లక్ష్యాన్ని వివరిస్తోంది హనీ కౌర్.

(వరల్డ్ బాస్కెట్‌బాల్ డే)

అమ్మా చీర కట్టుకోవూ... చిన్నారి ఆశ.
చిన్నూకి ఈ చీర ఎంత బాగుంటుందో... అమ్మ కల.
రీతూ పెళ్లిరోజైనా చీర కట్టుకోవచ్చుగా...భర్త కోరిక.



అలాగని ఈతరం అమ్మాయిలు చీర కట్టడం లేదా అంటే, కోరి మరీ కడుతున్నారు. ట్రెండ్‌లోకి వచ్చినవన్నీ కొంటూ వార్డ్‌రోబ్‌నీ నింపేస్తున్నారు. కాకపోతే అవన్నీ ఈవెంట్లకీ, ఫొటోషూట్‌లకే పరిమితం.

అవునండీ, పెళ్లికో పార్టీకో వెళ్లాల్సి వస్తేనో లేదా పండగకో కట్టి కాసేపు మురిపిస్తారంతే. లేదంటే ఇన్‌స్టా రీల్స్ లేదా పోస్టుల కోసమే ఆ చీరకట్టు. దానికీ ఓపిక లేకుంటే ఏఐ యాప్‌ల్లో ఫొటో అప్‌లోడ్ చేసి, నచ్చిన చీరలో చూసుకుని మురిసిపోతున్నారు. మొత్తమ్మీద నేటి మిలీనియల్స్, జెన్‌జీలు చీరని సౌకర్యంకోసం కాకుండా సందర్భానుసారం కడుతున్నారు. అది కాస్తా పూర్తవగానే ఎప్పట్లా ఏ కుర్తీకో ఫ్రాక్‌కో మారడం మామూలే. అందుకోసం ట్రెండింగ్‌లో ఉన్న డ్రేపింగ్ స్టైల్స్‌నీ; ఎత్నిక్, వింటేజ్ ఫ్యాషన్లనీ; ఫ్యూజన్ డిజైన్లనీ; సస్టెయినబిలిటీనీ చక్కగా ఫాలో అయిపోతున్నారు. రెట్రో లుక్‌లోనూ మెరుస్తున్నారు. మొత్తంగా చీరని శక్తిమంతమైన ఫ్యాషన్ స్టేట్‌మెంట్‌గా మార్చేశారు. హెవీ ఎంబ్రాయిడరీలూ రాళ్లూ చమ్కీలూ జరీలూ అద్దాలూ పూసల్లాంటివి లేకుండా సుతిమెత్తగా సౌకర్యంగా ఉండే చీరల్ని కట్టే అమ్మాయిలు తక్కువే. సాదా కాటన్, లినెన్, చేనేతలు... ప్రభుత్వ అధికారులు, మంత్రులు, లాయర్లు, వైద్యులు, టీచర్లు, కమ్యూనిటీ వర్కర్లు... ఇలా కొన్ని రకాల వృత్తి, ఉద్యోగాల్లో ఉన్నవాళ్లకీ మధ్య, పెద్ద వయసువాళ్లకే పరిమితమయ్యాయి. రఫెల్ ఫ్యాషన్లూ ఆర్గంజా, టిష్యూ రకాలే నేటి తరం ఛాయిస్‌గా ఉన్నాయి.

అలాగని అందర్నీ ఒకే గాటన కట్టేయలేం. మల్ కాటన్, బెనారసీ, పటోలా, కంచి, బాంధనీ, సంబల్‌పుర్, పోచంపల్లి, గద్వాల, మంగళగిరి... వంటి చేనేతల్నీ యువత ఇష్టంగానే ధరిస్తోంది. కానీ వీళ్ల సంఖ్య తక్కువ. అయితే ఒక్కటి మాత్రం నిజం... ఈతరం అమ్మాయిలు చీరతో చేస్తోన్న ప్రయోగాలూ అసంఖ్యాకం. దాన్ని ప్రేమిస్తూనే అంతర్జాతీయ ర్యాంప్‌లమీదా కొత్తగా ప్రదర్శిస్తున్నారు. ట్రౌజర్లు, జీన్స్, ఫ్రాక్స్, మిడీస్... వంటివి ఎన్ని వచ్చినా చీర ఎవర్‌గ్రీన్ ఫ్యాషన్ అంటున్నారు.

చీర... భావోద్వేగం!

కానీ, చీర ఫ్యాషన్ కాదు... అందమైన సంప్రదాయం, మమతను పంచే అమ్మతనం, అనుబంధాల వారసత్వం, నిండైన హుందాతనం... ఇలా ఎన్నో భావాల్ని కలబోసుకున్న అద్భుత వస్త్రం. వీటన్నింటినీ నేటి తరం మిస్సవుతోందన్నదీ ఒప్పుకోవాల్సిందే. ఫలితమే అమ్మనీ అమ్మాయినీ భార్యనీ చీరలో చూడాలకునేవాళ్ల సంఖ్య పెరుగుతోంది. ఒకప్పుడు అమ్మ చీరే పాపాయికి తొలి ఉయ్యాల. పాలు తాగే వేళ చీరచెంగే ఆటబొమ్మ. ఏడిస్తే కన్నీళ్లు తుడిచే టిష్యూ. చలికాలంలో నులివెచ్చని స్వెట్టర్‌లా, ఎండల్లో చల్లని స్కార్ఫ్‌లా వానల్లో గొడుగులా తోడు నిలిచేదీ చీరే. కాబట్టే చీర... మాటల్లో చెప్పలేని భావోద్వేగం అని ఆనాటి మహిళ అంటే, దాంతో చిక్కులెన్నో అంటోందీ తరం. ఒక్కసారి చుట్టూ గమనించండి. చీరకట్టుతోనే పొలాల్లో ఇంట్లో పనిచేసే మహిళలు... కిరీటాలు అక్కర్లేని మహారాణుల్లా కనిపించరూ! కాబట్టే, పని చేస్తున్నా నాయకత్వం వహిస్తున్నా వాళ్లతోపాటు చీర ముందుకెళుతూనే ఉంటుంది. పైగా మన చీరలో ఉన్నన్ని చేనేతలూ ఫ్యాబ్రిక్‌లూ మరే దేశంలోనూ కనిపించవు. సృష్టించాలే కానీ కొత్త ఫ్యాషన్లు కోకొల్లలు. అందుకే మరి, అమ్మాయిలూ కడదామా శారీ... ఆ ఆరు గజాల అందంలో ముద్దబంతిలా మెరిసిపోదామా!

(నేడు ప్రపంచ చీర దినోత్సవం)

నిజమైన అందం... ధ్యానంతోనే.!

స్క్రీన్ మీద చందమామలా కనిపించేందుకు మన సినీతారలు ఎంతో కష్టపడుతుంటారు. బాహ్య సౌందర్యం కోసం ఎన్ని కసరత్తులు చేసినా... మానసిక సౌందర్యానికి వాళ్లు ఎంచుకున్న మార్గం 'మెడిటేషన్' అంటున్నారు. ఉదయం కాసేపు ధ్యానం చేస్తూ ఒత్తిడిని జయిస్తున్నారట. అలా చేస్తోన్న కొందరు సెలెబ్రిటీలు దాని గురించి ఏం చెబుతున్నారంటే...

సమంత: 'అనారోగ్యానికి మించిన పెద్ద సమస్య మరొకటి ఉండద'ంటారు సమంత. అందుకే ఆరోగ్యకరమైన జీవనశైలికే ఓటేస్తారు. నిద్ర, ఆహారంతోపాటు శారీరక, మానసిక ఆరోగ్యాలకి ప్రాధాన్యం ఇస్తారు. 'అందుకే డైలీ రొటీన్‌లో ధ్యానం తప్పక ఉంటుంది. దీనివల్లే నేను ఇంత ప్రశాంతంగా ఉన్నా'నంటారీమె.









(నేడు వరల్డ్ మెడిటేషన్ డే)






చూపు లేకపోయినా లక్ష్యం స్పష్టంగా ఉంటే చరిత్ర సృష్టించొచ్చని నిరూపించారు డా. ముస్కాన్ నేగి. కళ్లు కనిపించకున్నా హిమాచల్ ప్రదేశ్ యూనివర్సిటీ నుంచి సంగీతంలో పీహెచ్‌డీ పూర్తి చేసిన తొలి మహిళగా గుర్తింపు తెచ్చుకున్నారు. దీంతో భారత ఎన్నికల సంఘం(ఈసీఐ) ఆమెను యూత్ లీడర్‌గానూ ఎంపిక చేసింది.



'కళ్లతో చూసే ప్రపంచం కన్నా... సంగీత ప్రపంచం చాలా అందంగా ఉంటుంది. చిన్నప్పటి నుంచీ చూపు లేకపోయినా శబ్దాలే నాకు దారి చూపిస్తున్నాయి. అవే నన్ను ఈ స్థాయిలో నిలబెట్టాయ'ంటారు ముస్కాన్. హిమాచల్ ప్రదేశ్‌లో పుట్టి పెరిగారీమె. అమ్మ అంబికా దేవి. నాన్న జయచంద్. పుట్టుకతోనే అంధురాలు. ప్రాథమిక విద్య బ్రెయిలీ లిపిలో సాగినప్పటికీ పై చదువులకి మాత్రం చాలా కష్ట పడ్డారట. 'అసలైన కష్టం అప్పుడే మొదలైంది. బ్రెయిలీ పుస్తకాల్లో ఎక్కువ సమాచారం ఉండేది కాదు. దాంతో ల్యాప్‌టాప్, మొబైల్‌ని వినియోగించుకునేదాన్ని. చదువుతోపాటు సంగీతం కూడా నేర్చుకున్నా. మ్యూజిక్‌లో పీహెచ్‌డీ చేస్తానన్నప్పుడు అమ్మానాన్నలతోపాటు మా గురువుగారు మృత్యుంజయ్ శర్మ కూడా నన్ను ప్రోత్సహించారు. సంగీతం నేర్చుకోవడానికి టాకింగ్ సాఫ్ట్‌వేర్ వంటి ఈ-టెక్నాలజీని వినియోగించుకున్నా. అవి నాకెంతో ఉపయోగపడ్డాయ'ంటారీమె. ఈ క్రమంలో ఆమె అనుసరించిన పద్ధతులు దృష్టి లోపం ఉన్న చాలా మంది సంగీతం నేర్చుకోవడానికి ఉపయోగపడుతున్నాయి. ప్రస్తుతం సిమ్లాలోని ప్రభుత్వ బాలికల కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తూ ఎందరో విద్యార్థినుల్లో స్ఫూర్తి నింపుతున్నారు. చదువుతోపాటు సంగీతంలోనూ తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న ముస్కాన్, మన దేశంతోపాటు అమెరికాలోనూ తన స్వరంతో అభిమానుల్ని సంపాదించుకున్నారు. ఈ ప్రతిభకు ఆమె జాతీయ, రాష్ట్రస్థాయి పురస్కారాలెన్నో అందుకున్నారు. సామాజిక సేవలోనూ చురుగ్గా పాల్గొంటారామె. దాంతో 2017లో భారత ఎన్నికల సంఘం ముస్కాన్‌ను యూత్ ఐకాన్‌గా నియమించింది. అప్పటి నుంచి యువతలో ఓటు హక్కుపై అవగాహన పెంచుతున్నారు. అంతేకాదు, వికలాంగుల సాధికారత కోసం పనిచేసే ఉమంగ్ ఫౌండేషన్‌కు బ్రాండ్ అంబాసిడర్‌గానూ సేవలందిస్తున్నారు. సంకల్పం ఉంటే అవరోధాలు అడ్డు కాదని చెప్పే ముస్కాన్ ప్రయాణం మనందరికీ స్ఫూర్తిదాయకమే కదూ!

24 చుక్కలు
12 వరుసలు
12 వచ్చేవరకూ



వి. అలేఖ్య, హైదరాబాద్



పి. రత్నకుమారి, సికింద్రాబాద్



15 చుక్కలు
15 వరుసలు



21 చుక్కలు
11 వచ్చేవరకూ
మధ్యచుక్క



కానర లక్ష్మీసరోజా రెడ్డి, జంగారెడ్డిగూడెం

మీ ముగ్గులు 9154091911 నంబరుకు వాట్సాప్ చేయొచ్చు.

మా చిరునామా:
వసుంధర, ఈనాడు
ప్రధాన కార్యాలయం,
రామోజీ ఫిల్మ్‌సిటీ,
అనాజ్‌పూర్,
అబ్దుల్లాపూర్‌మెట్ మండలం,
రంగారెడ్డి జిల్లా,
తెలంగాణ - 501 512.
Email:vasundhara@eenadu.in

బంగారం - వెండి

20న ముగింపు

	బంగారం (24క్యా)	ఆర్నమెంట్ (22క్యా)	వెండి (కిలో)
హైదరాబాద్	1,36,500	1,23,400	2,09,200
విజయవాడ	1,32,310	1,26,690	2,08,500
ప్రొద్దుటూరు	1,33,000	1,22,360	2,00,000
రాజమహేంద్రవరం	1,34,180	1,23,000	2,26,000
విశాఖపట్నం	1,34,200	1,23,000	2,10,000
తమిళనాడు	-----	1,24,000	2,26,000

ఛాంపియన్


సూర్యకుమార్ యాదవ్

సంచలన నిర్ణయాలేమీ లేకుండా అంచనాలకు తగ్గట్లే ఉంటుందనుకున్న టీ20 ప్రపంచ కప్ జట్టు ఎంపిక విషయంలో భారత సెలక్టర్లు పెద్ద షాకే ఇచ్చారు. కొన్ని నెలల కిందటే కోచ్ గంభీర్, చీఫ్ సెలక్టర్ అజిత్ అగార్కర్ ఏరి కోరి వైస్ కెప్టెన్‌గా ఎంచుకున్న శుభ్‌మన్ గిల్‌పై వేటు పడింది. ఇప్పటికే టెస్టు, వన్డే జట్లను నడిపిస్తున్న శుభ్‌మన్ త్వరలో టీ20 కెప్టెన్ కూడా అవుతాడనుకుంటే.. మొత్తంగా జట్టులో చోటే కోల్పోయాడు. ముస్తాక్ అలీ ట్రోఫీలో అదరగొట్టిన ఇషాన్ కిషన్.. రెండేళ్ల తర్వాత భారత జట్టులో చోటు సంపాదించడం సెలక్షన్‌లో మరో కీలక నిర్ణయం.



గిల్‌పై వేటు

- సెలక్టర్ల సంచలన నిర్ణయం
- ఇషాన్ కిషన్‌కు చోటు

టీ20 ప్రపంచకప్, న్యూజిలాండ్ సిరీస్‌లకు భారత జట్టు

ముంబయి

టీ20 జట్టుకు వైస్ కెప్టెన్‌గా ఎంపిక చేసి వరుసగా అవకాశాలు కల్పించినా, వాటిని సద్వినియోగం చేసుకోలేకపోయిన శుభ్‌మన్ గిల్‌పై వేటు పడింది. వచ్చే నెలలో న్యూజిలాండ్‌తో టీ20 సిరీస్‌తో పాటు ఫిబ్రవరి, మార్చి నెలల్లో జరిగే టీ20 ప్రపంచకప్‌కు కలిపి ఎంపిక చేసిన టీ20 జట్టులో గిల్ చోటు దక్కించుకోలేకపోయాడు. అగార్కర్ నేతృత్వంలోని సెలక్షన్ కమిటీ 15 మంది సభ్యుల జట్టును శనివారం ప్రకటించింది. టీ20 జట్టులోకి పునరాగమనం తర్వాత నిలకడగా రాణించలేకపోతున్న గిల్‌ను తప్పించడంతో స్పిన్ ఆల్‌రౌండర్ అక్షర్ పటేల్ తిరిగి వైస్ కెప్టెన్ అయ్యాడు. సెలక్టర్లు మరి కొన్ని ఆశ్చర్యకర నిర్ణయాలు కూడా తీసుకున్నారు. రెండేళ్లకు పైగా టీమ్‌ఇండియాకు దూరంగా ఉన్న వికెట్ కీపర్ బ్యాటర్ ఇషాన్ కిషన్ జట్టులో చోటు దక్కించుకున్నాడు. అతను ముస్తాక్ అలీ ట్రోఫీలో అదరగొట్టాడు. రెండు శతకాలు సహా 517 పరుగులతో టోర్నీ టాప్‌స్కోరర్‌గా నిలిచాడు. ఫైనల్లో మెరుపు శతకంతో ఝార్ఖండ్‌ను టైటిల్ దిశగా నడిపించాడు. ఈ ప్రదర్శన ఇషాన్‌కు మళ్లీ జట్టులో చోటు తెచ్చిపెట్టింది. కొంత కాలంగా టీ20 జట్టులో చోటు దక్కించుకోలేకపోతున్న మిడిలార్డర్ బ్యాటర్ రింకు సింగ్‌కు కూడా అవకాశం ఇవ్వడం ఆశ్చర్యం కలిగించింది. రింకు దూరమయ్యాక జట్టులో ఫినిషర్ పాత్రను పోషిస్తున్న జితేశ్ శర్మ మీద వేటు పడింది. యశస్వి జైస్వాల్ టీ20 జట్టులో చోటు ఆశించాడు కానీ.. అతడికి సెలక్టర్లు మొండిచేయి చూపారు. మిగతా జట్టు ఎంపిక అంచనాలకు తగ్గట్లే ఉంది. కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ పేలవ ఫామ్‌లో ఉన్నప్పటికీ.. ప్రపంచకప్ ముంగిట సారథిని మార్చడం సరైంది కాదన్న ఉద్దేశంతో అతణ్నే కొనసాగించినట్లు కనిపిస్తోంది. జట్టులో అతను కాకుండా అభిషేక్ శర్మ, తిలక్ వర్మ, ఇషాన్, రింకు స్పెషలిస్టు బ్యాటర్లు. హార్దిక్ పాండ్య, శివమ్ దూబె, అక్షర్, వాషింగ్టన్ సుందర్ ఆల్‌రౌండర్లుగా జట్టులో ఉన్నారు. బుమ్రా, అర్ష్‌దీప్, హర్షిత్ రాణా జట్టులోని స్పెషలిస్టు పేసర్లు కాగా.. కుల్‌దీప్ యాదవ్, వరుణ్ చక్రవర్తి స్పిన్నర్లు. టీ20 ప్రపంచకప్ ఫిబ్రవరి 7న ఆరంభం కాబోతోంది. ఆలోపు అవసరాన్ని బట్టి జట్టులో మార్పులు చేసుకునే వీలుంది. ప్రపంచకప్ కంటే ముందు టీమ్‌ఇండియా.. న్యూజిలాండ్‌తో జనవరి 21 నుంచి అయిదు టీ20ల సిరీస్ ఆడుతుంది.



"గిల్ నాణ్యమైన ఆటగాడని మాకు తెలుసు. కానీ ఇప్పుడు అతను పరుగులు చేయడంలో వెనుకబడ్డాడు. గిల్ దురదృష్టవశాత్తూ గత ప్రపంచకప్‌లోనూ ఆడలేకపోయాడు. అప్పుడు భిన్నమైన కూర్పుతో వెళ్లాం. ఇప్పుడు కూడా కూర్పు కోసమే ఈ నిర్ణయం తీసుకున్నాం. టాప్ ఆర్డర్లో ఆడగల ఇద్దరు వికెట్ కీపర్ బ్యాటర్లు ఉండాలనుకున్నాం. 15 మందిని ఎంపిక చేయాలంటే కొందరిని పక్కన పెట్టక తప్పదు. ప్రస్తుతం గిల్ అలా పక్కకు వెళ్లాడు. ఇషాన్ టాప్ ఆర్డర్లో ఆడతాడు. ప్రస్తుతం మంచి ఫామ్‌లోనూ ఉన్నాడు. గతంలో భారత జట్టుకు ఆడాడు. వన్డేల్లో డబుల్ సెంచరీ కొట్టాడు. పంత్, జురెల్ అతడి కంటే ముందుండడం వల్లే ఇషాన్‌ను ఇంతకుముందు ఎంపిక చేయలేకపోయాం. అంతకుమించి ఏమీ లేదు. టాప్ ఆర్డర్లో ఆడే మరో వికెట్ కీపర్‌గా సంజుకు తోడు ఇషాన్ ఉన్నాడు. ఒకరికి గాయమైనా, ఫామ్ సమస్య తలెత్తినా ఆ స్థానాన్ని భర్తీ చేసే సరైన ప్రత్యామ్నాయం ఉండాలి''

– అజిత్ అగార్కర్

భారత జట్టు

సూర్యకుమార్ యాదవ్ (కెప్టెన్), అభిషేక్ శర్మ, తిలక్ వర్మ, హార్దిక్ పాండ్య, శివమ్ దూబె, అక్షర్ పటేల్ (వైస్ కెప్టెన్), సంజు శాంసన్ (వికెట్ కీపర్), కుల్‌దీప్ యాదవ్, జస్‌ప్రీత్ బుమ్రా, అర్ష్‌దీప్ సింగ్, హర్షిత్ రాణా, వాషింగ్టన్ సుందర్, వరుణ్ చక్రవర్తి, ఇషాన్ కిషన్ (వికెట్ కీపర్), రింకు సింగ్.

"శుభ్‌మన్ నాణ్యమైన ఆటగాడు. ఇక్కడ చర్చ ఫామ్ గురించి కాదు. కూర్పే ముఖ్యం. ప్రపంచకప్ గెలిపించగల కూర్పు కోసం ప్రయత్నించాం. మూడో స్థానాన్ని తిలక్ వర్మకు ఖరారు చేశాం. నేను నాలుగులో ఆడతా. 5, 6 స్థానాలకు హార్దిక్, దూబె సరిపోతారు. నా ఫామ్ విషయానికి వస్తే.. కెరీర్లో ప్రతి ఒక్కరికీ ఇలాంటి దశ వస్తుంది. ఎక్కడ తప్పు జరుగుతోందో గుర్తించాను. దాని మీద పని చేస్తాను. న్యూజిలాండ్ సిరీస్, ఆ తర్వాత ప్రపంచ కప్ రాబోతున్నాయి. వాటిలో బ్యాటర్ సూర్యను చూస్తారు''

– సూర్య కుమార్

ఏదో అనుకుంటే..

ఈనాడు క్రీడావిభాగం


గిల్

ఈ ఏడాది జూన్‌లో టెస్టు జట్టు కెప్టెన్ అయ్యాడు శుభ్‌మన్ గిల్. కొన్ని నెలలకే వన్డేల్లోనూ సారథ్య బాధ్యతలు వరించాయి. టీ20ల్లోనూ అతనే కెప్టెన్ కాబోతున్న సంకేతాలు కనిపించాయి. నేరుగా కెప్టెన్‌ను చేయకుండా ముందు వైస్ కెప్టెన్సీ అప్పగించారు సెలక్టర్లు. నిలకడగా రాణిస్తే.. సూర్యకుమార్ స్థానంలోకి అతణ్ని తీసుకొచ్చి మూడు ఫార్మాట్ల కెప్టెన్‌ను చేయాలన్నది కోచ్, సెలక్టర్ల ఆలోచన! కానీ వారి ప్రణాళిక ఫలించలేదు. కెప్టెన్ కావడం సంగతి అటుంచితే.. ఇప్పుడు జట్టులోనే చోటు లేకుండా పోయింది. భారత భవిష్యత్ సూపర్ స్టార్ అవుతాడనుకున్న ఆటగాడికి ఈ పరిస్థితి తీవ్ర ఇబ్బందికరమే. వైస్ కెప్టెన్‌ను చేయడానికి ముందు ఏడాది పాటు గిల్ టీ20 జట్టులోనే లేడు. కోచ్ గంభీర్‌కు ఫేవరెట్‌గా మారిన అతణ్ని ఉన్నట్లుండి టీ20ల్లోకి తీసుకొచ్చారు. సరైన కారణం లేకుండానే అక్షర్ పటేల్‌ను వైస్ కెప్టెన్‌గా తప్పించి అతడికి ఆ బాధ్యతలు ఇచ్చారు. గిల్ నిలకడగా ఆడి ఉంటే.. పేలవ ఫామ్‌లో ఉన్న సూర్యకుమార్ యాదవ్‌ను తప్పించి టీ20 ప్రపంచకప్‌కు అతణ్నే సారథిని చేసేవారేమో. అలా కాకపోయినా పొట్టి కప్పు తర్వాత అయినా అతడికి పగ్గాలు దక్కేవేమో. కానీ వైస్ కెప్టెన్‌గా జట్టులోకి వచ్చాక 15 టీ20లు ఆడిన అతను.. 24.25 సగటుతో 291 పరుగులే చేశాడు. అందులో ఒక్క అర్ధశతకం కూడా లేదు. ఇటీవల దక్షిణాఫ్రికాతో టీ20 సిరీస్‌లో మూడు మ్యాచ్‌ల్లో వరుసగా 4, 0, 28 పరుగులే చేయగలిగాడు గిల్. రద్దయిన నాలుగో టీ20 ముంగిట అతడి బొటనవేలికి గాయమైంది. అయినా చివరి టీ20లో ఆడడానికి అది అడ్డంకిగా ఏమీ మారలేదని జట్టు వర్గాల సమాచారం. అయినా గిల్‌ను ఆ మ్యాచ్‌లో ఆడించలేదు. సంజు శాంసన్‌కు అవకాశమిచ్చారు. అతను 37 పరుగులతో రాణించాడు. మరోవైపు ముస్తాక్ అలీ టోర్నీలో ఇషాన్ కిషన్ అదరగొట్టాడు. ఇషాన్ మెరుపు శతకంతో ఫైనల్లో ఝార్ఖండ్‌ను గెలిపించాడు. ఆ మ్యాచ్‌కు సెలక్టర్లు ఆర్పీ సింగ్, ప్రజ్ఞాన్ ఓజా హాజరయ్యారు. ఫామ్ పరంగా సంజు, ఇషాన్‌ల ముందు గిల్ నిలవలేని పరిస్థితి ఉండడంతో అతడిపై వేటు వేయక తప్పని పరిస్థితి తలెత్తింది. నిజానికి శుభ్‌మన్ టీ20ల్లో ఫామ్ అందుకోనప్పటికీ.. కొన్ని రోజుల ముందు వరకు అతణ్ని టీ20 ప్రపంచకప్‌నకు ఎంపిక చేయాలనే కోచ్, చీఫ్ సెలక్టర్ భావించారు. కానీ తర్వాత వేగంగా పరిస్థితులు మారిపోయాయి. ఈ వైఫల్యం కారణంగా ఇప్పుడిప్పుడే గిల్ మళ్లీ టీ20 జట్టులోకి రావడం కష్టంగా కనిపిస్తోంది. మరోవైపు కొంత కాలంగా ఫినిషర్ పాత్రలో ఉపయోగించుకుంటున్న జితేశ్ శర్మపై ఇప్పుడు హఠాత్తుగా వేటు వేయడం ఆశ్చర్యానికి గురి చేసేదే. తన గణాంకాలు గొప్పగా లేకపోవచ్చు కానీ.. 7, 8 స్థానాల్లో వస్తున్న అతడికి ఎక్కువ బంతులు ఆడే అవకాశం రాలేదు. రింకును పక్కన పెట్టి జితేశ్‌ను ఆడిస్తూ వచ్చిన జట్టు యాజమాన్యం.. ఇప్పుడు ఉన్నట్లుండి అతడిపై వేటు వేసి మళ్లీ రింకుకు అవకాశం ఇవ్వడంలో ఆంతర్యమేంటో అర్థం కావడం లేదు.

దేశవాళీలో ప్రదర్శన కొలమానం కావాలి

దిల్లీ: ఐపీఎల్ మాత్రమే కాకుండా దేశవాళీ క్రికెట్లో ప్రదర్శన భారత జట్టు ఎంపికకు ప్రామాణికం కావాలని బ్యాటింగ్ దిగ్గజం సునీల్ గావస్కర్ అన్నాడు. ముస్తాక్ అలీ ట్రోఫీలో అదిరే ప్రదర్శనతో వికెట్‌కీపర్ బ్యాటర్ ఇషాన్ కిషన్.. టీ20 ప్రపంచకప్‌లో పోటీపడే భారత జట్టుకు ఎంపికైన నేపథ్యంలో గావస్కర్ ఈ వ్యాఖ్యలు చేశాడు. "ఇషాన్ కిషన్ గతంలో కూడా భారత జట్టుకు ఆడాడు. సత్తా చాటుకున్నాడు. అది భారత్‌కు పెద్ద సానుకూలాంశం. కేవలం ఐపీఎల్ కాకుండా దేశవాళీ క్రికెట్లో ప్రదర్శన ఎంపికకు ప్రమాణికం కావాలని సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో ఇషాన్ ప్రదర్శన రుజువు చేస్తోంది'' అని అన్నాడు. "ఇషాన్ కిషన్ ఎంపికైనందుకు సంతోషంగా ఉంది. అతడు జట్టుకు దూరమై రెండేళ్లయింది. కానీ ఘనంగా పునరాగమనం చేశాడు. తన రాష్ట్ర జట్టుకు టైటిల్‌ను అందించాడు'' అని గావస్కర్ అన్నాడు.


సునీల్ గావస్కర్

అతడిపై వేటు ఆశ్చర్యం కలిగించింది: గిల్‌ను తప్పించడం ఆశ్చర్యం కలిగించిందని గావస్కర్ చెప్పాడు. "గిల్‌ను టీ20 జట్టు నుంచి తప్పించడం ఆశ్చర్యం కలిగించింది. అతడు నాణ్యమైన బ్యాటర్. 2024 టీ20 ప్రపంచకప్ అనంతరం గొప్పగా రాణించాడు. దక్షిణాఫ్రికాపై కొన్ని ఇన్నింగ్స్‌ల్లో అతడు తడబడ్డ మాట నిజమే. కానీ క్లాస్ శాశ్వతం.. ఫామ్ తాత్కాలికం'' అని అన్నాడు. "గిల్ సుదీర్ఘ విరామం తర్వాత పునరాగమనం చేశాడు. లయలో లేడు. అలాంటపుడు టీ20 క్రికెట్లో మొదటి నుంచే చెలరేగడం కష్టం. అతడి సహజమైన ఆట టెస్టు క్రికెట్‌కు బాగా సరిపోతుంది. టీ20 షాట్లు అతడికి తేలికగా రావు. కానీ గిల్ మంచి ఆటగాడు. ఐపీఎల్‌లో అతడు ఎంత బాగా ఆడాడో చూశాం. కాబట్టి టీ20లు అతడికి కొత్త కాదు. కానీ ఫామ్‌లో లేకపోవడం అతడికి ప్రతికూలంగా పనిచేసి ఉంటుంది'' అని చెప్పాడు. వికెట్‌కీపర్ బ్యాటర్ జితేశ్ శర్మను తప్పించడంపై గావస్కర్ విచారం వ్యక్తం చేశాడు.

కుర్రాళ్లు కొట్టేస్తారా!

- పాకిస్థాన్‌తో భారత్ ఫైనల్ నేడు
- అండర్-19 ఆసియాకప్

దుబాయ్: జోరుమీదున్న భారత యువ జట్టు ఆఖరి పంచ్‌కు సిద్ధమైంది. అండర్-19 ఆసియాకప్ వన్డే టోర్నీ ఫైనల్లో ఆదివారం చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌ను ఢీకొట్టనుంది. ఆయుష్ మాత్రే నేతృత్వంలోని భారత్ ఇప్పటివరకు అదిరే ప్రదర్శన చేసింది. గ్రూపులో ఆడిన అన్ని మ్యాచ్‌ల్లోనూ గెలిచిన ఆ జట్టు.. సెమీస్‌లో శ్రీలంకను 8 వికెట్ల తేడాతో చిత్తు చేసింది. మరోవైపు పాక్ సెమీస్‌లో బంగ్లాదేశ్‌పై గెలిచింది. గ్రూప్ దశలో పాక్‌తో జరిగిన మ్యాచ్‌లో భారత జట్టు 90 పరుగుల తేడాతో ఘనవిజయం సాధించింది. ఫైనల్లోనూ అదే ప్రదర్శనను పునరావృతం చేయాలనుకుంటోంది. భారత్‌ను ఆపడం పాక్‌కు కష్టమైన పనే. భారత్ టోర్నీలో అన్ని విభాగాల్లోనూ అద్భుతంగా రాణించింది. రెండుసార్లు 400పై స్కోర్లు నమోదు చేసింది. వైభవ్ సూర్యవంశీ, అభిజ్ఞాన్ కుందు వంటి బ్యాటర్లు మరోసారి చెలరేగడానికి సిద్ధమవుతున్నారు. యూఏఈపై వైభవ్ 95 బంతుల్లో 171 చేయగా.. మలేసియాపై కుందు 125 బంతుల్లో అజేయంగా 209 పరుగులు సాధించాడు.

మెస్సికి రూ.89 కోట్లు


మెస్సి

కోల్‌కతా: భారత్‌లో మూడు రోజులు పర్యటించినందుకు ఫుట్‌బాల్ స్టార్ లియోనెల్ మెస్సి రూ.89 కోట్లు అందుకున్నాడట. ఈ విషయాన్ని ఈవెంట్ మేనేజర్ శతద్రు దత్తా వెల్లడించాడు. "మెస్సికి రూ.89 కోట్లు చెల్లించాం. ప్రభుత్వానికి రూ.11 కోట్ల పన్ను కట్టాం. మొత్తం ఖర్చు రూ.100 కోట్లు. ఇందులో 30 శాతం స్పాన్సర్ల నుంచి వచ్చింది. టికెట్ల అమ్మకాల ద్వారా మరో 30 శాతం లభించింది'' అని కోల్‌కతా స్టేడియంలో మెస్సి ఈవెంట్ గందరగోళంగా మారడంపై విచారణ జరుపుతున్న అధికారులకు దత్తా చెప్పినట్లు సమాచారం. సాల్ట్‌లేక్ స్టేడియంలో కొందరు తనను హత్తుకోవడం మెస్సికి నచ్చలేదని అతడు తెలిపాడు. మెస్సి సరిగా కనపడకపోవడం, అతడు 22 నిమిషాల్లోనే స్టేడియాన్ని వీడడంతో ఆగ్రహించిన ప్రేక్షకులు విధ్వంసానికి పాల్పడ్డ సంగతి తెలిసిందే.

హార్దిక్ సూపర్: స్టెయిన్

అహ్మదాబాద్: టీమ్‌ఇండియా ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యను సూపర్ హీరోగా అభివర్ణించాడు దక్షిణాఫ్రికా మాజీ ఫాస్ట్‌బౌలర్ డేల్ స్టెయిన్. హార్దిక్ మానసికంగా మరో స్థాయిలో ఉన్నాడని అన్నాడు. హార్దిక్ శుక్రవారం దక్షిణాఫ్రికాతో అయిదో టీ20లో మెరుపు ఇన్నింగ్స్ (63)తో టీమ్‌ఇండియా విజయంలో కీలక పాత్ర పోషించిన నేపథ్యంలో స్టెయిన్ స్పందించాడు. "హార్దిక్.. సినిమాలో సూపర్ హీరోలా కనిపించాడు. అతడి ప్రణాళికలను ఎవరూ దెబ్బతీయలేరు. హార్దిక్‌ను ఎవరూ అందుకోలేరు. అతడు నిలబడ్డ తీరులో అది తెలుస్తుంది. హార్దిక్ మానసికంగా మరోస్థాయిలో ఉన్నాడు. క్రికెట్ అంటేనే మానసిక యుద్ధాలు. అతడు మానసికంగా చాలా బలవంతుడు'' అని అన్నాడు.

ఛాంపియన్లు దిగుతున్నారు

నేడే లంకతో భారత్ తొలి టీ20

రా.7 గంటల నుంచి


హర్మన్‌ప్రీత్

ఈనాడు, విశాఖపట్నం: వన్డే ప్రపంచకప్ గెలిచిన భారత మహిళల క్రికెట్ జట్టు.. ఆ టోర్నీ తర్వాత తొలి పోరుకు సిద్ధమైంది. శ్రీలంకతో అయిదు టీ20ల సిరీస్‌లో భాగంగా హర్మన్‌ప్రీత్ బృందం ఆదివారం తొలి మ్యాచ్ ఆడనుంది. వచ్చే ఏడాది టీ20 ప్రపంచకప్ జరగనున్న నేపథ్యంలో జట్టు కూర్పుపై అవగాహనకు రావడానికి ఈ సిరీస్‌ను ఉపయోగించుకోవాలని భారత్ భావిస్తోంది. బ్యాటింగ్‌లో హర్మన్‌ప్రీత్, స్మృతి మంధాన, జెమీమా రోడ్రిగ్స్, దీప్తిశర్మ మంచి ఫామ్‌లో ఉన్నారు. జట్టులోకి కొత్తగా వచ్చిన బ్యాటర్ కమలిని, లెఫ్ట్ ఆర్మ్ స్పిన్నర్ వైష్ణవి శర్మ ఎలా ఆడతారో చూడాలి. అండర్-19 ప్రపంచకప్‌లో 17 వికెట్లు తీసిన వైష్ణవిపై మంచి అంచనాలున్నాయి. రాధ యాదవ్ గైర్హాజరీ నేపథ్యంలో వైష్ణవి కీలకం కానుంది. వన్డే ప్రపంచకప్‌లో అదరగొట్టిన తెలుగమ్మాయి శ్రీచరణి.. లంకపై ఎలాంటి ప్రదర్శన చేస్తుందనేది ఆసక్తికరం. చమరి ఆటపట్టు సారథ్యంలోని లంకను తక్కువ అంచనా వేస్తే భారత్‌కు చేదు అనుభవం తప్పదు. రెండు చేతులతో బౌలింగ్ చేయగల స్పిన్నర్ షాషిని గింహనిపై అందరి దృష్టినీ ఆకర్షిస్తోంది. కవిష, హాసిని, ఇనోక ఆ జట్టులో చూడదగ్గ ప్లేయర్లు.

"వన్డే ప్రపంచకప్ గెలిచిన తర్వాత మళ్లీ ఎప్పుడు బరిలో దిగుదామా అని జట్టు ఆసక్తిగా ఎదురు చూస్తోంది. మాపై అంచనాలు పెరిగాయి. శ్రీలంకతో టీ20 సిరీస్ భారత్‌కు ఎంతో కీలకం. జట్టులో కొత్త ప్లేయర్లు వచ్చారు. వచ్చే టీ20 ప్రపంచకప్‌ను దృష్టిలో ఉంచుకుని అలాంటి వారికి అవకాశం ఇవ్వడం ముఖ్యం. గత రెండేళ్లుగా ఈ ఫార్మాట్లో ఎలా ఆడుతున్నామో లంకపైనే అలాగే ఆడాలని కోరుకుంటున్నా. లంక సమతూకంగా ఉంది. ముఖ్యంగా వారి బ్యాటింగ్ బలంగా కనిపిస్తోంది''

– హర్మన్‌ప్రీత్ కౌర్, భారత్ కెప్టెన్

సాత్విక్ జంట ఔట్


చిరాగ్, సాత్విక్

హాంగ్‌జౌ: బీడబ్ల్యూఎఫ్ ప్రపంచ టూర్ ఫైనల్స్ టోర్నీలో సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి జంట పోరాటం ముగిసింది. శనివారం పురుషుల డబుల్స్ సెమీఫైనల్లో ఈ జోడీ 21-10, 17-21, 13-21తో లియాంగ్ వీయ్-వాంగ్ చాంగ్ (చైనా) జంట చేతిలో ఓడింది. తొలి గేమ్ గెలిచి జోరు మీద కనిపించిన సాత్విక్ ద్వయం.. తర్వాత తడబడింది. భారత జోడీ తప్పిదాలను సొమ్ము చేసుకుంటూ రెండో గేమ్‌లో సత్తా చాటిన చైనా జంట 7-3తో ఆధిక్యంలోకి వెళ్లింది. కానీ సాత్విక్-చిరాగ్ గొప్పగా పుంజుకున్నారు. తమ శైలిలో దూకుడైన ఆటతో నెమ్మదిగా అంతరాన్ని కరిగించారు. ఆపై 15-15తో స్కోరు సమం చేశారు. ఈ దశలో చైనా జోడీ విజృంభించింది. గేమ్‌ను గెలిచి మ్యాచ్‌లో నిలిచింది. మూడో గేమ్‌లో సాత్విక్ ద్వయం ప్రత్యర్థి జంట జోరు ముందు ఏమాత్రం నిలవలేకపోయింది. 2-11తో వెనుకబడిన సాత్విక్ జోడీ.. ఆ తర్వాత కోలుకోలేకపోయింది. అనవసర తప్పిదాలతో గేమ్‌తో పాటు మ్యాచ్‌ను కోల్పోయింది.

విజయానికి చేరువలో ఆసీస్

లక్ష్యం 435.. ఇంగ్లాండ్ 207/6


లైయన్

అడిలైడ్: సుదీర్ఘ విరామం తర్వాత ఆస్ట్రేలియాలో యాషెస్ సిరీస్‌ను గెలుచుకోవాలనుకున్న ఇంగ్లాండ్ ఆశ నెరవేరనట్లే! అద్భుతం ఏదైనా జరిగితే తప్ప ఆ జట్టు రెండు టెస్టులు మిగిలుండగానే సిరీస్‌ను కోల్పోనుంది. ఇప్పటికే రెండు టెస్టులు గెలిచిన ఆసీస్.. మూడో టెస్టులోనూ విజయానికి చేరువైంది. 435 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన ఇంగ్లాండ్.. నాలుగో రోజు, శనివారం ఆట చివరికి రెండో ఇన్నింగ్స్‌లో 207/6తో నిలిచింది. జేమీ స్మిత్ (2 బ్యాటింగ్), విల్ జాక్స్ (11 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు. ఇంగ్లాండ్ ఇంకా 228 పరుగులు చేయాల్సి ఉంది. భారీ ఛేదనలో కమిన్స్ (3/24) ధాటికి ఇంగ్లిష్ జట్టు 31 పరుగులకే తొలి రెండు వికెట్లు చేజార్చుకుంది. ఈ స్థితిలో జాక్ క్రాలీ (85; 151 బంతుల్లో 8×4) నిలిచాడు. జో రూట్ (39; 63 బంతుల్లో 5×4), హ్యారీ బ్రూక్ (30; 56 బంతుల్లో 2×4)తో కలిసి పోరాడాడు. ఒక దశలో ఇంగ్లాండ్ 177/3తో మెరుగైన స్థితిలో కనిపించింది. అయితే లైయన్ (3/64) దెబ్బకు ఇంగ్లాండ్ ఇన్నింగ్స్ మరోసారి కుదుపునకు లోనైంది. 85 పరుగుల తేడాతో మూడు కీలక వికెట్లు కోల్పోయి 194/6తో మళ్లీ ఇబ్బందుల్లో పడింది. జేమీ స్మిత్, జాక్స్ మరో వికెట్ పడకుండా ఆటను ముగించారు. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 271/4తో రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన ఆస్ట్రేలియా 349 పరుగులకు ఆలౌటైంది. ఒక దశలో 311/4తో బలమైన స్థితిలో ఉన్న కంగారూ జట్టు 38 పరుగుల వ్యవధిలో 6 వికెట్లు చేజార్చుకుంది. మూడో రోజు సెంచరీ చేసిన ట్రావిస్ హెడ్ (170; 219 బంతుల్లో 16×4, 2×6).. ఓవర్‌నైట్ స్కోరుకు 28 పరుగులు జత చేసి ఔటయ్యాడు. అతడు వెనుదిరిగాక.. ఆసీస్ ఇన్నింగ్స్ ఎంతోసేపు సాగలేదు. జోష్ టంగ్ (4/70), బ్రైడన్ కార్స్ (3/80) ఆస్ట్రేలియాను కట్టడి చేశారు. తొలి ఇన్నింగ్స్‌లో ఆస్ట్రేలియా 371.. ఇంగ్లాండ్ 286 పరుగులు చేశాయి.

కవెమ్ అజేయ శతకం

వెస్టిండీస్ 381/6


కవెమ్

మౌంట్ మాంగనుయ్: న్యూజిలాండ్-వెస్టిండీస్ మూడో టెస్టులో బ్యాటర్ల జోరు కొనసాగుతోంది. 110/0తో మూడో రోజు, శనివారం తొలి ఇన్నింగ్స్‌ను కొనసాగించిన విండీస్.. ఆట చివరికి 381/6తో నిలిచింది. అజేయ శతకం సాధించిన కవెమ్ హాడ్జ్ (109 నాటౌట్; 254 బంతుల్లో 14×4) జట్టుకు ఫాలోఆన్ ముప్పు తప్పించాడు. ఉదయం ఆట ఆరంభం కాగానే జాన్ క్యాంప్‌బెల్ (45) ఓవర్‌నైట్ స్కోరుకే ఔట్ కాగా.. కింగ్ (63), టెవిన్ ఇమ్లాక్ (27), అలిక్ అథనేజ్ (45), జస్టిన్ గ్రీవ్స్ (43)లతో కలిసి కీలక భాగస్వామ్యాలు నెలకొల్పిన కవెమ్.. జట్టును మెరుగైన స్థితికి చేర్చాడు. ఒక దశలో విండీస్ 348/4తో నిలిచింది. కానీ చివర్లో 3 పరుగుల తేడాలో ఆ జట్టు గ్రీవ్స్, కెప్టెన్ చేజ్ (2)ల వికెట్లు కోల్పోయింది. కివీస్ బౌలర్లలో జాకబ్ డఫీ (2/79), అజాజ్ పటేల్ (2/94) రాణించారు. విండీస్ ఇంకా 198 పరుగులు వెనుకబడి ఉంది. తొలి ఇన్నింగ్స్‌ను న్యూజిలాండ్ 575/5 వద్ద డిక్లేర్ చేసిన సంగతి తెలిసిందే. మూడు టెస్టుల సిరీస్‌లో ఆ జట్టు 1-0 ఆధిక్యంలో ఉంది.

కైట్స్‌దే డబ్ల్యూటీఎల్ ట్రోఫీ


ట్రోఫీతో కైట్స్ జట్టు

బెంగళూరు: ప్రపంచ టెన్నిస్ లీగ్ (డబ్ల్యూటీఎల్) సీజన్-4 టైటిల్‌ను కైట్స్ జట్టు కైవసం చేసుకుంది. శనివారం జరిగిన ఫైనల్లో కైట్స్ 21-19తో ఈగల్స్‌ను ఓడించింది. తొలి సింగిల్స్‌లో మార్టా కొస్తుక్ 6-4తో శ్రీవల్లిపై గెలిచి కైట్స్‌కు శుభారంభం అందించింది. మిక్స్‌డ్ డబుల్స్‌లో శ్రీవల్లి-మోన్‌ఫిల్స్ జంట 6-3తో దక్షిణేశ్వర్ సురేశ్-మార్టా కొస్తుక్ జోడీపై గెలవడంతో ఈగల్స్ పోటీలోకి వచ్చింది. పురుషుల డబుల్స్‌లో దక్షిణేశ్వర్ సురేశ్-నిక్ కిర్గియోస్ జంట 6-3తో సుమిత్ నగాల్-మోన్‌ఫిల్స్ జోడీని ఓడించి కైట్స్‌కు విజయాన్ని అందించింది.

ప్లాస్టిక్ రహిత రాష్ట్రంగా ఏపీ

స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర సభలో సీఎం చంద్రబాబు

ఈనాడు, అనకాపల్లి: ఆంధ్రప్రదేశ్‌ను 2026 జూన్ నాటికి ప్లాస్టిక్ రహిత రాష్ట్రంగా మార్చాలని ముఖ్యమంత్రి చంద్రబాబు పిలుపునిచ్చారు. ప్రజలందరి సహకారంతోనే ఇది సాధ్యమవుతుందన్నారు. అనకాపల్లి జిల్లా కశింకోటలో శనివారం నిర్వహించిన స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో సీఎం పాల్గొన్నారు. పారిశుద్ధ్య కార్మికులతో కలిసి చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను, కంపోస్టు యార్డును పరిశీలించారు. వ్యర్థాలను ఎరువుగా తయారుచేసి పంటలకు వినియోగిస్తున్న యూనిట్ నిర్వాహకుడితో మాట్లాడారు. హరిత రాయబారులు హరికృష్ణ, రమణలను జ్ఞాపికలతో సత్కరించారు.

● 'పారిశ్రామిక, నిర్మాణరంగాల్లో వచ్చే వ్యర్థాలను యూజ్, రికవర్, రీయూజ్ చేసి సర్క్యులర్ ఎకానమీ సృష్టిస్తున్నాం. ఇక్కడ వ్యర్థాలను ఆస్తిగా మారే వనరుగా చూడాలి. ఇందుకోసం కష్టపడుతున్న స్వచ్ఛసైనికుల గౌరవం పెంచుతున్నాం. వారి ఆరోగ్యానికి భద్రత కల్పిస్తూ, అవార్డులతో ప్రోత్సహిస్తున్నాం. అప్పుడే స్వచ్ఛాంధ్ర సాకారమై స్వర్ణాంధ్ర సాధ్యమవుతుంది' అని సీఎం చంద్రబాబు ఆశాభావం వ్యక్తం చేశారు.

గత ప్రభుత్వ చెత్త నిర్వాకం

'వైకాపా ప్రభుత్వం ఎక్కడా ఏ మంచి పనీ చేయలేదు. నివాసప్రాంతాల మధ్య 86 లక్షల టన్నుల వ్యర్థాలు వదిలేసింది. కూటమి అధికారంలోకి రాగానే వాటి తొలగింపునకు శ్రీకారం చుట్టాం. వచ్చే ఏడాది జనవరి 26 నాటికి రోడ్లమీద చెత్త కనిపించకుండా చేయాలి. వారానికోసారి స్వచ్ఛరథం వీధుల్లోకి వస్తుంది. ఇంట్లోని చెత్తను రథానికి ఇస్తే డబ్బులు వస్తాయి. ఇంట్లో చెత్త తీసి రోడ్డుమీద వేస్తాం. ఇల్లూ మనదే, రోడ్డూ మనదే అని ప్రజలు భావించాలి. పట్టణాల్లో 5లక్షల ఇళ్లలో కంపోస్టు తయారుచేయాలని లక్ష్యంగా పెట్టుకుంటే 3.91 లక్షల ఇళ్లలో అమలవుతోంది. గ్రామాల్లో పది లక్షల ఇళ్లలో చేయాలని ఆదేశిస్తే 3.3 లక్షల ఇళ్లలో అమలుచేస్తున్నారు. వచ్చే ఏడాది మార్చి నాటికి లక్ష్యాలు చేరుకుంటాం' అని సీఎం చంద్రబాబు చెప్పారు.



అనకాపల్లి జిల్లా తాళ్లపాలెంలో నిర్వహించిన స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర సభకు హాజరైన జనం

కిచెన్ గార్డెన్లతో మేలు

'ప్రజల ఆలోచనలు మారాలి. ఇళ్ల వద్దే కిచెన్‌గార్డెన్లు ఏర్పాటు చేసుకోవాలి. వాటిలో పండే కూరగాయలు తింటే ఆరోగ్యంగా ఉంటారు. ఇప్పటికే పట్టణాల్లో 3.65 లక్షల కుటుంబాలు ఇలా పండిస్తున్నాయి. ఈ సంఖ్య 9 లక్షలకు చేరుకోవాలి. 2026 అక్టోబరు 2 తర్వాత సింగిల్ యూజ్ ప్లాస్టిక్ కనిపించడానికి వీల్లేదు. కొత్తగా ఈ-వ్యర్థాల సేకరణ కేంద్రాలు ఏర్పాటుచేస్తున్నాం. ఐటీసీ సంస్థ పాత పుస్తకాలిస్తే కొత్తవి ఇస్తోంది. మరుగుదొడ్డి పిట్లు నిండితే వ్యర్థాల తొలగింపునకు ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తాం' అని సీఎం చంద్రబాబు వెల్లడించారు.

ఆలోచనలు శుభ్రంగా ఉండాలి


'గ్రామాలు శుభ్రంగా ఉండటమే కాకుండా ప్రజల ఆలోచనలు బాగుండాలి. స్వచ్ఛ ఇల్లు, కార్యాలయం, రోడ్లు, ప్రాంతాలే కాకుండా స్వచ్ఛమైన మనసు, ఆలోచన ఉండాలనేది రాష్ట్రప్రభుత్వ విధానం. బయట స్వచ్ఛత పాటించి తప్పుడు ఆలోచనలతో ప్రజలను మభ్యపెడితే సరికాదు. స్వచ్ఛసాధనకు ప్రతి నెలా మూడో శనివారం ఈ కార్యక్రమం చేపడుతున్నాం' అని ఆయన పేర్కొన్నారు.



తాళ్లపాలెంలో స్వచ్ఛ రథాలను ప్రారంభిస్తున్న సీఎం చంద్రబాబు



చెత్త సేకరించే సిబ్బందితో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి



సభలో ప్రసంగిస్తున్న సీఎం చంద్రబాబు

పనితనాన్ని బేరీజు వేసుకుంటూ..

'ప్రజలు ఎక్కడికీ వెళ్లకుండా ఇంటినుంచే సేవలు పొందేలా సుపరిపాలన తెస్తున్నాం. నా పనితనాన్ని ఎప్పటికప్పుడు బేరీజు వేసుకుంటూ ముందుకెళ్తున్నాను. ఎమ్మెల్యేలు, ఎంపీలు, మిత్రపక్ష నేతల పనితనాన్ని అంచనా వేస్తున్నా. కలెక్టర్లు, ఎస్పీల పనితీరును మదింపు చేస్తున్నా. ఒకటికి రెండుసార్లు చెబుతా, వారు మారేవరకూ వదలను. మొన్నటివరకు సంక్షోభంలో ఉన్న రాష్ట్రాన్ని నంబర్1 దిశగా ముందుకు తీసుకువెళ్తున్నా. రాష్ట్రాభివృద్ధికి కొందరు రాక్షసులు అడ్డుపడుతున్నారు. ఐటీ కంపెనీలు తెస్తే కేసులు వేస్తున్నారు. కానిస్టేబుల్ ఉద్యోగాల భర్తీని అడ్డుకోవాలని చూశారు. వైద్య కళాశాలలను ప్రైవేటుపరం చేశామని గోల పెడుతున్నారు. అవి ప్రైవేటుకు ఇవ్వలేదు, యాజమాన్యాలకు అప్పగించాం. దీంతో సీట్లు, సేవలు ఉచితంగానే అందుతాయి. గతంలో 104, 108 సేవలు ఎలా నిర్వహించారు? వారంతా కావాలనే నాటకాలు ఆడుతున్నారు. విశాఖను గత ప్రభుత్వం గంజాయి హబ్‌గా మారిస్తే.. కూటమి ప్రభుత్వం ఏఐ, డేటా సెంటర్ల హబ్‌గా మార్చింది' అని ముఖ్యమంత్రి తెలిపారు. మంత్రులు అనిత, నారాయణ, కొల్లు రవీంద్ర, ఎంపీ సీఎం రమేష్, ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ పట్టాభి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రానికి పిల్లలే ఆస్తి

(మొదటి పేజీ తరువాయి)

మీకు బంగారు భవిష్యత్తునిచ్చే గ్యారంటీ నాది' అని సీఎం పేర్కొన్నారు. టీచర్లు బాగున్నారా.. బాగా చదువు చెబుతున్నారా... డిజిటల్ క్లాస్‌రూం వచ్చిందా అని అడిగి తెలుసుకున్నారు.

వ్యక్తిగత ఆరోగ్యానికి ఎంతో మేలు

సార్.. ఈ కార్యక్రమం బాగుంది. వ్యక్తిగత శుభ్రత, ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయి. గోళ్లు కత్తిరించుకుని, భోజనం చేసేముందు చేతులు శుభ్రం చేసుకుంటే అనారోగ్య సమస్యలు రావు. ఈ కార్యక్రమం వ్యక్తిగత ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది.

– ముఖ్యమంత్రితో సీనియర్ ఇంటర్ విద్యార్థిని గుణ శ్రీవల్లి



తాళ్లపాలెంలోని బాలికల గురుకుల పాఠశాల విద్యార్థుల చేతులను పరిశీలిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

గూండాలకు యోగి ట్రీట్‌మెంటే కరెక్ట్

(మొదటి పేజీ తరువాయి)

రౌడీయిజం అన్నారో కాళ్లకు కాళ్లు, కీళ్లకు కీలు తీసి కూర్చోబెడితే సరిపోతుంది. ప్రభుత్వం తలచుకుంటే వామపక్ష తీవ్రవాదం లాంటి బలమైన వ్యవస్థే కకావికలమైన పరిస్థితి. అలాంటిది ఇన్ని వేల మంది పోలీసులు, వందల మంది ఐపీఎస్‌లు, డీఎస్పీలు తలుచుకుంటే ఎంత? 48 గంటల్లో కిరాయి గ్యాంగ్‌లు నిర్వహించే వ్యక్తుల వివరాలు సేకరించి, ఒక రాజకీయ నిర్ణయం తీసుకుంటే ఇటువంటి మాటలు మళ్లీ రావు. అక్కడిదాకా తీసుకెళ్లకండి' అని హెచ్చరించారు. పిఠాపురంలాంటి చోట్ల పిల్లల మధ్య కులాల చిచ్చు పెట్టే స్థాయికి దిగజారతారా? రాజకీయాల గురించి మాట్లాడేందుకు వేరే దారులు లేవా అని మండిపడ్డారు. బెదిరించేవారు ఎవరైనా సరే.. పవన్‌కల్యాణ్ అధికారంలో ఉన్నా లేకున్నా ఒకేలా స్పందిస్తాడని స్పష్టం చేశారు.

పోయే ముందు చాలామంది తాట తీసేస్తా

సామాజిక మాధ్యమాల్లో, విదేశాల్లో కూర్చొని మాట్లాడేవారితో సహా ఇక్కడ కూర్చొని భవిష్యత్తులో మేమొస్తాం, వచ్చి ఏదో చేస్తామంటున్నారు. మీరు (వైకాపానుద్దేశించి) వచ్చినప్పుడే ఏం చేయలేకపోయారు. ఇప్పుడు మీ బెదిరింపులకు భయపడతామా? పద్ధతి మార్చుకోండి.. మీరు పాత పద్ధతిలోనే చేస్తామంటే నేనూ విసిగిపోయా. ఒక ఆశయం కోసం నా ప్రాణాలు పోయినా లెక్కచేయను. కానీ పోయే ముందు చాలామంది తాట తీస్తా. అడ్డగోలుగా ఏదైనా చేసేస్తామని అంటే రోమాలు తీసి కూర్చోబెడతాం' అని హెచ్చరించారు.

ధైర్యం లేని నాయకులెందుకు?

'రాష్ట్రం విడిపోయినప్పుడు ఒక్క ఎంపీ కూడా మాట్లాడలేదు. విభజన వద్దన్నారే తప్ప మాకొచ్చే నష్టం ఇది అని చెప్పలేదు. మాట్లాడితే కొడతారని, వ్యాపారాలు పోతాయనే భయం. అంత దరిద్రపుగొట్టు బతుకులెందుకు? ధైర్యం లేని నాయకులెందుకు? పొట్టిశ్రీరాములు 56 రోజుల ఆమరణ దీక్షతో ప్రాణత్యాగం చేసి తెచ్చిన రాష్ట్రానికి అన్యాయం జరిగితే ఒక్కరూ మాట్లాడరు. నాయకులు చేసే తప్పులకు ప్రజలను ఎలా శిక్షిస్తారు? అంతా కుల సమూహాలతో కొట్టుకుంటున్నారు. కొందరు నాయకులు అదే కోరుకుంటున్నారు' అని వ్యాఖ్యానించారు.

అలా చేస్తే వారికి, మనకు తేడా ఏంటి?

కలెక్టర్, ఎస్పీల సమావేశంలో రౌడీయిజం, బెదిరింపులపై చర్చకు వచ్చింది. ఉత్తరాంధ్రలో కొందరు బెదిరిస్తున్నారంటే ఒకటే చెప్పా.. రౌడీయిజం చేసినవాళ్లను పంపించేసి మనం వచ్చాం కదా? మనం అలా చేస్తే వాళ్లకు, మనకు తేడా ఏంటని ప్రశ్నించాం. ప్రభుత్వంలో నిర్మాణాత్మక భాగస్వామిగా ఉన్నాం. ప్రతి విషయాన్ని కచ్చితంగా తెలియజేస్తాం. వైకాపా అంటే గౌరవం ఉంది. అక్కడ బొత్స లాంటి నాయకులున్నారు.. మా పార్టీలోకి సామినేని ఉదయభాను, బాలినేని శ్రీనివాస్ వచ్చారు. అప్పుడు, ఇప్పుడూ బ్యాలెన్స్‌డ్‌గానే ఉన్నారు' అని పేర్కొన్నారు.

ప్రధాని కూడా వెనుకాడుతున్నారు

తాను ప్రసంగిస్తున్న సమయంలో కేరింతలు కొడుతున్న యువతను పవన్ కల్యాణ్ వారించారు. ఈ ఉత్సాహం వల్ల తాను హాజరయ్యే కార్యక్రమాల్లో పాల్గొనేందుకు ప్రధాని మోదీ కూడా వెనుకాడుతున్నారంటూ వ్యాఖ్యానించారు. తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్‌ను బాహుబలి అంటూ సంబోధించారు. ఉపసభాపతి రఘురామకృష్ణరాజును ఉద్దేశించి.. 'ఆయన ఒక్కోసారి మాట్లాడితే బాగుంటుంది. కొన్ని సందర్భాల్లో మాట్లాడకపోతేనే మంచిది అనిపిస్తుంది.. ఆయనే ఆరడుగుల బుల్లెట్' అని అనడంతో వేదికపై నవ్వులు విరిశాయి.

'అమరజీవి జలధార'తో ఇంటింటికీ మంచినీళ్లు

- రూ.7,910 కోట్లతో 5 జిల్లాల్లో 8 ప్రాజెక్టులు
- పొట్టి శ్రీరాములుకు తగిన గౌరవమివ్వాలనే వాటర్‌గ్రిడ్‌కు పేరు
- పెరవలిలో జరిగిన శంకుస్థాపనలో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్
- రాష్ట్రం బాగు కోసమే తనను తాను తగ్గించుకున్నానని వ్యాఖ్య

ఈనాడు– రాజమహేంద్రవరం; న్యూస్‌టుడే– పెరవలి, నిడదవోలు: రాష్ట్రంలో 'అమరజీవి జలధార' ప్రాజెక్టు ద్వారా ఐదు ఉమ్మడి జిల్లాల్లో రూ.7,910 కోట్లతో 8 ప్రాజెక్టుల ద్వారా ఇంటింటికీ స్వచ్ఛ జలాలు ఇవ్వాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించిందని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. రూ.3,050 కోట్లతో ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాలకు సురక్షిత తాగునీరందించే అమరజీవి జలధార వాటర్‌గ్రిడ్ పనులకు తూర్పుగోదావరి జిల్లా నిడదవోలు నియోజకవర్గం పెరవలిలో శనివారం ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ గోదావరి పారే నేలపై తాగునీటి కొరత ఉందంటే బాధగా ఉందని, ఆక్వా వల్ల భూగర్భ జలాలన్నీ కలుషితమయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. జలధార ప్రాజెక్టు కింద ఉమ్మడి తూర్పులో రూ.1,650 కోట్లు, ఉమ్మడి పశ్చిమ గోదావరిలో రూ.1,400 కోట్లతో ప్రాజెక్టులు నిర్మిస్తామని. ధవళేశ్వరం వద్ద నీటిని సేకరిస్తామని చెప్పారు. ఈ పనులను రెండేళ్లలో పూర్తి చేసే బాధ్యత తాను తీసుకుంటానన్నారు. తెలుగువారి ఆత్మగౌరవం కోసం ప్రాణత్యాగం చేసిన పొట్టి శ్రీరాములు స్ఫూర్తిని భావితరాలకు అందించేందుకే ఈ పథకానికి ఆ పేరు పెట్టామన్నారు. ఓసారి అమరజీవి జయంతి రోజున దండ వేద్దామంటే విగ్రహాలు లేవని, ఆర్యవైశ్య భవనాల్లో ఉంటాయని చెప్పారన్నారు. అదేంటని అడిగితే.. ఆయన వైశ్య వర్గానికి చెందినవారని చెప్పడంతో బాధ అనిపించిందని గుర్తుచేసుకున్నారు. వందల కులాల కోసం ప్రాణత్యాగం చేస్తే ఆయనను ఓ కులానికి, ఓ జిల్లాకే పరిమితం చేస్తామా అని ప్రశ్నించారు.



పెరవలిలో అమరజీవి జలధార పథకం శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్. చిత్రంలో వెట్రి సెల్వీ, పులపర్తి రామాంజనేయులు, పితాని సత్యనారాయణ, శశిభూషణ్‌కుమార్, శ్రీనివాసవర్మ, కొలుసు పార్థసారథి, కందుల దుర్గేష్, బూరుగుపల్లి శేషారావు తదితరులు



సభకు హాజరైన ప్రజలు

నేను తగ్గి రాష్ట్రాన్ని పెంచా

విభిన్న నేపథ్యాలు, భావజాలాలున్న నాయకులమంతా రాష్ట్రం కోసం ఏకమై కూటమి ప్రభుత్వం తీసుకొచ్చామని ఉపముఖ్యమంత్రి చెప్పారు. రాష్ట్రం బాగుండాలని సీట్ల విషయంలో తగ్గానని.. కానీ సీట్లు అమ్మేశానంటూ తనను దూషించారని గుర్తుచేశారు. 'తాగే నీళ్ల సాక్షిగా చెబుతున్నా. రాష్ట్రానికి, మీకు మేలు చేయాలనే తగ్గాను. అలా చేయకపోతే రూ.3,500 కోట్లతో పల్లెపండగ జరుపుకోగలిగేవాళ్లమా? 4 వేల కి.మీ. సీసీ రోడ్లు వచ్చేవా? 10 వేల ఎకరాల్లో ఉద్యాన పంటలు పండేవా? రూ.7 వేల కోట్లతో 8 వేల కి.మీ. మేర బీటీ/సీసీ రోడ్లు వేయగలమా? 25 వేల మినీ గోకులాలు, లక్ష ఎకరాల్లో పంట కుంటలు వస్తాయా? నేను తగ్గి, రాష్ట్రాన్ని పెంచా' అని పవన్ పేర్కొనడంతో సభాప్రాంగణం హర్షధ్వానాలతో మార్మోగింది.

రాష్ట్ర ఆర్థిక దుస్థితిని సీఎం సరిచేస్తున్నారు

సీఎం చంద్రబాబు తన అనుభవంతో రాష్ట్ర ఆర్థిక దుస్థితిని సరిచేస్తున్నారని.. ఆయన తక్కువ వనరులను సమర్థంగా ఎలా వినియోగించాలో తెలిసిన నాయకుడని పవన్ కల్యాణ్ కొనియాడారు. గత ప్రభుత్వంలో జలజీవన్ మిషన్ కింద రాష్ట్రంలో 24 లక్షల కుళాయిలు, పైపులు వేసినా నీళ్లివ్వకుండా నిధులు దుర్వినియోగం చేశారని కేంద్ర జలశక్తి మంత్రి పాటిల్ చెప్పారన్నారు. ఆ పథకాన్ని పునరుద్ధరించేలా కేంద్రాన్ని ఒప్పించడానికి సీఎం, తాను చాలా శ్రమపడాల్సి వచ్చిందని తెలిపారు.

కొండగట్టు ఆలయానికి రూ.35.19 కోట్లు

ఇటీవల తన ఇష్టదైవం తెలంగాణలోని కరీంనగర్ కొండగట్టు ఆంజనేయస్వామి దర్శనానికి వెళ్తే.. 2వేల మందికి సరిపడా దీక్ష విరమణకు మండపం కావాలని భక్తులు, నిర్వాహకులు కోరారని పవన్ కల్యాణ్ తెలిపారు. అక్కడ రూ.35.19 కోట్లు వెచ్చించి 96 గదులతో సత్రం నిర్మించేందుకు తితిదే పాలకమండలి ఆమోదించిందన్నారు. దీనిపై కొందరు సామాజిక మాధ్యమాల్లో 'ఆంధ్రా డబ్బులు మీకెందుకని' మాట్లాడడం సరికాదని సూచించారు. హైందవ ధర్మాన్ని కాపాడుకుందామని.. ప్రాంతాలు, రాష్ట్రాలు, కులాలు, భాషతో దేశాన్ని నాశనం చేసే మాటలొద్దని హితవు పలికారు.

నాడు ఊరూరా మద్యం పంపిణీ చేశారు

కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ మాట్లాడుతూ గత ప్రభుత్వ పాలనలో ప్రజల దాహం తీర్చేందుకు నిధుల్లేవు గానీ, మద్యం డిస్టిలరీలు ఏర్పాటు చేసి ఊరూరా మద్యం పంపిణీ చేశారని విమర్శించారు. రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే కందుల దుర్గేష్ మాట్లాడుతూ గోదావరి వాసుల దశాబ్దాల కల ఈ ప్రాజెక్టు అన్నారు. ఉపసభాపతి రఘురామకృష్ణరాజు మాట్లాడుతూ ఈ ప్రాజెక్టులో అధిక శాతం లబ్ధి తాను ప్రాతినిధ్యం వహిస్తున్న ఉండి నియోజకవర్గానికి చేకూరుతుందన్నారు. కార్యక్రమంలో మంత్రి కొలుసు పార్థసారధి, ఎమ్మెల్యేలు బత్తుల బలరామకృష్ణ, బొమ్మిడి నాయకర్, బొలిశెట్టి శ్రీనివాస్, పంతం నానాజీ, పులపర్తి రామాంజనేయులు, పితాని సత్యనారాయణ, వరుపుల సత్యప్రభ, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, బండారు సత్యానందరావు, ఆరిమిల్లి రాధాకృష్ణ, చింతమనేని ప్రభాకర్, ముప్పిడి వెంకటేశ్వరరావు, ఎమ్మెల్సీలు సోము వీర్రాజు, కర్రి పద్మశ్రీ, నైపుణ్యాభివృద్ధి సంస్థ ఛైర్మన్ బూరుగుపల్లి శేషారావు, మాజీ మంత్రి కొత్తపల్లి సుబ్బారాయుడు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రఘురామకృష్ణరాజు

మరో హామీ నెరవేరింది: మంత్రి లోకేశ్

ఈనాడు, అమరావతి: 'అమరజీవి జలధార' పథకానికి శ్రీకారం చుట్టి, కూటమి ప్రభుత్వం ఇచ్చిన మరో హామీని నెరవేరుస్తున్న పవన్ అన్నకు హృదయపూర్వక అభినందనలని మంత్రి నారా లోకేశ్ అన్నారు. ఎక్స్‌లో ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలకు స్వచ్ఛ జలాలు అందించేందుకు ఆయన చేసిన ప్రయత్నం ఫలించిందని పేర్కొన్నారు.

నేడు తెదేపా జిల్లా అధ్యక్షుల జాబితా ప్రకటన

ప్రధాన కార్యదర్శుల పేర్లు కూడా...

ఈనాడు, అమరావతి: తెదేపా లోక్‌సభ నియోజకవర్గ (జిల్లా) అధ్యక్ష ప్రధాన కార్యదర్శుల జాబితాను ఆదివారం ప్రకటించనున్నారు. అనకాపల్లి జిల్లా పర్యటన ముగించుకుని శనివారం రాత్రి ఉండవల్లి నివాసానికి చేరుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబు దీనిపై తుది కసరత్తు పూర్తిచేశారు. వివిధ సామాజిక సమీకరణాలు, సామర్థ్యం, సీనియారిటీ, విధేయత, అనుభవం తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుని అధ్యక్ష, ప్రధాన కార్యదర్శుల స్థానాలకు ఇప్పటికే ప్రతిపాదనలు సిద్ధం చేశారు. స్థానిక అంశాలు, పలు సమీకరణాల దృష్ట్యా ప్రతిపాదిత జాబితాలో కొన్ని మార్పులు, చేర్పులు చేసినట్లు సమాచారం.



పుస్తకాలు చదవడంలో నియమాలు


- మీరు ఎక్కడికివెళ్లినా అక్కడకు మీకు నచ్చిన పుస్తకాన్ని తీసుకువెళ్లి చదవండి.
- మీరు చదివేటప్పుడు పెన్ను దగ్గరపెట్టుకుని మీకు నచ్చిన వాక్యాలను, పదాలను హైలైట్ చేసుకోండి.
- ప్రపంచంలో ఏం జరుగుతోందన్న విషయాలను పుస్తకాల ద్వారా తెలుసుకోండి.
- చదివిన పుస్తకాలను మళ్లీమళ్లీ చదవండి.
- ముఖ్యమైన విషయాలను ప్రత్యేకంగా రాసుకోండి.

– రియాన్ హాలిడే, రచయిత

పనితీరు బాగాలేని ఎమ్మెల్యేలకు కౌన్సెలింగ్

- వారి పనితీరుపై నివేదిక ఇవ్వండి
- పార్టీ ప్రాంతీయ సమన్వయకర్తలకు మంత్రి లోకేశ్ ఆదేశం
- పార్టీనే సుప్రీం అని... పార్టీ నిర్ణయాన్ని పాటించాల్సిందేనని స్పష్టీకరణ

ఈనాడు, అమరావతి: కూటమి అధికారంలోకి వచ్చిన ఈ ఏడాదిన్నరలో తెదేపా ఎమ్మెల్యేల పనితీరుపై నివేదిక ఇవ్వాలని పార్టీ ప్రాంతీయ సమన్వయకర్తలకు విద్య, ఐటీ శాఖల మంత్రి, తెదేపా జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ సూచించారు. పనితీరు బాగాలేని వారిని పిలిపించి పార్టీ కౌన్సెలింగ్ ఇస్తుందని తెలిపారు. అందరికీ పార్టీనే సుప్రీం అని, ఎవరైనా పార్టీ ఆదేశాల్ని తు.చ. తప్పక పాటించాల్సిందేనని స్పష్టం చేశారు. "సచివాలయం అద్దె ఇల్లు లాంటిది. పార్టీ సొంత ఇల్లు లాంటిది. అధికారంలో ఉన్నప్పుడే సచివాలయంలో ఉంటాం. అధికారం ఉన్నా, లేకపోయినా పార్టీ శాశ్వతం. ఎంత పెద్ద నాయకులకైనా పార్టీ నిర్ణయమే శిరోధార్యం. అందరూ పార్టీ లైన్‌కి లోబడి పనిచేయాల్సిందే" అని స్పష్టం చేశారు. శనివారం తెదేపా కేంద్ర కార్యాలయంలో పార్టీ ప్రాంతీయ సమన్వయకర్తలతో ఆయన రెండున్నర గంటలపాటు భేటీ అయ్యారు. పార్టీ నాయకులు, కార్యకర్తలకు మధ్య అనుసంధాన బాధ్యత సమన్వయకర్తలదేనని స్పష్టంచేశారు. ఎమ్మెల్యేల పనితీరును మదింపు చేయడం మొదలు, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రులతో కలసి సమీక్ష సమావేశాలు నిర్వహించడం వరకు... సమన్వయకర్తలు క్రియాశీలంగా వ్యవహరించాలన్నారు. ఇన్‌ఛార్జి మంత్రులెవరైనా సమన్వయకర్తల ఫోన్లకు స్పందించకపోతే పార్టీ దృష్టికి తేవాలని వారికి తెలిపారు.



తెదేపా జోనల్ కోఆర్డినేటర్ల సమావేశంలో మంత్రి లోకేశ్, నాయకులు

డీఆర్‌సీతో పాటు పార్టీ సమావేశమూ జరగాలి

జిల్లాల్లో ఇన్‌ఛార్జి మంత్రులు ఎప్పుడు డీఆర్‌సీ సమావేశం పెట్టినా, ఆ మర్నాడే పార్టీ సమావేశం కూడా నిర్వహించాలని లోకేశ్ స్పష్టంచేశారు. దానిలో ఇన్‌ఛార్జి మంత్రులతో పాటు ప్రాంతీయ సమన్వయకర్తలు పాల్గొనాలన్నారు. మిత్రపక్షాల మంత్రులు ఇన్‌ఛార్జులుగా ఉన్న జిల్లాల్లో స్థానిక ఎంపీతో కలిసి పార్టీ సమావేశం నిర్వహించాలని సూచించారు. గ్రామ, మండల, నియోజకవర్గ స్థాయిలో పెండింగ్‌లో ఉన్న పార్టీ పదవుల్ని ఈ నెలాఖరుకు భర్తీ చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న దేవాలయ కమిటీలు, మార్కెట్ యార్డులు, పీఏసీఎస్‌ల అధ్యక్షుల్లాంటి పోస్టుల్లో నియామకాల్ని వెంటనే పూర్తిచేయాలని తెలిపారు. ఏపీపీఎస్సీ, బీసీ కార్పొరేషన్, వక్ఫ్ బోర్డుల్లో పోస్టుల భర్తీకి ప్రతిపాదనలు తీసుకోవాలని సమన్వయకర్తలకు లోకేశ్ సూచించారు. పార్టీ, నామినేటెడ్ పదవుల నియామకాల్లో... ప్రతిపక్షంలో ఉన్నప్పుడు తెగించి పోరాడినవారికే ప్రాధాన్యమివ్వాలని స్పష్టంచేశారు. కూటమి అధికారంలోకి వచ్చాక ఇతర పార్టీల నుంచి వచ్చినవారెవరికైనా పదవులివ్వాలని ప్రతిపాదిస్తే నిర్దాక్షిణ్యంగా తిరస్కరించాలని చెప్పారు.

ఎమ్మెల్యేలు చురుగ్గా పాల్గొనేలా చూడండి

గడిచిన రెండున్నర నెలల్లో ఎమ్మెల్యేల పనితీరు మెరుగుపడిందని, ప్రజల నుంచి అర్జీల స్వీకరణ కార్యక్రమాన్ని ప్రతి నియోజకవర్గంలో నిర్వహిస్తూ, సమస్యల పరిష్కారానికి కృషిచేస్తున్నారని లోకేశ్ తెలిపారు. దాన్ని మరింత ముందుకు తీసుకెళ్లేలా సమన్వయకర్తలు కృషి చేయాలన్నారు. పింఛన్ల పంపిణీ, స్వచ్ఛాంధ్ర లాంటి ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాల్లో ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌ఛార్జులు చురుగ్గా పాల్గొనేలా చూడాలన్నారు.

స్థలాల గుర్తింపు ఈ నెలాఖరుకు పూర్తిచేయండి

పార్టీ జిల్లా కార్యాలయాల డిజైన్‌ని సమన్వయకర్తలతో సమావేశంలో ఖరారు చేశారు. వాటిలో కొన్ని అంతర్గత మార్పులు చేయాలని ఆర్కిటెక్ట్‌కి సూచించారు. ప్రతి జిల్లా కార్యాలయాన్నీ ఒకే డిజైన్‌లో నిర్మించనున్నారు. జిల్లా, నియోజకవర్గ కేంద్రాల్లో పార్టీ కార్యాలయాలకు స్థలాల ఎంపిక ప్రక్రియను ఈ నెలాఖరుకల్లా పూర్తిచేయాలని లోకేశ్ సూచించారు. నెల్లూరు విజయ డెయిరీ ఛైర్మన్ ఎంపిక ప్రక్రియపై చర్చ జరిగింది. ప్రతిపాదనల్లో ఉన్న పేర్లలోంచి ఛైర్మన్‌ను ఎంపికచేసే బాధ్యతను పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావుకు అప్పగించారు. పార్టీ కార్యకర్తలకు బీమా సదుపాయంపైనా ఆయన సమీక్షించారు. జనవరి నుంచి ఇప్పటివరకు రూ.38 కోట్లు పరిహారం చెల్లించినట్టు పేర్కొన్నారు. సమావేశంలో ప్రాంతీయ సమన్వయకర్తలు మంతెన సత్యనారాయణరాజు, భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి, బీద రవిచంద్ర యాదవ్, సుజయ్‌కృష్ణ రంగారావు, దీపక్‌రెడ్డి, కోవెలమూడి రవీంద్ర, వేపాడ చిరంజీవిరావు, మందలపు రవి, పెళ్లకూరు శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

కాపు రామచంద్రారెడ్డి ప్రోద్బలంతో పెట్టిన తప్పుడు కేసులు తొలగించండి

- 'మెడికల్ అన్‌ఫిట్' అయిన ఆర్టీసీ ఉద్యోగుల వారసులను ఆదుకోండి
- మంత్రి లోకేశ్ ప్రజాదర్బార్‌కు వినతుల వెల్లువ

ఈనాడు, అమరావతి: తెదేపా సానుభూతిపరుడన్న కారణంతో జగన్ ప్రభుత్వంలో అప్పటి వైకాపా ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి ప్రోద్బలంతో తనపై అక్రమ కేసులు బనాయించారని మంత్రి లోకేశ్ వద్ద అనంతపురం జిల్లా రాయదుర్గం మండలం ఆవులదట్ల గ్రామానికి చెందిన గొల్ల బ్రహ్మానందం వాపోయారు. ఆ కేసులను తొలగించి తనకు న్యాయం చేయాలని కోరుతూ వినతిపత్రం సమర్పించారు. మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో లోకేశ్ శనివారం ప్రజాదర్బార్ నిర్వహించారు. రాష్ట్ర వ్యాప్తంగా వివిధ సమస్యలతో తరలివచ్చిన బాధితుల నుంచి వినతులు, ఫిర్యాదులు స్వీకరించారు. వారి సమస్యలు విని, వాటి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కొన్నింటికి అక్కడికక్కడే ఆదేశాలిచ్చి పరిష్కారం చూపారు. ఆర్టీసీలో పనిచేస్తూ అనారోగ్య కారణాలతో 'మెడికల్ అన్‌ఫిట్' అయిన ఉద్యోగుల కుటుంబాల్లో ఒకరికి కొలువు ఇవ్వాలని 2015లో అప్పటి తెదేపా ప్రభుత్వం సర్క్యులర్ జారీ చేసిందని, దాన్ని వైకాపా ప్రభుత్వం అమలు చేయకపోవడంతో తాము నష్టపోయామని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. ఆరు వేలకు పైగా ఓటింగ్ ఉన్న తమ పంచాయతీని విభజించాలని అన్నమయ్య జిల్లా పెనగలూరు మండలం కొండూరు గ్రామస్థులు కోరారు. ప్రకాశం జిల్లా పెదరావిపాడులోని తన రెండున్నర ఎకరాల భూమిని వైకాపా నాయకులు ఆక్రమించారని, వారిపై చర్యలు తీసుకోవాలని ప్రకాశం జిల్లా నాయుడుపాలేనికి చెందిన ఎం.శారదాంబ, ఎం.సునీత ఫిర్యాదు అందజేశారు.



తెదేపా కార్యాలయానికి వచ్చిన మహిళ నుంచి సమస్య తెలుసుకుంటున్న మంత్రి లోకేశ్

ఇది సంవత్సరాంతం.. బోల్డన్ని సెలవులు మిగిలిపోయుంటాయి. పైగా క్రిస్మస్ కూడా వస్తోంది. ఈ వెసులుబాటు సమయంలో కొత్తకొత్త వంటలు చేయాలని సరదాగా ఉందా?! అయితే కేక్ తయారీ భేషుగ్గా ఉంటుంది. ఈ కాలంలో దొరికే పండ్లతో మీ కోసం కొన్ని ఫ్రూట్ కేక్స్!

ఫ్రూట్స్.. కేక్స్..



కావలసినవి: యాపిల్ పండ్లు - 3, మైదా - కప్పున్నర, పంచదార - ముప్పావు కప్పు, పాలు - అర కప్పు, ఆలివ్ నూనె - అర కప్పు, బేకింగ్ పౌడర్ - స్పూన్, బేకింగ్ సోడా - కొద్దిగా, వెనీలా ఎసెన్స్ - తగినంత, దాల్చినచెక్క పొడి - అర స్పూన్, ఉప్పు - చిటికెడు, నిమ్మరసం - ఒకటిన్నర స్పూన్లు, కిస్‌మిస్, వాల్‌నట్స్, జీడిపప్పులు - అన్నీ కలిపి గుప్పెడు

తయారీ: యాపిల్ పండ్ల చెక్కు, గింజలు తీసి చిన్న ముక్కలుగా కట్ చేయాలి. సగం ముక్కలను మిక్సీలో వేసి గ్రైండ్ చేయాలి. మిగతా వాటిని చిన్నగా కట్ చేసి పక్కనుంచాలి. మిక్సింగ్ బౌల్‌లో యాపిల్ పేస్టు, నూనె, పంచదార, పాలు, వెనీలా ఎసెన్స్, మైదా, బేకింగ్ పౌడర్, బేకింగ్ సోడా, ఉప్పు, దాల్చిన చెక్క పొడి, నిమ్మరసం వేసి బాగా కలపాలి. అందులో కిస్‌మిస్, వాల్‌నట్స్, జీడిపప్పులు, యాపిల్ ముక్కలు జోడించి మరోసారి కలియబెట్టాలి. ఈ మిశ్రమాన్ని వెన్న రాసిన కేక్ టిన్‌లో వేసి 35 నిమిషాలు బేక్ చేస్తే.. యాపిల్ కేక్ తయారైపోతుంది.



కావలసినవి: నారింజపండ్ల రసం - కప్పు, నాణ్యమైన గోధుమపిండి - 150 గ్రాములు, పంచదార - 100 గ్రాములు, ఉప్పు - చిటికెడు, బేకింగ్ పౌడర్, బేకింగ్ సోడా - అర స్పూన్ చొప్పున, వెన్న - అర కప్పు, ఆరెంజ్ జెస్ట్ - అర స్పూన్, కస్టర్డ్ పౌడర్ - టేబుల్ స్పూన్, నెయ్యి, పంచదార పొడి - టీస్పూన్ చొప్పున

తయారీ: మిక్సింగ్ బౌల్‌లో జల్లించిన గోధుమపిండి, కస్టర్డ్ పౌడర్, బేకింగ్ పౌడర్, బేకింగ్ సోడా, ఉప్పు వేసి కలపాలి. మరో పాత్రలో నూనె, పంచదార, ఆరెంజ్ జెస్ట్ వేసి ఎలక్ట్రిక్ బీటర్‌తో బ్లెండ్ చేయాలి. అందులో నారింజ జ్యూస్, గోధుమపిండి జతచేసి కలియబెట్టాలి. ఈ మిశ్రమాన్ని నెయ్యితో గ్రీజ్ చేసిన కేక్‌టిన్‌లో సమంగా సర్ది అవెన్‌లో అమర్చాలి. 180 డిగ్రీల వద్ద ప్రీహీట్ చేసి.. 35 నిమిషాలు బేక్ చేయాలి. కేక్‌లో టూత్‌పిక్ గుచ్చి.. ఏమీ అంటుకోలేదంటే చక్కగా తయారైనట్లు. లేదంటే ఇంకో ఐదు నిమిషాలు బేక్ చేయాలి. పైన పంచదార పొడి, నారింజ స్లైసులతో గార్నిష్ చేస్తే.. సరిపోతుంది. దీన్ని రిఫ్రిజిరేటర్‌లో ఉంచితే.. వారం రోజులు నిలవుంటుంది.



కావలసినవి: తాజా స్ట్రాబెర్రీలు - 200 గ్రాములు, మైదా - 280 గ్రా, బేకింగ్ పౌడర్ - స్పూన్, బేకింగ్ సోడా - అర స్పూన్, ఉప్పు - చిటికెడు, కరిగించిన వెన్న - అర కప్పు, పంచదార - 150 గ్రా, పెరుగు - పావు కప్పు, యాపిల్ సైడర్ వెనిగర్ - టేబుల్ స్పూన్, నెయ్యి, స్ట్రాబెర్రీ ఎసెన్స్, వెనీలా ఎసెన్స్ - స్పూన్ చొప్పున

తయారీ: స్ట్రాబెర్రీలను కడిగి కాడలు తీసేయాలి. వాటిలో కొన్నిటిని పక్కనుంచి మిగిలినవాటిని గ్రైండ్ చేయాలి. పంచదారలో కరిగించిన వెన్న వేసి బ్లెండ్ చేయాలి. అందులో స్ట్రాబెర్రీ ప్యూరీ, వెనీలా ఎసెన్స్, స్ట్రాబెర్రీ ఎసెన్స్, వెనిగర్ జోడించి కలియబెట్టాలి. మరో బౌల్‌లో మైదా, ఉప్పు, బేకింగ్ పౌడర్, బేకింగ్ సోడాలను కలపాలి. ఈ పొడి పదార్థాలను స్ట్రాబెర్రీ మిశ్రమంలో కొద్దికొద్దిగా వేసి అంతా కలిసేలా చేయాలి. దీన్ని నెయ్యి రాసిన కేక్ ట్రేలో సర్ది.. 180 డిగ్రీల వద్ద ప్రీహీట్ చేసిన అవెన్‌లో ఉంచి.. అరగంట బేక్ చేయాలి. చల్లారిన తర్వాత ముక్కలుగా కోయాలి. మిగిలిన స్ట్రాబెర్రీలను సగానికి కోసి పైన వేసి, అర స్పూన్ పంచదార చల్లాలి. ఇక స్ట్రాబెర్రీ కేక్ తిని ఆనందించడమే తరువాయి.



కావలసినవి: సపోటా పండ్లు - 5, మైదా - 2 కప్పులు, పంచదార - అర కప్పు, పాలు - అర కప్పు, ఆలివ్ నూనె - అర కప్పు, వెన్న - స్పూన్, బేకింగ్ పౌడర్ - ముప్పావు స్పూన్, బేకింగ్ సోడా - అర స్పూన్, వెనీలా ఎసెన్స్ - స్పూన్, ఉప్పు - చిటికెడు, కిస్‌మిస్, జీడిపప్పులు - టేబుల్ స్పూన్ చొప్పున, వెనిగర్ - 2 స్పూన్లు, ఖర్జూరాలు - చారెడు

తయారీ: సపోటాల తొక్క, గింజలు తీసేసి మెత్తగా గుజ్జు చేసి ఉంచాలి. నూనెలో పంచదార వేసి బ్లెండ్ చేయాలి. అందులో సపోటా గుజ్జు, పాలు, వెనీలా ఎసెన్స్, వెనిగర్, బేకింగ్ పౌడర్, బేకింగ్ సోడా, ఉప్పు జోడించి బాగా కలపాలి. తర్వాత కిస్‌మిస్, జీడిపప్పులు, ఖర్జూరాలు జతచేసి మరోసారి కలియతిప్పాలి. కేక్ టిన్‌ను వెన్నతో గ్రీజ్ చేసి.. ఈ మిశ్రమాన్ని సమంగా పరచుకునేలా వేయాలి. అవెన్‌ను 180 డిగ్రీల వద్ద ప్రీహీట్ చేసి.. సుమారు 40 నిమిషాలు బేక్ చేయాలి. చల్లారిన తర్వాత ముక్కలుగా కోసుకోవాలి. పంచదార నచ్చనివారు బెల్లం ఉపయోగించవచ్చు. సపోటాలు బాగా పండినవి తీసుకుంటేనే కేక్ మరింత టేస్టీగా ఉంటుంది.



కావలసినవి: బాగా పండిన అరటి పండ్లు - 5, నాణ్యమైన గోధుమపిండి - ఒకటిన్నర కప్పులు, పంచదార - అర కప్పు, బేకింగ్ పౌడర్ - స్పూన్, బేకింగ్ సోడా - అర స్పూన్, ఆలివ్ నూనె - అర కప్పు, వెనీలా ఎసెన్స్ - స్పూన్, ఉప్పు - చిటికెడు, వాల్‌నట్స్ - టేబుల్ స్పూన్, కిస్‌మిస్, పిస్తా పప్పులు - 2 స్పూన్ల చొప్పున, నెయ్యి - స్పూన్

తయారీ: నాలుగు అరటి పండ్లను మెత్తగా గుజ్జులా చేసి పక్కనుంచాలి. నూనెలో పంచదార వేసి బ్లెండ్ చేయాలి. అందులో అరటి పండ్ల గుజ్జు, బేకింగ్ పౌడర్, బేకింగ్ సోడా, గోధుమపిండి, వెనీలా ఎసెన్స్, ఉప్పు జతచేసి బాగా కలపాలి. తర్వాత వాల్‌నట్స్, కిస్‌మిస్, పిస్తా పప్పులు జోడించి మరోసారి కలియబెట్టాలి. బ్రెడ్ ప్యాన్‌లో నెయ్యి రాసి.. ఈ మిశ్రమాన్ని అందులో సమంగా సర్దాలి. మిగిలిన అరటిపండును స్లైసులుగా కోసి పైన వేసి.. 180 డిగ్రీల వద్ద ప్రీహీట్ చేసిన అవెన్‌లో 45 నుంచి 50 నిమిషాలు బేక్ చేయాలి. అంతే.. నోరూరించే 'బనానా కేక్' రెడీ.

13వ స్థానంలో భారత్!



ప్రపంచవ్యాప్తంగా ఎన్నెన్ని రుచులున్నా వాటిల్లో మనదేశ వంటలకు ఒక ప్రత్యేకత ఉంది. పాయసం నుంచి పరోటా వరకూ, బిర్యానీ నుంచి పావ్ భాజీ వరకూ దేనికదే తినేదాకా.. నోరూరిస్తుంది. తినేశాక.. 'ఇంతకంటే ఇంకేం కావాలి?!' అనేంత సంతోషాన్ని, సంతృప్తిని ఇస్తుంది. అందుకే మన వంటకాలు ప్రపంచవ్యాప్తంగా భళీ అనిపిస్తాయి. ఈ ఏడాది కూడా మన రుచులు ప్రశంసలు పొందాయి. టేస్ట్ ఆఫ్ అట్లాస్ 2025/26 ప్రపంచ 100 ఉత్తమ వంటకాల జాబితాలో వివిధ ప్రాంతాల వంటకాలతో మనదేశం 13వ స్థానాన్ని దక్కించుకుంది. ప్రపంచవ్యాప్తంగా 100 ఉత్తమ ఆహార నగరాల్లో మనవి ఆరున్నాయి. మన ఘాటైన వంటలు ప్రపంచాన్ని ఆకట్టుకున్నాయి. ఇందులో ముంబై 5వ, హైదరాబాద్ 54వ స్థానాల్లో నిలిచాయి. భేల్‌పురి, పావ్ భాజీ, మోదక్, రగ్డా పట్టీస్, వడ పావ్‌లతో ముంబై; బిర్యానీ, పెసరట్టు, హలీమ్, చికెన్65, కరాచీ బిస్కెట్లతో హైదరాబాద్ తమదైన గుర్తింపు సాధించాయి. అమృత్‌సర్ 48, న్యూదిల్లీ 53, కోల్‌కతా 73, చెన్నై 93 స్థానాల్లో నిలిచాయి. టేస్ట్ ఆఫ్ అట్లాస్ ర్యాంకింగ్స్‌లో ఇటలీ మొదటి స్థానంలో నిలిచింది.

జెల్లీ షుగర్ క్యాండీ ఇంట్లోనే!

ఇతర చాక్లెట్లతో పోలిస్తే జెల్లీ షుగర్ క్యాండీ మంచిది. ఇది దవడ కీళ్లను బలోపేతం చేస్తుంది. ఈ క్యాండీలను మనమే చేసుకుంటే.. పిల్లలకు ఆరోగ్యకరమైనవి ఇచ్చినట్లవుతుంది.

జెల్లీ షుగర్ క్యాండీ కోసం... పాలు - 200 ఎం.ఎల్., పంచదార - 300 గ్రాములు, పంచదార పొడి - రెండు స్పూన్లు, నూనె - స్పూన్, న్యూట్రల్ జెలటిన్, ఫ్లేవర్డ్ జెలటిన్ - తగినంత తీసుకోవాలి. ఎలా చేయాలంటే... నూనె తప్ప మిగతా పదార్థాలన్నింటినీ సాస్‌ప్యాన్‌లో వేసి పది నిమిషాలు సన్న సెగ మీదుంచాలి. అడుగంటకుండా కలియతిప్పుతూనే ఉండాలి. చిక్కగా అయ్యాక దించేయాలి. ఈ మిశ్రమాన్ని నూనె రాసిన చాక్లెట్ మౌల్డ్‌లో సర్ది.. ఒక పూటంతా రిఫ్రిజిరేటర్‌లో ఉంచితే.. జెల్లీ షుగర్ క్యాండీలు సిద్ధమైపోతాయి. వాటిని తీసి.. పంచదార పొడి చల్లితే.. ఒకదానికొకటి అంటుకోవు. చాక్లెట్ మౌల్డ్ లేకుంటే ఐస్ క్యూబ్ ట్రేని ఉపయోగించవచ్చు. లేదా పళ్లెంలో నూనె రాసి.. చాక్లెట్ మిశ్రమాన్ని సమంగా సర్ది.. చల్లారిన తర్వాత నచ్చిన ఆకృతిలో ముక్కలుగా కట్ చేసుకోవాలి.



వామ్మో.. పులిహోర!



ఆఫీసు ట్రైనింగ్ కోసం కోల్‌కతా వెళ్లా! మూడు నెలలు అక్కడే ఉండాలి. భోజన ప్రియుణ్ణి కావడంతో కొత్త రుచులను కుమ్మేయాలని రసగుల్లా సాక్షిగా ప్రయాణంలోనే గాట్టిగా నిర్ణయించుకున్నా. 'నమహో హుగిలీ హౌరా వారధి..' అని పాడుకుంటూ హుషారుగా వాలిపోయా. ఇక్కడ మీకో విషయం చెప్పాలి... మా అమ్మ వంటలు నాకు పెద్దగా నచ్చవు. తను ఏం చేసినా ఆహా.. అద్భుతం అని ఒక్కసారి కూడా అనిపించదు. ఆ మాటే చెబితే.. కరెక్ట్ చేసుకోకపోగా.. 'ఎప్పుడూ వంకలు పెడతావు.. నీకు పెళ్లయ్యాక ఆ పిల్ల ఎలా తట్టుకుంటుందో' అంటూ చిరాకుపడుతుంది. ఈ ఆడవాళ్లంతే.. ఎప్పుడూ అర్థంచేసుకోరు. అసలు విషయానికి వస్తే.. కోల్‌కతాలో రకరకాల స్వీట్లు రుచి చూశా. కానీ కొన్ని రోజులకే బోరుకొట్టేసాయి. ఓ రోజు పులిహోర మీద మనసైంది. 'మా తెలుగువాళ్ల స్పెషల్ వంటకం అదిరిపోయేలా చేస్తా! తిన్నారంటే మళ్లీమళ్లీ కావాలంటారు' అని రూమ్మేట్లను తెగ ఊరించా. వెంటనే నడుం బిగించేసి అన్నం వండి.. చింతపండు రసం దాంట్లో కలిపేశా. చివర్లో తాలింపు వేశా. రసం ఎక్కువ, అన్నం తక్కువై.. చారన్నంలా తయారైంది. వడ్డించబోతే పల్చటి దాని వాలకం చూసి భయపడ్డట్టున్నారు.. తర్వాత తింటామని తెలివిగా తప్పించుకోబోయారు. కాదూకూడదంటే అంతా కలిసి ఒక్కముద్దలో పదోభాగాన్ని అతి కష్టం మీద తిన్నారు. పాపం వాళ్లేం అనలేదు కానీ.. రాష్ట్రం పరువు నిలువునా మంటగలిపేశానని ఆ రాత్రి నిద్రపడితే ఒట్టు. ఇంకోసారి దద్దోజనం తినాలనిపించి పాలను తోడేస్తే అవలాగే ఉన్నాయి. తర్వాత తెలిసింది.. పచ్చిపాలలో వేయకూడదని. మరోసారి మామిడికాయ పప్పు చేద్దామని పప్పులో మామిడికాయ, కాస్త చింతపండు, కారం, ఉప్పు వేసి ఉడికిస్తే ఎన్ని గంటలైనా కొంచెం కూడా ఉడకలేదు. కుక్కర్లో అయితేనే పప్పు మాట వింటుందని ఆ తర్వాత ఎప్పటికో తెలిసొచ్చింది. మొత్తానికి ట్రైనింగ్ పూర్తయ్యేసరికి మా అమ్మకి వంటలు బాగానే వచ్చని అర్థమైంది. ఆ తర్వాత వంకలు పెడితే ఒట్టు. ఎంతైనా అమ్మ చేతి వంటే వేరు భయ్యా.

– సీహెచ్. అభిజిత్, కొవ్వూరు



నేనొకసారి ఉత్తరాఖండ్ వెళ్లినప్పుడు.. వాళ్ల సంప్రదాయ మిఠాయి సింగోరీ తిన్నాను. ఆ రుచి చాలా నచ్చింది. రెసిపీ ఎలా చేయాలో తెలుసుకుని ఇంటికొచ్చాక చేశాను. ఇంట్లో అందరూ బాగుందనడంతో అప్పుడప్పుడూ చేస్తుంటాను..

సింగోరీ స్వీట్ ఎలా చేయాలంటే...



ఈ స్వీట్ కోసం...
పాలు-లీటర్, ఖోవా, పంచదార - అర కప్పు చొప్పున, బాదం, జీడిపప్పులు - 12 చొప్పున, ఎండుద్రాక్ష - టేబుల్ స్పూన్, యాలకుల పొడి - అర టీస్పూన్, నెయ్యి - టీస్పూన్, తమలపాకులు - 20 తీసుకోవాలి.

ఎలా చేయాలంటే...
బాదం, జీడిపప్పు, ఎండుద్రాక్షలను నెయ్యిలో వేయించి పలుకులుగా చేసి పక్కనుంచాలి. మందపాటి గిన్నెలో పాలను సగం అయ్యే వరకూ మరిగించాలి. అందులో ఖోవాను వేసి కలియ బెడుతుండాలి. దగ్గరగా అయ్యాక.. పంచదార, యాలకుల పొడి, వేయించిన బాదం, జీడిపప్పు, ఎండుద్రాక్షలను జతచేసి.. అడుగంటకుండా కలుపుతుండాలి. మిశ్రమం మరింత చిక్కగా అయ్యాక సెగ తీసేయాలి. కడిగి ఆరబెట్టిన తమలపాకులను కోన్ ఆకృతి వచ్చేలా చుట్టాలి. ఒక్కో కోన్‌లో తగినంత మిఠాయిని ఉంచాలి. అంతే.. 'సింగోరీ స్వీట్' తయారైపోతుంది. ఇది వేడిగా కంటే చల్లారిన తర్వాత తింటే మరింత రుచిగా ఉంటుంది. నచ్చితే మీరు కూడా ప్రయత్నించి చూడండి.



– యర్రాప్రగడ లక్ష్మి, రాజమండ్రి

నాన్ వెజ్ ప్రియులకి చికెన్, మటన్ల కంటే రొయ్యలు మరింత ప్రత్యేకం కదూ! ఈసారి మీ కోసం నోరూరించే చిల్లీ గార్లిక్ ప్రాన్స్! ఇలా చేశారంటే హోటల్ స్టైల్లో అద్దిరిపోతుంది.

హోటల్ స్టైల్లో.. చిల్లీ గార్లిక్ ప్రాన్స్!



కావలసినవి: కడిగి శుభ్రం చేసిన రొయ్యలు (ప్రాన్స్) - 250 గ్రాములు, వెల్లుల్లి - 10 రెబ్బలు, పచ్చిమిర్చి - 2, కారం - ఒకటిన్నర స్పూన్లు, ఉప్పు - రుచికి తగినంత, చిల్లీ, సోయా, టొమాటో సాస్‌లు - టేబుల్ స్పూన్ చొప్పున, వెనిగర్, మిరియాల పొడి - టీస్పూన్ చొప్పున, నూనె - 2 టేబుల్ స్పూన్లు, ఉల్లి కాడలు, కొత్తిమీర తరుగు - గార్నిష్ చేసేందుకు

తయారీ: రొయ్యల్లో కాస్త ఉప్పు, మిరియాల పొడి వేసి 10 నిమిషాలు పక్కనుంచండి. ప్యాన్‌లో నూనె వేడిచేసి, సన్నగా తరిగిన వెల్లుల్లి తరుగును వేయించండి. అది వేగాక.. పచ్చిమిర్చి ముక్కలు, మ్యారినేట్ చేసిన రొయ్యలు వేసి మధ్యస్థమైన సెగ మీద మెల్లగా కలియతిప్పుతూ వేయించండి. అవి కాస్త రంగు మారిన తర్వాత.. కారం, చిల్లీ, సోయా, టొమాటో సాస్‌లు వేసి కలపండి. చివరగా వెనిగర్ జోడించండి. పొడిపొడిలాడుతూ ఉండాలనుకుంటే ఒక నిమిషం ఉంచి దించేయండి. గ్రేవీ కావాలనుకుంటే కొద్దిగా నీళ్లు చేర్చి, ఇంకో రెండు నిమిషాలుంచి సెగ తీసేయండి. ఉల్లి కాడలు, కొత్తిమీర తరుగుతో గార్నిష్ చేసి.. వడ్డించండి. ఇది ఫ్రైడ్ రైస్‌లోకి చాలా బాగుంటుంది.



నారింజపండ్లు ఒలుస్తుంటే.. ఆ వాసన ఎంత హాయిగా ఉంటుంది కదూ! వాటితో జ్యూస్ చేసి తాగటం మామూలే. ఈ కాలంలో విస్తారంగా దొరుకుతున్నాయి కాబట్టి కాన్‌సన్‌ట్రేట్ చేసుకుంటే అన్ సీజన్‌లోనూ నారింజ పానీయం తాగొచ్చు.

వారెవా.. నారింజ పానీయం!

కావలసినవి: తియ్యటి నారింజ పండ్లు - 10, పంచదార - ముప్పావు కిలో, నిమ్మరసం - 2 టేబుల్ స్పూన్లు, సిట్రిక్ యాసిడ్ - అర స్పూన్, సోడియం బెంజోయేట్ - పావు స్పూన్, నీళ్లు - కప్పు

తయారీ: నారింజ పండ్లను కడిగి తొక్క, విత్తనాలు తీసేయాలి. ఆ తొనలను గ్రైండ్ చేసి, వడకట్టాలి. అడుగుభాగం మందంగా ఉన్న పాత్రలో పంచదార, కప్పు నీళ్లు పోసి వేడిచేయాలి. చక్కెర పూర్తిగా కరిగి, తీగ పాకం వచ్చాక.. నారింజ రసం జోడించి తక్కువ సెగ మీద ఆరేడు నిమిషాలుంచాలి. రంగు మారేంత వరకూ ఉంచకూడదు. కాస్త చిక్కగా అయ్యాక సెగ తీసేయాలి. అందులో నిమ్మరసం, సిట్రిక్ యాసిడ్, సోడియం బెంజోయేట్ వేసి కలపాలి. పూర్తిగా చల్లారిన తర్వాత తడి లేని సీసాలో పోసి, గాలి చేరకుండా గట్టిగా మూత బిగించాలి. ఈ చిక్కటి పానీయాన్ని రిఫ్రిజిరేటర్‌లో ఉంచితే.. చాన్నాళ్లు నిల్వ ఉంటుంది. తాగదలచినప్పుడు.. గ్లాసు నీళ్లలో రెండు టేబుల్ స్పూన్ల కాన్‌సన్‌ట్రేట్ కలిపితే సరిపోతుంది. సోడియం బెంజోయేట్ ఉపయోగించకుంటే మూడు నెలలు మాత్రమే నిలవుంటుంది. ఈ కొలతల ప్రకారం ఎక్కువ మోతాదులో చేసుకోవచ్చు.



చిత్రంగా..

అందాల క్రిస్మస్ ట్రీ



క్రిస్మస్ అంటేనే సందడి, సంతోషం. రంగురంగుల క్రిస్మస్ ట్రీ, నవ్వులు చిందించే శాంటాక్లాజ్ తాతయ్య, ఇళ్లకు వేళ్లాడదీసిన స్టార్, డోనట్స్, డేట్ రోల్స్, చీజ్ బాల్స్ లాంటి ప్రత్యేక వంటలతో పసందుగా ఉంటుంది. ఆ ఉత్సాహంతో పండ్లూ పదార్థాలతో క్రిస్మస్ ట్రీలను రూపొందించారు.. అందంగా, ఆకర్షణీయంగా ఉన్నాయి కదూ!





కమల్ కకడీ టిక్కీ

కశ్మీర్ వాసులు చేసే స్నాక్స్‌లో తామర కాడల బజ్జీలు ఒకటి. వీటిని కమల్ కకడీ టిక్కీ అంటారు. తామర కాడలు ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉన్నాయి కాబట్టి.. మనం కూడా ఈ వంటకాన్ని రుచి చూద్దామా...



కావలసినవి: తామర కాడలు - 2, పాలు - 2 టేబుల్ స్పూన్లు, ఉప్పు - రుచికి తగినంత, కొత్తిమీర తరుగు - చారెడు, పచ్చిమిర్చి - 3, ధనియాలు, జీలకర్ర పొడులు, కారం - అర స్పూన్ చొప్పున, నూనె - వేయించేందుకు సరిపడా, ఆమ్‌చూర్ పౌడర్ - స్పూన్, శనగపిండి - కప్పు, పసుపు - పావు స్పూన్

తయారీ: తామర కాడలను పీల్ చేసి.. కడిగి.. అంగుళమంత ముక్కలుగా కోయాలి. వీటిని కుక్కర్‌లో ఉడికించి.. నీళ్లు వార్చేయాలి. పచ్చిమిర్చి, కొత్తిమీరలను నూరి.. అందులో కారం, పసుపు, ఉప్పు, ఆమ్‌చూర్ పౌడర్ జోడించి కలపాలి. మరో పాత్రలో శనగపిండి, కొన్ని నీళ్లు మిగిలిన కారం, ఉప్పు, పసుపు వేసి.. కలపాలి. పిండి మరీ గట్టిగా లేదా జారుగా ఉండకూడదు. తామర కాడల ముక్కలకు మిర్చి మిశ్రమం పట్టించాలి. వాటిని శనగపిండిలో ముంచి తీసి.. కాగుతున్న నూనెలో వేయించాలి. అంతే.. కమల్ కకడీ టిక్కీ ఆస్వాదించడమే తరువాయి.

గోదావరి ట్రైబ్యునల్ ఏర్పాటుకు ఏపీ పట్టు

- కేంద్రమంత్రి పాటిల్‌తో భేటీలో సీఎం చంద్రబాబు ప్రస్తావన
- ఇప్పటిదాకా ట్రైబ్యునల్ లేకుండానే నీటి పంపకాలు

ఈనాడు, అమరావతి: గోదావరి నదీ జలాల పంపిణీకి కొత్తగా ట్రైబ్యునల్ ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం పట్టుబడుతోంది. ముఖ్యమంత్రి చంద్రబాబు శుక్రవారం దిల్లీ పర్యటనలో కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్‌ను కలిసినప్పుడు చర్చకు వచ్చిన అంశాల్లో ఇది కీలకంగా ఉంది.

అంతర్రాష్ట్ర ప్రాజెక్టులు, రాష్ట్రం లోపలి నదుల అనుసంధాన ప్రాజెక్టులకు అనుమతులు కోరడంతో పాటు ఇతర రాష్ట్రాలతో ఉన్న జలవివాదాలను సీఎం.. కేంద్ర మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. తాజా పరిస్థితుల నేపథ్యంలో 75% విశ్వసనీయత వద్ద గోదావరి అవార్డు ప్రకారం అందుబాటులో ఉన్న జలాలను రెండు తెలుగు రాష్ట్రాలకు పంచాల్సి ఉంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు 75% విశ్వసనీయ జలాలు అంటే.. 1,430 టీఎంసీలు. అయితే, రాష్ట్ర విభజన తర్వాత గోదావరి జలాలు రెండు రాష్ట్రాల మధ్య పంచాల్సిన అవసరం ఉంది. ఇప్పటికే అపెక్స్ కౌన్సిల్ సమావేశంలో గోదావరి ట్రైబ్యునల్ ఏర్పాటుకు ఏపీ డిమాండ్ చేయగా, తెలంగాణ కూడా మద్దతిచ్చింది. అయితే, కేంద్రం ఆ దిశగా అడుగు ముందుకు వేయలేదు.

కృష్ణాపై నిర్ణయం.. గోదావరిపై ఏది?

★ గోదావరి ట్రైబ్యునల్ ఏర్పాటు చేయాలని 2020 అక్టోబరు 6న దిల్లీలో జరిగిన అపెక్స్ కౌన్సిల్ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ కోరింది. రెండు రాష్ట్రాలకు నీటి కేటాయింపులను తిరగతోడేలా కొత్త ట్రైబ్యునల్ కావాలని తెలంగాణ అడిగింది. కృష్ణా ట్రైబ్యునల్ అంశం ఏపీకి నష్టదాయకంగా ఉందన్న అభిప్రాయం వ్యక్తమైనా, నాటి సీఎం జగన్ ఆ డిమాండ్‌ను వ్యతిరేకించలేదు. పర్యవసానంగా కృష్ణా రెండో ట్రైబ్యునల్‌నే ఈ అంశాలు తేల్చాలని ఆదేశిస్తూ కేంద్రం నోటిఫికేషన్ ఇచ్చింది. ఆ ట్రైబ్యునల్ విచారణ కూడా ప్రారంభమైంది.

★ అదే సమావేశంలో గోదావరి ట్రైబ్యునల్ ఏర్పాటుకు రెండు రాష్ట్రాలూ కోరినా ముందడుగు పడలేదు.

★ ఇంతవరకు గోదావరిపై ట్రైబ్యునల్ ఎప్పుడూ వేయలేదు. ఈ నది నీటి వాడకానికి సంబంధించి 1980 వరకు కుదిరిన ఒప్పందాలన్నింటినీ కలిపి గోదావరి అవార్డుగా పరిగణిస్తున్నారు. 1978 ఆగస్టు 7న మహారాష్ట్ర, ఉమ్మడి మధ్యప్రదేశ్, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌ల మధ్య ఏర్పడ్డ ఒప్పందాలు తప్ప, మిగిలినవన్నీ గోదావరి అవార్డులో ఉన్నాయి.

★ ఉమ్మడి ఏపీకి 75% విశ్వసనీయత వద్ద 1,430 టీఎంసీలు ఉన్నాయని అధ్యయనాలు చెబుతున్నాయి. ఏపీలో గోదావరిపై వివిధ ప్రాజెక్టుల కింద వినియోగంలో ఉన్న నీళ్లు 659.691 టీఎంసీలు, నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టులకు 116.20 టీఎంసీలు అవసరం. ఇవికాక గోదావరి వరద జలాల ఆధారంగా ఏపీ పోలవరం-నల్లమలసాగర్ అనుసంధాన ప్రాజెక్టును చేపట్టదలిచింది.

ప్రజల హృదయాల్లో నిలిచిన వాజ్‌పేయీ

- డబుల్ ఇంజిన్ సర్కార్‌తో ఏపీకి ప్రయోజనాలు
- తెలంగాణలోనూ అలాంటి ప్రభుత్వం వస్తుంది
- విశాఖలో వాజ్‌పేయీ విగ్రహావిష్కరణలో కేంద్ర మంత్రి బండి సంజయ్

విశాఖపట్నం (పెదవాల్తేరు), న్యూస్‌టుడే: ఎన్నిసార్లు నెగ్గామన్నది కాదు, ఎంత మంది హృదయాలు గెలుచుకున్నామన్నదే ముఖ్యమని.. మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయీ అలా కోట్ల మంది ప్రజల హృదయాల్లో మహానేతగా నిలిచిపోయారని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ అన్నారు. అటల్-మోదీ సుపరిపాలన యాత్రలో భాగంగా శనివారం విశాఖ బీచ్‌రోడ్డులో వాజ్‌పేయీ కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న కేంద్ర మంత్రి బండి సంజయ్ మాట్లాడుతూ 'డబుల్ ఇంజిన్ సర్కార్‌తో ఏపీకి ఎన్నో ప్రయోజనాలు కలుగుతున్నాయి. ఏపీ అభివృద్ధిని చూసి తెలంగాణ ప్రజల్లోనూ ఆలోచన మొదలైంది. అక్కడ కూడా డబుల్ ఇంజిన్ సర్కారు ఏర్పాటవుతుంది. ఏపీ సీఎం చంద్రబాబునాయుడు విజన్ ఉన్న నాయకుడు. విశాఖ అభివృద్ధి చెందితే దేశమంతా ఫలాలు అందుతాయి. అందుకే నాడు అటల్, నేడు మోదీ విశాఖ అభివృద్ధికి పెద్దపీట వేశారు. అటల్‌జీ విలువలతో రాజకీయం చేయొచ్చని చూపించారు. తెలంగాణలో భాజపా అధికారంలోకి వస్తే రాష్ట్రవ్యాప్తంగా ఆయన విగ్రహాలు ఏర్పాటు చేస్తాం. వాజ్‌పేయీ రవాణా, టెలికమ్యూనికేషన్ రంగాలపై తనదైన ముద్ర వేశారు. నాలుగు, ఆరు లేన్ల జాతీయ రహదారుల ఏర్పాటుతో దేశ ఆర్థికాభివృద్ధికి బాటలుపరిచారు' అని పేర్కొన్నారు. భాజపా రాష్ట్ర అధ్యక్షుడు పి.వి.ఎన్. మాధవ్ మాట్లాడుతూ స్టీల్ ప్లాంట్ అభివృద్ధికి ఎన్డీయే ప్రభుత్వం అన్ని విధాలుగా చేయూత ఇస్తోందన్నారు. నాడు వాజ్‌పేయీ, ప్రస్తుతం మోదీ స్టీల్ ప్లాంట్‌కు నిధులు మంజూరు చేశారన్నారు. అయినా ప్రైవేటీకరణ చేస్తున్నారని ప్రతిపక్షాలు దుష్ప్రచారం చేస్తున్నాయని విమర్శించారు. మంత్రి సత్యకుమార్, విశాఖ ఎంపీ శ్రీభరత్, ఎమ్మెల్యేలు విష్ణుకుమార్ రాజు, వెలగపూడి రామకృష్ణబాబు, గణబాబు, గంటా శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి ఆలయ నిర్మాణం కోసం.. గువాహటిలో 25 ఎకరాల కేటాయింపు

తిరుమల, న్యూస్‌టుడే: తిరుమల శ్రీవారి వైభవాన్ని దేశంలోని ఈశాన్య రాష్ట్రాల్లోనూ విస్తరించేందుకు కీలక ముందడుగు పడింది. గువాహటిలో శ్రీవేంకటేశ్వరస్వామి దివ్యక్షేత్రం నిర్మాణానికి 25 ఎకరాలు కేటాయించేందుకు అస్సాం ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. గతంలో అస్సాంలోని గర్చుక్ ప్రాంతంలో ఆలయ నిర్మాణానికి భూమిని కేటాయించారు. అప్పటికే అక్కడ స్వామివారి స్థానిక ఆలయం ఉన్న నేపథ్యంలో గువాహటిలో భూమి కేటాయించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు.. అస్సాం సీఎంకు తితిదే ఛైర్మన్ విజ్ఞప్తి మేరకు లేఖ రాశారు. దీంతో గువాహటిలో తితిదేకు 25 ఎకరాలు కేటాయించేందుకు సూత్రప్రాయంగా అంగీకరించారు. ప్రతిపాదిత ప్రాజెక్టు అభివృద్ధి కార్యక్రమాలకు అవసరమైన ఆర్థిక సహకారాన్ని అందించనున్నట్లు తెలిపారు. ఈశాన్య భారతదేశంలో తొలి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణ పనులను త్వరలోనే ప్రారంభిస్తామని తితిదే ఛైర్మన్ పేర్కొన్నారు.

అమెరికా ఫిల్మ్ ఫెస్టివల్‌కు 'ఒసేయ్ బాలమ్మ' ఎంపిక



దర్శకుడు రమణ్ నిమ్మల

విజయవాడ సిటీ, న్యూస్‌టుడే: 'ఒసేయ్ బాలమ్మ' లఘు చిత్రం 2026లో అమెరికాలో నిర్వహించే సన్ డ్యాన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌కు ఎంపికైందని దర్శకుడు రమణ్ నిమ్మల తెలిపారు. విజయవాడ గుణదలలోని ఓ హోటల్లో శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా వచ్చిన పదకొండు వేల ఎంట్రీల్లో కేవలం 50 చిత్రాలే ఎంపికవగా, అందులో ఈ లఘుచిత్రం ఒకటని చెప్పారు. సన్ డ్యాన్స్ ఫిల్మ్ ఫెస్టివల్ పోటీ విభాగంలో ఎంపికైన తొలి తెలుగు చిత్రంగా ఇది రికార్డు సృష్టించిందని పేర్కొన్నారు. తన చిన్నప్పుడు వేసవి సెలవుల్లో అమ్మమ్మ ఇంట్లో గడిపిన జ్ఞాపకాల ఆధారంగా ఈ చిత్రాన్ని రూపొందించినట్లు దర్శకుడు వెల్లడించారు. తాను పుట్టి పెరిగింది హైదరాబాద్‌లో అని, ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా తిరువూరులో కుటుంబ మూలాలు ఉన్నాయని చెప్పారు. న్యూయార్క్‌లో ఫైనాన్స్ రంగంలో పనిచేసిన తాను వ్యక్తిగత అనుభవాల ఆధారంగా అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందే కథలను చెప్పాలనే లక్ష్యంతో చిత్ర పరిశ్రమలోకి ప్రవేశించినట్లు పేర్కొన్నారు. ఈ చిత్రాన్ని తెలంగాణ రాష్ట్రంలోని నేరడిగుంటలో తీసినట్లు రమణ్ తెలిపారు.

3న కొండగట్టుకు పవన్‌కల్యాణ్!

మల్యాల, న్యూస్‌టుడే: తెలంగాణలోని కొండగట్టులో చేపట్టనున్న వంద గదుల ధర్మశాల, దీక్షా మండపం నిర్మాణానికి ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ చొరవతో తితిదే బోర్డు నిధులు మంజూరు చేసిన నేపథ్యంలో.. వచ్చేనెల 3న ఆయన కొండగట్టుకు రానున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఆయన తన ఇష్టదైవమైన అంజనేయ స్వామిని దర్శించుకొని గదుల నిర్మాణానికి ప్రతిపాదించిన స్థల పరిశీలన లేదా భూమిపూజ చేస్తారని తెలిసింది.

'వాస్తవాలు పరిశీలించకుండా పనిష్మెంట్లు సరికాదు'

ఈనాడు, అమరావతి: స్త్రీశక్తి పథకం వల్ల డ్రైవర్లు, కండక్టర్లపై ఒత్తిడి పెరిగిందని, ఈ సమయంలో చిన్న చిన్న పొరపాట్లకు సైతం తనిఖీ అధికారులు కేసులు నమోదు చేస్తుంటే.. వాస్తవాలు తెలుసుకోకుండా డిపో మేనేజర్లు పనిష్మెంట్లు ఇవ్వడం సరికాదని ఎంప్లాయిస్ యూనియన్ (ఈయూ) రాష్ట్ర అధ్యక్షుడు పలిశెట్టి దామోదరరావు తెలిపారు. ఇలాగైతే డ్రైవరు, కండక్టర్లు విధులు నిర్వహించడమే కష్టమైపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈయూ రాష్ట్ర కార్యాలయంలో శనివారం జరిగిన విద్యాధరపురం డిపో యూనియన్ సమావేశంలో ఆయన మాట్లాడారు.



నిద్రలేమి.. కండర క్షీణత సంబంధం

శరీరంలో కండర బలం తక్కువగా ఉన్నవారికి నిద్రలేమి సమస్య తలెత్తుతుందని తాజా అధ్యయనం తేల్చింది. ఇంకా అస్థిపంజర కండరం, శరీరంలో కొవ్వు, పొట్టపై పేరుకునే కొవ్వులపై నిద్ర నాణ్యత ఆధారపడి ఉంటుందని పేర్కొంది. నాణ్యతలేని నిద్రతో రక్తంలో చక్కెరస్థాయిలు, లిపిడ్స్, కిడ్నీ, లివర్ ప్రభావితమవుతాయి.

– ఆండీ గాల్‌పిన్, పార్కర్ వర్సిటీ డైరెక్టర్

ఆంధ్రా ట్యాక్సీ.. చౌకగా, సౌకర్యంగా!

- యాప్ రూపొందించిన ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్
- త్వరలో పర్యాటక సేవలు, ప్రత్యేక ప్యాకేజీలు

ఈనాడు, అమరావతి: మెట్రో సిటీలు, పెద్ద నగరాల్లో ప్రయాణాలకు ఆటోలు, ట్యాక్సీలు, క్యాబ్‌లు బుక్ చేసుకోవడానికి ప్రైవేటు సంస్థల యాప్‌లు విస్తృతంగా వాడుకలో ఉన్నాయి. ఇదే తరహాలో, ప్రభుత్వ ఆధీనంలో ఓ పోర్టల్/యాప్‌ను రూపొందించారు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ. త్వరలోనే యాప్‌ను విడుదల చేస్తామని, ప్లే స్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చని కలెక్టర్ తెలిపారు. విజయవాడ దుర్గ గుడి, భవానీ ద్వీపం, కృష్ణా నది తీరం వెంబడి ఆలయాల సందర్శనకు వచ్చే పర్యాటకులకు చౌకగా, భద్రంగా రవాణా సేవలు అందించడానికి ఉపయుక్తంగా దీన్ని తీర్చిదిద్దారు. సందర్శకుల నుంచి స్థానిక ఆటో, క్యాబ్ డ్రైవర్లు ఎక్కువ రుసుము డిమాండ్ చేస్తున్న నేపథ్యంలో, ఆంధ్రా ట్యాక్సీ యాప్‌తో మోసాలకు చెక్ పెట్టనున్నట్లు చెబుతున్నారు. సందర్శకులను చౌకధరల్లో సౌకర్యంగా, భద్రంగా తిప్పడమే ఈ యాప్ ఉద్దేశం. దీని ద్వారా పర్యాటకం వృద్ధి చెందుతుందని, వాహనదారులకు కచ్చితమైన ఉపాధి లభిస్తుందని కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు.

ఇవీ ఈ యాప్ ప్రత్యేకతలు

- ★ ఆంధ్రా ట్యాక్సీ పోర్టల్/ యాప్‌లో క్యాబ్, ఆటోలను వాట్సప్, ఫోన్‌కాల్, యాప్, క్యూఆర్ కోడ్ ద్వారా బుక్ చేసుకోవచ్చు.
- ★ ఏ ప్రాంతం నుంచి వాహనం కావాలో యాప్‌లో నమోదుచేస్తే, అక్కడ స్థానికంగా రిజిస్టర్ అయినవి డ్రైవర్ వివరాలతో సహా కనిపిస్తాయి. రవాణా శాఖ అధికారుల ద్వారా పరీక్షించి, ఫిట్‌నెస్ ఉన్నవాటికే అనుమతి ఇస్తారు.
- ★ మహిళల భద్రత దృష్ట్యా వాహనాల డేటా, బుకింగ్ సమాచారం స్థానిక పోలీస్ స్టేషన్లకు అందేలా యాప్‌ను రూపొందించారు.
- ★ ఈ యాప్‌లో నమోదైన వాహనాల సమాచారం రాష్ట్ర డేటా కేంద్రానికి చేరుతుంది. ప్రయాణికుల వ్యక్తిగత డేటా భద్రంగా ఉంటుంది.
- ★ విజయవాడతో పాటు ఎన్టీఆర్ జిల్లాలోని పర్యాటక ప్రాంతాలకు రవాణాతో పాటు హోటల్ గదులు బుక్ చేసుకునేందుకు ఆప్షన్స్ ఇచ్చారు. మొత్తం ప్యాకేజీగానూ ఎంచుకోవచ్చు.
- ★ రైతుల అవసరాల మేరకు డ్రోన్ సేవలు కూడా అందించనున్నారు.



ఆంధ్రా ట్యాక్సీ పోస్టర్

11 మంది ఆర్‌అండ్‌బీ ఇంజినీర్లపై చర్యలు!

- చిత్తూరు జిల్లాలో రూ.123 కోట్లతో నాసిరకంగా రోడ్ల నిర్మాణం
- వైకాపా హయాంలో 'పెద్దాయన'కు తలొగ్గి, బిల్లుల మంజూరు

ఈనాడు, చిత్తూరు: జగన్ పాలనలో ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఆ 'పెద్దాయన' చెప్పిందే వేదం. అప్పట్లో అధికార యంత్రాంగమంతా ఆయనకు సాగిలపడింది. పెద్దాయన చెప్పారు కదా.. అని, అవసరం లేనిచోట కూడా అడ్డగోలుగా పనులు చేపట్టి, గుత్తేదారులకు దోచిపెట్టింది. నిబంధనలకు విరుద్ధమని, ప్రభుత్వ ఖజానాకు నష్టమని తెలిసినా లెక్క పెట్టలేదు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక నాటి తప్పులను తవ్వితీయడంతో ఇప్పుడా అధికారులు మూల్యం చెల్లించుకోవాల్సి వస్తోంది. పుంగనూరు, పలమనేరు, పీలేరు నియోజకవర్గాల్లో రోడ్లు, భవనాల శాఖలో నిబంధనలు అతిక్రమించి విస్తరించిన ఆరు రహదారులు, ఓ వంతెన నిర్మాణంలో 11 మంది అధికారులను బాధ్యులుగా పేర్కొంటూ ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది. అందులో పనులు తనిఖీ చేసి నాణ్యంగా ఉన్నాయని నిర్ధారించిన ఐదుగురు ఇంజినీర్లూ ఉన్నారు. 'పెద్దాయన' పాపానికి ఇద్దరు ఈఈలు, ఇద్దరు డీఈఈలు, ఏడుగురు ఏఈఈలు క్రమశిక్షణ చర్యలు ఎదుర్కోనున్నారు.



కల్లూరు– రొంపిచెర్ల క్రాస్ రోడ్డులో వరుసగా నిర్మించిన కల్వర్టులు

కాంట్రాక్టు రాఘవ.. చేసింది కీలక నేత కంపెనీ

మూడు నియోజకవర్గాల్లోని ఆరు రహదారులు, ఓ వంతెన నిర్మాణానికి వైకాపా హయాంలో రూ.154.40 కోట్లతో అంచనాలు రూపొందించారు. ఈ రోడ్లలో 4 పుంగనూరు నియోజకవర్గంలోనే ఉండగా 2 ఆ ప్రాంతం మీదుగా వెళ్తాయి. టెండర్లను జగన్‌కు సన్నిహితుడు, తెలంగాణ ప్రస్తుత మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కుటుంబానికి చెందిన రాఘవ కన్‌స్ట్రక్షన్స్ దక్కించుకుని రూ.123.19 కోట్లతో ఒప్పందం చేసుకుంది. వాస్తవంగా క్షేత్రస్థాయిలో పనులు చేసింది మాత్రం వైకాపాలోని కీలక నేత కంపెనీయే. అవసరం లేకున్నా రోడ్లు వేస్తున్నారని, అంచనా వ్యయాన్ని గణనీయంగా పెంచారని జగన్ పాలనలోనే విమర్శలు వచ్చాయి. అధికారులు వాటిని పట్టించుకోలేదు. నాణ్యత, నియంత్రణ (క్యూసీ) విభాగం సైతం అంతా సక్రమంగానే ఉందంటూ నివేదిక ఇవ్వడంతో బిల్లులు చెల్లించేశారు. నిబంధనల ఉల్లంఘన, నాణ్యత విస్మరణ వ్యవహారం కూటమి ప్రభుత్వ దృష్టికి రావడంతో విజిలెన్స్ విచారణకు ఆదేశించింది. ఆ కమిటీ అక్టోబరు 7న నివేదిక ఇచ్చింది. ఇందులో నాణ్యత లేని కాంక్రీట్ వినియోగంతో రూ.53.86 లక్షలు, తారు తక్కువగా వేసి రూ.25.81 లక్షలు కొల్లగొట్టారని స్పష్టమైంది. చేయని పనికీ రూ.17.10 లక్షల బిల్లు, ఇతర అవకతకవలు కలిపి మొత్తంగా రూ.97.03 లక్షలు సంబంధిత గుత్తేదారు నుంచి రికవరీ చేయాలని పేర్కొంది. ఏయే అధికారులు బాధ్యులో నివేదికలో స్పష్టం చేశారు.

అదనపు కల్వర్టుల సంగతేంటి?

మరోవైపు, ఈ రహదారుల విస్తరణలో భాగంగా అవసరం లేకున్నా కల్వర్టులు నిర్మించారు. కేవలం అంచనాలు పెంచి నిధులు దోచుకోవడానికే ఇలా చేశారన్న ఆరోపణలున్నాయి. పుంగనూరు- పులిచెర్ల- చిన్నగొట్టిగల్లు మార్గంలో.. కల్లూరు నుంచి రొంపిచెర్ల క్రాస్ వరకు 16 కి.మీ. ఉండగా ఏకంగా 32 కల్వర్టులు నిర్మించారు. వీటిలో 12 కల్వర్టులు అనవసరం. వీటిపైనా సమగ్రంగా విచారణ చేపడితే, మరింత దోపిడీ బహిర్గతం కానుంది.

రాజధాని కోసం హరిత వాహనాలు!



రాజధాని గ్రామాల్లో చెత్త సేకరణకు సీఆర్డీఏ పర్యావరణహిత వాహనాలను వినియోగించనుంది. వీటిని ఒక్కసారి ఫుల్ ఛార్జింగ్ చేస్తే 65 కిలోమీటర్ల వరకు వెళ్లగలవు. మూడు చక్రాలతో ఆటో రిక్షాలా ఉన్న ఈ వాహనాలు ఇరుకు సందుల్లోని ఇళ్ల వద్దకూ వెళ్లేలా రూపొందించారు. త్వరలో రాజధానిలో ప్రారంభించనున్న వాహనాలు శనివారం గుంటూరు నుంచి కోల్‌కతా-చెన్నై జాతీయ రహదారి మీదుగా అమరావతి వైపు వెళ్తూ కనిపించాయి.

– ఈనాడు అమరావతి, న్యూస్‌టుడే తుళ్లూరు

వంశీ బెయిల్‌పై అత్యవసర విచారణకు హైకోర్టు నిరాకరణ

ఈనాడు, అమరావతి: విజయవాడలోని మాచవరం పోలీసులు నమోదు చేసిన హత్యాయత్నం కేసులో ముందస్తు బెయిలు కోసం తాను దాఖలు చేసిన పిటిషన్‌పై అత్యవసర విచారణ జరపాలని వైకాపా నేత వల్లభనేని వంశీ చేసిన అభ్యర్థనను హైకోర్టు తోసిపుచ్చింది. పూర్తి వివరాలు సమర్పించాలని మాచవరం పోలీసులను ఆదేశిస్తూ విచారణను ఈ నెల 29కి వాయిదా వేసింది. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ డాక్టర్ వై.లక్ష్మణరావు శనివారం ఈ ఉత్తర్వులిచ్చారు. అంతకు ముందు వంశీ తరఫు న్యాయవాది దేవి సత్యశ్రీ స్పందిస్తూ.. ఘటన జరిగిన 16 నెలల తర్వాత కేసు నమోదు చేశారన్నారు. ఈ ఘటనలో వంశీ బాధితుడని చెప్పడానికి ఆధారాలున్నాయని చెప్పారు. అత్యవసరంగా విచారణ జరపాలని కోరారు. తనపై దాడి చేశారంటూ నూతక్కి సునీల్ అనే వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా మాచవరం పోలీసులు వంశీ తదితరులపై హత్యాయత్నం కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే.




విట్‌లో జెన్‌-జెడ్ పోస్టాఫీసును ప్రారంభిస్తున్న పెమ్మసాని, చిత్రంలో జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా, ఏపీ సర్కిల్ చీఫ్ పోస్ట్‌మాస్టర్ జనరల్ శ్రీదేవి, విజయవాడ రీజియన్ పోస్ట్‌మాస్టర్ జనరల్ ఉపేంద్ర ★ జెన్‌-జెడ్ పోస్టాఫీసు

దేశవ్యాప్తంగా 50 జెన్‌-జెడ్ పోస్టాఫీసులు

కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ వెల్లడి

ఈనాడు, అమరావతి: యువత అవసరాలు, ఆకాంక్షలను దృష్టిలో ఉంచుకుని దేశ వ్యాప్తంగా 50 జెన్‌-జెడ్ పోస్టాఫీసులు ఏర్పాటు చేస్తున్నట్లు కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ల శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. ప్రతిష్ఠాత్మక విద్యా సంస్థలు, విశ్వవిద్యాలయాల ప్రాంగణాల్లో యువతకు అందుబాటులో ఉండేలా, అనుకూలమైన సేవలు అందించడమే లక్ష్యంగా జెన్‌-జెడ్ పోస్టాఫీసులను తీర్చిదిద్దుతామన్నారు. అమరావతిలోని విట్ ఏపీ క్యాంపస్‌లో శనివారం జెన్ జెడ్ పోస్టాఫీసును పెమ్మసాని చంద్రశేఖర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జెన్‌-జెడ్ పోస్టాఫీసులో ఆధునిక వాతావరణం, డిజిటల్ చెల్లింపుల సదుపాయాలు, సరళీకృత సేవల విధానాలు, ఒకేచోట పోస్టల్, బ్యాంకింగ్, బీమా సేవలు పొందే వెసులుబాటు కల్పించామన్నారు. లేఖల బట్వాడాకే పరిమితం కాకుండా ఈకామర్స్ ప్లాట్‌ఫామ్‌గా పోస్టల్ శాఖ ఎదిగిందన్నారు. ప్రైవేటు కొరియర్ సర్వీసులకు దీటుగా పోస్టాఫీసులను తయారు చేస్తున్నామన్నారు. రాష్ట్రంలో విశాఖ, అమరావతిలో జెన్ జెడ్ పోస్టాఫీసులు ఉండగా.. త్వరలో కర్నూలులో ఏర్పాటు చేస్తామని పెమ్మసాని చంద్రశేఖర్ చెప్పారు. ఆంధ్రప్రదేశ్ సర్కిల్ చీఫ్ పోస్ట్‌మాస్టర్ జనరల్ బి.పి.శ్రీదేవి మాట్లాడుతూ జెన్‌-జెడ్ పోస్టాఫీసుల ద్వారా పాస్‌పోర్టు సేవలు, ఆధార్ నవీకరణ, పోస్టల్, బ్యాంకింగ్, బీమా సేవలు అందుబాటులో ఉంటాయన్నారు. ఉచిత వైఫై, విద్యార్థులకు పార్సిల్ సర్వీసులో 10 శాతం రాయితీ ఇస్తామన్నారు. కార్యక్రమంలో విట్ వైస్‌ఛాన్సలర్ వర్మన్, గుంటూరు కలెక్టర్ తమీమ్ అన్సారియా తదితరులు పాల్గొన్నారు.

హైకోర్టుకు హాజరైన ఆర్టీఐ పూర్వ కమిషనర్ శామ్యూల్

కోర్టుధిక్కరణ కేసును కొట్టేసిన న్యాయమూర్తి

ఈనాడు, అమరావతి: విచారణకు గైర్హాజరయినందుకు కోర్టు ధిక్కరణ కేసులో బెయిలబుల్ వారంట్ జారీ నేపథ్యంలో సమాచార హక్కు చట్టం (ఆర్టీఐ) పూర్వ కమిషనర్ శామ్యూల్ జొనాథన్ శనివారం హైకోర్టులో విచారణకు హాజరయ్యారు. ఆయన తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. కోర్టు ఆదేశాలను శామ్యూల్ అమలు చేశారన్నారు. పిటిషనర్ కోరిన సమాచారాన్ని ఇవ్వాలని సంబంధిత అధికారిని ఆదేశిస్తూ అప్పీల్‌ను పరిష్కరించారన్నారు. ఈ వివరాలను పరిగణనలోకి తీసుకున్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎస్.సుబ్బారెడ్డి శామ్యూల్‌పై దాఖలైన కోర్టుధిక్కరణ కేసును కొట్టేశారు. వారంట్‌ను రీకాల్ చేశారు. కదిరి మున్సిపాలిటీ తాను కోరిన సమాచారం ఇవ్వలేదంటూ నూరుల్లా సమాచార హక్కు కమిషన్ వద్ద అప్పీల్ చేశారు. దానిని నిర్దిష్ట కాలంలో పరిష్కరించలేదని హైకోర్టులో పిటిషన్ వేశారు. విచారణ జరిపిన న్యాయమూర్తి చట్ట నిబంధనల మేరకు అప్పీల్‌ను పరిష్కరించాలని ఆదేశించారు. ఈ ఉత్తర్వులను అమలు చేయకపోవడంతో నూరుల్లా అప్పటి స.హ. కమిషనర్ శామ్యూల్ జొనాథన్‌పై కోర్టుధిక్కరణ వ్యాజ్యం వేశారు. జొనాథన్ విచారణకు హాజరుకాకపోవడంతో న్యాయమూర్తి ఇటీవల ఆయనకు అరెస్టు వారంట్ జారీ చేసిన సంగతి తెలిసిందే.

ఎన్నికల్లో అక్రమ వ్యయంపై విచారణకు ఏం నిర్ణయం తీసుకున్నారు?

వివరాలివ్వాలని ఈసీని ఆదేశించిన హైకోర్టు

ఈనాడు, అమరావతి: గత ఎన్నికల్లో ఓటర్లను ప్రలోభపెట్టేందుకు రూ.3,500 కోట్లు ఖర్చు పెట్టారని మద్యం కుంభకోణం కేసులో సిట్ అభియోగపత్రం దాఖలు చేసిందని, దీనిపై విచారణ జరిపించేలా కేంద్ర ఎన్నికల సంఘాన్ని (ఈసీ) ఆదేశించాలంటూ జైభీమ్‌రావ్ భారత్ పార్టీ అభ్యర్థులు దాఖలు చేసిన వినతిపై ఏం నిర్ణయం తీసుకున్నారని ఈసీని హైకోర్టు ప్రశ్నించింది. హైకోర్టు సీజే జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ చల్లా గుణరంజన్‌తో కూడిన ధర్మాసనం శనివారం ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టింది. పిటిషనర్ల తరఫున న్యాయవాది జడ శ్రావణ్‌కుమార్ వాదనలు వినిపిస్తూ.. ఈ అంశంపై తగిన చర్యలు తీసుకోవాలని ఈసీకి జులై 23న వినతి ఇచ్చినా చర్యలు తీసుకోలేదని చెప్పారు.

ప్లాస్టిక్‌పై పోరు.. ప్రధాని మెచ్చిన తీరు

ఈటీవీ భారత్: ఒకసారి వాడి పడేసే ప్లాస్టిక్ (సింగిల్ యూజ్) వల్ల కలిగే అనర్థాలపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు ఛత్తీస్‌గఢ్‌లోని అంబికాపుర్‌లో గల హోలీ క్రాస్ స్కూలు విద్యార్థులు విస్తృత ప్రచారం చేస్తున్నారు. వీరి ప్రయత్నాన్ని అభినందిస్తూ ప్రధాని మోదీ తన సోషల్ మీడియా ఖాతాలో పోస్టు కూడా పెట్టారు. ఈ విద్యార్థులు ఇప్పుడు మరో అడుగు ముందుకువేసి దేశవ్యాప్తంగా సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలని కోరుతూ నగరంలోని 75 వేల మంది ప్రజల సంతకాలు సేకరించి ప్రధానికి కొరియర్‌లో పంపుతున్నారు. పాఠశాల ప్రిన్సిపల్ డాక్టర్ జెస్సీ మాట్లాడుతూ.. విద్యార్థులు నెలవ రోజులుగా ప్లాస్టిక్ నిర్మూలన కార్యక్రమంలో పాల్గొంటున్నట్లు తెలిపారు. ప్రశంసలు వారిలో మరింత ఉత్సాహాన్ని నింపాయన్నారు. ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వ పర్యావరణ పరిరక్షణ బోర్డు సైతం రాష్ట్రంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను నిషేధించేలా కఠిన నిబంధనలను నిర్దేశిస్తూ డిసెంబరు మొదటివారంలో ప్రత్యేక ఉత్తర్వులు జారీ చేసింది.





చక్రాల కుర్చీ నుంచి.. చుక్కల లోకానికి

వాషింగ్టన్: సాధారణంగా పూర్తిస్థాయి ఫిట్‌నెస్ ఉన్నవారినే అంతరిక్షంలోకి పంపుతుంటారు. తొలిసారిగా.. కాళ్లు చచ్చుబడి, చక్రాల కుర్చీకే పరిమితమైన ఒక మహిళ రోదసిలోకి వెళ్లి వచ్చారు. జర్మనీకి చెందిన మైఖేలా బెంతాస్ (33) ఈ ఘనత సాధించారు. రోదసిలోకి చేరాక భారరహిత స్థితిలో ఆమె తేలియాడారు. పుడమి అందాలను వీక్షించారు. అమెరికాలోని పశ్చిమ వర్జీనియా నుంచి బ్లూ ఆరిజిన్ కంపెనీకి చెందిన న్యూ షెపర్డ్ వ్యోమనౌక ద్వారా మరో ఐదుగురు వ్యోమగాములతో కలిసి శనివారం ఆమె నింగిలోకి దూసుకుపోయారు. వీరిలో స్పేస్‌ఎక్స్ సంస్థకు చెందిన మాజీ ఎగ్జిక్యూటివ్ హాన్స్ కోనిగ్స్‌మన్ కూడా ఉన్నారు. ఆయన కృషి వల్లే మైఖేలా రోదసియాత్ర సాధ్యమైంది. ఇందుకైన ఖర్చును బ్లూ ఆరిజిన్‌తో కలిసి ఆయన భరించారు. దాదాపు 10 నిమిషాల పర్యటనలో 3 నిమిషాల పాటు భారరహిత స్థితిని ఆస్వాదించారు. మైఖేలా కోసం న్యూషెపర్డ్ వ్యోమనౌకలో స్వల్పంగా సర్దుబాట్లు చేయాల్సి వచ్చిందని బ్లూ ఆరిజిన్ సంస్థ పేర్కొంది.



వ్యోమనౌకపై మైఖేలా

వెరీగుడ్డు

అపోహలకు చెక్ పెట్టిన ఎఫ్ఎస్ఎస్ఏఐ

దిల్లీ: గుడ్లను క్యాన్సర్ ముప్పునకు ముడిపెడుతూ సామాజిక మాధ్యమాల్లో పలు వార్తలు చక్కర్లు కొడుతుండటంపై భారత ఆహార భద్రత, ప్రమాణాల అథారిటీ(ఎఫ్ఎస్ఎస్ఏఐ) స్పందించింది. అవన్నీ తప్పుదోవపట్టించే వార్తలని స్పష్టంచేసింది. దేశంలో లభ్యమవుతోన్న గుడ్లు సురక్షితమైనవని శనివారం ఓ ప్రకటన విడుదల చేసింది. గుడ్లల్లో క్యాన్సర్ కారక పదార్థాలు ఉన్నాయని చెప్పేందుకు ఎలాంటి శాస్త్రీయ ఆధారాలు లేవని పేర్కొంది. 2011లో తీసుకువచ్చిన ఆహార భద్రత నిబంధనల ప్రకారం.. పౌల్ట్రీ, గుడ్ల ఉత్పత్తి జరిగే అన్ని దశల్లో నైట్రోఫ్యూరాన్ల వాడకాన్ని పూర్తిగా నిషేధించినట్లు ఎఫ్ఎస్ఎస్ఏఐ వెల్లడించింది. భారతదేశంలో నియంత్రణ ప్రమాణాలు అంతర్జాతీయ చట్టాలకు అనుగుణంగా ఉన్నాయని పేర్కొంది.





వయసు పెరుగుతుంటే పాటించాల్సినవి..

- ఊబకాయంతో ఉండొద్దు.
- బరువులు ఎత్తాలి.
- నడక మానొద్దు.
- మద్యాన్ని దూరం పెట్టాలి.
- ప్రకృతితో మమేకం కండి.
- కొత్త విషయాలు నేర్చుకోండి.
- సూర్యరశ్మి తగిలేలా చూసుకోండి.
- చిరుతిళ్లు మానేయండి.
- స్నేహితులు, కుటుంబసభ్యులతో ఎక్కువ సమయం గడపండి.

– డాన్ గో, ఆరోగ్య శిక్షకుడు

మహా ఆటవిక రాజ్యం అంతమొందిస్తాం

- అవినీతితో బెంగాల్ భ్రష్టుపట్టింది
- బిహార్‌లా ఇక్కడా మేం నెగ్గుతాం: మోదీ

కోల్‌కతా, గువాహటీ: అవినీతి, ఆశ్రితపక్షపాతం, బుజ్జగింపు రాజకీయాలతో పశ్చిమబెంగాల్‌లో 'మహా జంగిల్ రాజ్' (మహా ఆటవిక పాలన) కొనసాగుతోందని, దీనిని అంతమొందిస్తామని ప్రధాని మోదీ ఉద్ఘాటించారు. గంగానది బిహార్ నుంచి బెంగాల్‌కు ప్రవహిస్తున్నట్లుగానే ఇటీవల బిహార్‌లో తాము సాధించిన గెలుపు ఈ పొరుగు రాష్ట్రంలోనూ విజయానికి దారి తీస్తుందని ఆశాభావం వ్యక్తంచేశారు. శనివారం పశ్చిమబెంగాల్‌లోని నదియా జిల్లా తహెర్‌పుర్‌లో భాజపా నిర్వహించిన భారీ బహిరంగ సభనుద్దేశించి ప్రధాని ప్రసంగించారు. మమతా బెనర్జీ సర్కారుపై విరుచుకుపడ్డారు. విపరీతమైన పొగమంచు కారణంగా దృశ్యస్పష్టత లోపించి ఆయన ప్రయాణిస్తున్న హెలికాప్టర్ ఆ గ్రామంపై కొద్దిసేపు చక్కర్లు కొట్టినా చివరకు హెలిప్యాడ్‌పై దిగలేకపోయింది. దీంతో ఆయన కోల్‌కతాకు వెనుదిరిగి అక్కడి విమానాశ్రయ వీఐపీ లాంజ్ నుంచి ఫోన్‌ద్వారా ప్రసంగించారు.

బెంగాల్‌లో అనేక ప్రాంతాలు ఇప్పటికీ వెనుకబడి ఉన్నాయని, రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు భాజపా కట్టుబడి ఉందని మోదీ చెప్పారు. తనను, భాజపాను తృణమూల్ కాంగ్రెస్ ఎంతగా వ్యతిరేకించినా, రాష్ట్ర అభివృద్ధిని మాత్రం ఆపకూడదని వ్యాఖ్యానించారు.

కాంగ్రెస్ తప్పుల్ని సరిచేస్తున్నాం

అస్సాంతో పాటు ఈశాన్య రాష్ట్రాల అభివృద్ధి కాంగ్రెస్ ఎజెండాలో ఎప్పుడూ లేదని మోదీ విమర్శించారు. ఈశాన్య భారతంలో దశాబ్దాలుగా కాంగ్రెస్ చేసిన తప్పులను తాము సరిచేస్తున్నామన్నారు. బెంగాల్ నుంచి అస్సాంకు చేరుకున్న మోదీ.. గువాహటిలో రూ.5,000 కోట్ల వ్యయంతో నిర్మించిన గోపీనాథ్ బొర్దొలోయి అంతర్జాతీయ విమానాశ్రయంలోని నూతన టెర్మినల్ భవనాన్ని ప్రారంభించారు. అస్సాం తొలి సీఎం, భారతరత్న బొర్దొలోయి 80 అడుగుల ఎత్తైన విగ్రహాన్ని ఆవిష్కరించి ప్రసంగించారు. ప్రకృతిని ఇతివృత్తంగా తీసుకుని అస్సాం సంస్కృతిని ప్రతిబింబించేలా ఈ విమానాశ్రయాన్ని తీర్చిదిద్దారు. చాలావరకు వెదురును వాడారు. "ఓటు బ్యాంకు రాజకీయాల కోసం మతపరమైన బుజ్జగింపులకు కాంగ్రెస్ ప్రాధాన్యమిచ్చింది. రాష్ట్రాన్ని రక్షించేందుకు హిమంత బిశ్వశర్మ ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది" అని చెప్పారు. పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడు, అదానీ గ్రూపు ఛైర్మన్ గౌతం అదానీ పాల్గొన్నారు.



గువాహటి విమానాశ్రయాన్ని పరిశీలిస్తున్న ప్రధాని మోదీ, అస్సాం సీఎం హిమంత, కేంద్రమంత్రులు రామ్మోహన్ నాయుడు, సర్బానంద సోనోవాల్

'ఉపాధి'పై బుల్‌డోజర్ నడిపిన కేంద్రం: సోనియా

దిల్లీ: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంపై కేంద్రంలోని మోదీ ప్రభుత్వం బుల్‌డోజర్ నడిపి ధ్వంసం చేసిందని కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ ఛైర్‌పర్సన్ సోనియాగాంధీ శనివారం ఆరోపించారు. మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ చట్టం (ఎంజీఎన్ఆర్ఈజీఏ) స్థానంలో ప్రభుత్వం ప్రవేశపెట్టిన నల్ల చట్టాన్ని తమ పార్టీ కార్యకర్తలు దేశవ్యాప్తంగా ప్రతిఘటిస్తారని ఆమె ప్రకటించారు. ఎంజీఎన్ఆర్ఈజీఏను బలహీన పరచడం ద్వారా మోదీ ప్రభుత్వం కోట్లాది రైతులు, కూలీలు, భూమిలేని పేదల ప్రయోజనాలను దెబ్బతీసిందని సోనియా తన వీడియో సందేశంలో పేర్కొన్నారు. ఉపాధి హామీ పథకాన్ని ఓ విప్లవాత్మక అడుగుగా పేర్కొంటూ, అది అట్టడుగు వర్గాలకు, నిరుపేదలకు, దోపిడీకి గురైన వర్గాలకు బతుకు తెరువు కల్పించిందని అన్నారు. "దురదృష్టవశాత్తూ కేంద్ర ప్రభుత్వం ఇటీవల ఈ పథకంపై బుల్‌డోజర్ నడిపి ధ్వంసం చేసింది" అని ఆమె ఆరోపించారు.




ముఖ్యమైన వ్యాజ్యాల పరిష్కారం కోసం రేపు సుప్రీం సెలవు కాలీన ధర్మాసనం

దిల్లీ: న్యాయస్థానం సత్వర జోక్యం అవసరమైన ముఖ్య వ్యాజ్యాల విచారణకు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ ఈనెల 22న (సోమవారం) ప్రత్యేక సెలవుకాలీన ధర్మాసనానికి నేతృత్వం వహిస్తారు. కోర్టుకు క్రిస్మస్, నూతన సంవత్సర సెలవులు ఆరోజే ప్రారంభమవుతున్న విషయం తెలిసిందే. ముఖ్యమైన 17 వ్యాజ్యాలపై విచారణ కోసం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్ మల్యా బాగ్చీలతో కూడుకున్న ఈ ప్రత్యేక సెలవుకాలీన ధర్మాసనం ఉదయం 11 గంటల నుంచి పని ప్రారంభిస్తుందని సుప్రీంకోర్టు వెబ్‌సైట్ తెలిపింది.

తోషాఖానా 2 కేసులో

ఇమ్రాన్ దంపతులకు చెరో 17 ఏళ్ల జైలుశిక్ష

ఇస్లామాబాద్: 'తోషాఖానా-2' కేసులో పాకిస్థాన్ జాతీయ దర్యాప్తు సంస్థ(ఎఫ్ఐఏ)కు చెందిన ప్రత్యేక కోర్టు శనివారం సంచలన తీర్పును వెలువరించింది. మాజీ ప్రధానమంత్రి ఇమ్రాన్ ఖాన్, ఆయన సతీమణి బుష్రా బీబీలకు చెరో 17 ఏళ్ల జైలు శిక్షను న్యాయస్థానం విధించింది. 2021 మే నెలలో పాకిస్థాన్ పర్యటన సందర్భంగా నాటి ప్రధానమంత్రి ఇమ్రాన్ ఖాన్‌కు సౌదీ యువరాజు మహ్మద్ బిన్ సల్మాన్ ఇటాలియన్ లగ్జరీ బ్రాండ్ 'బుల్గారీ'కి చెందిన బంగారు ఆభరణాల సెట్‌ను బహూకరించారు. ఈ విధంగా ప్రభుత్వ ప్రతినిధులు, అధికారులకు అందే బహుమతులు పాకిస్థాన్ ప్రభుత్వ తోషాఖానా విభాగానికి చేరుతాయి. అయితే ఇమ్రాన్ ఖాన్ తన అధికారాన్ని దుర్వినియోగం చేసి ఆ ఆభరణాల సెట్‌ను తక్కువ ధరకే తోషాఖానా నుంచి కొనేశారనే అభియోగంతో 2022 ఆగస్టులో షెహబాజ్ షరీఫ్ ప్రభుత్వం కేసు నమోదుచేసింది. ఇదే 'తోషాఖానా-2' కేసు. ఇందులో ఇమ్రాన్, బుష్రా బీబీ దోషులు అని తేలడంతో కోర్టు తాజాగా తీర్పును ఇచ్చింది. ఇమ్రాన్ ప్రస్తుతం రావల్పిండిలోని అడియాలా జైలులో ఉన్న సంగతి తెలిసిందే. ఆ జైలులోనే జడ్జి అర్జుమంద్ విచారణ జరిపి.. ఇమ్రాన్ దంపతులకు 17 ఏళ్ల జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు. దీంతో పాటు ఒక్కొక్కరికీ 1.64 కోట్ల పాకిస్థానీ రూపాయలు జరిమానా కూడా విధించారు. ఇమ్రాన్ వయసు, ఆయన భార్య మహిళ అనే అంశాలను పరిగణనలోకి తీసుకొని ఈ తీర్పు ఇస్తున్నట్లు పేర్కొన్నారు. తీర్పును తాము హైకోర్టులో సవాల్ చేస్తామని ఇమ్రాన్ తరఫు న్యాయవాది తెలిపారు.



బీఎస్ఎఫ్ కానిస్టేబుళ్ల నియామకాల్లో అగ్నివీరుల కోటా 50 శాతానికి పెంపు

దిల్లీ: సరిహద్దు భద్రతా దళం (బీఎస్ఎఫ్) నియామకాల్లో నిబంధనలను సవరిస్తూ కేంద్ర హోం మంత్రిత్వ శాఖ నోటిఫికేషన్ జారీ చేసింది. బీఎస్ఎఫ్ కానిస్టేబుళ్ల నియామకాల్లో గతంలో 10 శాతం ఉన్న మాజీ అగ్నివీరుల కోటాను 50శాతానికి పెంచినట్లు వెల్లడించింది. మాజీ అగ్నివీరుల మొదటి బ్యాచ్‌కు ఐదు సంవత్సరాల వరకు గరిష్ఠ వయోపరిమితి సడలింపు, మిగిలిన వారికి మూడేళ్ల సడలింపును కల్పించింది. మాజీ అగ్నివీరులకు శారీరక ప్రమాణాలు, సామర్థ్య పరీక్షల నుంచి మినహాయింపు ఉంటుందని నోటిఫికేషన్ పేర్కొంది. ప్రత్యక్ష నియామకం ద్వారా ప్రతి ఏడాది చేపట్టే నియామకాల్లో 50శాతం మాజీ అగ్నివీరులకు, 10శాతం మాజీ సైనికులకు, 3శాతం వరకు పోరాట కానిస్టేబుల్ (ట్రేడ్స్‌మెన్)కు కేటాయించనున్నట్లు తెలిపింది. మొదటిదశలో మాజీ అగ్నివీరుల కోసం కేటాయించిన 50శాతం ఖాళీలకు నోడల్ ఫోర్స్ నియామకాలు చేపడుతుంది.

ఇదేం పైత్యం!

ఇంటర్నెట్ డెస్క్: రీల్స్ పిచ్చితో కొందరు ప్రమాదకర స్టంట్‌లు చేస్తూ ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. తాజాగా ఉత్తర్‌ప్రదేశ్ జాతీయ రహదారిపై హాపుడ్ వద్ద ఉన్న రైల్వే వంతెనకు ఓ వ్యక్తి వేలాడుతూ.. కింది నుంచి వాహనాలు వెళ్తుండగా వంతెన అంచును పట్టుకొని పుల్‌అప్స్ తీశాడు. ఈ వీడియో వైరల్ అవుతోంది. ఆ వ్యక్తి ఎవరు అనే వివరాలు తెలియరాలేదు.



గంటా శ్రీనివాసరావు మనవడికి గిన్నిస్ బుక్‌లో చోటు

విశాఖపట్నం (మధురవాడ), న్యూస్‌టుడే: విశాఖపట్నం జిల్లా భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు మనవడు గంటా జిష్ణు ఆర్యన్.. గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో చోటు సంపాదించాడు. ఎనిమిదేళ్ల వయసున్న ఈ బాలుడు హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో నిమిషం వ్యవధిలో 216 దశాంశాల (డెసిమల్స్) స్వర్ణ నిష్పత్తిని (గోల్డెన్ రేషియో) అనర్గళంగా చెప్పి ఈ రికార్డు సృష్టించాడు. ఆర్యన్ తండ్రి రవితేజ ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు కుమారుడు కాగా, తల్లి శరణి మంత్రి పొంగూరి నారాయణ కుమార్తె. రవితేజ, శరణి దంపతులిద్దరూ నారాయణ విద్యాసంస్థల డైరెక్టర్లు.



గిన్నిస్ ధ్రువపత్రంతో జిష్ణుఆర్యన్

భాజపాలో చేరిన సినీనటి ఆమని

ఈనాడు, హైదరాబాద్: ప్రముఖ సినీనటి ఆమని శనివారం భాజపాలో చేరారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి సమక్షంలో భాజపా తెలంగాణ అధ్యక్షుడు ఎన్.రామచందర్‌రావు ఆమెకు పార్టీ కండువా కప్పి, ప్రాథమిక సభ్యత్వం అందజేశారు. ఆమనితోపాటు మేకప్ ఆర్టిస్ట్ శోభలత కూడా పార్టీలో చేరారు. మోదీ చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్'కు తాను ఎంతో ఆకర్షితురాలినయ్యానని, భాజపాలో చేరి ప్రజాసేవ చేయాలనేది తన లక్ష్యమని ఆమని తెలిపారు.





బోల్తా పడిన ట్రక్కు

ట్రక్కు బోల్తా.. 50 గోవుల మృతి

జయపురం, న్యూస్‌టుడే: ట్రక్కు బోల్తాపడి 50 గోవులు మృతి చెందిన ఘటన ఒడిశాలో శనివారం చోటుచేసుకుంది. గోవులను తరలిస్తున్న ట్రక్కు కొరాపుట్ జిల్లాలోని కొట్పాడ్-బొరిగుమ్మ రహదారిపై ఘుమర వద్ద అదుపు తప్పింది. అలానే దూసుకుపోయి పొలంలో బోల్తా కొట్టడంతో అందులోని మూగజీవాలు అక్కడికక్కడే మృతి చెందాయి. డ్రైవర్ తీవ్రంగా గాయపడ్డాడు. చుట్టుపక్కల ప్రాంతాల నుంచి ప్రతి శనివారం పొరుగు రాష్ట్రాలకు వాహనాల్లో గోవులను తరలిస్తున్నా యంత్రాంగం ఎలాంటి చర్యలూ తీసుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సైబర్ నేరాలు తగ్గాయట!

- సీఎం ముందు లెక్కలు చూపిన పోలీసు శాఖ
- మోసాలు, బాధితులు పెరుగుతుంటే నేరాలు ఎలా తగ్గాయో?
- ఫిర్యాదులొచ్చినా కేసులు సరిగా నమోదు చేయకపోవటమే కారణం

ఈనాడు – అమరావతి: దేశవ్యాప్తంగా సైబర్ నేరాలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. ఏపీలోనూ నిత్యం అనేక మంది వీటి బారిన పడుతున్నారు. డిజిటల్ అరెస్టులు, ఆన్‌లైన్ మోసాలకు బాధితులవుతున్న వారి గురించి తరచూ వింటూనే ఉన్నాం. కానీ ఏపీ పోలీసు శాఖ మాత్రం రాష్ట్రంలో సైబర్ నేరాలు గణనీయంగా తగ్గాయంటూ గణాంకాలు చూపిస్తోంది. 2023 డిసెంబరు నుంచి 2024 నవంబరు వరకూ 1,905 కేసులు నమోదు కాగా, 2024 డిసెంబరు నుంచి ఈ ఏడాది నవంబరు వరకూ 1,494 కేసులు నమోదయ్యాయని చెబుతోంది. ఏడాది వ్యవధిలో సైబర్ నేరాలు 21.57 శాతం తగ్గాయంటోంది. తాజాగా కలెక్టర్ల సదస్సులో ముఖ్యమంత్రి చంద్రబాబు ఎదుట ఉన్నతాధికారులు ఈ గణాంకాలే ప్రదర్శించారు. ఓవైపు రాష్ట్రంలో సైబర్ మోసాలు, బాధితులు పెరుగుతుంటే.. ఆ నేరాలు ఎలా తగ్గాయో అధికారులకే తెలియాలి. అలాగని సైబర్ నేరాల్ని నిజంగానే ఆ స్థాయిలో అరికట్టేశారా? పోనీ ఆ దిశగా చర్యలు తీసుకున్నారా అంటే అదీ లేదు. సైబర్ మోసాల బారిన పడుతున్న బాధితులు ఫిర్యాదు ఇచ్చేలా అవగాహన కల్పించకపోవటం, అనేక ఫిర్యాదులపై కేసు నమోదు చేయకపోవటం వల్లే ఈ నేరాల సంఖ్య తగ్గినట్లు కనిపిస్తోంది.

తలనొప్పులు మనకెందుకంటూ..

- రాష్ట్రంలో సీఐడీ ప్రధాన కార్యాలయం, విశాఖపట్నం, విజయవాడ కమిషనరేట్లలో మాత్రమే సైబర్ నేరాల పోలీస్‌స్టేషన్లు ఉన్నాయి. మెజారిటీ కేసులు వాటిలోనే నమోదవుతున్నాయి. జిల్లాకొక సైబర్ పోలీస్‌స్టేషన్ ఏర్పాటు చేస్తామని ఏడాదిగా చెబుతున్నా ముందడుగు పడలేదు.
- అత్యధిక సందర్భాల్లో బాధితులకు ఎక్కడ ఫిర్యాదు చేయాలో, ఎలా చేయాలో తెలియదు. స్థానిక పోలీసుస్టేషన్లకు వెళితే.. పోలీసులు వారిని సవాలక్ష ప్రశ్నలతో విసిగిస్తున్నారు. సైబర్ నేరాల కేసులు నమోదు చేస్తే వాటి దర్యాప్తు తలనొప్పులు తమకు చుట్టుకుంటాయనే ఉద్దేశంతో పలు చోట్ల ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయడం లేదు. పలుకుబడి ఉన్నవారితో సిఫార్సు చేయించుకుంటేనో లేదంటే ఎస్పీలు చురుగ్గా ఉన్న జిల్లాల్లో వారి చొరవతోనో తప్ప కేసులు నమోదు కావట్లేదు. దీంతో సైబర్ నేరాల సంఖ్య తగ్గినట్లు కనిపిస్తోంది.
- సీఐడీలో ప్రత్యేకంగా సైబర్ నేరాల విభాగం ఏర్పాటు చేసినా తగిన వనరులు, సిబ్బంది లేరు. ఎలాంటి నేరాలు జరుగుతున్నాయి? వాటి బారిన పడకుండా ఏయే జాగ్రత్తలు తీసుకోవాలి, సైబర్ నేరాల బారిన పడితే వెంటనే ఎవరికి, ఎలా ఫిర్యాదు చేయాలో అవగాహన కల్పించటంలో ఈ విభాగం విఫలమైంది.

ఐదేళ్లుగా సైబర్ నేరాలు ఇలా..

2021	1,875
2022	2,341
2023	2,341
2024	2,853
2025	1,771

- ఏటా పెరుగుతున్న కేసులు ఈ ఏడాది ఒక్కసారిగా తగ్గిపోయాయంటే అర్థమేంటి? నమోదు చేయట్లేదనే కదా!

భార్యను ఖర్చుల లెక్కలడగడం క్రూరత్వం కిందికి రాదు

- హైదరాబాద్‌కు చెందిన భార్యాభర్తల వివాదంలో సుప్రీంకోర్టు తీర్పు
- భర్త, ఆయన కుటుంబ సభ్యులపై ఎఫ్ఐఆర్ కొట్టివేత

ఈనాడు, దిల్లీ: భర్త తాను ఇచ్చిన డబ్బుకు సంబంధించి భార్యను లెక్కలడగడం క్రూరత్వం కిందికి రాదని సుప్రీంకోర్టు పేర్కొంది. అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్న భర్త, ఆయన కుటుంబ సభ్యులపై హైదరాబాద్‌లో ఉంటున్న ఓ మహిళ 2022లో సరూర్‌నగర్ ఉమెన్ పోలీస్‌స్టేషన్‌లో నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌ను కొట్టేస్తూ ఇచ్చిన తీర్పులో జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ ఆర్.మహదేవన్‌లతో కూడిన ధర్మాసనం ఈ మేరకు అభిప్రాయపడింది. సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు అయిన వీరిద్దరికీ 2016లో వివాహం కాగా.. అమెరికాలో 2019 వరకు కలిసి ఉన్నారు. అక్కడే బాబు పుట్టాడు. ఆ తర్వాత ఇద్దరి మధ్య గొడవ తలెత్తడంతో ఆమె కొడుకును తీసుకొని హైదరాబాద్‌లోని పుట్టింటికి వచ్చారు. దాంపత్య హక్కుల పునరుద్ధరణ కోరుతూ 2022లో ఆమెను అమెరికాకు తిరిగి రావాలని భర్త నోటీసు పంపారు. ఆ వెంటనే భార్య అతనితో పాటు, అతని కుటుంబ సభ్యులపై గృహహింస, వరకట్న వేధింపుల నిరోధక చట్టం కింద సరూర్‌నగర్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. 'నేను భారత్‌కు తిరిగి వచ్చిన తర్వాత భర్త నాకు, నా బిడ్డకు ఆర్థికంగా సాయం చేయడం లేదు. కుటుంబ అవసరాల కోసం ఎప్పుడు డబ్బుడిగినా ప్రతి పైసాకూ లెక్క అడుగుతారు. ఇండియాలో ఉన్న తన తల్లిదండ్రులకు మాత్రం రూ.లక్షలు పంపుతారు" అని అందులో పేర్కొన్నారు. భర్త హైకోర్టును ఆశ్రయించగా అక్కడా చుక్కెదురైంది. దాంతో అతను సుప్రీంకోర్టుకు వెళ్లారు. దీనిపై విచారించిన సుప్రీంకోర్టు ఈ ఎఫ్ఐఆర్‌ను కొట్టేయడంతో పాటు సెక్షన్ 498ఎ కింద ఏయే అంశాలను పరిగణనలోకి తీసుకోవాలో స్పష్టం చేసింది.

గృహ హింస ఫిర్యాదులను పరిశీలించేటప్పుడు జాగ్రత్తగా ఉండాలి

"మహిళను ఆత్మహత్యకు ఉసిగొల్పేలా వ్యవహరించడమో, ప్రాణానికో, ఆరోగ్యానికో (భౌతికంగా, మానసికంగా) తీవ్ర హాని తలపెట్టడమో, డబ్బు, ఆస్తుల కోసం మహిళను వ్యక్తిగతంగానో లేదంటే ఆమె సంబంధీకులను వేధించడమో మాత్రమే ఐపీసీ సెక్షన్ 498ఎ ప్రకారం క్రూరత్వం కిందికి వస్తుంది. వరకట్న నిషేధ చట్టంలోని సెక్షన్ 3 ప్రకారం కట్నం ఇవ్వడం, పుచ్చుకోవడం నేరం. అందుకు కారకులైన వారికి కనీసం 5 ఏళ్ల జైలు, రూ.15 వేలు కానీ, లేదంటే కట్నం విలువంతకానీ జరిమానా విధించడానికి వీలుంది. ప్రత్యక్షంగా, పరోక్షంగా కట్నం డిమాండ్ చేసిన వారికి ఆరునెలల నుంచి రెండేళ్ల వరకు జైలు, రూ.పదివేల వరకు జరిమానా విధించడానికి ఇదే చట్టంలోని సెక్షన్ 4 వీలుకల్పిస్తోంది. అందువల్ల గృహహింస, వరకట్న వేధింపులకు సంబంధించిన ఫిర్యాదులను పరిశీలించేటప్పుడు న్యాయస్థానాలు అత్యంత జాగ్రత్తగా ఉండాలి. ఈ కేసులో భర్తపై మహిళ చేసిన ఆరోపణలను ఎట్టి పరిస్థితుల్లోనూ క్రూరత్వం కింద పరిగణించడానికి వీల్లేదు. భర్త లెక్కలడగడం క్రూరత్వ నిర్వచన పరిధిలోకి రాదు. తాను గర్భవతిగా ఉన్నప్పుడు భర్త సరిగా చూసుకోలేదని, కాన్పు అయిన తర్వాత లావుతగ్గమని వేధించాడని భార్య ఆరోపిస్తున్నారు. ఒకవేళ నిజమే అనుకున్నా అది సదరు వ్యక్తి గుణాన్ని ప్రతిబింబిస్తుంది తప్పితే క్రూరత్వం కిందికి రాదు. ఎఫ్ఐఆర్‌లో భార్య చేసిన ఆరోపణలు నిరాధారంగా ఉన్నాయి" అని ధర్మాసనం పేర్కొంది.

భారతీయ ప్రాచీన జ్ఞానంతో ప్రపంచ సమస్యల పరిష్కారం

- బ్రహ్మకుమారీస్ శాంతిసరోవర్ 21వ వార్షికోత్సవంలో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము

ఈనాడు, హైదరాబాద్; గచ్చిబౌలి, న్యూస్‌టుడే: సామాజిక ఐక్యతకు, జాతీయ ప్రగతికి ఆధ్యాత్మికత ఒక బలమైన పునాదిగా పనిచేస్తుందని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము అన్నారు. ఆధ్యాత్మిక చైతన్యంతో ప్రేరణ కలిగిన ప్రజలు సమాజంలో సానుకూల మార్పు తీసుకురావడానికి కృషి చేస్తారని, దేశ నిర్మాణానికి చురుగ్గా సహకరిస్తారని పేర్కొన్నారు. బ్రహ్మకుమారీస్ శాంతి సరోవర్ 21వ వార్షికోత్సవం సందర్భంగా శనివారం హైదరాబాద్ గచ్చిబౌలిలోని గ్లోబల్ పీస్ ఆడిటోరియంలో నిర్వహించిన 'భారత కాలాతీత జ్ఞానం: శాంతి, పురోగతికి మార్గం' సదస్సులో రాష్ట్రపతి ప్రసంగించారు. భారతీయ ప్రాచీన జ్ఞానం, ఆధ్యాత్మిక వారసత్వం ప్రపంచ మానవాళి ఎదుర్కొంటున్న మానసిక, నైతిక, పర్యావరణ సమస్యలకు పరిష్కారం చూపుతుందని ఆమె అన్నారు. వేల ఏళ్లుగా భారతీయ నాగరికత సత్యం, న్యాయం, కరుణ, ప్రకృతితో మమేకమై జీవించడం వంటి సూత్రాలపై ఆధారపడి ఉందని గుర్తుచేశారు. వసుధైక కుటుంబం భావన నేటి ప్రపంచ శాంతికి అత్యంత అవసరమన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం ద్వారా భారతీయ ప్రాచీన జ్ఞానానికి ప్రపంచ గుర్తింపు లభించిందని... తద్వారా ప్రపంచ శాంతికి, మానవ కల్యాణానికి అగ్రదూతగా భారత్ నిలిచిందని ఆమె తెలిపారు. భౌతిక అభివృద్ధితో మాత్రమే జీవితంలో సుఖశాంతులు లభించవని... అంతర్గత స్థిరత్వం, భావోద్వేగాల నియంత్రణ, విలువలతో కూడిన ఆలోచన చాలా అవసరమని పేర్కొన్నారు. అణగారిన వర్గాల అభివృద్ధిని కాంక్షించే సమతుల అభివృద్ధి ఉపనిషత్తుల సారాంశానికి అనుగుణంగా ఉందని రాష్ట్రపతి చెప్పారు. పర్యావరణ పరిరక్షణ, స్వచ్ఛ ఇంధనం కోసం ప్రభుత్వం చేపడుతున్న చర్యలు ప్రకృతితో సహజీవనం చేయాలనే భారతీయ ఆలోచన విధానం నుంచి ఉద్భవించాయని వివరించారు. భారతీయ విలువలను వివిధ దేశాలకు వ్యాపింపజేస్తున్నాయంటూ బ్రహ్మకుమారీస్ సంస్థను రాష్ట్రపతి అభినందించారు. 21 ఏళ్లుగా విలువలతో కూడిన వ్యక్తిత్వ నిర్మాణం, శాంతి, సానుకూలతలు పెంపొందిస్తున్నారని ఆమె పేర్కొన్నారు.



సదస్సును జ్యోతి వెలిగించి ప్రారంభిస్తున్న రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము. చిత్రంలో తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, మంత్రి సీతక్క

డీఎం ప్రవేశపరీక్షలో ప్రొద్దుటూరు వైద్యుడికి మొదటి ర్యాంకు

ప్రొద్దుటూరు విద్య, న్యూస్‌టుడే: వైఎస్సార్ కడప జిల్లా ప్రొద్దుటూరుకు చెందిన డాక్టర్ డి.భవానీ శంకర్ సూపర్ స్పెషాలిటీ డీఎం ఇంటర్వెన్షనల్ రేడియాలజీలో ఆలిండియా మొదటి ర్యాంకు సాధించారు. అఖిలభారత వైద్యవిజ్ఞాన సంస్థ (ఎయిమ్స్) దిల్లీ నిర్వహించిన జాతీయస్థాయి డాక్టర్ ఆఫ్ మెడిసిన్ (డీఎం) ప్రవేశపరీక్ష మెరిట్ లిస్టులో మొదటి ర్యాంకుతో సత్తా చాటి తిరువనంతపురంలోని శ్రీచిత్రా తిరునాల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ మెడికల్ సైన్సెస్, టెక్నాలజీలో కార్డియోవాస్క్యులర్ రేడియాలజీ, ఎండోవాస్క్యులర్ ఇంటర్వెన్షన్ విభాగంలో డీఎం సీటు సాధించారు. భవానీశంకర్ తండ్రి సుధాకర్ తిరుపతి సీఐడీ విభాగంలో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నారు. తల్లి సుధామాధవి గృహిణి. కుమారుడి ప్రతిభతో తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. డాక్టర్ భవానీశంకర్ పదోతరగతి వరకూ ప్రొద్దుటూరు వైఎంఆర్ కాలనీలోని గౌతమ్ పాఠశాలలో చదివారు. విజయవాడలో ఇంటర్, కర్నూలు వైద్యకళాశాలలో ఎంబీబీఎస్ పూర్తిచేశారు.



డాక్టర్ భవానీశంకర్



వలకు చిక్కిన భారీ తిమింగలం

సముద్రంలో వేటకు వెళ్లిన మత్స్యకారుల వలకు భారీ తిమింగలం చిక్కింది. అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం మండలం పూడిమడకకు చెందిన మత్స్యకారులు శనివారం సముద్రంలో వల వేయగా పెద్దఎత్తున చేపలు పడినట్లు అనిపించింది. వలను కొద్ది దూరం లాక్కొచ్చాక అందులో తిమింగలం పడినట్లు గుర్తించారు. వెంటనే దాన్ని ఒడ్డుకు తీసుకొచ్చి, వల నుంచి విడిపించారు. స్థానికుల సాయంతో తిరిగి సముద్రంలోకి పంపించారు. అప్పటికే అది కొన ఊపిరితో ఉన్నట్లు మత్స్యకారులు తెలిపారు.

–న్యూస్‌టుడే, అచ్యుతాపురం

EENADU Vol: 52, Issue: 131 | Printed and Published by M Nageswara Rao on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Pvt Ltd. Printed and Published at Ushodaya Publications, Eenadu Press, Survey No. 239/3, 240/3B & 240/4, Gudavalli Village, Vijayawada Rural Mandal, NTR District - 521 104, Andhra Pradesh. Editor: M Nageswara Rao. Phones: 0866-2494900, 2862111. Regd. No. VJ/013/2024-26. RNI No.32238/1978. Air Surcharge Extra. Mumbai, Kolkata, Goa. Re. 1.00, Portblair Rs. 10.00. | Founder Ramoji Rao

ఈనాడు సినిమా

సమయం ఆసన్నమైందా?



అల్లు అర్జున్

అల్లు అర్జున్ సినిమాల చుట్టూ ప్రస్తుతం చర్చ నడుస్తోంది. సెట్స్‌పై ఉన్న సినిమా గురించి కొంచెమైతే, ఆయన చేయనున్న కొత్త సినిమాల గురించి మరికొంచెం ఆసక్తికరంగా మాట్లాడుకుంటున్నాయి పరిశ్రమ వర్గాలు. అట్లీ దర్శకత్వంలో ఓ సినిమా చేస్తున్న అల్లు అర్జున్, ఆ తర్వాత చేయనున్న సినిమాపై ఇంకా స్పష్టత రాలేదు. పలువురు దర్శకుల పేర్లు వినిపించినా, ఆయన ఎవరితో జట్టు కడతారనేది మాత్రం ఇంకా తేలలేదు. అయితే కొత్త సినిమాపై నిర్ణయం తీసుకోవడానికి సమయం మాత్రం దగ్గరకొచ్చిందని, కొత్త ఏడాది ఆరంభంలోనే ఆ సినిమాని ప్రకటించే అవకాశాలున్నట్టు సమాచారం. అట్లీ దర్శకత్వంలో ప్రస్తుతం చేస్తున్న సినిమా వచ్చే ఏడాదిలోనే ప్రేక్షకుల ముందుకు రానుంది. దాంతో అల్లు అర్జున్ ఈమధ్యే పలువురు దర్శకులతో కథాచర్చలు సాగించినట్టు తెలుస్తోంది. తెలుగు, తమిళ, మలయాళ... ఇలా మూడు భాషలకు చెందిన దర్శకుల పేర్లు వినిపిస్తున్నాయి. మరి బన్నీ నిర్ణయం ఏమిటనేది త్వరలోనే తెలుస్తుంది. ఇలా ఈ చర్చంతా ఒకెత్తైతే, అల్లు అర్జున్ - అట్లీ కలయికలో రూపొందుతున్న సినిమా ఒక భాగంగా వస్తుందా లేక రెండు భాగాలుగానా అనేది ఇంకో చర్చ. రెండు భాగాలుగా సినిమాని తీసుకు రావాలనేది అట్లీ నిర్ణయమని, అందుకే తొలి భాగాన్ని వీలైనంత త్వరగా పూర్తి చేసి వచ్చే ఏడాది ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తారని ప్రచారం సాగుతోంది.

బాలీవుడ్ కంఫర్ట్ జోనే కానీ...!



మృణాల్ ఠాకూర్

కొత్తదనం నిండిన కథలతో అభిమానుల్ని అలరిస్తుంటుంది అందాల తార మృణాల్ ఠాకూర్. 'సన్ ఆఫ్ సర్దార్ 2'తో 2025కి టాటా చెప్పేసిన ఆమె.. వచ్చే ఏడాది భాషతో సంబంధం లేకుండా వరుస ప్రాజెక్టులతో తెరపై మెరవడానికి ముస్తాబవుతోంది. ఈ నేపథ్యంలోనే తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న మృణాల్.. తెలుగు, హిందీ సినిమాల్లో నటించడం గురించి కొన్ని ఆసక్తికర విషయాల్ని పంచుకుంది. "కొన్నిసార్లు నాలో మంచి ప్లానర్ ఉన్నారని అనిపిస్తుంది. ఎందుకంటే నాకు సినిమాల విషయంలో ముందుగానే ప్రణాళికలు వేసుకోవడం ఇష్టం. నన్ను ఎంతో ఆరాధిస్తున్న తెలుగు అభిమానుల్ని నిరాశపరచకూడదని అనుకుంటున్నా. బాలీవుడ్ నా కంఫర్ట్ జోన్. కానీ నటిగా సరిహద్దులను దాటి నటించడమే నాకిష్టం. 2026లో నేను కథానాయికగా చేసిన హిందీ సినిమా 'దో దీవానే సెహెర్ మే', తెలుగు చిత్రం 'డెకాయిట్' రానున్నాయి. రెండు భాషలకు చెందిన ఈ సినిమాల్ని ఒకేసారి ఏకకాలంగా చిత్రీకరించడంలో సహాయం చేసిన దర్శకనిర్మాతలకు ధన్యవాదాలు. ఇది చాలా సవాలుతో కూడుకున్న విషయం. కానీ ఇలా ఉండాలనే నేను కలలు కన్నాను. చివరికి ఇప్పుడు సాధ్యమవుతోంద'ని చెప్పుకొచ్చింది.

'మా వందే'.... మొదలు



గంగాధర్, రవి బస్రూర్, ఉన్ని ముకుందన్, క్రాంతికుమార్, సెంథిల్, వీర్ రెడ్డి ఎం, రాజేశ్, సాబు సిరిల్

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జీవితకథను 'మా వందే' పేరుతో తెరపైకి తీసుకొస్తున్నారు దర్శకుడు సి.హెచ్. క్రాంతికుమార్. ఇందులో మోదీ పాత్రను మలయాళ స్టార్ ఉన్ని ముకుందన్ పోషిస్తున్నారు. వీర్ రెడ్డి ఎం నిర్మిస్తున్నారు. రవీనా టాండన్ కీలక పాత్ర పోషిస్తోంది. ఈ సినిమా తాజాగా పూజా కార్యక్రమాలతో చిత్రీకరణ ప్రారంభించుకుంది. "ప్రధాని మోదీ వ్యక్తిగత, రాజకీయ జీవితంలోని విశేషాల్ని ఇందులో ఎంతో సహజంగా చూపించనున్నాం. ఎన్నో పోరాటాల కన్నా తల్లి సంకల్పం గొప్పదనే సందేశాన్ని ప్రేక్షకులకు అందిస్తుంది. అంతర్జాతీయ ప్రమాణాలతో, అత్యున్నత సాంకేతిక హంగులతో ముస్తాబు కానున్న ఈ సినిమా పాన్ ఇండియా భాషలతో పాటు ఇంగ్లిష్‌లోనూ ఒకేసారి విడుదల కానుంది. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ రామోజీ ఫిల్మ్ సిటీలో జరుగుతోంద"ని చిత్ర వర్గాలు తెలిపాయి. ఈ చిత్రానికి సంగీతం: రవి బస్రూర్, కూర్పు: శ్రీకర్ ప్రసాద్, ఛాయాగ్రహణం: కె కె సెంథిల్ కుమార్, ప్రొడక్షన్ డిజైనర్: సాబు సిరిల్, ఎగ్జిక్యూటివ్ నిర్మాతలు: గంగాధర్ ఎన్ ఎస్, వాణిశ్రీ.బి, లైన్ ప్రొడ్యూసర్: రాజేశ్.

'శంబాల' ఇంతలా జనాల్లోకి వెళ్లిందా!



రాజశేఖర్, మహీధర్

"హారర్, సస్పెన్స్‌తో పాటు బలమైన భావోద్వేగాలు నిండిన సినిమా 'శంబాల'. ఇది కచ్చితంగా అందర్నీ ఆశ్చర్యపరుస్తుంది" అన్నారు నిర్మాతలు రాజశేఖర్ అన్నభీమోజు, మహీధర్ రెడ్డి. ఆది సాయికుమార్ హీరోగా నటించిన ఈ 'శంబాల'ని యుగంధర్ ముని తెరకెక్కించారు. అర్చన అయ్యర్, స్వసిక, రవి వర్మ కీలక పాత్రలు పోషించారు. ఈ చిత్రం ఈనెల 25న ప్రేక్షకుల ముందుకు రానున్న నేపథ్యంలో శనివారం హైదరాబాద్‌లో విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నిర్మాతలు రాజశేఖర్, మహీధర్ మాట్లాడుతూ.. "ఈ సినిమాని మొదలు పెట్టినప్పుడు ఇంతటి స్థాయిలో జనాల్లోకి వెళ్తుందని అనుకోలేదు. అందుకే మొదట్లో దీన్ని కొంచెం తక్కువ బడ్జెట్‌లో అనుకున్నప్పటికీ ఆ తర్వాత బడ్జెట్ పెంచి క్వాలిటీగా పూర్తి చేశాం. ఇప్పటికే ఓటీటీ, శాటిలైట్ రైట్స్ ద్వారా 80శాతం పెట్టుబడి తిరిగొచ్చేసింది. మిగిలినది థియేట్రికల్ రన్‌తో లాభాల్లోకి వస్తామని నమ్ముతున్నాం" అన్నారు.

సంక్రాంతి పండగ లాంటి చిత్రం



సుధాకర్, డింపుల్ హయాతి, కిశోర్ తిరుమల, ఆషికా రంగనాథన్


"ఆద్యంతం వినోదాత్మకంగా సాగే సినిమా 'భర్త మహాశయులకు విజ్ఞప్తి'. దీన్ని చూస్తే మన జీవితం తెరపై చూసుకున్నట్లుగానే ఉంటుంది" అన్నారు దర్శకుడు కిశోర్ తిరుమల. ఆయన దర్శకత్వంలో రవితేజ కథానాయకుడిగా నటించిన ఈ చిత్రాన్ని సుధాకర్ చెరుకూరి నిర్మించారు. ఆషికా రంగనాథన్, డింపుల్ హయాతి కథానాయికలు. ఈ సినిమా సంక్రాంతి సందర్భంగా జనవరి 13న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలోనే శనివారం హైదరాబాద్‌లో విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నటి ఆషికా రంగనాథ్ మాట్లాడుతూ.. "ఇందులో మోడ్రన్ రిలేషన్‌షిప్ గురించి చాలా సున్నితంగా చక్కటి హాస్యంతో చెప్పనున్నాం. ఈ సినిమా చూస్తుంటే ఒక సంక్రాంతి పండగలాగే ఉంటుంది" అంది. "నేనిందులో బాలామణి పాత్ర పోషించా. దీంట్లో ఓ కొత్త డింపుల్‌ని చూస్తారు" అంది డింపుల్ హయాతి. దర్శకుడు కిశోర్ తిరుమల మాట్లాడుతూ.. "రవితేజ మార్క్ ఫన్ ఎక్కడా తగ్గకుండా నాదైన శైలిలో ఈ చిత్రాన్ని చాలా వినోదాత్మకంగా మలిచాను. దీంట్లో రామ్ సత్యనారాయణ పాత్రలో రవితేజ చాలా ఫ్రెష్‌గా కనిపిస్తారు" అన్నారు. "సంక్రాంతికి వినోదాత్మక చిత్రాలు బాగా ఆడతాయి. అందుకే పండక్కి రావాలని ఈ సినిమా చేశాం" అన్నారు నిర్మాత సుధాకర్ చెరుకూరి.

జనవరి 1న... 'వానర'

అవినాశ్ తిరువీధుల కథానాయకుడిగా నటిస్తూ, దర్శకత్వం వహించిన 'వానర' జనవరి 1న ప్రేక్షకుల ముందుకు రానుంది. అవినాశ్ బుయానీ, ఆలపాటి రాజా, సి. అంకిత్‌రెడ్డి నిర్మిస్తున్న చిత్రమిది. సిమ్రాన్ చౌదరి కథానాయిక. నందు ప్రతినాయకుడిగా నటించారు. పురాణాలతో ముడిపడిన పల్లెటూరి కథతో రూపొందిన ఈ చిత్రం మొదట క్రిస్మస్ సందర్భంగా విడుదలకు సిద్ధమైంది. అయితే 25న చాలా సినిమాలు విడుదలవుతుండడంతో, 'వానర' చిత్రాన్ని జనవరి 1న ప్రేక్షకుల ముందుకు తీసుకు రావాలని చిత్రబృందం నిర్ణయించింది. 'ఖడ్గం' పృథ్వీ, కోన వెంకట్, సత్య, ఆమని తదితరులు నటించిన ఈ చిత్రానికి ప్రొడక్షన్ డిజైనర్: ఎన్. శ్రీనివాస్, సంభాషణలు: సాయిమాధవ్ బుర్రా, కూర్పు: ఛోటా కె. ప్రసాద్, ఛాయాగ్రహణం: సుజాత సిద్ధార్థ్, సంగీతం: వివేక్ సాగర్, కథ, స్క్రీన్‌ప్లే: విశ్వజిత్, సమర్పణ: శంతను పత్తి.

ఛాంపియన్‌తో ఓ కొత్త రోషన్

"ప్రేక్షకుల్ని థియేటర్లకు రప్పించాలంటే వాళ్లకు మంచి అనుభూతిని అందించే చిత్రాలు చేయాలి. అందుకే నా ప్రతి సినిమా విభిన్నంగా ఉండాలని కోరుకుంటా" అన్నారు హీరో రోషన్. ఇప్పుడాయన నుంచి వస్తున్న కొత్త చిత్రం 'ఛాంపియన్'. ప్రదీప్ అద్వైతం తెరకెక్కించారు. అనస్వర రాజన్ కథానాయిక. ఈ సినిమా ఈనెల 25న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలోనే శనివారం హైదరాబాద్‌లో విలేకర్లతో ముచ్చటించారు రోషన్.



రోషన్

"నిజానికి హీరోలంతా 25ఏళ్ల వయసులోనే తెరపైకి వస్తుంటారు. కానీ, నేను 21ఏళ్లకే వచ్చేశాను. వాస్తవానికి యాక్టింగ్ అంటే చాలా భావోద్వేగాలు తెలియాలి. దానికి ఒక పరిణతి కావాలి. అందుకే 'పెళ్లి సందడి' తర్వాత కావాలని గ్యాప్ తీసుకున్నా. నటుడిగా నన్ను నేను చాలా మార్చుకున్నాను. ఈక్రమంలోనే ఈ 'ఛాంపియన్'తో మూడేళ్ల ప్రయాణం చేశాను. ఇప్పుడు సరైన వయసులో.. సరైన కథతో తిరిగి తెరపైకి వస్తున్నందుకు ఆనందంగా ఉంది".

చిత్రీకరణలో గాయాలు

"చరిత్రలో బైరాన్‌పల్లి గురించి చాలా మందికి తెలుసు. అందులో మైఖేల్ విలియమ్స్ అనే ఒక ఫిక్షనల్ పాత్రను సృష్టించి ఈ కథను సిద్ధం చేశారు దర్శకుడు ప్రదీప్. ఇది 1948 నేపథ్యంలో సాగే యాక్షన్ వార్ డ్రామాగా ఉంటుంది. నేనిందులో ఫుట్‌బాల్ ఆటగాడిగా కనిపిస్తాను. దీంట్లో పీటర్ మాస్టర్ అద్భుతమైన పోరాట ఘట్టాల్ని సిద్ధం చేశారు. చిత్రీకరణ సమయంలో కొన్ని గాయాలు కూడా అయ్యాయి".

ప్రతి పాత్రా.. వస్తువు కీలకమే!

"ఈ సినిమాలో నాకు.. అనస్వరకు మధ్య నడిచే ప్రేమకథలో మంచి డ్రామా, చక్కటి వినోదం ఉంటాయి. ముఖ్యంగా అనస్వర పాత్రలో చాలా లోతుంటుంది. కథానాయకుడు లక్ష్యాన్ని పరిపూర్ణం చేస్తుంది. దీంట్లో నా ఒక్కడికే కాదు.. తెరపై కనిపించే ప్రతి పాత్రకు ప్రాధాన్యత ఉంటుంది. ప్రతి పాత్రకీ చక్కటి ప్రారంభం.. ముగింపు ఉంటాయి. అంతే కాదు ఈ సినిమాలో కనిపించే కారు, గన్స్, ఫుట్‌బాల్.. ఇలా ప్రతి వస్తువు కథకు కీలకమే".

క్రికెటర్ అవ్వాలనుకున్నా..

"ఈ సినిమాతో అందరూ కచ్చితంగా ఓ కొత్త రోషన్‌ను చూస్తారు. ఈ చిత్రం నాలో ఓపికను పెంచింది. ఒకప్పటికీ ఇప్పటికీ నాలో చాలా మార్పులొచ్చాయి. ఈ సినిమా చూశాక 'రోషన్ మూడేళ్ల గ్యాప్ తీసుకుని మంచి పని చేశాడ'ని మీరే అంటారు. నిజానికి నేను ఇండస్ట్రీలోకి రాకముందు క్రికెటర్ అవ్వాలని అనుకున్నా. మా నాన్న శ్రీకాంత్ కూడా నన్ను అలా చూడాలనే అనుకున్నారు. కానీ, కాలేజీ తర్వాత నుంచి నాకు సినిమాలపై ఆసక్తి పెరగడంతో ఇటువైపు వచ్చా. ఇకపై గ్యాప్ లేకుండా రెండేళ్లకు కనీసం మూడు చిత్రాలైనా చేయాలని అనుకుంటున్నా. ఇప్పటికే రెండు కథలు ఒప్పుకున్నా".

నీది కాని ఆత్మ నీ శరీరాన్ని ఆవహిస్తే!



'ఈషా'

"నీ శరీరాన్ని నీది కాని ఆత్మ ఆక్రమించినప్పుడు జరిగే సంఘర్షణ ఎంత భయంకరంగా ఉంటుందో తెలుసా" అని ప్రశ్నిస్తోంది 'ఈషా' బృందం. దీనికి జవాబు తెలియాలంటే తమ చిత్రాన్ని తప్పక చూడాల్సిందే అంటోంది. 'లిటిల్‌హార్ట్స్', 'రాజు వెడ్స్ రాంబాయి' విజయాల తర్వాత నిర్మాతలు బన్నీవాస్, వంశీ నందిపాటి ద్వారా వస్తున్న సినిమానే 'ఈషా'. అఖిల్ రాజ్, త్రిగుణ్, హెబ్బా పటేల్ ప్రధాన పాత్రలు పోషించారు. శ్రీనివాస్ మన్నె తెరకెక్కించారు. కేఎల్ దామోదర్ ప్రసాద్ సమర్పణలో హేమ వెంకటేశ్వరరావు నిర్మించారు. ఈ చిత్రం ఈనెల 25న విడుదల కానుంది. ఈ నేపథ్యంలోనే శనివారం 'ఈషా వార్నింగ్' పేరుతో ఓ వీడియోను విడుదల చేశారు. "మనుషుల్లాగే కొన్ని స్థలాలు కూడా పుట్టుకతోనే శాపగ్రస్తమై ఉంటాయి. తర్వాత అవి క్రమంగా ఆత్మలకు నిలయాలుగా మారతాయి" అంటూ ఓ వ్యక్తి చెప్పే డైలాగ్‌తో సాగిన ఈ వీడియో ఆద్యంతం భయపెట్టేలా సాగింది. 'దెయ్యాలు లేవని నమ్మే నలుగురు స్నేహితుల చుట్టూ తిరిగే కథ ఇది. వాళ్లు ఓ చీకటి ప్రపంచంలోకి అడుగు పెట్టినప్పుడు ఎలాంటి భయానక పరిస్థితులు ఎదుర్కొన్నారు? అన్నది ఆసక్తికరం. ఇది తప్పకుండా థియేటర్లలో ప్రేక్షకుల్ని భయపెడుతుంది" అని చిత్ర బృందం తెలిపింది.

మలయాళ నటుడు శ్రీనివాసన్ మృతి



మలయాళ నటుడు, దర్శకనిర్మాత శ్రీనివాసన్(69) కన్నుమూశారు. కొన్ని రోజులుగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఆయన శనివారం తుదిశ్వాస విడిచినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. నాలుగు దశాబ్దాలకు పైగా చిత్రపరిశ్రమలో రాణించిన ఆయన.. దాదాపు 200లకు పైగా చిత్రాల్లో నటించి మెప్పించారు. రచయితగా పలు సినిమాలకు పనిచేసిన శ్రీనివాసన్.. 'వడక్కునోక్కియంత్రం'తో దర్శకుడిగా పరిచయమయ్యారు. వైవాహిక బంధంలో ఏర్పడే సమస్యల గురించి తెలియజేసిన ఈ సినిమా ఉత్తమ చిత్రంగా కేరళ రాష్ట్ర అవార్డును సొంతం చేసుకోవడం విశేషం. ఆయన కుమారులు వినీత్ శ్రీనివాసన్, ధ్యాన్ శ్రీనివాసన్ కూడా నటులే. "శ్రీనివాసన్ మరణం మలయాళ సినిమాకు తీరని లోటు. చిత్ర నిర్మాణంలోని ప్రతి రంగంలోనూ తనదైన ముద్ర వేసిన ఒక బహుముఖ ప్రజ్ఞాశాలి పరిశ్రమను విడిచి వెళ్లారని" కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్‌తో పాటు పలువురు రాజకీయ, సినీ ప్రముఖులు శ్రీనివాసన్ మృతిపట్ల సంతాపం వ్యక్తం చేశారు.



మనోహర్, జయకాంత్, ఫరియా, నరేశ్ అగస్త్య, అమర్ బుర్రా, వేణు సద్ది

ప్రేక్షకులు కడుపుబ్బా నవ్వుకుంటున్నారు

'గుర్రం పాపిరెడ్డి'గా థియేటర్లలో సందడి చేస్తున్నారు హీరో నరేశ్ అగస్త్య. ఆయన టైటిల్ పాత్రలో నటించిన ఈ సినిమాని మురళీ మనోహర్ తెరకెక్కించారు. వేణు సద్ది, అమర్ బుర్రా, జయకాంత్ నిర్మించారు. ఫరియా అబ్దుల్లా కథానాయిక. జీవన్, రాజ్‌కుమార్ కసిరెడ్డి, బ్రహ్మానందం తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఈ సినిమా ఇటీవల విడుదలైన నేపథ్యంలో శనివారం హైదరాబాద్‌లో సక్సెస్‌మీట్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా హీరో నరేశ్ అగస్త్య మాట్లాడుతూ.. "మా చిత్రానికి ప్రేక్షకుల నుంచి మంచి ఆదరణ లభిస్తోంది. 90శాతం థియేటర్లు నిండుతున్నాయి. థియేటర్లలో ప్రేక్షకులు కడుపుబ్బా నవ్వుకుంటున్నారు" అన్నారు. "'అవతార్ 3' వల్ల మా సినిమాకి మార్నింగ్ షోస్ నెమ్మదిగా మొదలయ్యాయి. కానీ, సాయంత్రానికి థియేటర్లలో 90శాతం ఆక్యుపెన్సీ వచ్చింది." అన్నారు దర్శకుడు మురళీ మనోహర్. ఈ కార్యక్రమంలో కృష్ణ సౌరభ్, వంశీధర్, రాజ్‌కుమార్‌తో పాటు తదితర చిత్రబృందం పాల్గొంది.

'సైయారా' తారతో లక్ష్య?



లక్ష్య



అనీత్ పడ్డా

కొత్త జోడీలను పరిచయం చేయడంలో ముందుండే హిందీ చిత్రపరిశ్రమ.. ఇప్పుడు మరో జంటను తెరపైకి తీసుకురావడానికి రెడీగా ఉంది. 'సైయారా' సినిమాతో ప్రేక్షకుల మనసుల్ని గెల్చుకుంది యువ కథానాయిక అనీత్ పడ్డా. ఆమె 'శక్తి శాలిని' చిత్రంలో నటిస్తున్నట్లు ఇటీవలే ప్రకటించింది చిత్రబృందం. ఇప్పుడిందులో ఈమె సరసన 'కిల్' ఫేమ్ లక్ష్య కనిపించనున్నట్లు సమాచారం. మడాక్ ఫిల్మ్స్ నిర్మిస్తున్న ఈ చిత్రంలో లక్ష్య, అనీత్‌ల జోడీ అభిమానులకు కనులవిందులా ఉంటుందని, ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయని నిర్మాణ సంస్థ సన్నిహిత వర్గాలు తెలిపాయి. జనవరిలో షూటింగ్ మొదలవుతుందని, 2026 ద్వితీయార్థంలో థియేటర్లలోకి వస్తుందని బాలీవుడ్ వర్గాల్లో చర్చ జరుగుతోంది. మరి ఈ కొత్త జంట మెరుపులు ఎలా ఉంటాయో చూడాలంటే కొన్ని రోజులు వేచి చూడాల్సిందే.

చిత్ర పరిశ్రమల్ని ఏకం చేయడమే లక్ష్యం

దేశంలోని 12 సినీ పరిశ్రమల్ని ఒక తాటిపైకి తీసుకొచ్చే ఏకీకృత జాతీయ వేదికగా ఇండియన్ నేషనల్ సినీ అకాడమీ (ఐ.ఎన్.సి.ఏ) నిలుస్తుందన్నారు ఆ సంస్థ వ్యవస్థాపకులు విష్ణువర్ధన్ ఇందూరి. భారతీయ సినీ వ్యవస్థను మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా ఐ.ఎన్.సి.ఏని నెలకొల్పినట్టు ఆయన శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సంస్థకు ప్రొడ్యూసర్స్ గిల్డ్ ఆఫ్ ఇండియా సంస్థాగత భాగస్వామిగా వ్యవహరిస్తుందని ఆయన పేర్కొన్నారు. "భారతీయ సినిమా అంతర్జాతీయంగా అపూర్వమైన గుర్తింపుని పొందుతున్నప్పటికీ, ఇంకా ఆయా పరిశ్రమలు విడివిడిగానే పనిచేస్తున్నాయి. హిందీ, తమిళ, తెలుగు, మలయాళ, కన్నడ, బెంగాలీ, మరాఠీ, గుజరాతీ, పంజాబీ, భోజ్‌పురీ, అస్సామీ, ఒడియా చిత్ర పరిశ్రమల్ని ఒక చోటకు చేర్చి... పరస్పర సహకారం, భాగస్వామ్యాల్ని ప్రోత్సహించే జాతీయ వేదికగా ఐ.ఎన్.సి.ఏ నిలుస్తుంది. ఈ వేదిక నుంచే పురస్కార ప్రదానోత్సవాలూ జరుగుతాయ"ని విష్ణువర్ధన్ ఇందూరి చెప్పారు. వచ్చే ఏడాది మార్చి 8న ముంబయిలో రెండు రోజులపాటు ఐ.ఎన్.సి.ఏ తొలి సమావేశం జరగనుంది. ఇండియన్ ప్రొడ్యూసర్స్ గిల్డ్ అధ్యక్షుడు శిబాశిష్ సర్కార్ మాట్లాడుతూ "భారతీయ సినిమాను ఏకం చేసే ముఖ్యమైన అడుగు ఐ.ఎన్.సి.ఏ. పరిశ్రమల పరస్పర సహకారం, గుర్తింపును ప్రోత్సహించడమే లక్ష్యంగా ఈ సంస్థకు గిల్డ్ పూర్తి మద్దతుని ఇస్తుంది" అన్నారు.

నటనలో కన్నా డైపర్లు మార్చడంలోనే మెరుగ్గా ఉన్నా!



విక్కీ కౌశల్

"తండ్రిగా ప్రస్తుత సమయాన్ని నా కుమారుడితో సంతోషంగా గడుపుతున్నా. తండ్రిగా ఉండే అనుభూతిని మాటల్లో వర్ణించలేన"ని అంటున్నారు బాలీవుడ్ కథానాయకుడు విక్కీ కౌశల్. గత నెల్లో విక్కీ, కత్రినా దంపతులకు బాబు జన్మించిన సంగతి తెలిసిందే. ఈ ఏడాది 'ఛావా' సినిమాతో బ్లాక్‌బస్టర్ హిట్‌ను ఖాతాలో వేసుకున్నారు విక్కీ. తాజాగా ఓ అవార్డుల కార్యక్రమంలో పాల్గొన్న ఆయన.. తండ్రిగా తన కొత్త ప్రయాణం గురించి కొన్ని ఆసక్తికర విషయాల్ని పంచుకున్నారు. "నాన్నగా మారిన తర్వాత నేను ఇంటిని వదిలి వెళ్లడం ఇదే మొదటిసారి. వృత్తి కోసం మా బాబుకి దూరంగా వెళ్లడం చాలా కష్టంగా ఉంది. కొందరు నన్ను తండ్రి పాత్ర సవాలుగా ఉందా? అని అడుగుతున్నారు. సవాళ్లను అనుభవించినా.. కొత్తగా, అద్భుతంగా ఉంది. అంతా మాయాజాలమే. చాలా ఆనందంగానూ ఉంది. నటనలో కన్నా డైపర్లు మార్చడంలోనే నేను చాలా మెరుగ్గా ఉన్నానని అనిపిస్తుంది (నవ్వుతూ)" అని అన్నారు విక్కీ. ప్రస్తుతం ఆయన ఖాతాలో 'మహావతార్', 'లవ్ అండ్ వార్' లాంటి సినిమాలున్నాయి.



ఈనాడు బిజినెస్ వారాంతం

ఆతిథ్య రంగంలోకీ అదానీ!



భారత ఆతిథ్య రంగంలోకి భారీ స్థాయిలో అడుగుపెట్టడానికి గౌతమ్ అదానీ గ్రూప్ సన్నాహాలు చేస్తోంది. దేశంలోనే అతి పెద్ద హోటల్ పోర్ట్‌ఫోలియోలలో ఒకటిగా ఉండేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు ఓ ఆంగ్ల పత్రిక తెలిపింది. వేగంగా విస్తరిస్తున్న విమానాశ్రయాలు, స్థిరాస్తి వ్యాపారాల చుట్టూ వీటిని ఏర్పాటు చేయాలనే వ్యూహాత్మక ప్రణాళికలో ఉన్నట్లు పేర్కొంది. టాటా గ్రూప్‌నకు చెందిన తాజ్ హోటల్స్‌తో పాటు ఐటీసీ హోటల్స్, ఒబెరాయ్ వంటి హోటల్ దిగ్గజాలకు పోటీగా ఎదిగేందుకు ఒక వ్యూహాత్మక అడుగు వేయబోతున్నట్లు తెలుస్తోంది. అదానీ గ్రూప్ దేశ వ్యాప్తంగా 60కి పైగా హోటళ్లను అభివృద్ధి చేయాలని యోచిస్తోంది. ప్రధానంగా అది నిర్వహించే విమానాశ్రయాలు, అది నియంత్రించే పెద్ద స్థిరాస్తి ప్రాజెక్టులతో ఇవి అనుసంధానమై ఉంటాయని సమాచారం. ఈ హోటళ్లను అధిక శాతం సొంతంగానే అభివృద్ధి చేయొచ్చని తెలుస్తోంది.

ఎలాన్ మస్క్‌కు భారీ ఊరట

వేతన ప్యాకేజీని పునరుద్ధరిస్తూ కోర్టు ఆదేశాలు



డోవర్: టెస్లా అధినేత ఎలాన్ మస్క్‌కు న్యాయస్థానంలో భారీ విజయం లభించింది. 2018లో టెస్లా ఆయనకు ప్రకటించిన 55 బిలియన్ డాలర్ల వేతన ప్యాకేజీ విషయంలో డెలావేర్ సుప్రీంకోర్టు నుంచి మస్క్‌కు అనుకూలంగా తీర్పు వచ్చింది. టెస్లాను వృద్ధి పథంలో నడిపించినందుకు గాను ప్రోత్సాహకం కింద ఈ ప్యాకేజీని ఆ సమయంలో కంపెనీ ఇవ్వాలనుకుంది. అయితే మస్క్‌కు ఇంత భారీ మొత్తంలో వేతన చెల్లింపుపై అభ్యంతరాన్ని వ్యక్తం చేస్తూ కంపెనీకి చెందిన ఒక వాటాదారు కోర్టును ఆశ్రయించారు. మస్క్‌కు అనుకూలంగా ఉన్న బోర్డే ఈ వేతన ప్యాకేజీని రూపొందించిందని, అనుమతుల ప్రక్రియలో నిబంధనలనూ పాటించలేదని పేర్కొంటూ ఆ వేతన ప్యాకేజీని రద్దు చేస్తూ 2024లో కోర్టు ఆదేశాలు ఇచ్చింది. అయితే కింది కోర్టు ఇచ్చిన ఈ ఆదేశాల్లో పలు రకాల లోపాలు ఉన్నాయని చెబుతూ 2018 నాటి వేతన ప్యాకేజీ పునరుద్ధరించాలని తాజాగా డెలావేర్ సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చింది.

'కెనరా ఏఐ1పే' యాప్ ఆవిష్కరణ

బెంగళూరు: కెనరా బ్యాంక్ 'కెనరా ఏఐ1పే' అనే కొత్త డిజిటల్ చెల్లింపుల యాప్‌ను ప్రారంభించినట్లు ప్రకటించింది. యూపీఐ ప్లాట్‌ఫామ్‌ను ఉపయోగించి చెల్లింపులు చేయడంలో వేగవంత, సురక్షిత, సౌకర్యవంతమైన అనుభవాన్ని వినియోగదార్లకు అందించడమే ఈ యాప్ లక్ష్యమని పేర్కొంది. ఏ బ్యాంకు ఖాతాదార్లయినా లింక్ చేసుకోవడానికి, తక్షణ నగదు బదిలీలు, బిల్లు చెల్లింపులు, రోజువారీ డిజిటల్ సేవలు.. ఇలా అన్నీ ఒకే చోట పొందడానికి ఈ యాప్ వీలు కల్పిస్తుందని తెలిపింది. కెనరా ఏఐ1పే అధునాతన యూపీఐ సామర్థ్యాలు, సులభమైన క్యూఆర్ స్కాన్ కోసం విడ్జెట్ సౌకర్యం, మెరుగైన భద్రతా ప్రమాణాలను అందిస్తుందని వెల్లడించింది.

కోడి గుడ్లు

21న ఫారం వద్ద రైతు అమ్మకం ధరలు (నెక్) (100కు రూపాయలలో)

హైదరాబాద్	660
వరంగల్	662
విజయవాడ	700
తూ/ప గోదావరి	680
విశాఖపట్నం	680
చిత్తూరు	693

చిన్న కార్లు.. పెద్ద దుమారం

- ప్రతిపాదిత కేఫ్-3 నిబంధనలపై భిన్నాభిప్రాయాలు
- మారుతీ, టయోటా, హోండా ఒక వైపు
- టాటా, మహీంద్రా, హ్యుందాయ్, కియా మరో వైపు



ఇపుడిపుడే విద్యుత్ వాహనా(ఈవీ)లను ప్రజలు ఆదరిస్తున్నారు. ఈ సమయంలో 909 కిలోల బరువులోపు పెట్రోలు వాహనాలకు సడలింపులు/మినహాయింపులు ఇస్తే.. పర్యావరణహిత కార్లను అందిపుచ్చుకోవాలన్న లక్ష్యానికి గండి కొట్టినట్లే అవుతుంది. భద్రత ప్రమాణాలకు దెబ్బ పడుతుంది. కేఫ్-3 నిబంధనల్లో ఎటువంటి మినహాయింపులూ ఇవ్వొద్దు.

– ప్రధాన మంత్రి కార్యాలయానికి టాటా మోటార్స్ తాజాగా రాసిన లేఖ సారాంశమిది

కొన్ని కంపెనీలు ప్రతిపాదిత కార్పొరేట్ యావరేజ్ ఫ్యూయల్ ఎఫిషియన్సీ(కేఫ్)-3 నిబంధనల్లో చిన్న కార్లకు వచ్చే సడలింపులపై తప్పుడు ప్రచారం చేస్తున్నాయి.

– మారుతీ సుజుకీ వాదన

కారు బరువు, అందుబాటు ధర ఆధారంగా ప్రతిపాదిత కేఫ్-3 నిబంధనల్లో చిన్న కార్లకు ఎటువంటి సడలింపులూ ఇవ్వరాదని కార్ల తయారీ కంపెనీల్లో కొన్ని గట్టిగా వాదిస్తుండగా.. దీనిపై తప్పుడు ప్రచారానికి తెరదీశారని మరి కొన్ని కంపెనీలు ఆరోపిస్తున్నాయి. దీంతో భారత వాహన పరిశ్రమ రెండు వర్గాలుగా విడిపోయినట్లయింది.

ఏమిటీ నిబంధనలు: 2017లో కేఫ్ నిబంధనలు అమల్లోకి వచ్చాయి. కార్ల కంపెనీలకు సగటు ఇంధన వినియోగంపై, కర్బన ఉద్గారాలపై ఒక పరిమితిని ఇవి తీసుకొచ్చాయి. కార్ల తయారీదార్లు మొత్తం మీద ఇంధన సామర్థ్యాన్ని పెంచుకోవడం, ఉద్గారాలను తగ్గించడం వీటి లక్ష్యం. ఇక 2022లో కేఫ్-2 నిబంధనలను తీసుకొచ్చారు. తదుపరి కేఫ్-3 ఏప్రిల్ 2027 నుంచి ప్రారంభం కావాల్సి ఉంది. కొత్త అర్హతలు ఇపుడు చర్చల్లో ఉన్నాయి. ఈ ఏడాది సెప్టెంబరులో ముసాయిదా మార్గదర్శకాలు జారీ అయ్యాయి. దీని కింద చిన్న కార్లకు కొన్ని సడలింపులు ఉండొచ్చని సమాచారం.

ఇతర దేశాల్లో ఇలా..

'ఈ కొత్త నిబంధనల వల్ల పెద్ద కార్ల ఇంధన సామర్థ్యం పెరుగుతుంది. ఉద్గారాలు తగ్గుతాయి. కానీ కొన్ని కంపెనీలు తమ తక్కువ మైలేజీ ఇచ్చే కార్ల నుంచి దృష్టిని మళ్లించడం కోసం బాధ్యతారహితంగా వాస్తవాలను వక్రీకరిస్తూ, తప్పుడు కథనాలను అల్లుతున్నాయ'ని మారుతీ సుజుకీ సీనియర్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ రాహుల్ భార్తి అంటున్నారు. 'చిన్న కార్లపై ప్రపంచవ్యాప్తంగా సడలింపులున్నాయి. చైనాలో 1090, ఐరోపాలో 1115, కొరియాలో 1100 కిలోల లోపు కార్లకు మినహాయింపులిస్తున్నాయి. జపాన్, అమెరికాలూ తక్కువ బరువున్న కార్లకు ప్రోత్సాహం ఇస్తున్నాయి. ఈ దేశాలన్నీ ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకున్నాయా? ఎవరైనా సరే ఈ దేశ ప్రభుత్వాలన్నిటిపైనా ఆరోపణ చేసే ముందు జాగ్రత్తగా ఉండాలి. పరిశోధన చేసి మాట్లాడాలి' అని వాదిస్తున్నారు. మారుతీతో పాటు టయోటా కిర్లోస్కర్, హోండా కార్స్ భారత్‌లో చిన్న కార్లకు ప్రయోజనాలు ఇవ్వాలని అంటున్నాయి.

భద్రత మాటేమిటి..

కేఫ్-3 నిబంధనల్లో బరువు, ధర ఆధారంగా చిన్న కార్లపై ఎటువంటి దయా చూపించాల్సిన అవసరం లేదని టాటా మోటార్స్ ప్యాసింజర్ వెహికల్స్ ఎండీ, సీఈఓ శైలేశ్ చంద్ర అంటున్నారు. అపుడు భద్రత ఫీచర్లపై రాజీ పడాల్సి వస్తుందని, ఇది సస్టెయినబుల్ మొబిలిటీ వైపు సరైన చర్యలు తీసుకోకుండా చేస్తుందని పేర్కొన్నారు. చిన్న కార్ల నిర్వచనంలో బరువును చేర్చే ఎటువంటి ప్రతిపాదనకూ టాటా మద్దతు ఇవ్వదని చంద్ర తేల్చి చెప్పారు. ఇటువంటి ప్రమాణాల వల్ల ప్రయాణికుల భద్రతకు ఇబ్బంది తలెత్తుతుందని భారత వాహన తయారీదార్ల సంఘం(సియామ్)కు ప్రెసిడెంట్‌గానూ ఉన్న చంద్ర అంటున్నారు. టాటా మోటార్స్‌కు మద్దతుగా మహీంద్రా, హ్యుందాయ్, కియా గళమెత్తుతున్నాయి.

ఎస్‌యూవీలనే కొంటున్నారా?



ప్రారంభ స్థాయి వినియోగదార్లు చిన్న కార్లను కొనడం లేదని, నేరుగా ఎస్‌యూవీలనే కొంటున్నారని కొంత మంది తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేస్తున్నారని రాహుల్ భార్తి అంటున్నారు. ఒకవేళ ఎస్‌యూవీలనే ప్రారంభ స్థాయి వినియోగదార్లు కొనుగోలు చేస్తుంటే, జీఎస్‌టీ కోతకు ముందు పరిశ్రమ 20% పైగా వృద్ధిని నమోదు చేసి ఉండాలి. కానీ వృద్ధి పెద్దగా ఎందుకు లేదని ప్రశ్నించారు. భారత జనాభాలో 3% మంది కారు కలిగి ఉన్నారు. మిగతా 97 శాతమూ కారు కొనగలిగే స్థాయికి చేర్చడం మన బాధ్యత అని ఆయన అన్నారు.

చిన్నకార్లు కనుమరుగవుతాయా?

సడలింపులు ఇవ్వకపోతే ఆల్టో, ఎస్ ప్రెసో వంటి చిన్న కార్లపై ప్రభావం పడుతుందా అన్న ప్రశ్నకు సమాధానంగా 'లక్ష్యాలు శాస్త్రీయంగా లేకపోతే తక్కువ ఉద్గారాలను వెలువరచే చిన్న కార్లు కనుమరుగవుతాయ'ని అన్నారు. భద్రత విషయానికొస్తే పెద్ద కార్ల లాగే అన్ని నిబంధనలనూ చిన్న కార్లకూ పాటిస్తున్నామన్నారు. తమ అన్ని వేరియంట్లకూ 6 ఎయిర్‌బ్యాగ్‌లు అందిస్తున్న విషయాన్ని గుర్తు చేశారు.

– ఈనాడు వాణిజ్య విభాగం

అందరికీ బీమా సాధ్యమే

- చట్టాల సవరణతో లక్ష్యానికి చేరువ
- కేర్ ఎడ్జ్ రేటింగ్స్ విశ్లేషణ



ఈనాడు, హైదరాబాద్: దేశంలోని ప్రజలందరికీ బీమా రక్షణ కల్పించాలనే లక్ష్య సాధనకు చేరువ అయ్యే అవకాశం బీమా చట్టాల సవరణతో లభిస్తుందని కేర్ ఎడ్జ్ రేటింగ్స్ తాజాగా విశ్లేషించింది. 2047 నాటికి ప్రజలందరికీ తప్పనిసరిగా బీమా కవరేజీ ఉండాలని కేంద్రం లక్ష్యం పెట్టుకున్న విషయం తెలిసిందే. అందుకు అనుగుణంగానే సబ్‌కా బీమా, సబ్కీ రక్షా పేరుతో బీమా చట్టాల (సవరణ) బిల్లు-2025ని ఈ నెల 17న రాజ్యసభ ఆమోదించింది. బీమా సంస్థలు, రీ-ఇన్సూరెన్స్ కంపెనీలు, ఇంటర్మీడియేట్స్‌కు సంబంధించిన నియమ నిబంధనలు, వృద్ధి అవకాశాలు, బీమా వినియోగదార్ల సంరక్షణకు సంబంధించిన పలు అంశాలు ఇందులో ఉన్నాయి.

100% ఎఫ్‌డీఐకి అవకాశం

ఈ సవరణ బిల్లుతో బీమా చట్టం-1938, ఎల్ఐసీ చట్టం-1956, ఐఆర్‌డీఏఐ చట్టం- 1999లో మార్పులు చోటుచేసుకున్నాయి. ముఖ్యంగా బీమా సంస్థల్లో నూరు శాతం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి(ఎఫ్‌డీఐ)కి అవకాశం కలుగుతోంది. ప్రస్తుతం ఈ పరిమితి 74% వరకూ ఉంది. ఇకపై విదేశీ సంస్థలు భారతీయ భాగస్వామి లేకుండానే 100% పెట్టుబడితో బీమా వ్యాపారంలోకి అడుగుపెట్టవచ్చు. ప్రస్తుత చట్ట సవరణ వల్ల విదేశీ రీ-ఇన్సూరెన్స్ సంస్థలకు నికర సొంత నిధుల (నెట్ ఓన్డ్ ఫండ్స్) అవసరాలు తగ్గుతాయి. బీమా సంస్థలు, ఇంటర్మీడియేట్ సంస్థలపై ఐఆర్‌డీఏఐకు ఇంకా అధిక నియంత్రణ అధికారాలూ లభిస్తాయి. ముఖ్యంగా బీమా ఏజెంట్లకు ఇచ్చే కమీషన్లను నియంత్రించే అవకాశం కలుగుతుంది. 'పాలసీ హోల్డర్స్ ఎడ్యుకేషన్ అండ్ ప్రొటెక్షన్ ఫండ్' ఏర్పాటు చేయటానికీ మార్గం సుగమం అయ్యింది. ఇకపై డిజిటల్ పర్సనల్ డేటా ప్రొటెక్షన్ (డీపీడీపీ) యాక్ట్- 2023 నిబంధనల ప్రకారమే సమాచారాన్ని తీసుకోవాల్సి ఉంటుంది.

✦ కొన్ని బీమా సంస్కరణలకు ప్రస్తుత చట్ట సవరణలో చోటు దక్కలేదు. కాంపోజిట్ లైసెన్స్ జారీ, కొత్త బీమా సంస్థలకు మూలధన నిబంధనల సడలింపు, క్యాప్టివ్ ఇన్సూరర్స్, ఓపెన్ ఏజెంట్ విధానం... తదితర అంశాలను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోలేదు.

పరిశ్రమకు మేలు

100% ఎఫ్‌డీఐకి అనుమతి ఇవ్వటం వల్ల బీమా సంస్థలకు మూలధన నిధుల లభ్యత పెరుగుతుందని, తత్ఫలితంగా బీమా పాలసీలకు ప్రజలు మరింత దగ్గర అయ్యే అవకాశం ఉంటుందని కేర్ ఎడ్జ్ రేటింగ్స్ సీనియర్ డైరెక్టర్ సంజయ్ అగర్వాల్ పేర్కొన్నారు. అంతేగాక బీమా కంపెనీలు ఆర్థికంగా బలోపేతం అవుతాయని తెలిపారు. మొత్తం మీద ఈ సంస్కరణలతో బీమా సదుపాయం విస్తరించటంతో పాటు బీమా పరిశ్రమ స్థిరమైన వృద్ధి బాట పట్టే అవకాశం ఉంటుందని వివరించారు. ఐఆర్‌డీఏఐకి అదనపు అధికారాలు ఇవ్వటం వల్ల పరిశ్రమకు మేలు జరుగుతుందని విశ్లేషించారు.

అన్‌లిమిటెడ్ 'రెడ్ అలర్ట్ సేల్'

దేశ వ్యాప్తంగా ఉన్న తమ అన్ని విక్రయశాలల్లో 'రెడ్ అలర్ట్ సేల్' కొనసాగుతున్నట్లు అన్‌లిమిటెడ్ వెల్లడించింది. ఫ్యాషనబుల్ దుస్తులపై 50% డిస్కౌంట్ ఇస్తున్నట్లు తెలిపింది. పురుషులు, మహిళలు, చిన్నారులకు అవసరమైన అన్ని రకాల దుస్తులు అందుబాటులో ఉన్నాయని పేర్కొంది. బేసిక్స్, సోచ్, క్లాసిక్ పోలో, క్రొకడైల్, క్రిమ్‌సోన్ క్లబ్, రిక్ రోగ్, ట్విల్స్ తదితర బ్రాండ్లలో రూ.3,000 విలువైన షాపింగ్ చేస్తే మరో రూ.3,000 విలువైన దుస్తులు ఉచితంగా కొనుగోలు చేసే అవకాశం కల్పించామని తెలిపింది.

డీడీఎఫ్ఎస్‌లో వాటా పెంచుకున్న జీఎమ్ఆర్ ఎయిర్‌పోర్ట్స్

అనుబంధ సంస్థ దిల్లీ డ్యూటీ ఫ్రీ సర్వీసెస్(డీడీఎఫ్ఎస్)లో దిల్లీ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ (డయల్)కున్న 49.90% వాటాను రూ.183.22 కోట్లకు కొనుగోలు చేసినట్లు జీఎమ్ఆర్ ఎయిర్‌పోర్ట్స్ తెలిపింది. దీంతో డీడీఎఫ్ఎస్‌లో కంపెనీ మొత్తం వాటా 66.93 శాతానికి చేరిందని శనివారం ఎక్స్ఛేంజీలకిచ్చిన సమాచారంలో వెల్లడించింది. కంపెనీల చట్టం కింద 2009లో ఏర్పాటైన డీడీఎఫ్ఎస్, ఇందిరా గాంధీ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్‌లో డ్యూటీ ఫ్రీ కార్యకలాపాల అభివృద్ధి, నిర్వహణ పనులు చూస్తుంటుంది.

2030 నాటికి 30 కోట్ల టన్నుల ఉక్కు ఉత్పత్తి సామర్థ్యం

- వచ్చే ఏడాది ఏప్రిల్‌లో 'భారత్ స్టీల్ 2026' కార్యక్రమం
- కేంద్ర మంత్రి కుమారస్వామి వెల్లడి



ఈనాడు, హైదరాబాద్: మనదేశంలో ఉక్కు ఉత్పత్తి సామర్థ్యం 2030 నాటికి 30 కోట్ల టన్నులకు చేరుకోనుంది. ఆ దిశగా స్థిరంగా ముందుకు సాగుతున్నట్లు కేంద్ర ఉక్కు శాఖమంత్రి హెచ్.డి.కుమారస్వామి తెలిపారు. 2047 నాటికి 50 కోట్ల టన్నుల స్టీలు ఉత్పత్తి సామర్థ్యాన్ని సాధిస్తామని అన్నారు. వచ్చే ఏడాది ఏప్రిల్‌లో దిల్లీలో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనున్న 'భారత్ స్టీల్ 2026' కార్యక్రమంలో క్రియాశీలకంగా పాల్గొనాలని ఆయన వివిధ దేశాలకు చెందిన దౌత్యవేత్తలను కోరారు. ఈ సందర్భంగా ఆయన మన దేశంలో స్టీలు ఉత్పత్తి సామర్థ్యం, ప్రభుత్వం నిర్దేశించుకున్న లక్ష్యాలు, భవిష్యత్తు కార్యక్రమాలను దౌత్యవేత్తలు, వివిధ దేశాలకు చెందిన ప్రతినిధులకు వివరించారు.

ఉక్కు రంగం వాటా జీడీపీ (స్థూల జాతీయోత్పత్తి)లో 2.5 శాతం ఉన్నట్లు, అంతేగాకుండా ఈ రంగం 28 లక్షల కుటుంబాలకు ఉపాధి కల్పిస్తోందని కేంద్ర మంత్రి తెలిపారు. భారత్ స్టీలుకు ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు తీసుకురావటంతో పాటు అధిక ఎగుమతులు సాధించటం కోసం వివిధ దేశాల్లోని స్టీలు వినియోగదార్లకు దగ్గరయ్యే ప్రయత్నాలు చేస్తున్నామని అన్నారు.


విస్తరణ ప్రణాళికల్లో కోయంప్ట్ ఎడ్యుటెక్



ఈనాడు, హైదరాబాద్: విద్యా సంస్థల ప్రవేశ, ఇతర పరీక్షల నిర్వహణ, మూల్యాంకనంలో కృత్రిమ మేధ (ఏఐ) సాంకేతికతను అందించే సంస్థ కోయంప్ట్ ఎడ్యుటెక్ విస్తరణ ప్రణాళికల్లో ఉంది. వచ్చే మూడేళ్ల కాలంలో తమ క్లయింట్ల సంఖ్యను ఇప్పుడున్న 32 నుంచి 100కు పెంచుకోవాలని లక్ష్యంగా పెట్టుకుంది. రాష్ట్ర స్థాయిలోనే కాకుండా సీబీఎస్ఈ వంటి సంస్థలతో కలిసి పనిచేసేందుకు ప్రయత్నిస్తున్నట్లు సంస్థ డైరెక్టర్, సీఈఓ వీఎస్ఎన్ రాజు తెలిపారు. ప్రస్తుతం 250 మంది ఉద్యోగులున్నారని, 2027 నాటికి వీరి సంఖ్య దాదాపు 1,000కి చేరుకుంటుందని వివరించారు. ఇందులో ప్రధానంగా సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్, టెస్టింగ్ నిపుణులతో పాటు క్షేత్రస్థాయిలో పనిచేసే బృందం ఉంటుందని తెలిపారు. మానవ ప్రమేయం లేకుండానే సమాధాన పత్రాలను ఏఐ ద్వారా మూల్యాంకనం చేసే విధానాన్ని మరింత విస్తృతం చేయనున్నట్లు పేర్కొన్నారు. విస్తరణ ప్రణాళికల్లో భాగంగా 2030 నాటికి తొలి పబ్లిక్ ఇష్యూ(ఐపీఓ)కు రావాలనే ఆలోచనతో ఉన్నట్లు వివరించారు.

2033 నాటికి 2 లక్షల ఉద్యోగాలు

- డ్రోన్, స్పేస్ టెక్ రంగంలో అవకాశాలు
- కీలకంగా హైదరాబాద్ నగరం
- అడెక్కో నివేదిక



దేశీయంగా ఏరోస్పేస్, డ్రోన్, అంతరిక్ష సాంకేతిక రంగాలు శరవేగంగా విస్తరిస్తున్నాయి. రానున్న రోజుల్లో ఈ రంగం పరిశోధనల స్థాయి నుంచి పూర్తి స్థాయి వాణిజ్య పరిశ్రమగా రూపాంతరం చెందనుంది. ఇందులో హైదరాబాద్ కీలక పాత్ర పోషించనుంది. 2033 నాటికి ఈ రంగాల్లో దాదాపు 2 లక్షలకు పైగా కొత్త ఉద్యోగాలు రానున్నాయి' అని అడెక్కో నివేదిక వెల్లడించింది. ప్రభుత్వం తీసుకొస్తున్న సంస్కరణలు, ప్రైవేటు రంగానికి ప్రోత్సాహం ఇవ్వడంతో ఈ పరిశ్రమ అయిదు రెట్ల వరకూ విస్తరించి, దాదాపు రూ.3.98 లక్షల కోట్ల మార్కెట్‌గా అవతరించనుందని అంచనా వేసింది.

ఈ పోస్టులకు గిరాకీ

అంతరిక్ష రంగం ఉద్యోగాల సృష్టిలో హైదరాబాద్, బెంగళూరు, చెన్నై, అహ్మదాబాద్, పుణెలు కీలకంగా మారనున్నాయి. ఇంజినీరింగ్, రీసెర్చ్, డేటా సైన్స్ విభాగాల్లో నిపుణులకు ఇక్కడ గిరాకీ పెరగనుందని నివేదిక పేర్కొంది. ముఖ్యంగా ఏవియానిక్స్, క్రయోజెనిక్స్, రిమోట్ సెన్సింగ్, స్పేస్ హాబిటాట్ ఇంజినీరింగ్ వంటి అత్యున్నత సాంకేతిక నైపుణ్యం ఉన్న వారికి ఇతర టెక్ రంగాలతో పోలిస్తే 20 నుంచి 30 శాతం అధిక వేతనాలు లభించే అవకాశం ఉందని అడెక్కో ఇండియా డైరెక్టర్ దీపేశ్ గుప్తా తెలిపారు. సుమారు 100కు పైగా సంస్థల నుంచి సేకరించిన సమాచారం ప్రకారం.. ఇంజినీరింగ్ పోస్టులే కాకుండా, స్పేస్ పాలసీ విశ్లేషకులు, రోబోటిక్స్ ఇంజినీర్లు, ఏవియానిక్స్ స్పెషలిస్టులు, గైడెన్స్-నావిగేషన్ అండ్ కంట్రోల్ (జీఎన్‌సీ) నిపుణులకు గిరాకీ పెరగనుందని తెలిపింది.

అంకురాలకు మేలు..

'ఇండియన్ స్పేస్ పాలసీ-2023'లో భాగంగా ఇన్-స్పేస్ వెంచర్ క్యాపిటల్ ఫండ్‌కు రూ.1,000 కోట్లకు పైగా నిధులు కేటాయించడం ఈ రంగంలో ఆవిష్కరణలకు ఊతం ఇస్తున్నాయి. ఇప్పటికే దేశంలో 250కి పైగా అంతరిక్ష అంకురాలు తమ సత్తా చాటుతున్నాయి. మరోవైపు వైజ్ ఫెలోషిప్, విజ్ఞాన్ జ్యోతి, ఇస్రోకు చెందిన యువికా వంటి పథకాల ద్వారా మహిళలు, యువతను ఈ రంగం వైపు ఆకర్షించేందుకు ప్రయత్నిస్తోంది. ప్రస్తుతం ప్రపంచ అంతరిక్ష ఆర్థిక వ్యవస్థలో భారత్ వాటా కేవలం 2 శాతమే. గగన్‌యాన్ మిషన్, భారత సొంత అంతరిక్ష కేంద్రం ఏర్పాటు వంటి ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టులతో 2033 నాటికి ఈ వాటాను 7-8 శాతానికి పెంచాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకొంది. ఇందులో 11 బిలియన్ డాలర్ల మేరకు ఎగుమతులూ ఉండాలని భావిస్తోందని నివేదిక తెలిపింది.

ఐఐఎఫ్ఎల్ ఫైనాన్స్ ఛైర్మన్‌గా బి.పి.కనుంగో



దిల్లీ: ఆర్‌బీఐ మాజీ డిప్యూటీ గవర్నర్ బి.పి. కనుంగోను నాన్ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్‌గా నియమించినట్లు ఐఐఎఫ్ఎల్ ఫైనాన్స్ తెలిపింది. శుక్రవారం జరిగిన బోర్డు సమావేశంలో కనుంగో నియామకానికి ఆమోదం లభించింది. తక్షణం ఈ మార్పు అమల్లోకి రానుందని ఎక్స్ఛేంజీలకిచ్చిన సమాచారంలో వివరించింది. పరపతి విధానం, ఆర్థిక నియంత్రణలు, కేంద్ర బ్యాంకింగ్ వంటి అంశాల్లో నాలుగు దశాబ్దాలకు పైగా అనుభవం కనుంగోకు ఉంది.

ఫోర్టిస్ చేతికి పీపుల్ ట్రీ హాస్పిటల్!

దిల్లీ: బెంగళూరుకు చెందిన పీపుల్ ట్రీ హాస్పిటల్‌ను రూ.430 కోట్లతో కొనుగోలు చేయడానికి ఒప్పందం కుదుర్చుకున్నట్లు ఫోర్టిస్ హెల్త్‌కేర్ తెలిపింది. ఆ మేరకు యశ్వంత్‌పూర్‌లోని 125 పడకల ఆసుపత్రి కొనుగోలుకు కచ్చితంగా కార్యరూపం దాల్చే ఒప్పందంపై సంతకాలు చేసినట్లు వివరించింది. పీపుల్ ట్రీ హాస్పిటల్ వ్యాపారాలను నిర్వహిస్తున్న టీఎమ్ఐ హెల్త్‌కేర్ ప్రైవేట్ లిమిటెడ్‌లో 100 శాతం వాటా సొంతం చేసుకోవడం ద్వారా ఈ కొనుగోలు చేపట్టనుంది. తన అనుబంధ కంపెనీ ఇంటర్నేషనల్ హాస్పిటల్ లిమిటెడ్(ఐహెచ్ఎల్) ద్వారా ఈ లావాదేవీని నిర్వహించనున్నట్లు ఒక ప్రకటనలో ఫోర్టిస్ తెలిపింది. వచ్చే మూడేళ్లలో రూ.410 కోట్ల అదనపు పెట్టుబడులనూ పెట్టనుంది. తద్వారా వైద్య పడకలను పెంచుకోవడంతో పాటు, వైద్య పరికరాలు, రేడియేషన్ ఆంకాలజీ వంటి క్లినికల్ ప్రోగ్రామ్‌లను సమకూర్చుకోనుంది.

అనిల్ అంబానీ తనయుడిని రెండో రోజూ విచారించిన ఈడీ



దిల్లీ: రిలయన్స్ అనిల్ ధీరూభాయ్ అంబానీ గ్రూపు ఛైర్మన్ అనిల్ అంబానీ తనయుడు జై అన్మోల్ అంబానీని శనివారం కూడా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) విచారించింది. యెస్ బ్యాంకు నుంచి రుణం తీసుకొని మోసం చేశారనే ఆరోపణలకు సంబంధించిన కేసు విషయంలో ఈ విచారణ జరుగుతోందని అధికారులు తెలిపారు. మనీ ల్యాండరింగ్ నియంత్రణ చట్టం కింద తొలుత శుక్రవారం నాడు అన్మోల్‌ను విచారించి ఆయన చెప్పిన వివరాలను ఈడీ నమోదు చేసుకుంది. మళ్లీ రెండో రోజు కూడా ఆ విచారణను కొనసాగించింది. అయితే ఈ పరిణామాలపై రిలయన్స్ అనిల్ ధీరూభాయ్ అంబానీ గ్రూపు నుంచి ఇప్పటివరకు ఎలాంటి స్పందన రాలేదు.

కృత్రిమ మేధలో భారత్ ముందుండాలి

ముకేశ్ అంబానీ



ముంబయి: కృత్రిమ మేధ (ఏఐ)లో భారత్ ముందుండాలని రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ (ఆర్ఐఎల్) సీఎండీ ముకేశ్ అంబానీ ఆకాంక్షించారు. భారత దేశ ఇంధన సవాళ్లను, సౌర విద్యుత్ నిల్వ పరిష్కారాలను కనుగొనడానికి ఆర్ఐఎల్ కృషి చేస్తుందని పేర్కొన్నారు. 'అంతర్జాతీయ మానవ సంఘీభావ దినోత్సవం' కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. ఆర్ఐఎల్ టెలికాం అనుబంధ సంస్థ జియో తన సేవలతో పునాది వేయడం ద్వారా భారతదేశాన్ని ప్రపంచ డిజిటల్ ప్రధాన స్రవంతిలోకి చేర్చిందన్నారు. 'మనకు ఏఐ కావాలి. ఏఐలో ప్రపంచ దిగ్గజంగా మారాల్సిన అవసరం ఉంది. కానీ అంతకంటే ముందు సానుభూతి, కరుణ చాలా ముఖ్యమ'ని ముకేశ్ అంబానీ వెల్లడించారు.

విదేశీ విద్యతో ఉద్యోగం వస్తుందా?

- ఆర్థిక స్థోమత సరిపోతుంది కదా
- బయటి దేశాలకు వెళ్లే విద్యార్థుల ప్రాధాన్యతలివే
- లీప్ స్కాలర్ నివేదిక



ముంబయి: ప్రపంచ ఆర్థిక అంశాలు, మారుతున్న వీసా విధానాల దృష్ట్యా.. ఆర్థిక స్థోమత-చదువు తర్వాత ఉద్యోగావకాశాలు.. భారతీయ విద్యార్థులు విదేశాల్లో చదివేందుకు నడిపించే కొన్ని అంశాల్లో ప్రధానంగా ఉన్నాయని లీప్ స్కాలర్ నివేదిక వెల్లడించింది. 30 లక్షలకు పైగా విద్యార్థులతో జరిపిన సర్వే ఆధారంగా ఈ నివేదికను రూపొందించింది. దీని ప్రకారం..

✦ 2024-25 సంవత్సరానికి భారతీయ విద్యార్థుల ఆసక్తిలో జర్మనీ 377 శాతం పెరుగుదలను నమోదు చేసింది. ఇది గత సంవత్సరం కంటే 219 శాతం ఎక్కువగా ఉంది.

✦ న్యూజిలాండ్‌లో వార్షిక వృద్ధి 2900 శాతం (6 శాతం నుంచి) కాగా, యూఏఈలో 5,400 శాతంగా (గతంలో 7 శాతం) ఉంది.

✦ జర్మనీ 18 నెలల పోస్ట్-స్టడీ వర్క్ వీసా, పాశ్చాత్య విశ్వవిద్యాలయాల కంటే యూఏఈ తక్కువ ఖర్చుతో పాటు యాక్సెసిబిలిటీ, న్యూజిలాండ్ ఇమిగ్రేషన్ పాలసీలు, చదువు తర్వాత మూడేళ్ల వరకు నివసించడానికి, పని చేయడానికి అనుమతించే పోస్ట్ స్టడీ వర్క్ వీసాను కలిగి ఉండటం వంటివి భారతీయ విద్యార్థులను ఆకర్షిస్తున్నాయి.


✦ 'కేవలం ఆర్థిక స్థోమతే కాకుండా డిగ్రీ తర్వాత రాబడి గురించి కూడా విద్యార్థులు ఆలోచిస్తున్నారు. పేరు కోసం కాకుండా పెట్టుబడిపై రాబడి (ఆర్ఓఐ) ఆధారంగా నిర్ణయాలు తీసుకుంటున్నారని డేటా చెబుతోందని లీప్ స్కాలర్ సహ వ్యవస్థాపకుడు ఆర్నవ్ కుమార్ వెల్లడించారు.

✦ 40.4 శాతం మంది విద్యార్థులు ఏఐ, మెషిన్ లెర్నింగ్, డేటా సైన్స్‌లో ప్రత్యేక మాస్టర్స్ ప్రోగ్రామ్‌లను చేసేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. 59.6 శాతం మంది ఏఐ మాడ్యూళ్లు కలిగిన విస్తృత మాస్టర్స్ డిగ్రీలను ఎంచుకుంటున్నారు. ఈ ధోరణి విద్యా వైవిధ్యీకరణ వ్యూహాన్ని సూచిస్తోంది. వ్యాపారం, ఇంజినీరింగ్, ఆరోగ్య సంరక్షణ వంటి స్థిరపడే రంగాల్లో బహుముఖ ప్రజ్ఞను కొనసాగిస్తూ ఏఐ నైపుణ్యాన్ని విద్యార్థులు కోరుకుంటున్నారు.

✦ ప్రోగ్రామ్ ఖర్చు, భరించగలిగే సామర్థ్యాన్ని చూస్తున్నామని 75 శాతం మంది విద్యార్థులు వెల్లడించారు. దీని తర్వాత స్కాలర్‌షిప్ లభ్యత (70 శాతం), కెరీర్ పురోగతి (58 శాతం), గ్రాడ్యుయేట్ జీతం సామర్థ్యం (49 శాతం) పరిగణనలోకి తీసుకుంటున్నట్లు తెలిపారు.

✦ అధ్యాపక నైపుణ్యం, పరిశోధన అవకాశాలు 40 శాతంతో ఐదో స్థానంలో ఉన్నాయి. అయితే విశ్వవిద్యాలయ ర్యాంకింగ్‌లు మొదటి 5 ప్రాధాన్యతల్లో చోటు దక్కించుకోలేదు.

✦ విదేశాల్లో చదువుల కోసం వెళుతున్న వారిలో లింగ అంతరం కూడా ఉంది. 58 శాతం మంది పురుషులు ఉండగా, మహిళలు 42 శాతమే ఉన్నారు. విదేశాల్లో స్టెమ్ ప్రోగ్రామ్‌లకు ముఖ్యంగా ఏఐ, డేటా సైన్స్‌లో విద్యాభ్యాసానికి అమ్మాయిలు మొగ్గుచూపుతున్నారు.



అరుదైన విశిష్ట లక్షణం విషయ సంగ్రహణంలో విభిన్నం

ప్రపంచంలోని పలు రాజ్యాంగాల నుంచి వివిధ లక్షణాలను భారత రాజ్యాంగం స్వీకరించింది. అయినప్పటికీ దీనిలో ఉన్న అనేక విశిష్ట లక్షణాలు మరే ఇతర రాజ్యాంగంలో కనిపించవు. విషయ సంగ్రహణంలో, స్ఫూర్తిని కలిగించడంలో భారత రాజ్యాంగం విభిన్నమైంది. 42వ రాజ్యాంగ సవరణ చట్టాన్ని (1976) 'మినీ రాజ్యాంగం' అంటారు. దీని ద్వారా రాజ్యాంగంలోని అనేక భాగాల్లో మార్పులు వచ్చాయి. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా సవరణలు చేయడం, కొన్ని ప్రకరణలు తీసివేయడం, నూతన ప్రకరణలను చేర్చడం చేస్తున్నారు.

ఏపీపీఎస్సీ పరీక్షల ప్రత్యేకం
ఇండియన్ పాలిటీ

భారత రాజ్యాంగం - విశిష్ట లక్షణాలు

ప్రపంచ లిఖిత రాజ్యాంగాల్లోకెల్లా భారత రాజ్యాంగం అతి పెద్దది. దీన్ని హెచ్.వి.కామత్ రాజ్యాంగాన్ని రాజ్యాంగ పరిషత్ గుర్తు అయిన ఐరావతంతో పోల్చారు. పార్లమెంట్‌కు రాజ్యాంగ సవరణాధికారం ఉన్నప్పటికీ, మౌలిక స్వరూపాన్ని మాత్రం మార్చకూడదని సుప్రీంకోర్టు కేశవానంద భారతి కేసు సందర్భంగా తీర్పునిచ్చింది.

దృఢ - అదృఢ సమ్మేళనం

- భారత రాజ్యాంగం దృఢ-అదృఢ లక్షణాల సమ్మేళనం.
- రాజ్యాంగంలోని కొన్ని ముఖ్యమైన అంశాలను అత్యంత కఠినమైన పద్ధతిలో సవరించడానికి వీలుంటే, మరికొన్నింటిని సరళమైన రీతిలో మార్పు చేయొచ్చు. మిగిలిన అంశాలను సగం కఠినమైన, సరళమైన రీతిలో సవరణ చేయొచ్చు.
- భారత రాష్ట్రపతి, సుప్రీంకోర్టు - హైకోర్టు అధికారాలు, భారత పౌరసత్వం, నూతన రాష్ట్రాల ఏర్పాటు లాంటి అంశాల సవరణకు సరళమైన పద్ధతి సూచించారు.
- రాష్ట్రపతి ఎన్నిక, కేంద్ర ప్రభుత్వ కార్యనిర్వాహక అధికారాలు, కేంద్ర, రాష్ట్ర ఉమ్మడి జాబితాలోని అంశాలను సవరించేందుకు పార్లమెంట్‌లో ఉభయసభల్లో 2/3వ వంతు సభ్యుల ఆమోదంతో పాటు సగం రాష్ట్ర శాసనసభల ఆమోదం అవసరం. అంటే పాక్షిక సరళ-పాక్షిక దృఢ పద్ధతిని అనుసరించాలి.
- ప్రాథమిక హక్కులు, ఆదేశిక సూత్రాలు లాంటి కొన్ని అంశాలను సవరించాలంటే పార్లమెంట్‌లో ప్రత్యేక మెజార్టీ సభ్యుల ఆమోదం తప్పనిసరి. అందుకే భారత రాజ్యాంగాన్ని దృఢ - అదృఢ లక్షణాల సమ్మేళనంగా చెప్పవచ్చు.

ఓటుహక్కు

భారతీయుల్లో 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికీ కుల, మత, జాతి, లింగ, అక్షరాస్యత లాంటి వివక్ష లేకుండా రాజ్యాంగం ఓటుహక్కు కల్పించింది.

- 61వ రాజ్యాంగ సవరణ చట్టం (1988) ఓటుహక్కు వయసుని 21 ఏళ్ల నుంచి 18 ఏళ్లకు తగ్గించింది. ఇది 1989 నుంచి అమల్లోకి వచ్చింది.

సుదీర్ఘమైన లిఖిత రాజ్యాంగం

1950లో అమల్లోకి వచ్చిన భారత రాజ్యాంగంలో 395 ప్రకరణలు 22 భాగాలు, 8 షెడ్యూళ్లు ఉన్నాయి. ప్రస్తుతం 465 ప్రకరణలు, 25 భాగాలు, 12 షెడ్యూళ్లు ఉన్నాయి. ప్రపంచంలోని ఏ రాజ్యాంగంలో ఇన్ని ప్రకరణలు, షెడ్యూళ్లు లేవు. అంతేకాకుండా భారతీయ సమాజం వైవిధ్యతను దృష్టిలో పెట్టుకుని భారత రాజ్యాంగ నిర్మాతలు మైనార్టీలు, షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలకు చెందిన ప్రజలకు ప్రత్యేకమైన రక్షణలు ఏర్పాటు చేశారు.

పార్లమెంటరీ తరహా ప్రభుత్వం

- భారత్ బ్రిటిష్ తరహా పార్లమెంటరీ వ్యవస్థను ఎంపిక చేసుకుంది. ఈ వ్యవస్థలో శాసనసభ, కార్యనిర్వాహక వర్గాల మధ్య సహకారం, సమన్వయం ఉంటాయి. పార్లమెంటరీ వ్యవస్థను వెస్ట్ మినిస్టర్ తరహా ప్రభుత్వం అని, బాధ్యతాయుత ప్రభుత్వం అని, కేబినెట్ ప్రభుత్వం అని కూడా అంటారు.
- రాజ్యాంగం కేంద్రం, రాష్ట్రాల్లో పార్లమెంటరీ వ్యవస్థను ఏర్పర్చింది. కేంద్రంలో రాష్ట్రపతి, రాష్ట్రంలో గవర్నర్ నామమాత్రపు కార్యనిర్వహణాధికారులు కాగా, కేంద్రంలో ప్రధానమంత్రి నాయకత్వంలోని మంత్రివర్గానికి, రాష్ట్రంలో ముఖ్యమంత్రి నాయకత్వంలోని మంత్రివర్గానికి వాస్తవ కార్యనిర్వహణాధికారాలు ఉంటాయి.

ఆదేశిక సూత్రాలు

రాజ్యాంగంలోని నాలుగో భాగంలో 36 - 51 వరకు ఉన్న నిబంధనలు ఆదేశిక సూత్రాల గురించి వివరిస్తాయి. వీటికి న్యాయ సంరక్షణ లేదు.

- ఇవి రాజ్యాంగ ప్రవేశికలోని ఆదర్శాలను సాధించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఇచ్చిన మార్గదర్శక సూత్రాలు. భారతదేశంలో సంక్షేమ రాజ్య స్థాపనకు ఇవి దోహదపడతాయి.

కేంద్ర - సమాఖ్య వ్యవస్థ

- భారత రాజ్యాంగం మొదటి ప్రకరణ భారతదేశాన్ని రాష్ట్రాల యూనియన్‌గా ప్రకటించింది. భారత రాజ్యాంగంలో సమాఖ్య లక్షణాలు ఉన్నప్పటికీ సమాఖ్య అనే పదం ఎక్కడా వాడలేదు. ఇందులో రెండు అర్థాలు ఇమిడి ఉంటాయి. అవి:
  1. రాష్ట్రాల మధ్య జరిగిన ఒప్పందం ద్వారా భారత సమాఖ్య ఏర్పడలేదు.
  2. ఏ రాష్ట్రానికీ సమాఖ్య నుంచి విడిపోయే అధికారం లేదు.
- ఈ కారణంగానే భారత రాజ్యాంగాన్ని ఏకకేంద్ర స్ఫూర్తితో ఉన్న సమాఖ్య స్వరూపం అంటారు.

సమగ్ర, స్వతంత్ర న్యాయవ్యవస్థ

భారత రాజ్యాంగం ఒక ఏకీకృత, స్వతంత్ర న్యాయవ్యవస్థను ఏర్పాటు చేసింది. దేశ న్యాయవ్యవస్థలో సుప్రీంకోర్టు అగ్రభాగాన ఉంటుంది. దాని కింద రాష్ట్ర స్థాయిలో హైకోర్టులు ఉంటాయి. హైకోర్టుల కింద క్రమానుగతిలో సబార్డినేట్ కోర్టులు, జిల్లా కోర్టులు, ఇతర కోర్టులు ఉంటాయి. సుప్రీంకోర్టు ప్రజల ప్రాథమిక హక్కులను, రాజ్యాంగాన్ని సంరక్షిస్తుంది.

అధికార విభజన

భారత రాజ్యాంగం దేశాన్ని 'రాష్ట్రాల యూనియన్' అని ప్రకటించినప్పటికీ, అధికారాల పంపిణీ రాజ్యాంగ పరంగా జరిగింది. అవి కేంద్ర, రాష్ట్ర, ఉమ్మడి జాబితాలు.

అత్యవసర అధికారాలు

- ఎలాంటి అసాధారణ పరిస్థితులనైనా సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు రాష్ట్రపతికి భారత రాజ్యాంగం అత్యవసర అధికారాలను సమకూర్చింది. దేశ సార్వభౌమాధికారాన్ని, ఐక్యతను, సమగ్రతను, భద్రతను కాపాడటానికి, దేశ రాజకీయ ప్రజాస్వామ్య వ్యవస్థను, రాజ్యాంగాన్ని సంరక్షించడానికి ఈ అత్యవసర అధికారాలు అవసరం.
- రాజ్యాంగం ప్రకారం మూడు రకాల అత్యవసర పరిస్థితులు ఉన్నాయి.
  - జాతీయ అత్యవసర పరిస్థితి
  - రాష్ట్ర అత్యవసర పరిస్థితి (రాష్ట్రపతి పాలన)
  - ఆర్థిక అత్యవసర పరిస్థితి

ఏక పౌరసత్వం

భారత రాజ్యాంగం సమాఖ్య పద్ధతి, ద్వంద్వ ప్రభుత్వ విధానం కలిగి ఉన్నప్పటికీ పౌరులందరికీ ఒకే పౌరసత్వాన్ని ప్రసాదించింది. పౌరులు ఏ రాష్ట్రంలో జన్మించినా, నివాసం ఏర్పర్చుకున్నా దేశమంతా సమాన రాజకీయ, పౌర హక్కులు ఉంటాయి.

లౌకిక రాజ్యం

భారత రాజ్యాంగం లౌకిక రాజ్యానికి ప్రతీకగా ఉంటుంది. రాజ్యాంగం భారతదేశంలో ఏ ఒక్క మతాన్ని అధికార మతంగా గుర్తించదు. మత ప్రాతిపదికపై కల్పించిన రిజర్వేషన్లను రద్దు చేసింది. అయితే తాత్కాలిక ప్రాతిపదికపై షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగల వారికి శాసన నిర్మాణంలో తగిన ప్రాతినిధ్యం లభించడానికి వీలుగా రిజర్వేషన్ సౌకర్యాలు కల్పించింది.

ప్రాథమిక విధులు

మౌలిక రాజ్యాంగం పౌరుల ప్రాథమిక విధులను పేర్కొనలేదు. 42వ రాజ్యాంగ సవరణ చట్టం (1976) ద్వారా స్వరణ్‌సింగ్ కమిటీ సూచనల మేరకు 10 ప్రాథమిక విధులను రాజ్యాంగంలో చేర్చారు. వీటిని రష్యా (USSR) నుంచి గ్రహించారు. 86వ రాజ్యాంగ సవరణ చట్టం (2002) ద్వారా ఒక ప్రాథమిక విధిని అదనంగా చేర్చారు. ప్రస్తుతం రాజ్యాంగంలో 4A భాగంలోని 51 - A ఆర్టికల్ 11 ప్రాథమిక విధుల గురించి తెలుపుతుంది.

ప్రాథమిక హక్కులు

భారత రాజ్యాంగంలోని 3వ భాగంలో 12 - 35 వరకు ఉన్న నిబంధనలు ప్రాథమిక హక్కుల గురించి తెలియజేస్తాయి. రాజకీయ ప్రజాస్వామ్యాన్ని ప్రాథమిక హక్కులు ప్రసాదిస్తాయి. కార్యనిర్వాహక వర్గ నిరంకుశత్వాన్ని, సహేతుకం కాని శాసనసభ శాసనాలను ప్రాథమిక హక్కులు నిరోధిస్తాయి. ఇవి న్యాయ నిర్ణేతుకమైనవి. ఈ హక్కులకు భంగం కలిగితే న్యాయస్థానాలు విచారించి, తగిన రక్షణ కల్పిస్తాయి.



రచయిత
డా. వి.కుమారస్వామి
విషయ నిపుణులు

Word of the Day 867

Feud

Telugu meaning: వైరం, శత్రుత్వం

English meaning: The word feud (ఫ్యూడ్) is a noun that refers to a prolonged and bitter conflict between individuals or groups.

Synonyms: Conflict, Rivalry; ***Antonyms:*** Harmony, Peace


Usage: **1.** The long-standing feud between the two families affected social harmony in the village.

2. Political parties often engage in a public feud that distracts from real issues.

Current Affairs



Prime Minister Narendra Modi was on 18 December 2025 conferred with the Order of Oman (First Class) by Sultan Haitham bin Tarik in recognition of his contribution to strengthening India-Oman ties and his leadership. The conferment coincided with the 70th anniversary of diplomatic relations between India and Oman and came during the Prime Minister's official visit to Muscat, underscoring the depth of the strategic partnership between the two countries.



The Union Government has approved a Rs.887-crore plan to develop a world-class marina at Mumbai Harbour, a move aimed at boosting coastal shipping, maritime tourism and waterfront-led urban development in the country's financial capital. The project will be developed over nearly 12 hectares of seawater area and will have the capacity to berth 424 yachts of up to 30 metres in length.



The Tripura Agriculture Department on 17 December 2025 signed a Memorandum of Understanding (MoU) with the Nagpur-based National Bureau of Soil Survey and Land Use Planning (NBSS and LUP). This is a major step towards enhancing agricultural productivity and achieving self-sufficiency in foodgrain production. The collaboration aims to carry out in-depth research on cultivable land across several districts of the state, paving the way for sustainable farming practices and a stronger agricultural future for Tripura.

India has recorded a significant surge in fish production and aquaculture productivity since the launch of the Pradhan Mantri Matsya Sampada Yojana (PMMSY) in 2020. With total fish production rising from around 141.6 lakh tonnes in 2019-20 to an estimated 197.75 lakh tonnes in 2024-25, marking a 38% growth.

For more Current Affairs: Scan QR code

భారతీయ రక్షణ రంగం - డీఆర్‌డీఓ

స్టడీ జోన్

దేశ భద్రతలో రక్షణ రంగానిదే ముఖ్య భూమిక. భారత్‌లో ఈ రంగానికి సంబంధించిన కార్యకలాపాలన్నీ రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఓ) ఆధ్వర్యంలోనే జరుగుతాయి. రక్షణపరమైన పరిశోధన సామర్థ్యాలను మెరుగుపరచడం, జాతీయ భద్రతను బలోపేతం చేయడం, ప్రాదేశిక సార్వభౌమాధికారాన్ని నిలబెట్టడం మొదలైనవి సాధించడంలో డీఆర్‌డీఓ వ్యూహాత్మక పాత్ర పోషిస్తుంది. అంతేకాక శాస్త్ర, సాంకేతిక రంగంలో మన దేశాన్ని తిరుగులేని శక్తిగా మార్చడంలోనూ ఇది క్రియాశీలకంగా పనిచేస్తోంది. భారత సైనిక దళాల అవసరాలకు అనుగుణంగా అత్యాధునిక ఆయుధ వ్యవస్థలను, డిఫెన్స్ టెక్నాలజీని రూపొందించడం, అభివృద్ధి చేయడం, ఉత్పత్తి చేయడం దీని ముఖ్య విధి. పోటీపరీక్షల నేపథ్యంలో డీఆర్‌డీఓకు సంబంధించిన ముఖ్య విషయాల గురించి తెలుసుకుందాం..!

నాయకత్వం


- డీఆర్‌డీఓకు ఛైర్మన్ నాయకత్వం వహిస్తారు. మొదట్లో ఈ పదవిని డైరెక్టర్ జనరల్‌గా పిలిచేవారు. 2015లో ఛైర్మన్‌గా పేరు మార్చారు. ప్రస్తుతం డీఆర్‌డీఓ ఛైర్మన్‌గా డాక్టర్ సమీర్ వి. కామత్ ఉన్నారు (2022, ఆగస్టు 26 నుంచి)

భారతదేశ క్షిపణి ప్రోగ్రాం

- భారత మాజీ రాష్ట్రపతి, శాస్త్రవేత్త ఏపీజే అబ్దుల్ కలాం ఆధ్వర్యంలో 1983 జులై 26న ఇంటిగ్రేటెడ్ గైడెడ్ మిస్సైల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం (ఐజీఎండీపీ)ను ప్రభుత్వం ప్రారంభించింది. స్వదేశీ గైడెడ్ క్షిపణులను అభివృద్ధి చేయడం దీని ముఖ్య ఉద్దేశం. ఈ కారణంగానే కలాంను 'మిస్సైల్ మాన్ ఆఫ్ ఇండియా', 'ఫాదర్ ఆఫ్ ఇండియన్ మిస్సైల్ టెక్నాలజీ'గా పిలుస్తారు.
- క్షిపణి వ్యవస్థలో భారత్‌ను స్వయం సమృద్ధి దేశంగా రూపొందించడంలో డీఆర్‌డీఓ సఫలీకృతం అయ్యింది.
- 2008, జనవరి 8న ఐజీఎండీపీ విజయవంతంగా పూర్తయినట్లు డీఆర్‌డీఓ ప్రకటించింది.

డీఆర్‌డీఓ ఏర్పాటు - విశేషాలు, ఇతర పూర్తి సమాచారం కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

జనరల్ స్టడీస్ - ఇండియన్ జాగ్రఫీ



మృత్తికలు

భూమిపై జరిగే శిలా శైథిల్యం వల్ల, జంతు, వృక్ష సంబంధ పదార్థాలు కాలక్రమంలో అనేక భౌతిక, రసాయనిక మార్పులకులోనై అనేక పరిణామాలు చెందడం వల్ల ఏర్పడే సున్నితమైన పదార్థాన్ని 'మృత్తిక' అంటారు. లేదా భూ ఉపరితలంపై కర్బన, అకర్బన పోషకాలతో కూడి, వదులుగా ఉండే పొర/నేలనే 'మృత్తిక' అంటారు.

ఏర్పాటు

మృత్తికలు సాధారణంగా 5 రకాల కారణాల వల్ల ఏర్పడతాయని రష్యా మృత్తికా శాస్త్రవేత్త డాకు చాయెల్ పేర్కొన్నారు. అవి:

1. మాతృశిలలు
2. స్థానిక శీతోష్ణస్థితి
3. వృక్ష సంబంధ పదార్థాలు
4. నైసర్గిక స్వరూపం
5. నేల వయసు

భారతదేశంలో నేలలు

భారతదేశంలో నేలలను 8 రకాలుగా వర్గీకరించారు. అవి:

1. ఒండ్రు నేలలు
2. నల్లరేగడి నేలలు
3. ఎర్ర నేలలు
4. లాటరైట్ నేలలు
5. క్షార నేలలు
6. పర్వత ప్రాంత నేలలు
7. ఎడారి/ ఇసుక నేలలు
8. పీట్ / సేంద్రియ నేలలు

ఓల్కర్ శాస్త్రవేత్త - మృత్తికల వర్గీకరణ, మృత్తికా క్రమక్షయం రకాలు మొదలైన అంశాలతో సహా పూర్తి సమాచారం ఈ-బుక్ రూపంలో 'ఈనాడు ఈప్రతిభ' వెబ్‌సైట్‌లో 'జనరల్ స్టడీస్ ఈ-బుక్స్' కోర్సులో అందుబాటులో ఉంది. మరిన్ని వివరాలకు క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

నోటిఫికేషన్స్

పోస్టు గ్రాడ్యుయేట్ ప్రవేశాలు

నేషనల్ ఫోరెన్సిక్ సైన్సెస్ యూనివర్సిటీ, మణిపుర్ క్యాంపస్ 2026 సంవత్సరానికి గ్రాడ్యుయేట్ ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది. అర్హులైన అభ్యర్థులు 2026, జనవరి 10లోగా ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.

యాక్ట్ అప్రెంటిస్ పోస్టులు

పంజాబ్ రాష్ట్రం కపుర్తలాలోని రైల్ కోచ్ ఫ్యాక్టరీ (ఆర్‌సీఎఫ్) యాక్ట్ అప్రెంటిస్ ట్రైనింగ్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. మొత్తం పోస్టుల సంఖ్య 550. దరఖాస్తు రుసుము రూ.100. ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ 7 జనవరి 2026.

యంగ్ ప్రొఫెషనల్ పోస్టులు

దిల్లీలోని ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రిసెర్చ్ (ఐసీఎంఆర్) ఒప్పంద ప్రాతిపదికన యంగ్ ప్రొఫెషనల్-I (ఫైనాన్స్ & అకౌంట్స్) ఉద్యోగాల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహిస్తోంది. మొత్తం పోస్టుల సంఖ్య 8. అర్హులైన అభ్యర్థులు 2026, జనవరి 9న ఇంటర్వ్యూకు హాజరుకావొచ్చు.

దరఖాస్తు చేశారా..?

కింది ఉద్యోగాలకు నేడే (డిసెంబరు 21) చివరి తేదీ

- హిందుస్థాన్ ఉర్వరక్ అండ్ రసాయన్ లిమిటెడ్‌లో అప్రెంటిస్ పోస్టులు. బీఈ/బీటెక్, బీకాం/బీబీఏ, ఫిజిక్స్, కెమిస్ట్రీ, మ్యాథమెటిక్స్‌లో బీఎస్సీ ఉత్తీర్ణులు అర్హులు.

పూర్తి వివరాలు, మరిన్ని నోటిఫికేషన్ల కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

Railway Exams

Reasoning

Missing letters

Directions (1 - 34): *Find the missing letters in the given series.*

1. K_PZ_ZP_KZ_Z
A) SSYU B) ZHWB
C) SHEI D) ZKZP

2. L_PETE_EPE_ELE_ET_
A) ELTPE B) GSIWB
C) ERGII D) ESETG

3. C_PE_EPE_EP_
A) ECCE B) EFIB
C) RWJN D) REHI

4. CO_SC_PS_OP_
A) LHRS B) POCS
C) MOSH D) RVWI

5. _ED_KZ_DE_ZE_EK
A) NEFER B) ABERS
C) ZEEKD D) NEEKL

6. _AC_MA_KM_CK
A) MKCA B) LEBA
C) AHME D) AMOW

7. b_cdb_cd_cc_
A) dejw B) dbch
C) bwjw D) ccbd

8. l_nc_mn_lmn_
A) fjso B) mlcc
C) hejw D) fuwn

9. _up_c_prc_pr
A) cruu B) blms
C) llmv D) aamn

10. j_kn_kk_jk_n
A) jojs B) kjnk
C) kshs D) jisb

11. b_pdb_pd_dp_
A) dcna B) dahh
C) bahs D) ddbd

12. c_wx_rw_crw_
A) sjsj B) rcxx
C) hisn D) fsin

13. _pq_op_pop_p
A) opqq B) ajsj
C) lbsk D) sjns

14. m_lo_yl_my_o
A) jkls B) ymol
C) khso D) jaha

15. c_m_cc_bc_mb
A) cbmc B) ghab
C) hrvs D) fdhi

16. c_ea_cle_pc_e_p
A) sjsja B) csjwn
C) lpala D) onajq

17. _pur_fp_rnf_urn
A) wuqj B) fnup
C) mnqi D) nanj

18. r_re_ere_er_
A) erre B) sese
C) esws D) sera

19. b_dd_bbd_ybb_dy
A) dahs B) asisn
C) bydd D) deus

20. k_me_ime_im_
A) ikke B) lbsj
C) ilnw D) mpan

21. _oiz_oiz_o_z
A) ccci B) xhaj
C) zhah D) xhiv

22. _vc_vvc_vv_m
A) hqjk B) vmmc
C) jjwh D) oown

23. m_si_us_mus_
A) jjaj B) khab
C) umii D) iiba

24. r_ar_yr_arly_ea_ly
A) fansk B) ejamo
C) esjni D) elerr

25. s_je_ssj_rs_je_
A) mwhb B) eauw
C) rhab D) sresr

26. c_iz_ciz_ci_
A) janh B) cwjn
C) cwiw D) cccz

27. p_aso_eas_pe_so
A) awiw B) soan
C) epoa D) ouen

28. l_c_lo_kl_ck
A) okco B) oiob
C) ijqj D) ypnu

29. ca_r_c_r_ocarr_
A) caia B) roaro
C) rjqh D) mqun

30. j_klj_k_jok_
A) khaj B) ooll
C) ihwj D) jjab

31. t_orp_yor_tyo_p
A) icty B) rupn
C) ytpr D) yhai

32. _pg_iop_giop_gi
A) mnoh B) oggg
C) mhaj D) oiaj

33. so_rys_rrys_rr_
A) rooy B) yuyl
C) ougj D) rrioa

34. _cxz_cx_gcx_
A) zgah B) ggzz
C) vjah
D) xiwj

Scan the QR code for Key

These model questions were prepared by subject experts

కరెంట్ అఫైర్స్



◆ ఇటీవల జరిగిన ఐర్లాండ్ అధ్యక్ష ఎన్నికల్లో 63 శాతం ఓట్లు సాధించి దేశ 10వ అధ్యక్షురాలిగా ఎవరు ఎన్నికయ్యారు? జ: కేథరీన్ కొన్నొల్లీ

◆ ప్రపంచ అభివృద్ధి సమాచార దినోత్సవాన్ని ఏటా ఏ రోజున నిర్వహిస్తారు? జ: అక్టోబరు 24

◆ 2025–26లో భారతదేశం ఎంత శాతం వృద్ధితో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థగా కొనసాగుతుందని అంతర్జాతీయ ద్రవ్యనిధి (ఐఎంఎఫ్) తన తాజా వరల్డ్ ఎకనామిక్ అవుట్‌లుక్ నివేదికలో అంచనా వేసింది? జ: 6.6 శాతం

మాదిరి ప్రశ్నలు

◆ చర్చ్ ఆఫ్ ఇంగ్లాండ్‌గా పేరుగాంచిన కాంటర్బరీకి కొత్త ఆర్చ్ బిషప్‌గా ఇటీవల నియమితులైన మహిళ ఎవరు? (ఈ పదవికి ఎంపికైన మొదటి మహిళగా ఈమె ఘనత సాధించారు. 2025 ప్రారంభంలో ఈ చర్చ్ ఆర్చ్ బిషప్ జస్టిన్ వెల్బీ భద్రతా కుంభకోణం కారణంగా రాజీనామా చేసినప్పటి నుంచి ఈ పదవి ఖాళీగా ఉంది.) జ: డేమ్ సారా ముల్లల్లి

◆ 22వ ఆసియాన్ – ఇండియా సదస్సు సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ 2026 సంవత్సరాన్ని ఏమని ప్రకటించారు? జ: ASEAN - ఇండియా సముద్ర సహకార సంవత్సరం

మరింత సమాచారం




భారతదేశంలో స్వాతంత్ర్యానంతరం జరిగిన నిర్మాణాత్మక పరిణామాల్లో వ్యవసాయ రంగంలో వచ్చిన మార్పులు కీలకమైనవి. అందుకు బాటలు వేసిన హరితవిప్లవం వల్ల దేశంలో ఆహార కొరత తీరింది. స్వయంసమృద్ధితో ఆహారభద్రత ఏర్పడింది. అధిక జనాభాకు జీవనాధారమైన వ్యవసాయమే ప్రధాన ఆర్థిక కార్యక్రమంగా అవతరించింది. కానీ, రైతుల ఆదాయం పెరిగినప్పటికీ, దేశవ్యాప్తంగా ఆదాయ అసమానతలకు, పర్యావరణ నష్టాలకు కారణమైంది. సంస్కరణలు, సాంకేతికత వినియోగంతో సాధ్యమైన ఈ విప్లవం తొలి, మలి దశల గురించి పోటీ పరీక్షార్థులకు అవగాహన ఉండాలి. సాగులో ఆధునికీకరణతో వచ్చిన సానుకూల, ప్రతికూల ప్రభావాలతో పాటు సుస్థిర వ్యవసాయాభివృద్ధి దిశగా చేయాల్సిన కృషిని అర్థం చేసుకోవాలి.

ఆహార కొరతను తీర్చి.. అసమానతలు పెంచి!

జనరల్ స్టడీస్ – ఇండియన్ జాగ్రఫీ

వ్యవసాయంలో విప్లవాలు (హరిత విప్లవం)

స్వాతంత్ర్యానంతరం భారతదేశంలో చేపట్టిన సంస్కరణలు, అమలు చేసిన ప్రభుత్వ విధానాలు, సౌకర్యాలు, రాయితీలు, విదేశీ విజ్ఞానం సహకారంతో వ్యవసాయ రంగంలో వేగవంతమైన మార్పులు వచ్చాయి. ఆహార ధాన్యాల ఉత్పత్తి గణనీయంగా పెంచేందుకు వివిధ ప్రణాళికల్లో ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంది. ఇందులో భాగంగానే 1960 దశకంలో హరిత విప్లవం ప్రారంభమైంది. 1965లో మెక్సికోలో అధిక దిగుబడి రకాల విత్తనాలను వాడి ఒకే సంవత్సరంలో 20% అధిక దిగుబడి సాధించారు. దీనినే హరిత విప్లవం (గ్రీన్ రెవల్యూషన్)గా పేర్కొన్నారు. ఈ పదాన్ని అమెరికా శాస్త్రవేత్త డాక్టర్ విలియం గాడ్ మొదటిసారి ఉపయోగించారు. దిగుబడి ఎక్కువగా ఇచ్చే వంగడాలను ఉపయోగించి ఆహారధాన్యాల ఉత్పత్తి పెంచడమే హరిత విప్లవ లక్ష్యం. దేశంలో మొదటగా హరిత విప్లవాన్ని ప్రవేశపెట్టిన శాస్త్రవేత్త డాక్టర్ నార్మన్ బోర్లాగ్. ఆ తర్వాత దానిని అభివృద్ధి చేసిన వారు డాక్టర్ ఎమ్.ఎస్.స్వామినాథన్. అందుకే నార్మన్ బోర్లాగ్‌ను భారత దేశ హరిత విప్లవ పితామహుడిగా, ఎమ్.ఎస్.స్వామినాథన్‌ను హరిత విప్లవ నిర్మాతగా పేర్కొంటారు.



ఎమ్.ఎస్.స్వామినాథన్

హరిత విప్లవంలోని ప్రధానాంశాలు

1) అధిక దిగుబడి వంగడాల వినియోగం 2) రసాయనిక క్రిమిసంహారక మందుల వాడకాన్ని పెంచడం 3) నీటిపారుదల సౌకర్యాల అభివృద్ధి 4) వ్యవసాయ యాంత్రికీకరణ, ఆధునిక పద్ధతుల అమలు. దేశంలో 1966-67లో రుతుపవనాల అనిశ్చితితో కరవు వచ్చింది. వ్యవసాయ రంగ ఉత్పత్తులు గణనీయంగా తగ్గాయి. అదే సమయంలో అధిక దిగుబడిని ఇచ్చే వంగడాలను ఇక్కడ ప్రవేశపెట్టారు. దీంతో పంజాబ్, హరియాణా, పశ్చిమ ఉత్తర్‌ప్రదేశ్‌లో వ్యవసాయ దిగుబడిలో దాదాపు 25% పెరుగుదల నమోదైంది. ఈ వృద్ధినే భారత్‌లో హరితవిప్లవం అన్నారు. అయితే అది నీటిపారుదల ఉన్న ప్రాంతాల్లోనే విజయవంతమైంది.

సానుకూల ప్రభావాలు: ✦ ఉత్పత్తిలో గణనీయంగా పెరుగుదల నమోదైంది. తద్వారా రైతుల ఆదాయం రెట్టింపు అయ్యింది. ✦ వ్యవసాయ రంగంలో సాంకేతికత, యాంత్రికీకరణ జరిగింది. ✦ గ్రామీణ ప్రాంతాల్లో వాణిజ్య పంటలను పండించారు. తద్వారా గ్రామీణ ప్రాంతాల్లో ద్రవ్య ఆర్థిక వ్యవస్థ విస్తరించింది. ✦ వ్యవసాయాధారిత పరిశ్రమల వల్ల మార్కెట్లు పెరిగాయి. ఈ మేరకు రోడ్డు, రవాణా సౌకర్యాలు మెరుగయ్యాయి. ✦ వ్యవసాయ మిగులు, పరిశ్రమలు పెరగడంతో ద్వితీయ, తృతీయ వృత్తులు, కార్యకలాపాలు ఎక్కువయ్యాయి.



ప్రతికూల అంశాలు: ✦ వ్యవసాయ రంగంలో హరిత విప్లవం కారణంగా ప్రాంతీయ అసమానతలు పెరిగాయి. ✦ హరితవిప్లవంలోని అధిక దిగుబడి వంగడాలు, యంత్రాల వాడకం కోసం పెట్టుబడి/ధనం అవసరం వల్ల రైతుల్లో అసమానతల స్థాయి పెరిగింది. ✦ కొత్త యంత్రాల వాడకం కారణంగా గ్రామాల్లోని అనేక వృత్తుల(కమ్మరి, కుమ్మరి, వడ్రంగి) వారికి పని లేకుండా పోయింది. ✦ స్వయంసమృద్ధి ఉన్న గ్రామీణ ఆర్థిక వ్యవస్థలు ప్రభావితమయ్యాయి. ప్రజలు గ్రామాలను వదిలి పట్టణాలు, నగరాలకు వలస వెళ్లారు.

రెండో హరిత విప్లవం



హరితవిప్లవ ప్రతికూల ఫలితాలతో సామాజిక, ఆర్థిక, పర్యావరణ సమస్యలు తలెత్తాయి. పరిమిత పంటలకే హరితవిప్లవం విస్తరించింది. ఈ పరిస్థితుల్లో రెండో హరితవిప్లవం అవసరమనే భావనతో 11వ పంచవర్ష ప్రణాళిక కాలంలో కొన్ని ప్రయత్నాలు జరిగాయి. ✦ జనాభా పెరిగే నిష్పత్తిలో ఆహార ధాన్యాల ఉత్పత్తి ఉండాలి. అది వ్యవసాయ విప్లవంతోనే సాధ్యం. ✦ దేశంలో పట్టణీకరణ వేగంగా పెరుగుతోంది. ఈ ప్రభావంతో ఆహారశుద్ధి వ్యాపారం, ఆహార పరిశ్రమల అభివృద్ధి జరుగుతోంది. వీటికి అవసరమైన ముడి పదార్థాల ఉత్పత్తికి మళ్లీ వ్యవసాయ విప్లవం రావాలి. ✦ మొదటి హరిత విప్లవంతో గోధుమ, వరిలో మాత్రమే దిగుబడులు పెరిగాయి. ఈ మార్పులు ఇతర రంగాలు/పంటలకు కూడా అవసరం. ✦ హరితవిప్లవం కారణంగా గ్రామీణ మౌలిక సదుపాయాలు మెరుగయ్యాయి. అయితే అవి కొన్ని ప్రాంతాల్లోనే జరిగాయి. ఇతర ప్రాంతాల్లోనూ సౌకర్యాలు పెరగాలి. ✦ గ్రామీణ ప్రాంతాల్లో పేదరిక నిర్మూలనకు, నైపుణ్య అభివృద్ధికి రెండో హరితవిప్లవం దోహదం చేస్తుంది. ✦ మొదటి హరితవిప్లవ సమయంలో నీటి నిర్వహణ, నేల ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టలేదు. రెండో విప్లవంలో ఈ అంశంపై దృష్టిసారించాలి.

నిరంతర హరితవిప్లవం (ఎవర్‌గ్రీన్ రెవల్యూషన్)

భారత్‌లో హరితవిప్లవ నిర్మాత ఎమ్.ఎస్.స్వామినాథన్ దేశ ప్రజలందరికీ ఆహారభద్రత కల్పించడానికి, ఆహారధాన్యాల ఉత్పత్తిని రెట్టింపు చేసే ఉద్దేశంతో నిరంతర హరితవిప్లవానికి పిలుపునిచ్చారు.

ప్రధాన అంశాలు: 1) నీటిపారుదల సౌకర్యాలను రెట్టింపు చేయడం.. 2) నేలల పరిరక్షణ, క్రమక్షయానికి గురైన వాటిని కాపాడటం. 3) వర్షపునీటి రక్షణ, నిల్వ, భూగర్భ జలాల పెంపు. 4) రైతులకు పరపతి సౌకర్యాలను సకాలంలో సమకూర్చడం. 5) పరిశోధన ఫలితాలను ఎప్పటికప్పుడు అందించడం. 6) వ్యవసాయ విస్తరణ పథకాలు విస్తృతంగా అమలు చేయడం.




రచయిత: డాక్టర్ గోపగోని ఆనంద్

పర్యావరణ అంశాలు



✦ రసాయనిక ఎరువుల విపరీత వాడకంతో నేలలు వాటి సహజ స్వభావాన్ని కోల్పోయాయి. ✦ భూతాపం (గ్లోబల్ వార్మింగ్) పెరగడానికి కారణమైంది. ✦ నీరు అధికంగా వాడటంతో భూగర్భ జలాలు పడిపోయి నీటి కాలుష్యం ఏర్పడింది. ✦ రసాయనాలు ఎక్కువగా వాడటంతో అవి మానవ ఆరోగ్యంపై దుష్ప్రభావాలను చూపాయి. (ఉదా: క్యాన్సర్ ప్రబలడం) ✦ దేశంలో నీటి వినియోగం ఎక్కువగా ఉన్న రంగం వ్యవసాయం. అధిక దిగుబడిని ఇచ్చే వంగడాల కారణంగా నీటి డిమాండ్ పెరిగింది. భూగర్భ జల మట్టాలు పడిపోయాయి. ✦ కొన్ని ప్రాంతాల్లో నీటి మట్టాలు పడిపోవడం, నేలలు పొడిబారడంతో దీర్ఘకాలంలో ఎడారీకరణకు దారితీసింది. ✦ సాగు భూమి పెరగడంతో అటవీ ప్రాంతం తగ్గిపోయింది. ✦ నీటిపారుదల ప్రాంతాల్లో ఉప్పు నీటితో నేల క్షారయుతమైపోయింది. దాంతో సారం తగ్గింది, వ్యవసాయ ఖర్చు పెరిగింది. ✦ నీటిపారుదల వసతులు పెరిగిన ప్రాంతాల్లో కుంటల్లో నీరు నిలవడంతో దోమలు పెరిగి వ్యాధులు ప్రబలాయి. ✦ హరిత విప్లవంలో వాడిన పురుగు మందులు, యంత్రాల కారణంగా వాయు కాలుష్యం ఎక్కువైంది.

SENIOR INTER Botany – Transport in plants



1. Define water potential? What is the value of water potential of pure water. (2 Marks)

A: The relative difference between the chemical potential of pure water and that of solution. Water potential of the solution increases with increase in water molecules. Water potential of pure water is maximum, i.e., zero (0).

2. What are Porins? What role do they play in diffusion?

A: Special proteins present in cell membrane are called porins. Present in the membranes of mitochondria, plastids, and bacteria and allow the hydrophilic (water-loving) molecules of their size.

3. What are apoplast and symplast?

A: **APOPLAST:** Non-living parts of the plant. **e.g.:** Cell wall and intercellular spaces.

SYMPLAST: Living parts of the plant. **e.g.:** plasmodesmata, cytoplasm, and cytoplasmic strands.

4. Differentiate osmosis and diffusion?

Final Exams-2026 IMPORTANT Q & A

A: **OSMOSIS:** 1. Movement of molecules from low to high concentration. 2. Occurs only in liquid medium. 3. Semi-permeable membrane required, **e.g.:** egg membrane.

DIFFUSION: 1. Movement of molecules from high to low concentration.
2. Occurs in solid, liquid, and gaseous medium.
3. Semi-permeable membrane not required.

Photosynthesis in Higher Plants

1. Define the Law of Limiting Factors proposed by Blackman? (2 Marks)

A: When photosynthesis is influenced by several factors, the rate of the process is limited by slowest factor, and this factor is called limited factor. CO_2 is limiting factor for photosynthesis.

2. Where does the photolysis of H_2O occur? What is its significance?

A: Thylakoid lumen of the chloroplast. The oxygen (O_2) evolved in photolysis is life gas for all organisms during respiration.

For more IMP Q & A




Writer: Dr.M.Chenna Kesavulu

కేంద్రక భౌతిక శాస్త్రం


అనియంత్రిత సంలీన చర్యలతో హైడ్రోజన్ బాంబు!

అణువు నుంచి అనంత విశ్వం వరకు అన్ని స్థాయుల్లో ప్రకృతి దృగ్విషయాలను భౌతిక శాస్త్రం వివరిస్తుంది. శక్తి, పదార్థం తదితర ప్రాథమికాంశాలను, వాటి మధ్య పరస్పర చర్యలను అధ్యయనం చేస్తుంది. సృష్టిలో అపార శక్తిని విడుదల చేసే రెండు భౌతిక ప్రక్రియలైన కేంద్రక విచ్ఛిత్తి, కేంద్రక సంలీనం జరిగే ప్రదేశాలు, వాటి పర్యవసానాలు, వినియోగ విధానాలపై పోటీ పరీక్షార్థులకు అవగాహన ఉండాలి. అణువు నిర్మాణం, రేడియోధార్మికత వెలువడే పద్ధతి, న్యూక్లియర్ రియాక్టర్ల పని తీరు, దేశంలో ఈ అణు పరిజ్ఞానం ఉపయోగం, పురోగతి, ప్రస్తుత స్థితి తదితర వివరాలను తెలుసుకోవాలి.

జనరల్ స్టడీస్ - భౌతిక శాస్త్రం



1. కేంద్రక భౌతికశాస్త్ర పితామహుడు?
   1) బెక్వెరెల్ 2) చాడ్విక్
   3) మేడం క్యూరీ
   4) రూథర్ ఫర్డ్
2. కృత్రిమ రేడియోధార్మిక శ్రేణి?
   1) 4n 2) 4n + 1
   3) 4n + 2 4) 4n + 3
3. కింది వాటిలో రేడియోధార్మిక మూలకం?
   1) Na^{23} 2) P^{31} 3) H^3 4) O^{17}
4. $^{235}_{92}U$లో ప్రోటాన్లు, న్యూట్రాన్ల సంఖ్య?
   1) 92, 141 2) 147, 92
   3) 92, 143 4) 143, 92
5. రక్తనాళాల్లో అడ్డంకులను గుర్తించడానికి వాడే ఐసోటోపు?
   1) Na^{24} 2) P^{32} 3) I^{131} 4) Co^{60}
6. న్యూట్రాన్ సంఖ్యలో తేడా వల్ల ఏర్పడేవి?
   1) ఐసోబార్ 2) ఐసోటోన్
   3) ఐసోమర్ 4) ఐసోటోప్
7. కింది వాటిలో సరికానిది?
   1) α విఘటనంలో పరమాణు సంఖ్య 2, ద్రవ్యరాశి సంఖ్య 4 తగ్గుతుంది.
   2) β విఘటనంలో పరమాణు సంఖ్య 1 తగ్గుతుంది, ద్రవ్యరాశి సంఖ్య మారదు.
   3) γ విఘటనంలో కేంద్రకం శక్తి తగ్గుతుంది.
   4) ప్రోటాను.. న్యూట్రానుగా మారినప్పుడు β కణం విడుదల అవుతుంది.
8. రేడియోధార్మికతకు ప్రమాణాలు?
   ఎ) క్యూరీ బి) బెక్వెరెల్ సి) రూథర్‌ఫర్డ్
   1) ఎ, బి 2) బి, సి
   3) ఎ, సి 4) ఎ, బి, సి
9. న్యూక్లియర్ రియాక్టర్‌లో మితకారిగా వాడేది?
   ఎ) పారాఫిన్ మైనం బి) గ్రాఫైట్ సి) భారజలం
   1) ఎ, బి 2) బి, సి
   3) సి, ఎ 4) ఎ, బి, సి
10. కింది వాటిని జతపరచండి.
    ఎ) శిలాజాల వయసు 1) Co^{60}
    బి) శిలల వయసు 2) C^{14}
    సి) గాయిటర్ వ్యాధి 3) U^{238}
    డి) క్యాన్సర్ నివారణ 4) I^{131}
    1) ఎ-4, బి-2, సి-1, డి-3
    2) ఎ-2 బి-3, సి-4, డి-1
    3) ఎ-2, బి-3, సి-1, డి-4
    4) ఎ-3, బి-2, సి-4, డి-1
11. ఆసియాలో మొదటి న్యూక్లియర్ రియాక్టర్?
    1) సిరస్ 2) ధ్రువ
    3) జెర్లీనా 4) అప్సర
12. కృత్రిమ సూర్యుడి నిర్మాణంలో ఉపయోగించే సాంకేతికత?
    1) కేంద్రక సంలీనం 2) కేంద్రక విచ్ఛిత్తి
    3) గురుత్వాకర్షణ బలం
    4) విద్యుత్తు అయస్కాంత ప్రేరణ
13. విడి న్యూట్రాన్ అర్ధ జీవితకాలం?
    1) 1500 సెకన్లు
    2) 1000 సెకన్లు
    3) 1200 సెకన్లు
    4) 3 నిమిషాలు




14. ఒక మైక్రోగ్రాము పూర్తిగా నాశనం చెందినప్పుడు విడుదలయ్యే శక్తి?
    1) 9×10^7 J 2) 9×10^3 J
    3) 9×10^{10} J 4) 9×10^5 J
15. ఏ పరమాణు సంఖ్య మూలకం తర్వాత కేంద్రక విఘటనం చెందుతుంది?
    1) 82 2) 84 3) 92 4) 90
16. కల్పకంలో ఉన్న అణు రియాక్టర్?
    1) అసుర
    2) కామిని
    3) కిరణ్
    4) అప్సర




17. అణువిద్యుత్తు కేంద్రంలో ఇంధనంగా వాడేది?
    ఎ) U-238 బి) U-233 సి) ప్లుటోనియం
    1) ఎ, బి 2) బి, సి
    3) ఎ, సి 4) ఎ, బి, సి
18. అణువిద్యుత్తు కేంద్రంలో నియంత్రణ కడ్డీలుగా వాడేవి?
    1) బోరాన్ 2) కాడ్మియం
    3) గ్రాఫైట్ 4) 1, 2
19. కింది వాటిలో సరైనవి?
    ఎ) అణువిద్యుత్తు కేంద్రంలో గ్రాఫైట్ కడ్డీ న్యూట్రాన్ వేగాన్ని తగ్గిస్తుంది.
    బి) అణువిద్యుత్తు కేంద్రంలో శీతలీకరణిగా నీరు లేదా ద్రవ సోడియం వాడతారు.
    1) ఎ, బి సరైనవి 2) ఎ, బి సరికావు
    3) ఎ సరైంది, బి సరికాదు.
    4) ఎ సరికాదు, బి సరైంది.
20. అనియంత్రిత కేంద్రక సంలీన చర్యల శ్రేణి?
    1) హైడ్రోజన్ బాంబు 2) అణు బాంబు
    3) న్యూక్లియర్ రియాక్టర్ 4) డైనమేట్
21. ఇండియాలో మొదట జరిగిన అణుపరీక్ష పేరు?
    1) ఆపరేషన్ శక్తి 2) ఆపరేషన్ ట్రినిటి
    3) ఆపరేషన్ మాన్‌హట్టన్ 4) బుద్ధుడు నవ్వాడు
22. బాబా అటామిక్ రిసెర్చ్‌లో ఉన్న అణుకేంద్రకం?
    1) శివ 2) నారాయణ
    3) ధ్రువ 4) విష్ణు
23. మొదటి అణుపరీక్ష జరిగిన పోఖ్రాన్ ఏ రాష్ట్రంలో ఉంది?
    1) ఆంధ్రప్రదేశ్ 2) మహారాష్ట్ర
    3) తమిళనాడు 4) రాజస్థాన్
24. IAEA ముఖ్య విధి?
    1) ప్రపంచంలో పెట్రోలును ఎక్కువగా ఉపయోగించాలని ప్రోత్సహించడం.



    2) ప్రపంచంలో అణుశక్తిని శాంతి ప్రయోజనాలకు వాడటం.
    3) ప్రపంచంలో బొగ్గు ఉత్పత్తిని పెంచడం.
    4) అణుశక్తిని బాంబుల తయారీలో వాడేలా ప్రోత్సహించడం.
25. భారతదేశంలో మూడంచెల అణుకార్యక్రమాన్ని ఎవరు మొదలుపెట్టారు?
    1) డాక్టర్ హోమీబాబా 2) విక్రమ్ సారాభాయ్
    3) ఏపీజే కలాం 4) మేఘనాథ్ సాహ
26. ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న న్యూక్లియర్ రియాక్టర్?
    1) కల్పకం 2) అప్సర 3) కొవ్వాడ 4) ధ్రువ
27. కింది వాటిని జతపరచండి.
    ఎ) మితకారి 1) U^{238}
    బి) నియంత్రిత కడ్డీలు 2) ద్రవ సోడియం
    సి) శీతలీకరణి 3) కాడ్మియం
    డి) ఇంధనం 4) భారజలం
    1) ఎ-4, బి-2, సి-3, డి-1
    2) ఎ-1, బి-2, సి-3, డి-4
    3) ఎ-4, బి-3, సి-2, డి-1
    4) ఎ-4, బి-3, సి-1, డి-2
28. కేంద్రక విచ్ఛిత్తిలో విడుదలయ్యే శక్తి?
    1) 25.71 MeV 2) 200 MeV
    3) 100 MeV 4) 150 MeV
29. ఎలక్ట్రాన్ ప్రతికణం?
    1) న్యూట్రినో 2) మిషాన్‌లు
    3) పాజిట్రాన్ 4) బేరియాన్
30. సహజ రేడియోధార్మికతను కనుక్కున్న శాస్త్రవేత్త?
    1) మేడం క్యూరీ
    2) రూథర్ ఫర్డ్
    3) హెన్రీ బెక్వెరెల్
    4) చాడ్విక్



31. కృత్రిమ రేడియోధార్మికతను కనుక్కున్న శాస్త్రవేత్త?
    1) మేడం క్యూరీ 2) రూథర్ ఫర్డ్
    3) హెన్రీ బెక్వెరెల్ 4) చాడ్విక్
32. కింది వాటిలో సరికాని వాక్యం?
    1) I^{131} మెదడులో కణుతులు గుర్తించడం, థైరాయిడ్ గ్రంథి పరిశీలన
    2) C^{60} క్యాన్సర్ వ్యాధిని గుర్తించడం, చికిత్స, γ విఘటనం ద్వారా పంట ఉత్పత్తిని పెంచడం.
    3) S^{34} మొక్కల్లో లవణాలు సరఫరాను అధ్యయనం చేయడం.
    4) P^{32} రక్త సరఫరాలో అడ్డంకులు గుర్తించడం.
33. కింది వాటిని జతపరచండి.
    ఎ) ఐసోటోప్ 1) ^1_1H ^3_1H
    బి) ఐసోబార్ 2) $^{23}_{11}Na$, $^{12}_{24}Mg$
    సి) ఐసోటోన్ 3) $^{40}_{18}Ar$, $^{40}_{20}Ca$
    1) ఎ-3, బి-2, సి-1 2) ఎ-2, బి-1, సి-3
    3) ఎ-1, బి-3, సి-2 4) ఎ-1, బి-2, సి-3
34. $^{235}_{92}U$ నుంచి ఒక α కణం విఘటనం చెందింది. అప్పుడు ఏర్పడే కొత్త కేంద్రకం?
    1) $^{235}_{90}U$ 2) $^{231}_{90}Th$
    3) $^{231}_{90}U$ 4) $^{235}_{93}Np$
35. కింది వాటిలో α, β, γ వికిరణాలకు సంబంధించి సరికాని వాక్యం?
    1) α, β, γ వికిరణాలు సహజ రేడియోధార్మికతలో విడుదలవుతాయి.
    2) γ కిరణాలు కాంతి వేగంతో ప్రయాణిస్తాయి.
    3) α కిరణాలకు β, γ లతో పోలిస్తే ఎక్కువ అయనీకరణ సామర్థ్యం ఉంటుంది.
    4) β కణం విద్యుత్తు క్షేత్రంలో రుణ పలకవైపు అపవర్తనం చెందుతుంది.
36. C^{14} అర్ధజీవితకాలం 5728 సంవత్సరాలు. 17,184 ఏళ్ల కిందటి శిలాజంలో ఉండే C^{14} విలువ ఎంత?
    1) $\frac{1}{2}$ 2) $\frac{1}{4}$ 3) $\frac{1}{8}$ 4) $\frac{1}{16}$
37. ప్రతి కేంద్రక విచ్ఛిత్తిలో విడుదలయ్యే న్యూట్రాన్ల సంఖ్య సరాసరిగా..
    1) 1 2) 2 3) 3 4) 4
38. భారతదేశంలో మొదటి అణుపరీక్ష ఎప్పుడు జరిగింది?
    1) 1974, మే 18 2) 1974, జూన్ 18
    3) 1974, ఏప్రిల్ 18 4) 1974, జనవరి 18
39. 962 రోజులు ఏకధాటిగా పనిచేసి ప్రపంచ రికార్డు పొందిన అణువిద్యుత్తు కేంద్రం పేరు?



    1) కైగా 2) కల్పకం
    3) తారాపుర్ 4) కొవ్వాడ
40. ప్రపంచంలో అతిపెద్ద అణు విద్యుత్తు కేంద్రం పేరు?
    1) జైతాపుర్ 2) కల్పకం
    3) కైగా 4) గోరఖ్‌పుర్
41. ది ఇంటర్నేషనల్ అటామిక్ ఎనర్జీ ఏజెన్సీ (ఐఏఈఏ) ఎక్కడ ఉంది?
    1) జపాన్ 2) అమెరికా
    3) రష్యా 4) ఆస్ట్రియా
42. హైడ్రోజన్ బాంబు పితామహుడు?
    1) ఒపెన్ హైమర్ 2) ఐన్‌స్టీన్
    3) ఎడ్వర్డ్ టెల్లర్
    4) హోమీ జహంగీర్ బాబా
43. కేంద్రకం అస్థిరత్వానికి కారణమయ్యే కేంద్రక బలాలు?
    1) హార్డ్‌కోర్ బలాలు 2) కూలుంబు బలాలు
    3) న్యూక్లియర్ బలాలు 4) టెన్సార్ బలాలు
44. గురుత్వ, విద్యుత్తు, కేంద్రక సాపేక్ష బలాల నిష్పత్తి?
    1) $1 : 10^{30} : 10^{36}$ 2) $1 : 10^{30} : 10^{38}$
    3) $1 : 10^{36} : 10^{48}$ 4) $1 : 10^{36} : 10^{38}$
45. కింది వాటిలో హీలియం కేంద్రకాన్ని ($^4_2He^{++}$) పోలి ఉండేది.
    1) α - కణం 2) β - కణం
    3) γ - కిరణం 4) డ్యుటేరియం



రచయిత: మధు కుమార్

సమాధానాలు

1-4; 2-2; 3-3; 4-1; 5-1; 6-4; 7-2; 8-4:- 9-4; 10-2; 11-4; 12-1; 13-2; 14-1; 15-1, 16-2; 17-4; 18-4; 19-1; 20-1; 21-4; 22-3; 23-4; 24-2; 25-1; 26-3; 27-3, 28-2; 29-3; 30-3, 31-1, 32-4, 33-3, 34-2, 35-4, 36-3, 37-3, 38-1, 39-1, 40-1, 41-4, 42-3, 43-2, 44-4, 45-1.

వాట్సప్ వెబ్‌ను హైజాక్ చేయొచ్చు



డివైజ్ లింకింగ్ ఫీచర్‌తో ప్రమాదం ● నిరూపించిన సైబర్ భద్రతా సంస్థ

దిల్లీ: వాట్సప్ డివైజ్ లింకింగ్ ఫీచర్‌తో పొంచి ఉన్న హైజాక్ ప్రమాదాన్ని భారతీయ కంప్యూటర్ ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీం (సీఈఆర్‌టీ-ఐఎన్) వెలుగులోకి తెచ్చింది. దీనిద్వారా వాట్సప్ వెబ్ ఖాతాను హైజాకర్లు పూర్తిగా నియంత్రణలోకి తీసుకుని రియల్‌టైమ్ మెసేజ్‌లు, ఫొటోలు, వీడియోలను చూడగలుగుతారని, వాటిని నియంత్రిస్తారని తేల్చింది. 'ఘోస్ట్‌పెయిర్' పేరుతో శుక్రవారం సీఈఆర్‌టీ-ఐఎన్ ఒక హెచ్చరికను జారీ చేసింది. 'సైబర్ నేరగాళ్లు.. వాట్సప్ డివైజ్ లింకింగ్ ఫీచర్‌ను ఉపయోగించుకుని ఖాతాలను హైజాక్ చేస్తారు. దీనికి ఆథెంటికేషన్ కూడా అవసరం లేదు. పాస్‌వర్డ్‌లు, సిమ్ స్వాపింగ్‌లూ అక్కర్లేదు' అని సీఈఆర్‌టీ-ఐఎన్ అని వివరించింది. దీనిపై వాట్సప్ నుంచి ఇంకా స్పందన రాలేదు.

✦ భారీ స్థాయిలో జరిగే ఈ సైబర్ దాడిలో తొలుత 'హాయ్' అని సందేశం వస్తుంది. ఆ తర్వాత 'చెక్ దిస్ ఫొటో' అని తెలిసిన నంబరు నుంచి మెసేజ్ వస్తుంది. అందులో ఫేస్‌బుక్ మాదిరి ప్రివ్యూ కనిపిస్తుంది. అది ఫేక్ ఫేస్‌బుక్ వ్యూయర్‌కు దారితీస్తుంది. ఆ కంటెంట్‌ను చూడాలంటే 'వెరిఫై' చేయాలనే లింక్ వస్తుంది. అక్కడే సైబర్ నేరగాళ్లు.. డివైజ్ లింకింగ్ ఫీచర్‌ను వినియోగించుకుని ఫోన్ నంబరు ద్వారా వాట్సప్ వెబ్‌లోకి చొరబడతారు. అనుమానించలేని రీతిలో ఫోన్ నంబర్లలోకి ప్రవేశిస్తారు. దానిద్వారా బాధితులు తమకు తెలియకుండానే వాట్సప్ ఖాతాల్లో చొరబడటానికి సైబర్ నేరగాళ్లకు అనుమతిస్తారు.

✦ ఘోస్ట్ పెయిరింగ్ దాడి ద్వారా యూజర్ల ఖాతా.. నేరగాళ్ల బ్రౌజర్లకు అందుబాటులోకి వస్తుంది. అది అదనపు, రహస్య డివైజ్‌గా ఉండిపోతుంది. ఇందులో పెయిరింగ్ కోడ్ ఆథెంటిక్‌గా కనిపిస్తుంది. ఒక్కసారి నేరగాళ్లు డివైజ్‌ను లింక్ చేస్తే.. వాట్సప్ వెబ్‌లో బాధితుడికి ఏదైతే సమాచారం అందుతుందో అదంతా వాళ్లకూ అందుతుంది.

✦ డివైజ్ లింక్ అయ్యాక నేరగాళ్లు.. సందేశాలను చదవగలరు. కొత్త మెసేజ్‌లు బాధితుడికి అందిన సమయంలోనే నేరగాళ్లకు అందుతాయి. బాధితుల కాంటాక్ట్ లిస్టులో ఉన్న వారికి, గ్రూపులకూ సందేశాలను పంపించగలరు.

✦ అనుమానాస్పదంగా వచ్చే సందేశాలను ఎట్టి పరిస్థితుల్లోనూ తెరవద్దని, అవి తెలిసిన నంబర్ల నుంచి వచ్చినా ప్రమాదమేనని సీఈఆర్‌టీ-ఐఎన్ స్పష్టం చేసింది. వాట్సప్, ఫేస్‌బుక్ అని చెప్పుకొనే బయటి సైట్లలో ఫోన్ నంబర్లను ఎంటర్ చేయవద్దని సూచించింది.

అమెరికాను వీడి బయటకు వెళ్లకండి



● వీసా జాప్యాల వేళ ఉద్యోగులకు గూగుల్ సూచన

వాషింగ్టన్: అమెరికా తీసుకొచ్చిన కొత్త సోషల్ మీడియా వెట్టింగ్ పాలసీ కారణంగా వీసా అపాయింట్‌మెంట్లు ఆలస్యమవుతున్న నేపథ్యంలో ప్రముఖ టెక్ కంపెనీ గూగుల్ తన ఉద్యోగులకు కీలక సూచనలు జారీచేసింది. అమెరికాను వీడి ఇప్పట్లో బయటకు వెళ్లకూడదని కొందరు ఉద్యోగులకు ఈ-మెయిల్ ద్వారా అడ్వైజరీని జారీచేసింది. ఈ విషయాన్ని పలు జాతీయ మీడియా సంస్థలు కథనంలో పేర్కొన్నాయి. బయటకు వెళితే అమెరికాకు తిరిగి రావడానికి వీసా స్టాంపింగ్ అవసరమవుతుందని, అందుకు సుదీర్ఘ సమయం ఎదురుచూడాల్సి వస్తుందని అడ్వైజరీలో గూగుల్ తెలిపింది. అమెరికా వీసాపై ఉన్న సిబ్బంది అంతర్జాతీయ ప్రయాణాలకు దూరంగా ఉండాలని సూచించింది. డిసెంబరు 15వ తేదీ నుంచి హెచ్1బీ, హెచ్4 వీసా దరఖాస్తుదారులకు సోషల్ వెట్టింగ్‌ను అమెరికా ప్రారంభించిన సంగతి తెలిసిందే. దాంతో వీసా అపాయింట్‌మెంట్లలో జాప్యం ఎదురవుతోంది. ఎఫ్, జే, ఎం వంటి వీసాల పైనా ఈ ప్రభావం ఉంటుందని గూగుల్ నిపుణులు పేర్కొన్నారు.

రుషికొండ ప్యాలెస్‌తో ప్రతినెలా రూ.25 లక్షల భారం

మంత్రి కందుల దుర్గేష్

ఈనాడు, అమరావతి: వైకాపా ప్రభుత్వంలో రూ.500 కోట్ల ప్రజాధనంతో జగన్ నిర్మించిన రుషికొండ ప్యాలెస్‌తో పర్యాటక శాఖపై ప్రతినెలా రూ.25 లక్షల భారం పడుతోందని ఆ శాఖ మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. ప్రధాని మోదీ మెచ్చుకున్న యోగాంధ్రపై జగన్ తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని శనివారం ఓ ప్రకటనలో దుయ్యబట్టారు.

ఫార్మసీ కౌన్సిల్ ఓటర్లలో అనాసక్తి

ఈనాడు, అమరావతి: ఏపీ ఫార్మసీ కౌన్సిల్ ఏర్పాటుకు 15 ఏళ్ల తర్వాత ఎన్నికల ప్రక్రియ నిర్వహిస్తుండగా.. ఓటర్లలో పెద్దగా స్పందన కనిపించడం లేదు. పోస్టల్ బ్యాలట్ విధానంలో నిర్వహించే ఈ ఎన్నికల్లో.. ఈ నెల 27న ఓట్లను లెక్కించనున్నారు. ఓటింగ్ పత్రాల స్వీకరణకు ఈ నెల 24 సాయంత్రం 5 గంటల వరకు అవకాశం ఇచ్చారు. నాలుగు రోజుల్లో గడువు ముగుస్తుండగా.. మొత్తం 60,943 మంది ఓటర్లలో ఇప్పటివరకు 9 వేల పైచిలుకు ఓట్లు మాత్రమే విజయవాడలోని ఏపీ ఫార్మసీ కౌన్సిల్ కార్యాలయానికి చేరాయి. ఆరుగురు సభ్యుల ఎన్నికకు మొత్తం 44 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. ఓటర్లను ప్రసన్నం చేసుకోవడానికి అభ్యర్థులు తాపత్రయపడుతున్నారు. మరోవైపు అధికారులు సైతం ఓటు హక్కు వినియోగించుకోవాలంటూ చైతన్యపరుస్తున్నారు. తప్పులు లేకుండా డిక్లరేషన్ పత్రం నింపాలని, చెల్లుబాటయ్యేలా ఓట్లు వేసి.. గడువులోగా కార్యాలయానికి పంపాలని కోరుతున్నారు.



అస్సాంలోని గువాహటిలో గోపీనాథ్ బొర్దొలోయి అంతర్జాతీయ విమానాశ్రయం కొత్త టెర్మినల్‌ను ప్రారంభిస్తున్న ప్రధాని మోదీ. చిత్రంలో అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ, అదానీ గ్రూప్ ఛైర్మన్ గౌతమ్ అదానీ, గవర్నర్ లక్ష్మణ్ ప్రసాద్ ఆచార్య, కేంద్రమంత్రులు సర్బానంద సోనోవాల్, రామ్మోహన్ నాయుడు, గౌతమ్ అదానీ తనయుడు జీత్ అదానీ



విమానాశ్రయం వద్ద అస్సాం తొలి ముఖ్యమంత్రి గోపీనాథ్ బొర్దొలోయి విగ్రహం ఆవిష్కరించిన అనంతరం మోదీ

డ్రోగ్ పారాచూట్ల పరీక్ష విజయవంతం

బెంగళూరు: భారత్ చేపట్టనున్న తొలి మానవసహిత అంతరిక్ష యాత్ర గగన్‌యాన్ కోసం రూపొందించిన డ్రోగ్ పారాచూట్లపై పరీక్షలు విజయవంతంగా పూర్తయ్యాయి. తిరుగుప్రయాణంలో క్రూ మాడ్యూల్ వేగాన్ని తగ్గించడానికి ఉద్దేశించిన డిసలరేషన్ వ్యవస్థలో ఉపయోగించేందుకు వీటిని అభివృద్ధి చేసినట్లు భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) పేర్కొంది. చండీగఢ్‌లో ఉన్న టెర్మినల్ బాలిస్టిక్స్ రీసెర్చ్ ల్యాబ్‌లో ఉన్న రైల్ ట్రాక్ రాకెట్ స్లెడ్ (ఆర్‌టీఆర్‌ఎస్) కేంద్రంలో ఈ పరీక్షలు జరిగాయి. వ్యోమనౌక డిసలరేషన్ వ్యవస్థలో మొత్తం 10 పారాచూట్లను ఉపయోగిస్తారు. ఇవి నాలుగు రకాలుగా ఉంటాయి.

భారత వ్యతిరేక శక్తులతో రాహుల్ కుమ్మక్కు: భాజపా

దిల్లీ: ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తన జర్మనీ పర్యటన సందర్భంగా భారత వ్యతిరేక శక్తులతో సమావేశమయ్యారని భాజపా ఆరోపించింది. అలాంటి శక్తులతో చేతులు కలపడం ద్వారా ఆయన ఎలాంటి కుట్రకు పాల్పడుతున్నారన్నదీ తెలియాల్సి ఉందని భాజపా అధికార ప్రతినిధి గౌరవ్ భాటియా పేర్కొన్నారు. రాహుల్ గాంధీ బెర్లిన్‌లోని హెర్టీ స్కూల్ అధ్యక్షురాలు ప్రొఫెసర్ కార్నెలియా వోల్‌తో కలిసి ఉన్న ఫొటోను శనివారం ఆయన ప్రదర్శించారు. జర్మనీలోని భారత వ్యతిరేక శక్తులతో రాహుల్ సమావేశమయ్యారనడానికి ఇదే సాక్ష్యమని తెలిపారు. అమెరికాకు చెందిన బిలియనీర్ జార్జ్ సోరోస్ సెంట్రల్ యూరోపియన్ విశ్వవిద్యాలయానికి నిధులు అందిస్తున్నారని, ఆ విశ్వ విద్యాలయ ధర్మకర్తల్లో కార్నెలియా వోల్ ఒకరని పేర్కొన్నారు. జార్జ్ సోరోస్‌కు చెందిన సంస్థలు భారత వ్యతిరేక కార్యకలాపాల్లో పాల్గొంటున్నాయని, అలాంటి వ్యక్తితో కాంగ్రెస్ నేతలకు సంబంధాలున్నాయని గత సంవత్సరం భాజపా ఆరోపించింది. పార్లమెంటు సమావేశాలకు ముందు, సమావేశాలు జరుగుతున్న సమయంలో రాహుల్ ఎందుకు విదేశీ పర్యటనకు వెళ్తారని ప్రశ్నించారు. భారత వ్యతిరేక కార్యకలాపాల్లో పాల్గొనడం రాహుల్ గాంధీకి ఇది తొలిసారి కాదని, ఆయన మరో మీర్ జాఫర్‌గా మారారని గౌరవ్ భాటియా విమర్శించారు.

మత రాజకీయాలను రెచ్చగొడుతున్న మమత

వచ్చే ఏడాది జరిగే పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోతామని గ్రహించబట్టే ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి, తృణమూల్ కాంగ్రెస్ అధ్యక్షురాలు మమతా బెనర్జీ.. హిందువులు, ముస్లింల మధ్య అల్లర్లు రెచ్చగొట్టాలని చూస్తున్నారని గౌరవ్ భాటియా ఆరోపించారు. శ్రీరాముడు హిందువు కాదని, ముస్లిం అని తృణమూల్ ఎమ్మెల్యే మదన్ మిత్రా ఇటీవల వర్ణించడం కోట్లాది హిందువుల మనసులను గాయపరచిందని పేర్కొన్నారు. ఇంత జరిగినా మదన్ మిత్రాను తృణమూల్ నుంచి బహిష్కరించ లేదని, చార్జిషీటు దాఖలు చేయలేదని విమర్శించారు. ఒక వర్గం వారిని బుజ్జగించి వారి ఓట్లు సాధించుకోవడానికి ముఖ్యమంత్రి మమత స్వయంగా తన పార్టీ నాయకులను ఇలాంటి వ్యాఖ్యలు చేయాల్సిందిగా పురిగొల్పుతున్నారని ఆరోపించారు.

ట్రంప్‌తో సత్సంబంధాల కోసమే 'శాంతి' బిల్లుకు ఆమోదం

● అమెరికా కొత్త చట్టాన్ని ఆధారంగా చూపిస్తూ భాజపాపై కాంగ్రెస్ విమర్శలు

దిల్లీ: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో శాంతిని పునరుద్ధరించుకోవడానికే ప్రధాని మోదీ [illegible] పార్లమెంటులో శాంతి(అణు) బిల్లును ఆమోదింపజేశారని కాంగ్రెస్ ఆరోపించింది. అణుఇంధన పౌర బాధ్యత చట్టం(2010)లోని కీలక నిబంధనలను శాంతి బిల్లు రద్దు చేస్తుందని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ శనివారం ఆరోపించారు. అమెరికాలో డిఫెన్స్ ఆథరైజేషన్ యాక్ట్ 2026పై ట్రంప్ సంతకం చేసిన తర్వాతే తమకు ఆ విషయం అవగాహనలోకి వచ్చిందన్నారు. 3,100 పేజీలు గల ఆ చట్టంలోని 1,912వ పేజీలో అణుబాధ్యత నిబంధనలపై భారత్, అమెరికాల మధ్య జరిగిన ఉమ్మడి మూల్యాంకనానికి సంబంధించిన ప్రస్తావన ఉందని తెలియజేశారు. ఆ చట్టానికి సంబంధించిన కాపీని తన ఎక్స్ పోస్ట్‌లో జతచేసి ఈ విధంగా పేర్కొన్నారు. శాంతి చట్టాన్ని ట్రంప్(ద రియాక్టర్ యూజ్ అండ్ మేనేజ్‌మెంట్ ప్రామిస్ యాక్ట్) చట్టంగా పిలవవచ్చని ఎద్దేవాచేశారు.

ఆ వైద్యురాలికి ప్రభుత్వ ఉద్యోగం, ఫ్లాట్

● ఆఫర్ చేసిన ఝార్ఖండ్ ప్రభుత్వం

రాంచీ, పట్నా: ఉద్యోగ నియామక పత్రాలిచ్చే సందర్భంలో తన హిజాబ్‌ను బిహార్ ముఖ్యమంత్రి నీతీశ్ కుమార్ లాగడంతో ప్రభుత్వ ఉద్యోగంలో చేరేందుకు నిరాకరిస్తున్న వైద్యురాలు నుస్రత్ పర్వీన్‌కు అండగా నిలుస్తామని ఝార్ఖండ్ ప్రభుత్వం ప్రకటించింది. ఆమెకు తమ రాష్ట్రంలో రూ.3 లక్షల వేతనంతో ప్రభుత్వ ఉద్యోగంతోపాటు ఫ్లాట్ ఇస్తామని ఆ రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి ఇర్ఫాన్ అన్సారీ హామీ ఇచ్చారు. ఆమె కోరుకున్న చోట పోస్టింగ్ ఇస్తామని తెలిపారు. ఝార్ఖండ్‌లో ఆమెకు పూర్తి స్థాయి భద్రత కల్పిస్తామని శనివారం జంతారాలో జరిగిన మీడియా సమావేశంలో పేర్కొన్నారు. మహిళ హిజాబ్ లాగడం వ్యక్తిత్వంపై దాడి మాత్రమే కాదని, అది వారి ఆత్మగౌరవంతోపాటు, రాజ్యాంగం మీద చేసే ప్రత్యక్ష దాడి అని విమర్శించారు. అయితే అన్సారీ తీరుపై భాజపా మాజీ ఎమ్మెల్యే భాను ప్రతాప్ సాహి స్పందించారు. దీన్ని రాజకీయ బుజ్జగింపుగా పేర్కొంటూ ఎక్స్ వేదికగా విమర్శించారు. మరోవైపు హిజాబ్ వివాదం బాధాకరమని, ఇది మహిళల గౌరవానికి సంబంధించిందని, ఈ విషయంలో సీఎం నీతీశ్ ప్రత్యక్షంగా కలగజేసుకుని దీనికి ముగింపు పలకాలని బీఎస్పీ చీఫ్ మాయావతి పిలుపునిచ్చారు. నీతీశ్ తీరును సుప్రీం కోర్టు బార్ అసోసియేషన్ (ఎస్‌సీబీఏ) తీవ్రంగా ఖండించింది.

ఉద్యోగంలో చేరని వైద్యురాలు

నుస్రత్ పర్వీన్ శనివారం సాయంత్రం వరకూ ఉద్యోగంలో చేరలేదు. సాయంత్రం 7 గంటల వరకూ ఆమె రాలేదని, ఉద్యోగంలో చేరే గడువును పొడిగించినట్లు తనకు సమాచారం వచ్చిందని, సోమవారం ఆమె చేరుతుందో లేదో చూడాలని పట్నా సివిల్ సర్జన్ అవినాశ్ కుమార్ సింగ్ తెలిపారు. విధుల్లో చేరాల్సిన పట్నా సదర్‌లోని సబల్‌పుర్ పీహెచ్‌సీకి నుస్రత్ రాలేదు. ఈ విషయాన్ని పీహెచ్‌సీ సర్జన్ విజయ్ కుమార్ ధ్రువీకరించారు.

హిజాబ్ వివాదంపై బిహార్ గవర్నర్ ఆరిఫ్ మహమ్మద్ ఖాన్ అసంతృప్తి వ్యక్తం చేశారు. 'ఈ ఘటనలో వివాదం అనే పదం వాడటం నన్ను బాధించింది. తండ్రీ కుమార్తెల మధ్య ఘర్షణ ఉంటుందా' అని ఆయన ప్రశ్నించారు. పట్నాలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు.

దగ్గుమందు కేసులో 75 మంది అరెస్టు

ఉత్తర్‌ప్రదేశ్ ఆర్థిక మంత్రి సురేశ్ ఖన్నా వెల్లడి

షాజహాన్‌పుర్: కోడీన్ ఆధారిత దగ్గు మందును అక్రమంగా నిల్వచేయడం, విక్రయించడం వంటి ఘటనలకు సంబంధించి ఉత్తర్‌ప్రదేశ్‌లోని 31 జిల్లాల్లో ఇప్పటివరకు 74 కేసులు నమోదు చేశామని, 75 మందిని అరెస్టు చేశామని ఆ రాష్ట్ర ఆర్థిక మంత్రి సురేశ్ ఖన్నా తెలిపారు. దాడుల్లో మొత్తం 12.65 లక్షల సీసాల దగ్గు మందును స్వాధీనం చేసుకున్నామని, 132 ఔషధ సంస్థలపై చర్యలు చేపట్టామని వెల్లడించారు. అరెస్టయిన వారిలో కొందరికి సమాజ్‌వాదీ పార్టీలోని ఓ స్థాయి నాయకులతో సంబంధాలు ఉన్నాయని ఆరోపించారు. కల్తీ దగ్గుమందు వ్యవహారంపై దర్యాప్తునకు డీజీపీ స్థాయి అధికారి నేతృత్వంలో ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్)ను ఏర్పాటు చేసినట్లు మంత్రి చెప్పారు.

భూసేకరణ చట్టం అమలులో ఉల్లంఘనలెన్నో..

● స్థాయీ సంఘం ఆరోపణ

దిల్లీ: భూసేకరణ, పునరావాస చట్టం 2013 (ఎల్ఏఆర్ఆర్ యాక్ట్) అమలులో పారదర్శకత పాటించాలని, న్యాయమైన పరిహారం పొందేందుకు నిర్వాసితులకు ఉన్న హక్కును కచ్చితంగా అమలు చేయాలని పార్లమెంటరీ స్థాయీ సంఘం సిఫార్సుచేసింది. ముఖ్యంగా షెడ్యూల్డు ప్రాంతాల్లో ఇది జరగాలని సంఘం గత వారం పార్లమెంటుకు సమర్పించిన నివేదికలో పేర్కొంది. చట్టం అమలుకు సంబంధించి అనేే వ్యవస్థాగత ఏర్పాట్లు ఉన్నా.. పోలవరం, కెన్ బెట్వా వంటి ప్రాజెక్టుల నిర్వాసితుల నుంచి ఫిర్యాదులు అందుతూనే ఉన్నాయని సంఘం తెలిపింది. ఎల్ఏఆర్ఆర్ చట్టం అమలులో ఉల్లంఘనలు జరుగుతున్నాయని కాంగ్రెస్ ఎంపీ సప్తగిరి శంకర్ ఉలకా నేతృత్వంలోని గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ విభాగాల పార్లమెంటరీ స్థాయీ సంఘం పేర్కొంది. భూముల మార్కెట్ లావాదేవీలు తక్కువగా ఉండే షెడ్యూల్డు ప్రాంతాల్లో పరిహారం చెల్లింపు కోసం భూమి విలువ తగ్గించి చూపడం వంటి ఉల్లంఘనలు జరుగుతున్నాయని పార్లమెంటరీ సంఘం పేర్కొంది. భూసేకరణకు సంబంధించి షెడ్యూల్డు ప్రాంతాల్లో గ్రామసభలతో సంప్రదింపులు జరపడంలో ఆలస్యం చేయడం, మహిళలకు ఇతర బలహీన వర్గాలకు సంప్రదింపుల్లో భాగస్వామ్యం కల్పించకపోవడం, భూసేకరణ వల్ల ప్రభావితమయ్యే వర్గాలతో తగిన రీతిలో సంప్రదింపులు జరపకపోవడం వంటి ఉల్లంఘనల్ని పార్లమెంటరీ సంఘం ఎత్తి చూపింది. ఎల్ఏఆర్ఆర్ చట్టం అమలులో గ్రామసభ ప్రధాన పాత్ర పోషిస్తుందని స్థాయీ సంఘం తన నివేదికలో పేర్కొంది. గ్రామసభ ఆమోదాన్ని లాంఛనంగా పరిగణిస్తూ కేవలం కాగితాల్లో మాత్రమే సమ్మతి చూపే తత్వం ప్రబలిపోయిందని పార్లమెంటరీ సంఘం వాపోయింది. అటవీ హక్కుల చట్టం (ఎఫ్ఆర్ఏ) 2006ను ఉల్లంఘనకు పాల్పడి అటవీ భూముల్ని కూడా సేకరించారని తెలుపుతూ అనేక ఫిర్యాదులు తమకు అందాయని పార్లమెంటరీ సంఘం పేర్కొంది.

భారత్- పాక్ యుద్ధాన్ని ట్రంప్ ఆపారు

● అమెరికా విదేశాంగ శాఖ మంత్రి వ్యాఖ్యలు

వాషింగ్టన్: భారత్-పాకిస్థాన్ వివాదాన్ని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పరిష్కరించారని విదేశాంగ మంత్రి మార్కో రూబియో వ్యాఖ్యానించారు. ప్రపంచ వ్యాప్తంగా శాంతి సాధనకు ట్రంప్ సర్కార్ అత్యంత ప్రాధాన్యం ఇస్తోందన్నారు. శుక్రవారం విలేకరుల సమావేశంలో రూబియో ఈ మేరకు వ్యాఖ్యలు చేశారు. భారత్-పాక్, రష్యా- ఉక్రెయిన్, థాయ్‌లాండ్-కంబోడియా, సుడాన్ వంటి అంతర్జాతీయ ఘర్షణల్లో అమెరికా చురుకుగా మధ్యవర్తిత్వం వహించిందన్నారు. రెండు వైపులా మాట్లాడగలిగే శక్తి ఉన్న ఏకైక దేశం అమెరికానే అని పేర్కొన్నారు. భారత్, పాకిస్థాన్ యుద్ధంలో మూడో పక్షం జోక్యం లేదని ఇండియా స్పష్టం చేసినప్పటికీ...ఆ యుద్ధాన్ని తానే ఆపినట్లు ట్రంప్ వివిధ సందర్భాల్లో దాదాపు 70 సార్లు చెబుతూ వచ్చారు.


ఐరాసకు కఠిన వారం



గుటెరస్

ఐక్యరాజ్య సమితి: ఏడాది ముగింపులో ఐక్యరాజ్య సమితి కఠిన పరిస్థితులను ఎదుర్కొంటోంది. ఈ నెల 13న సుడాన్‌లోని సరకుల బట్వాడా కేంద్రంపై జరిగిన డ్రోన్ దాడిలో ఐరాస శాంతి పరిరక్షణ సేన సభ్యులైన ఆరుగురు బంగ్లాదేశీ సైనికులు మరణించారు. దక్షిణ సుడాన్‌లో సమితి తరఫున డ్రైవర్‌గా పని చేస్తున్న ఒక వ్యక్తిని స్థానిక భద్రతా దళాలు నిర్బంధంలోకి తీసుకున్నాయి. తరువాత ఆయన నిర్బంధంలోనే మరణించారు. యెమెన్‌లో హూతీ తిరుగుబాటుదారులు 10 మంది ఐరాస సిబ్బందిని గురువారం నిర్బంధంలోకి తీసుకున్నారు. దీంతో తిరుగుబాటుదారుల నిర్బంధంలోని ఐరాస ఉద్యోగుల సంఖ్య 69కి చేరింది. తమ సిబ్బందిని వెంటనే విడుదల చేయాలని ఐక్యరాజ్య సమితి ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెరస్ డిమాండు చేశారు. మరోవైపు తాజా దాడులను యుద్ధ నేరాలుగా పరిగణించాల్సి వస్తుందని ఐరాస హెచ్చరించింది. ఒకప్పుడు ఐరాస పతాకం భద్రతకు చిహ్నంగా ఉండేదని, ఇప్పుడు ఆ పరిస్థితి లేకపోవడం ఆందోళనకరమని సమితి ప్రతినిధి స్టెఫాన్ డుజారిక్ వ్యాఖ్యానించారు. గాజాలో ఇజ్రాయెల్-హమాస్ యుద్ధం మొదలైనప్పటి నుంచి ఇప్పటివరకూ 300 మంది సమితి సిబ్బంది హతమయ్యారని, దాదాపుగా వారంతా పాలస్తీనీయులేనని వివరించారు. అలాగే 'మాలి' దేశంలో పదేళ్లపాటు విధులు నిర్వహించిన సమితి శాంతి రక్షకుల్లో కూడా 300 మంది మరణించారని పేర్కొన్నారు.

కోర్టులు ఎప్పుడూ మూగజీవుల పక్షమే: సుప్రీం



దిల్లీ: వాణిజ్య ప్రయోజనాల కోసం వన్యప్రాణుల కదలికల్ని కట్టడి చేయడం తగదని సుప్రీంకోర్టు పేర్కొంది. మనుషులు చేపట్టిన నిర్మాణ పనులు, వాణిజ్య కార్యకలాపాల కారణంగా తమ కదలికలకు ఆటంకం కలిగినప్పుడు నోరులేని అడవి జంతువులు మౌనంగా సహించడం తప్ప ఏమీ చేయలేవని, అలాంటి సందర్భాల్లో న్యాయస్థానాలు ఎప్పుడూ జంతువుల పక్షాన నిలుస్తాయని జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్ మల్యా బాగ్చీ, జస్టిస్ విపుల్ పంచోలీలతో కూడిన ధర్మాసనం పేర్కొంది. నీలగిరి అడవుల్లో వివిధ హోటళ్లు, రిసార్టుల యజమానులు దాఖలు చేసిన వ్యాజ్యంపై విచారణను కోర్టు జనవరికి వాయిదా వేసింది. ఈ అంశాన్ని మరింత వివరంగా పరిశీలించాల్సిన అవసరం ఉందని ధర్మాసనం తెలిపింది. "మీరందరూ ఎలిఫెంట్ కారిడార్ (ఏనుగులు ఉండే అడవి)లో వాణిజ్య కార్యకలాపాలు నిర్వహించుకుంటున్నారు. మీరు చేపట్టిన నిర్మాణాలు ఏనుగుల కదలికలకు ఆటంకం కలిగిస్తున్నాయి. మానవ వాణిజ్య కార్యకలాపాల కారణంగా కలిగే నష్టాన్ని మౌనంగా భరించే ఈ జంతువులకు ప్రయోజనం కలిగించాలి" అని ధర్మాసనం అభిప్రాయపడింది. తమిళనాడు ప్రభుత్వం నీలగిరి అడవుల్లోని సిగూర్ పీఠభూమి ప్రాంతాన్ని ఎలిఫెంట్ కారిడార్‌గా ప్రకటించి ఆ ప్రాంతాన్ని ఖాళీ చేయాల్సిందిగా అక్కడి హోటళ్లు, రిసార్టుల యజమానుల్ని ఆదేశించడంతో వారు అత్యున్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. సిగూర్ పీఠభూమి ప్రాంతంలోని ఎలిఫెంట్ కారిడార్‌లో ప్రైవేటు వ్యక్తులు జరిపిన భూమి కొనుగోళ్లు చెల్లుబాటు కావంటూ అత్యున్నత న్యాయస్థానం నియమించిన కమిటీ చేసిన సిఫార్సుకు సెప్టెంబరు 12న మద్రాసు హైకోర్టు ఆమోదం తెలిపింది. సిగూర్ ఎలిఫెంట్ కారిడార్‌లో 39 రిసార్టులు, 390 ఇళ్లతో సహా మొత్తం 800 నిర్మాణాలు ఉన్నాయని అధికారులు కోర్టుకు తెలిపారు. ఆస్తుల యజమానులు ఆ ప్రాంతాన్ని ఎలిఫెంట్ కారిడార్‌గా ప్రకటించడానికి చాలాకాలం ముందే అక్కడ భూములు కొనుగోలు చేశారని కక్షిదారుల తరఫు న్యాయవాదులు పేర్కొన్నారు.

ప్రవేశాల్లో అవకతవకలపై సుప్రీం ఆగ్రహం

● రాజస్థాన్ దంత వైద్య కళాశాలలపై రూ.10 కోట్ల జరిమానా

జైపుర్: ప్రవేశాల్లో అవకతవకలకు పాల్పడిన పది ప్రైవేటు దంత వైద్య కళాశాలలపై సుప్రీంకోర్టు రూ.10 కోట్ల జరిమానా విధించింది. ఉద్దేశపూర్వకంగా నియమాల్ని ఉల్లంఘించిన ఈ కళాశాలలపై కఠినమైన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఏర్పడిందని కోర్టు స్పష్టంచేసింది. ఈ కేసులో వైద్య విద్య ప్రమాణాలకు తిలోదకాలు ఇచ్చారని జస్టిస్ విజయ్ బిష్ణోయి, జస్టిస్ జె.కె.మహేశ్వరిలతో కూడుకున్న ధర్మాసనం పేర్కొంది. 2016-17 విద్యా సంవత్సరంలో బీడీఎస్ (బ్యాచిలర్ ఆఫ్ డెంటల్ సైన్సెస్) కోర్సు ప్రవేశాల్లో చట్ట నిర్దేశిత ప్రక్రియను అనుసరించడంలో విఫలమైన రాజస్థాన్ ప్రభుత్వంపై సైతం కోర్టు చర్య తీసుకుంది. నియమోల్లంఘనకు పాల్పడిన ప్రభుత్వం రాష్ట్ర న్యాయ సేవల ప్రాధికార సంస్థ వద్ద రూ.10 లక్షలు డిపాజిట్ చేయాలని న్యాయస్థానం ఆదేశించింది.

కంపెనీలపై పర్యావరణ రక్షణ బాధ్యత

● సుప్రీంకోర్టు స్పష్టీకరణ

దిల్లీ: సామాజిక బాధ్యతకు తోడు పర్యావరణాన్నీ, ఇతర జీవులనూ కాపాడుకోవలసిన బాధ్యత కూడా కంపెనీలపై ఉందని సుప్రీంకోర్టు పేర్కొంది. రాజస్థాన్, గుజరాత్‌లలో పునరుత్పాదక ఇంధన వనరులతో విద్యుత్తును ఉత్పత్తి చేసే కేంద్రాలు విరివిగా ఏర్పడటం బట్టమేక (గ్రేట్ ఇండియన్ బస్టర్డ్) పక్షి ఉనికికి ప్రమాదం తెచ్చిపెడుతోందంటూ దాఖలైన పిటిషన్‌పై విచారణ సందర్భంగా ద్విసభ్య ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది. అడవులు, సరస్సులు, నదులు, జంతు, వృక్షజాలాలతో సహా సమస్త పర్యావరణ, జీవావరణాలను సంరక్షించడం, అన్ని జీవజాతుల పట్ల కారుణ్యం చూపడం పౌరుల ప్రాథమిక విధి అని 51ఏ(జి) రాజ్యాంగ అధికరణ నిర్దేశిస్తోంది. పౌరులకు ప్రాథమిక హక్కులతోపాటు ప్రాథమిక విధులూ ఉంటాయని రాజ్యాంగం స్పష్టం చేస్తోంది. కంపెనీ అనేది చట్టం దృష్టిలో ఒక వ్యక్తి వంటిది, సమాజంలో అంతర్భాగం కూడా కాబట్టి పౌరులపై ఉన్న బాధ్యత కంపెనీలపైన కూడా ఉంటుందని ధర్మాసనం పేర్కొంది. కనుక పర్యావరణ రక్షణకు కంపెనీ నిధులు ఇవ్వడమనేది దానం వంటిది కాదనీ, అది కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్)లానే కార్పొరేట్ పర్యావరణ బాధ్యత అని ఉద్ఘాటించింది. 2013నాటి కంపెనీల చట్టంలోని సెక్షన్ 135 కంపెనీలు సామాజిక బాధ్యత నెరవేర్చడానికి నిర్దిష్ట మొత్తంలో నిధులు కేటాయించాలని నిర్దేశిస్తోంది. కంపెనీల లాభాలు కేవలం వాటాదారుల ప్రైవేటు ఆస్తి కాదనీ, ఆ లాభాలు రావడానికి కారణమైన సమాజానికీ వాటిలో వాటా ఉంటుందని ఈ సెక్షన్ స్పష్టం చేసిందని ధర్మాసనం పేర్కొంది. గనుల తవ్వకం, విద్యుత్, మౌలిక వసతుల ప్రాజెక్టుల వల్ల జీవజాతులకు ప్రమాదం ఏర్పడితే, వాటిని సంరక్షించడానికి కార్పొరేట్ సామాజిక బాధ్యత కిందకు వచ్చే నిధులను వెచ్చించాలని పేర్కొంది. బట్టమేక పక్షిని కాపాడాలంటూ రంజిత్ సింహ్ అనే పర్యావరణ ఉద్యమకారుడు 2019లో వేసిన పిటిషన్‌ను పురస్కరించుకుని సుప్రీంకోర్టు ఈ ఉత్తర్వు జారీచేసింది.

గుజరాత్‌లో కిలో ఉల్లి రూ.3.. రైతుల ఆశలు తలకిందులు

ఈటీవీ భారత్: మార్కెట్ పరిస్థితుల కారణంగా కొన్నిసార్లు రైతులు ఊహించని నష్టాలు చవిచూస్తారు. అలాంటి పరిస్థితే ఇప్పుడు గుజరాత్‌లోని భావ్‌నగర్ రైతులకు వచ్చింది. మహారాష్ట్రలోని నాసిక్ తర్వాత గుజరాత్‌లోని సౌరాష్ట్ర ప్రాంతం దేశంలోనే అతిపెద్ద ఉల్లిపాయల ఉత్పత్తిదారుగా ఉంది. నాణ్యతకు పేరుగాంచిన భావ్‌నగర్ ఉల్లిపాయ ఈ ఏడాది రైతులను తీవ్ర ఆర్థిక సంక్షోభంలోకి నెట్టింది.



ధరలు మరీ దారుణంగా పడిపోవడం వల్ల రైతులు తమ సాగు ఖర్చులను తిరిగి పొందడం కూడా కష్టతరంగా మారింది. ఈ సారి ఎరుపు, తెలుపు ఉల్లిపాయలను పండించిన భావ్‌నగర్ రైతులు మంచి ధర వస్తుందని ఆశించారు. అకాల వర్షాలు వారి ఆశలను నీరుగార్చాయి. వర్షాలు, మంచు భారీగా కురవడం వల్ల చాలాచోట్ల ఉల్లిపాయలు దెబ్బతిన్నాయి. మార్కెటింగ్ యార్డుల్లో కిలోకు రూ.3 మాత్రమే లభిస్తుండటంతో రైతులు ఉసూరుమంటున్నారు.

మహా నగరంలో మమ్దానీ.. అనాథ ప్రేతాలకు నేనున్నాననీ



ఈటీవీ భారత్: నిత్యం సందడిగా ఉండే ముంబయి మహా నగరంలో లక్షలాది జనం వస్తూ.. పోతూ ఉంటారు. ప్రమాదం కారణంగానో, అనారోగ్యంతోనో, దిక్కు లేకనో రోడ్డు పక్కన శవాలుగా మారే అభాగ్యులకూ కొదవ లేదు. ప్రతినెలా ఇలాంటివి దాదాపు 300 కేసులు నమోదవుతుంటాయి. పోలీసులు కొన్నింటిని 'గుర్తు తెలియని మృతదేహాలు'గా ప్రకటిస్తారు. ఫారాలు నింపుతారు.. సంతకాలు తీసుకుంటారు. అంత్యక్రియల నిర్వహణకు మాత్రం ఎవరూ ముందుకు రారు. సరిగ్గా అప్పుడే.. 'ఇక్బాల్ మమ్దానీ హెల్త్ అండ్ ఎడ్యుకేషన్ ట్రస్టు'కు ఫోను వెళుతుంది. సకల ఏర్పాట్లతో కూడిన ఓ వాహనంలో ట్రస్టు నుంచి వచ్చే బృందం మరణించిన వ్యక్తుల మత సంప్రదాయాల (గుర్తులు లభిస్తే) ప్రకారం సగౌరవంగా తుది వీడ్కోలు పలుకుతుంది. ఇలా.. ఒక్కోరోజు మూడు నాలుగు కేసులు కూడా ఉంటాయి. కొవిడ్ కష్టకాలంతో మొదలుపెట్టి ఇప్పటిదాకా అన్ని మతాలకు చెందిన ఆరేడు వేల మృతదేహాల అంతిమ సంస్కారాలను ఇక్బాల్ మమ్దానీ పూర్తి చేశారు. "మరణం ముందు అందరూ సమానులే. ఆ వ్యక్తులు ఎవరో నాకు తెలియదు. చివరి క్షణాల్లో మాత్రం వారు ఒంటరి కారు అనే భరోసా ఇవ్వడమే నాకు ముఖ్యం" అంటారాయన.

ఉత్తర భారత్‌ను కమ్మేసిన పొగమంచు

● దిల్లీలో 129 విమానాలు రద్దు

దిల్లీ: దేశంలోని పలు ప్రాంతాల్లో చలి తీవ్రత పెరుగుతోంది. ఉత్తర భారత్‌లోని పలు రాష్ట్రాల్లో దట్టమైన పొగమంచు అలముకోవడంతో సాధారణ జనజీవితానికి ఆటంకం ఏర్పడుతోంది. పొగమంచు తీవ్రత దృష్ట్యా శనివారం ఉత్తర్‌ప్రదేశ్‌లో రెడ్ అలర్ట్ ప్రకటించారు. దేశరాజధాని దిల్లీలో వాయు కాలుష్యం కూడా జతకలవడంతో నానాటికీ పరిస్థితి దిగజారుతోంది. నగరంలోని చాలా ప్రాంతాల్లో దట్టమైన పొగమంచు కారణంగా దృగ్గోచరత బాగా తగ్గిపోయింది. ఈ క్రమంలోనే 129 విమానాలు రద్దు అయ్యాయి. పర్వతప్రాంత రాష్ట్రాలైన హిమాచల్‌ప్రదేశ్, జమ్మూకశ్మీర్‌లో శీతాకాల ప్రభావం మరింత ఉద్ధృతమైంది. పలు చోట్ల భారీగా మంచు కురిసే అవకాశం ఉందంటూ వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. శ్రీనగర్‌లో కనిష్ఠ ఉష్ణోగ్రత మైనస్ 0.4 డిగ్రీల సెల్సియస్‌గా నమోదైంది. పంజాబ్, హరియాణాలలోనూ చలి తీవ్రత పెరిగింది. రెండు రాష్ట్రాలను పొగమంచు కమ్మేసింది.



దిల్లీలోని మయూర్ విహార్ ప్రాంతాన్ని కప్పేసిన మంచు

రాష్ట్ర స్థాయి నైపుణ్య పోటీల్లో విజేతలకు సర్టిఫికెట్ల ప్రదానం

ఈనాడు, అమరావతి: రాష్ట్ర స్థాయి నైపుణ్య పోటీల్లో ప్రథమ, ద్వితీయ స్థానంలో నిలిచిన అభ్యర్థులకు శనివారం తాడేపల్లిలో నిర్వహించిన కార్యక్రమంలో నైపుణ్యాభివృద్ధి సంస్థ ఎండీ గణేష్‌కుమార్ అవార్డులు, సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. మొత్తం 48 నైపుణ్య ట్రేడ్‌ల్లో ఈ పోటీలు నిర్వహించగా.. 96 ప్రాజెక్టులకు బహుమతులు ప్రదానం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా పోటీల్లో పాల్గొనేందుకు 54వేల మంది అభ్యర్థులు నమోదు చేసుకున్నారు. ఈ నెల 15, 16 తేదీల్లో జిల్లా స్థాయిలో ఆన్‌లైన్ స్క్రీనింగ్ పరీక్ష నిర్వహించారు. ఇక్కడ ప్రతిభ చూపిన వారిని రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. 41వ్యక్తిగత నైపుణ్యాల పోటీలకు 820 మంది, ఏడు బృంద నైపుణ్యాల పోటీలకు 280 మంది కలిపి మొత్తం 1,100 మంది రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనేందుకు అర్హత సాధించారు. వీరికి ఈనెల 19న రాష్ట్ర స్థాయి పోటీలు నిర్వహించారు. 48 ట్రేడ్‌ల్లో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచిన అభ్యర్థులను హైదరాబాద్‌లో ఫిబ్రవరి రెండో వారంలో నిర్వహించే ప్రాంతీయ స్థాయి నైపుణ్య పోటీలకు ఎంపిక చేశారు. ప్రాంతీయ స్థాయి పోటీల అనంతరం జాతీయ స్థాయి పోటీలు జూన్‌లో నిర్వహిస్తారు. ఇక్కడ అర్హత సాధించిన వారికి అంతర్జాతీయ నైపుణ్య పోటీలను చైనాలోని షాంఘైలో ఉంటాయి. అంతర్జాతీయ నైపుణ్య పోటీల్లో మన దేశం తరఫున ప్రాతినిధ్యం వహించే నైపుణ్యం కలిగిన యువతను ఎంపిక చేసేందుకు ఈ పోటీలను ఏటా నిర్వహిస్తున్నారు.

మంచి నీరు... ముంచొద్దంటే



మన ఇంట్లోని నీళ్లే కదా... మన ఆర్వో ప్లాంట్లోనే శుద్ధిఅయింది కదా... నిక్షేపంలా తాగొచ్చని అనుకుంటాం. కానీ అందులో రసాయనాల అవశేషాలు ఉంచొచ్చు. ...తస్మాత్ జాగ్రత్త!

- బాటిల్‌లో అయినా, బబుల్‌లో అయినా తాగునీటి విషయంలో చాలా జాగ్రత్తలు తీసుకోవాలి. అనారోగ్యానికి కారణమయ్యే విషాలు ఏ దశలోనైనా పోగుపడొచ్చు. అందుకే ఆర్వో ప్లాంట్ నుంచి ఆ నీటిని నిల్వ చేసిన పాత్ర వరకు అన్నిటినీ తరచిచూడాలి. ఎందులోనైనా సరే నీరు ఎక్కువరోజులు నిల్వ ఉంటే అందులో ప్రమాదకర బ్యాక్టీరియా ఏర్పడుతుంది. ఆల్గే, శిలీంధ్రాలు వేగంగా పెరుగుతాయి.
- ప్లాంట్‌లో లీకేజీలు ఉన్నా, ప్లంబింగ్ కనెక్షన్లు సక్రమంగా లేకున్నా నీటిలోకి సీసం, సింథటిక్ మూలకాలు చేరే ప్రమాదం ఉంది.
- కొన్ని ఆర్వో ప్లాంట్లు శరీరానికి అవసరమైన క్యాల్షియం, మెగ్నీషియం, పొటాషియంలను కూడా పూర్తిగా ఫిల్టర్ చేసేస్తాయి. ఆ నీటితో చాలా సమస్యలు వస్తాయి. ఒకవేళ ఆ నీళ్లనే తాగాల్సివస్తే ఫిల్టర్ అయిన పోషకాలు ఆహారంలో ఉండేలా చూసుకోవాలి.
- ఎక్కువ పీడనంలో నీటిని ఫిల్టర్ చేస్తుంటే ఆర్వో ప్లాంట్‌లో వడకట్టే రంధ్రాలు కుంచించుకుపోతాయి. దానివల్ల విద్యుత్తు వినియోగం ఎక్కువవడంతో పాటు... కరిగిన ఘన పదార్థాలు పోయి నీటి నాణ్యత కూడా తగ్గిపోతుంది.
- ఆల్గే తొలగించడానికి ఉపయోగించే క్లోరిన్ వంటి రసాయనాల అవశేషాలు ప్లాంట్‌లో మిగిలిపోతే దీర్ఘకాలంలో అనారోగ్యాలకు దారితీయొచ్చు
- ఆర్వో ప్లాంట్లలో శుద్ధి అయిన నీళ్లలో ఆమ్లత ఉంటుంది. అది మన శరీరంలోని ఖనిజ లవణాలను తొలగించే అవకాశం ఉంది. ఇది మన ఆహారం రుచిని కూడా ప్రభావితం చేస్తుంది.
- ఒకవేళ బాటిళ్లు, బబుల్స్‌లో నీటిని వాడుతుంటే కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. తక్కువ నాణ్యత ఉన్న ప్లాస్టిక్ బాటిళ్లను ఎక్కువ కాలం వాడితే బిస్ఫినాల్స్, థాలేట్లు వంటి రసాయన అవశేషాలు, మైక్రోప్లాస్టిక్‌లు నీటిలోకి లీక్ అవుతుంటాయి. ఇవి మన శరీరంలోని జీవక్రియలను చిన్నాభిన్నం చేస్తాయి.

మనమేం చేయాలి?



- ఆర్వో ప్లాంట్లలోని ఫిల్టర్లలో బయోఫిల్మ్‌లను మార్చడమే కాకుండా పూర్తిగా సిస్టమ్ శానిటైజేషన్‌ను తరచూ చేస్తుండాలి.
- గాలి, కాలుష్యం లోపలికి రాకుండా కంటెయినర్లు, బాటిళ్లను గట్టిగా మూసేయాలి. స్క్రూఆర్ క్యాప్‌లు దీనికి బాగా ఉపయోగపడతాయి.
- బాటిళ్లలో నీళ్లనైతే నేరుగా సూర్యుడి కిరణాలు పడని ప్రదేశాల్లో నిల్వ ఉంచాలి. సూర్యకాంతి నుంచి వచ్చే యూవీ కిరణాలు నీటి నాణ్యతను దెబ్బతీస్తాయి.
- ప్లాస్టిక్‌వి కాకుండా సర్టిఫైడ్ ఫుడ్‌గ్రేడ్ స్టెయిన్‌లెస్ స్టీల్ లేదా హెచ్‌డీపీఈ ట్యాంకులను వాడకోవాలి.
- వడకట్టే పొరకు నష్టం జరగకుండా పీడనాన్ని ఎప్పటికప్పుడు సరిచూసుకోవాలి. ఆటోమేటెడ్ షట్‌డౌన్ వ్యవస్థలు ఏర్పాటు చేసుకోవాలి.
- ఆర్వో ప్లాంట్లను తరచూ తనిఖీచేయాలి. ఏవైనా కాలుష్య సంకేతాలు, రంగు, రుచి, వాసనలో మార్పులుంటే ఆ నీటిని వాడకూడదు. ప్లాంట్‌ను సరిచేసుకోవాలి.
- ఆర్వోప్లాంట్‌లోని నీటిని 24 నుంచి 48 గంటల్లో తాగేయడం మేలు.

- ఈనాడు ప్రత్యేక విభాగం



మనిషెత్తు సొర.. కిలోన్నర నిమ్మకాయ

మధ్యప్రదేశ్ రాజధాని నగరం భోపాల్‌లో అటవీశాఖ నిర్వహిస్తున్న మేళాలో ఏడు కిలోల మనిషెత్తు సొరకాయ, ఒకటిన్నర కిలోల నిమ్మకాయలను చూసి సందర్శకులు నోరెళ్లబెడుతున్నారు. అంగుళం పరిమాణంలో ఉన్న అటవీ నారింజ మరో ఆకర్షణ. డిసెంబరు 23 వరకు జరిగే ఈ మేళాలో ఆయుర్వేద మూలికలు, అటవీ ఉత్పత్తులు, గిరిజనులకు సంబంధించిన వస్తువులను ప్రదర్శించే 350 స్టాళ్లు ఏర్పాటు చేశారు. ఈ కూరగాయలు దేశవాళీ పంటలేనని, హైబ్రీడ్ రకాలు కాదని అనూప్‌పుర్ జిల్లా ప్రగతిశీల రైతు సేవాగ్రామ్ ప్రతినిధి తెలిపారు. బిజోరా రకం నిమ్మకాయ బరువు సాధారణంగా 1.5 నుంచి 5 కిలోల వరకు ఉంటుందని రేవాలోని గోవిందగఢ్‌కు చెందిన రైతు నేపాల్‌సింగ్ తెలిపారు. రాష్ట్ర జీవవైవిధ్యాన్ని చాటిచెప్పే ఉద్దేశంతో నిర్వహిస్తున్న ఈ ప్రదర్శనలో అంతరించిపోతున్న పలు రకాల మొక్కలు, వాటి విత్తనాలను గిరిజనులు సంరక్షిస్తున్న తీరు చూసి పలువురు అభినందిస్తున్నారు. -ఈటీవీ భారత్



కంఠహారంలో రామాయణం





రాజస్థాన్ రాజధాని నగరమైన జైపుర్‌లో జరుగుతున్న జువెలరీ షోలో విశ్వాసం, కళ, సంప్రదాయాల మేలు కలయికగా నిలిచిన ఓ కంఠహారం అందరి దృష్టిని కట్టిపడేస్తోంది. శ్రీరాముడి జీవితకథలో బాల్యం నుంచి లంకపై జయించి రామరాజ్య స్థాపన దాకా ముఖ్యమైన ఘట్టాలను ఓ బంగారుహారంలో పొదిగిన నైపుణ్యాన్ని అందరూ మెచ్చుకొంటున్నారు. రామ్ దర్బార్, రామ సేతు, అశోకవనంలోని సీతతో హనుమంతుని సంభాషణ వంటి దృశ్యాలు ఇందులో ఉన్నాయి. 600 గ్రాముల బంగారంతో ఈ కంఠహారం తయారీకి ఆరేడు నెలల సమయం పట్టిందని నగల వ్యాపారి శరణ్ తెలిపారు. "ప్రతి పాత్ర ముఖ కవళికలు, సన్నివేశాలు స్పష్టంగా కనిపించేలా సూక్ష్మ శిల్పకళ విధానాన్ని అనుసరించాం. సత్యం, ధర్మం, త్యాగం, కర్తవ్య పాలనలకు ప్రతీక అయిన శ్రీరాముడి సందేశాన్ని నా కళ ద్వారా కొత్త తరానికి తెలియజేయాలని అనుకున్నా" అని వివరించారు. -ఈటీవీ భారత్



వానరా.. అల్లరి మానరా!

పిల్లలు మారాం చేస్తే తల్లి ప్రేమగా దగ్గరకు తీసుకుంటుంది. ఎక్కువ అల్లరి చేస్తే దండిస్తుంది. ఈ చిత్రంలో కనిపిస్తున్న కోతి సైతం తన పిల్లను ఇదే చేసింది. అటు, ఇటు తిరుగుతున్న కోతి పిల్లను దగ్గరకు తీసుకుంది. నచ్చజెప్పేందుకు ప్రయత్నించింది. అయినా వినకపోవడంతో వెల్లకిలా పడుకోబెట్టింది. ఈ క్రమంలో పిల్ల కోతి చేష్టలు ఆకట్టుకున్నాయి. ఈ దృశ్యాలు మహబూబ్‌నగర్ జిల్లా నవాబ్‌పేట మండలం పర్వతాపురం మైసమ్మ ఆలయ ప్రాంగణంలో కనిపించాయి. -ఈనాడు, మహబూబ్‌నగర్



ట్యాగ్స్ ఆధ్వర్యంలో నాట్యగాన కళావేదిక

ఈనాడు, అమరావతి: తెలుగు అసోసియేషన్ ఆఫ్ గ్రేటర్ శాక్రమెంటో(టీఏజీఎస్) ఆధ్వర్యంలో కాలిఫోర్నియా రాజధాని శాక్రమెంటో కేపిటల్‌లో నాట్యగాన కళావేదిక నిర్వహించారు. తెలుగు సంప్రదాయాన్ని ప్రతిబింబించేలా శాస్త్రీయ నృత్యాలు, సంగీత ప్రదర్శనలు ఏర్పాటుచేశారు. రక్షణ శిఖర నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రదర్శించిన భరతనాట్యం, కూచిపూడి నృత్య ప్రదర్శనలు, కర్ణాటక సంగీత కచేరీలు, భక్తిగీతాలు హాజరైన వారిని ఆకట్టుకున్నాయి. సువిధ ఇంటర్నేషనల్ వ్యవస్థాపకుడు భాస్కర్ వెంపటిని ట్యాగ్స్ ఛైర్మన్ నాగ్ దొండపాటి, ప్రెసిడెంట్ శ్యామ్ ఏలేటి తదితరులు ఘనంగా సత్కరించారు. యూత్ ఎడ్వైజరీ బోర్డు సభ్యుడు నమీష్ దొండపాటికి ప్రత్యేక అభినందనలు తెలిపారు.

దుబాయ్ పర్యటనకు వెళ్లిన మంత్రి నిమ్మల

ఈనాడు, అమరావతి: ప్రవాసాంధ్రుల ఆహ్వానం మేరకు జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, తెలుగుదేశం పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు టి.డి.జనార్దన్‌లు దుబాయ్ చేరుకున్నారు. రెండు రోజుల దుబాయ్ పర్యటనకు వెళ్లిన వీరికి అక్కడి విమానాశ్రయంలో ఏపీ ఎన్నార్టీఎస్, ఎన్నారై డివిజన్, దుబాయ్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు స్వాగతం పలికారు. తొలిరోజు గ్రీట్ అండ్ మీట్ కార్యక్రమంలో ఎన్టీఆర్ సజీవ చరిత్ర పుస్తకావిష్కరణ సభ నిర్వహించారు. ఆదివారం దుబాయ్ తెలుగు మైనారిటీ అసోసియేషన్ నిర్వహించే క్రిస్మస్ వేడుకల్లో మంత్రి పాల్గొననున్నారు.

ఎన్‌సీవీఈటీ గుర్తింపు పొందిన మొదటి బోర్డు: మంత్రి లోకేశ్

ఈనాడు, అమరావతి: జాతీయ వృత్తి విద్య, శిక్షణ మండలి(ఎన్‌సీవీఈటీ) గుర్తింపు పొందిన మొట్టమొదటి పాఠశాల విద్యా బోర్డుగా ఇంటర్మీడియట్ విద్యా మండలి(బీఐఈ) నిలవడం సంతోషంగా ఉందని మంత్రి లోకేశ్ ఎక్స్‌లో పేర్కొన్నారు. ఈ మైలురాయి సెరీకల్చర్ టెక్నీషియన్ కోర్సుతో ప్రారంభించి, జాతీయస్థాయిలో గుర్తింపు పొందిన వృత్తి నైపుణ్యాల ధ్రువీకరణలను అనుమతిస్తుందని తెలిపారు. ఇది యువతకు భవిష్యత్తులో సిద్ధంగా ఉన్న ఉపాధి మార్గాల్లో పయనించేందుకు దోహదపడుతుందని వెల్లడించారు.

ఐటీ సంస్థలను అడ్డుకుంటున్న వైకాపా నేతలు: పంచుమర్తి అనురాధ

ఈనాడు, అమరావతి: ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా మంత్రి లోకేశ్ ఐటీ సంస్థలను రాష్ట్రానికి తీసుకొస్తుంటే.. యువతపై ద్వేషంతో వాటిని అడ్డుకోవడానికి వైకాపా నేతలు ప్రయత్నిస్తున్నారని శాసనమండలి చీఫ్ విప్ పంచుమర్తి అనురాధ ధ్వజమెత్తారు. అందుకే ఆయా సంస్థలకు వ్యతిరేకంగా కోర్టులకు వెళుతున్నారన్నారు. మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో శనివారం ఆమె మాట్లాడారు.

లారీలకు ట్రాకింగ్ పరికరం తప్పనిసరి

లారీ యజమానుల సంఘం సూచన

ఈనాడు, అమరావతి: ప్రజా రవాణా వాహనాలు, నేషనల్ పర్మిట్ ఉన్న లారీలకు వెహికల్ లొకేషన్ ట్రాకింగ్ డివైజ్ (వీఎల్‌టీడీ) తప్పనిసరిగా అమర్చుకోవాలని, ఇప్పటికే ఉంటే అవి సరిగా పనిచేసేలా చూసుకోవాలని ఏపీ లారీ యజమానుల సంఘం కోరింది. జనవరి ఒకటి నుంచి ఈ పరికరం లేకపోయినా, పనిచేయకపోయినా రవాణా శాఖ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కేంద్ర రవాణా, జాతీయ రహదారుల మంత్రిత్వ శాఖ (మోర్త్) ఆదేశించిందని తెలిపింది. అందువల్ల వీటిపై లారీ యజమానులు దృష్టిపెట్టాలని సంఘం ప్రధాన కార్యదర్శి వైవీ ఈశ్వరరావు ఓ ప్రకటనలో కోరారు.

బంగ్లాదేశ్ యువనేత హాదీ అంత్యక్రియలు పూర్తి

ఢాకా: కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్ల మధ్య బంగ్లాదేశ్ యువ నాయకుడు ఇంకిలాబ్ మోంచో నేత షరీఫ్ ఉస్మాన్ హాదీ అంత్యక్రియలు శనివారం ముగిశాయి. ఆయన మరణం తర్వాత బంగ్లావ్యాప్తంగా తీవ్రస్థాయిలో అల్లర్లు చెలరేగిన సంగతి తెలిసిందే. ఢాకాలో జరిగిన ఈ అంత్యక్రియల కార్యక్రమంలో బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వ ప్రధాన సలహాదారు మహమ్మద్ యూనస్, ఆయన సలహా మండలి సభ్యులు.. సైన్యాధిపతి జనరల్ వాకర్-ఉజ్-జమాన్, కీలక పార్టీల నేతలు హాజరయ్యారు. ప్రార్థనల సమయంలో వేల మంది ప్రజలు భారత్‌కు వ్యతిరేకంగా నినాదాలిచ్చారు. అనంతరం భౌతిక కాయాన్ని ఢాకా యూనివర్సిటీ మసీదు సమీపంలో ఖననం చేశారు. గత సంవత్సరం షేక్ హసీనా నేతృత్వంలోని అవామీ లీగ్ ప్రభుత్వాన్ని కూలదోసిన విద్యార్థుల ఉద్యమంలో ముఖ్య పాత్ర పోషించిన హాదీపై ఈ నెల 12న ముసుగు ధరించిన ఓ వ్యక్తి కాల్పులు జరిపారు. దీంతో ఆయన సింగపూర్‌లో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందారు.



హాదీ అంతిమ యాత్రలో పాల్గొన్న స్థానికులు

ముక్తివాహిని డిప్యూటీ కమాండర్ ఖండేకర్ మృతి

బంగ్లా విమోచన పోరాటంలో కీలక పాత్ర పోషించిన ముక్తి వాహిని డిప్యూటీ కమాండర్, ఎయిర్ వైస్ మార్షల్ ఎ.కె.ఖండేకర్ శనివారం తుదిశ్వాస విడిచారు. ఆయన వయసు 95 సంవత్సరాలు. 1971 డిసెంబరు 16న ఢాకాలో భారత్‌కు చెందిన లెఫ్టినెంట్ జనరల్ జగ్జీత్‌సింగ్ అరోడా నేతృత్వంలోని దళాలకు పాక్ సైన్యం లొంగిపోయిన కార్యక్రమంలో బంగ్లాదేశ్‌కు ఖండేకర్ ప్రాతినిధ్యం వహించారు.

■ మయమన్‌సింగ్ జిల్లాలో దీపూ చంద్ర దాస్ అనే హిందూ యువకుడి హత్య కేసులో ఏడుగురు అనుమానితులను అరెస్టు చేసినట్లు బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వం పేర్కొంది. పోలీసుల వివరాల ప్రకారం.. ఇస్లాంకు వ్యతిరేకంగా వ్యాఖ్యలు చేశారన్న ఆరోపణలతో దీపూ చంద్ర దాస్‌ను గురువారం రాత్రి కొందరు దుండగులు తీవ్రంగా కొట్టి చెట్టుకు వేలాడదీసి ఉరితీశారు. అనంతరం మృతదేహానికి నిప్పంటించారు.

ఐసిస్ ఉగ్రవాదులే లక్ష్యంగా..

సిరియాపై అమెరికా వైమానిక దాడులు

వాషింగ్టన్: సిరియాలో అమెరికా సిబ్బందిపై ఇటీవల జరిగిన దాడికి అగ్రరాజ్యం ప్రతీకార చర్యలు మొదలుపెట్టింది. ఇస్లామిక్ స్టేట్ ఉగ్రవాదులే లక్ష్యంగా సిరియాలో శుక్రవారం రాత్రి నుంచి వైమానిక దాడులు ప్రారంభించింది. అమెరికా రక్షణమంత్రి పీట్ హెగ్సెత్ ఈ దాడులను ధ్రువీకరించారు. ఈ నెల ఆరంభంలో పాల్మిరాలో అమెరికన్, సిరియా దళాల కాన్వాయ్ లక్ష్యంగా ఐసిస్ ఉగ్రవాదులు కాల్పులకు తెగబడ్డారు. ఈ ఘటనలో ముగ్గురు అమెరికన్ సిబ్బంది ప్రాణాలు కోల్పోయారు. మరికొందరు గాయపడ్డారు. దీనికి ప్రతీకారం తీర్చుకుంటామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రతిజ్ఞ చేశారు. అందులో భాగంగా తాజాగా దాడులకు దిగారు. దీనికి 'ఆపరేషన్ హాక్ఐ స్ట్రైక్' అని పేరు పెట్టారు. పీట్ హెగ్సెత్ ఈ ఆపరేషన్ వివరాలు వెల్లడించారు. ఐసిస్ ఉగ్రవాదుల మౌలిక సదుపాయాలు, ఆయుధ స్థావరాలే లక్ష్యంగా ఈ దాడులు చేసినట్లు తెలిపారు. 'ఇది యుద్ధానికి ప్రారంభం కాదు. ఐసిస్‌కు మేం విధిస్తున్న శిక్ష. ఈ రోజు మేం మా శత్రువులను వేటాడాం. వారిలో చాలామందిని చంపేశాం. దీన్ని కొనసాగిస్తాం' అని ఓ పోస్టులో రాసుకొచ్చారు.

సింధుఘోష్‌కు నేవీ వీడ్కోలు

దిల్లీ: భారత నౌకాదళానికి 40 ఏళ్ల పాటు సేవలందించిన జలాంతర్గామి ఐఎన్‌ఎస్ సింధుఘోష్ ఇక శాశ్వతంగా విశ్రాంతి తీసుకోనుంది. దీన్ని లాంఛనంగా నేవీ నుంచి ఉపసంహరించారు. ముంబయిలోని నేవల్ డాక్‌యార్డ్‌లో ఈ కార్యక్రమం జరిగింది. ఇందులో నౌకాదళ పశ్చిమ విభాగం అధిపతి వైస్ అడ్మిరల్ కృష్ణ స్వామినాథన్, నేవీ పూర్వ అధిపతి వి.ఎస్.శెఖావత్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



రష్యా క్షిపణి దాడిలో 8 మంది ఉక్రెయిన్ పౌరుల మృతి

కీవ్: దక్షిణ ఉక్రెయిన్‌లోని ఒడెసా ప్రాంతంలో ఒక రేవుపై రష్యా క్షిపణులతో దాడి చేసింది. ఈ దాడిలో ఎనిమిది మంది మరణించడంతోపాటు 27 మంది గాయపడ్డారని ఉక్రెయిన్ అత్యవసర సర్వీసుల విభాగం ప్రకటించింది. గాయపడిన వారిలో అనేకులు క్షిపణి పేలిన ప్రదేశానికి సమీపంలో ఒక బస్సులో ఉన్నారని ఆ విభాగం శనివారం తన టెలిగ్రామ్ పోస్టులో పేర్కొంది. సమీపంలోని పార్కింగ్ ప్రదేశంలో ఉన్న ట్రక్కులు కాలి బూడిద కాగా అనేక కార్లు కూడా ధ్వంసమయ్యాయి. రేవుపై బాలిస్టిక్ క్షిపణులతో దాడి చేశారని ఒడెసా ప్రాంత నాయకుడు ఒలేహ్ కిపెర్ తెలిపారు. ఈ దాడులకు సంబంధించి రష్యా ఎలాంటి ప్రకటనా చేయలేదు. మరోవైపు తమ డ్రోన్‌లు రష్యాలో ఒక చమురు రిగ్గును, సైనిక పహారా నౌకను, ఇతర సదుపాయాలను ధ్వంసం చేశాయని ఉక్రెయిన్ శనివారం ప్రకటించింది. క్యాస్పియన్ సముద్రంలో పహారా కాస్తున్న రష్యా నౌకను ఒక చమురు, సహజవాయు ప్లాట్‌ఫాం సమీపంలో ధ్వంసం చేశామని ఉక్రెయిన్ విడుదల చేసిన ప్రకటన వివరించింది.

గాజాలో ఇజ్రాయెల్ కాల్పులు

డెయిర్ అల్-బలా: గాజాలో ఇజ్రాయెల్ కాల్పుల విరమణ ఉల్లంఘించి కాల్పులు జరిపింది. గాజా సిటీలోని తుఫా ప్రాంతంపై నిర్వహించిన ఈ దాడిలో ఐదుగురు పాలస్తీనియన్లు శుక్రవారం మృతి చెందారు. యెల్లో లైన్‌కు సమీపంలో అనుమానాస్పద వ్యక్తుల కదలికలు కనిపించడంతో కాల్పులు జరిపామని ఇజ్రాయెల్ సైన్యం తెలిపింది.

హెలికాప్టర్ల కుంభకోణం నిందితుడు మిచెల్ విడుదలకు దిల్లీ కోర్టు ఆదేశం

దిల్లీ: అగస్టా-వెస్ట్‌ల్యాండ్ హెలికాప్టర్ల కుంభకోణానికి సంబంధించి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) నమోదు చేసిన నగదు అక్రమ చలామణి కేసులో నిందితుడు క్రిస్టియన్ జేమ్స్ మిచెల్‌ను కస్టడీ నుంచి విడుదల చేయాలని దిల్లీలోని సీబీఐ కోర్టు శనివారం ఆదేశించింది. అయితే, సీబీఐ దాఖలు చేసిన మరో అవినీతి కేసులో మిచెల్ ఇంకా జైలులోనే కొనసాగక తప్పదు. ఈడీ దాఖలు చేసిన నగదు అక్రమ చలామణి కేసులో మిచెల్‌కు గరిష్ఠంగా ఏడేళ్ల జైలు శిక్ష పడుతుంది. ఇప్పటికే ఏడేళ్లుగా జైలులో ఉన్నందున మిచెల్‌ను కస్టడీ నుంచి విడుదల చేయాలని సీబీఐ కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి ఆదేశించారు. అగస్టా-వెస్ట్‌ల్యాండ్ హెలికాప్టర్ల కొనుగోలు వ్యవహారంలో దళారీగా వ్యవహరించిన మిచెల్‌ను దుబాయ్ 2018 డిసెంబరులో భారత్‌కు అప్పగించగా ఆయనపై ఈడీ, సీబీఐ వేర్వేరు కేసులు పెట్టాయి. సీబీఐ కేసులో మిచెల్‌పై ఈ నెల 22న విచారణ జరగనుంది.

ఎప్‌స్టీన్ ఫైల్స్‌లో

బిల్‌క్లింటన్, మైఖేల్ జాక్సన్

వాషింగ్టన్: ప్రపంచవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఎప్‌స్టీన్ సెక్స్ కుంభకోణానికి సంబంధించి మరిన్ని పత్రాలను అమెరికా న్యాయశాఖ విడుదల చేసింది. వీటిలో ప్రస్తుత అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నకు సంబంధించిన ఫొటోలు, డాక్యుమెంట్లు పెద్దగా లేవు. మాజీ అధ్యక్షుడు బిల్ క్లింటన్, పాప్ స్టార్ మైఖేల్ జాక్సన్‌ల ప్రస్తావన, వారికి సంబంధించిన ఫొటోలు ఉన్నాయి. హాట్ టబ్బులో అమ్మాయిలతో బిల్ క్లింటన్ ఉన్న ఫొటోలు, సెక్స్ కుంభకోణంలో ప్రధాన నిందితుడు జెఫ్రీ ఎప్‌స్టీన్‌తో ఉన్న చిత్రాలు బయటకు వచ్చాయి. ఘిస్లయిన్ మ్యాక్స్‌వెల్, మైక్ జాగర్, వుడీ అలెన్, నోమ్ చామ్‌స్కీ వంటి ప్రముఖుల ఫొటోలు కూడా ఈ ఫైల్స్‌లో ఉన్నాయి. శుక్రవారం అర్ధరాత్రి నుంచి రాబోయే కొన్ని వారాల పాటు ఫైల్స్ విడుదల ప్రక్రియ కొనసాగుతుందని అమెరికా న్యాయశాఖకు చెందిన డిప్యూటీ అటార్నీ జనరల్ టాడ్ బ్లాంచ్ తెలిపారు. బాధిత యువతుల ఫొటోలు, పేర్లు బయటకు రాకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నామని అన్నారు. "అమెరికా విదేశాంగ నీతికి, జాతీయ భద్రతకు విఘాతం కలిగించే ఫైళ్లను విడుదల చేయం. దర్యాప్తునకు భంగం కలిగించే సమాచారాన్ని కూడా విడుదల చేయం. అమెరికాలోని ప్రముఖులను ఎప్‌స్టీన్ బ్లాక్‌మెయిల్ చేశాడనే ఆధారాలేవీ మా సమీక్షలో దొరకలేదు" అని టాడ్ బ్లాంచ్ వెల్లడించారు. ఈ ఫైళ్ల విడుదలపై విపక్షనేతలు విమర్శలు గుప్పిస్తున్నారు. అసలు సాక్ష్యాలు బయటికి రాకుండా ట్రంప్ సర్కారు అడ్డుకుంటోందని ఆరోపిస్తున్నారు.




■ వేలఏళ్ల నాటి భారత ఆయుర్వేద పద్ధతులను ఎప్‌స్టీన్ తన క్లయింట్ల కోసం ఉపయోగించేవారని 'ది ఆర్ట్ ఆఫ్ గివింగ్ మసాజ్' అనే పేరుతో అమెరికా న్యాయశాఖ విడుదల చేసిన తాజా ఎప్‌స్టీన్ ఫైళ్లలో వెల్లడించింది.

పుతిన్ ఎదుటే

ప్రియురాలికి జర్నలిస్టు ప్రేమ సందేశం

- ఆ జంట పెళ్లికి ఆర్థికసాయం ప్రకటించిన రష్యా అధ్యక్షుడు

మాస్కో: రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ విలేకరుల సమావేశంలో ఓ ఆసక్తికర సంఘటన చోటుచేసుకుంది. పుతిన్ ఎదుటే ఓ యువ జర్నలిస్టు.. తన ప్రియురాలికి ప్రపోజ్ చేసి పెళ్లికి ఒప్పించాడు. దీనికి సంబంధించిన వీడియో వైరల్ అయింది. మాస్కోలో శనివారం నిర్వహించిన సమావేశంలో విలేకరులు అడిగిన పలు ప్రశ్నలకు పుతిన్ సమాధానాలిచ్చారు. ఈ క్రమంలో కిరిల్ బజానోవ్ అనే 23 ఏళ్ల యువ జర్నలిస్టు.. 'నేను పెళ్లి చేసుకోవాలనుకుంటున్నాను' అని రాసిన ప్లకార్డును పట్టుకొని పుతిన్ ఎదుటే తన ప్రియురాలికి ప్రపోజ్ చేశాడు. దీంతో అక్కడున్న వారంతా ఒక్కసారిగా నవ్వులు చిందించారు. కిరిల్ మాట్లాడుతూ.. 'నా స్నేహితురాలు దీన్ని చూస్తోంది. ఓల్గా నువ్వు నన్ను పెళ్లి చేసుకుంటావా? ప్లీజ్.... నేను నీకు ప్రపోజ్ చేస్తున్నా' అని పేర్కొన్నాడు. వెంటనే ఆ ప్రాంగణంలోని వారంతా చప్పట్లు కొట్టారు. అనంతరం అతను పుతిన్‌తో మాట్లాడుతూ.. రష్యాలో జీవన వ్యయం పెరగడంపై ఆందోళన వ్యక్తం చేశాడు. తాను, తన స్నేహితురాలు ఎనిమిదేళ్లుగా కలిసి ఉంటున్నామని, ఆర్థిక ఒత్తిళ్ల కారణంగా పెళ్లి చేసుకునేందుకు ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. సమావేశం కొనసాగుతుండగానే కార్యక్రమ నిర్వాహకుడు కీలక ప్రకటన చేశారు. జర్నలిస్టు కిరిల్ బజానోవ్ ప్రపోజల్‌ను అతడి స్నేహితురాలు అంగీకరించినట్లు తెలిపారు. ఆ వెంటనే పుతిన్‌తో సహా అక్కడున్న వారంతా ఆనందం వ్యక్తంచేస్తూ చప్పట్లు కొట్టారు. తన వివాహ వేడుకకు హాజరుకావాలని పుతిన్‌ను కిరిల్ ఆహ్వానించారు. ఈ ఆహ్వానంపై అధ్యక్షుడి నుంచి ఎలాంటి స్పందన లేదు. అయితే, కిరిల్‌కు ఆర్థిక సాయం ప్రకటించారు. 'యువ కుటుంబాల ఆర్థిక పరిస్థితుల గురించి కిరిల్ ఆందోళన నిజమే. ఇప్పుడు మనం విరాళాలతో అతడి పెళ్లికి కావాల్సిన డబ్బును సేకరించాలి' అని అన్నారు.



2029 నాటికి దేశంలో 75 వేల వైద్య సీట్లు: నడ్డా

దిల్లీ: ప్రధాని మోదీ నేతృత్వంలో 2029 నాటికి దేశంలో యూజీ, పీజీ మెడికల్ సీట్ల సంఖ్య 75 వేల మేరకు పెరుగుతాయని, అందులో గత సంవత్సర కాలంలోనే 23 వేల సీట్లు పెంచామని కేంద్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డా ప్రకటించారు. "గత శతాబ్దాంతం నాటికి దేశంలో కేవలం ఒక ఆలిండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎయిమ్స్) ఉంది. ఇప్పుడు 23 ఉన్నాయి. నాణ్యమైన వైద్యాన్ని, వైద్య శిక్షణను అన్ని ప్రాంతాలకూ అందించాలన్న మా ప్రభుత్వ నిబద్ధతకు ఇది నిదర్శనం" అని ఆయన అన్నారు. శనివారం లఖ్‌నవూలో కింగ్ జార్జి మెడికల్ యూనివర్సిటీ 21వ వార్షిక స్నాతకోత్సవంలో ప్రసంగిస్తూ మంత్రి ఈ మాటలన్నారు.



పైలట్ వీరేందర్ | అంకిత్ దివాన్

ప్రయాణికుడిపై పైలట్ దాడి

విధుల నుంచి తొలగించిన ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్

దిల్లీ: విమానాశ్రయంలోని తనిఖీ కేంద్రం వద్ద ప్రయాణికుడిపై దాడికి పాల్పడిన పైలట్‌ను ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ సంస్థ విధుల నుంచి తొలగించింది. దాడి ఘటన గురించి ప్రయాణికుడు అంకిత్ దివాన్ సామాజిక మాధ్యమంలో పోస్ట్ చేయగా విమానయాన సంస్థ ఈ చర్య తీసుకుంది. తన కుటుంబంతో కలిసి స్పైస్‌జెట్ విమానంలో ప్రయాణించేందుకు దిల్లీ ఎయిర్‌పోర్టుకు వచ్చానని, టెర్మినల్ 1లో సెక్యూరిటీ చెక్-ఇన్ వద్ద లైన్‌లో ఉండగా.. ..కొందరు లైన్ మధ్యలోకి వచ్చి చేరడంతో ప్రశ్నించానని వీడియో ద్వారా అంకిత్ దివాన్ వెల్లడించారు. ప్రశ్నించినందుకుగాను ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ పైలట్ వీరేందర్ సెజ్వాల్ దుర్భాషలాడడంతో పాటు తనపై భౌతిక దాడి చేశాడని తెలిపారు. రక్తం రావడంతో తన ఏడేళ్ల కుమార్తె భయభ్రాంతులకు గురైందని దివాన్ పేర్కొన్నాడు. దీనిపై స్పందించిన ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ సంస్థ పైలట్‌ను విధుల నుంచి తొలగించినట్లు పేర్కొంది. ఆ పైలట్ మరో విమానంలో ప్రయాణించేందుకు అక్కడకు వచ్చారని తెలిపింది. దాడి ఘటన సామాజిక మాధ్యమం ద్వారా మాత్రమే తమ దృష్టికి వచ్చిందని, ఎలాంటి ఫిర్యాదు అందలేదని దిల్లీ పోలీసులు తెలిపారు.